విషయము. భారతి.

చైత్రము

సంపుటము 30

సంచిక 4



విజయ చైత్రము

భారతి

సంపుటము 30
సంచిక 4

ఉయ్యాలి

★

శ్రీ నండూరి వెంకటసుబ్బారావు

ఎంకి వూగెను కొమ్మ వుయ్యాలా! చంద్ర
వంక వూగెను బొమ్మ వుయ్యాలా!

ఏటిపై కొమ్మనూ
మొలమెంకి అమరించె
నీట బొమ్మ వుయ్యాల
నెలవంక వెలయించె

...ఎంకి...

ఎంకి వన్నెలచీర
నెగిరె వెన్నెల పూలు
ఎండుటాకుల గొలుసు
వెండి తీగలు చేరె

...ఎంకి...

సీకపూలు, ముంగురులు
చిరుమువల మొలనూలు
ఒకచే నదురుకొనుచు
ఒయ్యారమే వూగె

...ఎంకి...

తీగల నడుమ నూగె
దీపమై, తిలకమై
పీఠమై—ఎంకికి—కి
రీటమై నెలవంక
మున్నీటి యాజోడు
ఆనాటికీనాడు!

...ఎంకి...

ఆంధ్రులు - తెనుగులు వారి మూల భాషాదేశములు

★

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి

మన విజ్ఞాన నాగరికతలు హెచ్చినకొలది మన జాతి భాషా దేశముల ప్రారంభ స్థితినిగూర్చిన యాథార్థ్యమును దెలిసికొనవలెనను అభిలాష మన కధికమగుచుండును. కాని తన జాతి యొకప్పుడు పరమ పామరత్వములో నున్నంత మాత్రమున దాని నంగీకరించుట కెవ్వరు న్యూనత చెందరాదు. ఎందు కన ప్రస్తుతపు నాగరక జాతులన్నియు ప్రారంభమున బహు పామరత్వము నుండియే తల యెత్తినవి. పాశ్చాత్య దేశీయులు పచ్చిమాంసమునుదిని, చర్మములను ధరించెడి బహు ప్రాచీనకాలముననే, ప్రపంచము నందంతటను భారతీయులు బహు నాగరికులనియు, విజ్ఞానవంతులనియు ఎంచబడిరి. కాని యిప్పుడు పరిస్థితి విపరీతమైనది. భారతదేశమున గల యితర విజ్ఞాన నాగరకతలకంటె, నార్య విజ్ఞాన నాగరకత కెక్కువ గౌరవమున్నది. అది యితర విజ్ఞాన నాగరకతలకంటె, నధికమైనదిగా జనులు భావించుదురు. తత్ఫలితముగా కొందరు ఆర్యేతరమైన తమ జాతి నంగీకరించుట న్యూనతగా భావించి వెనుదీయువారు గలరు. భారతదేశమున కొన్నిచోట్ల ఆర్యులును ఆర్యేతరులును పరస్పరము కలిసిపోవుటచే, ప్రస్తుతము వారి జాతిని నిర్ణయించుట దుర్లభముగా నున్నది. అట్టి వానిలో ఆంధ్ర—తెలుగు సమస్య యొకటి.

ఆంధ్రులును, తెనుగువారు నొక జాతివారేనా, వారు ఆర్యులా, ద్రావిడులా, అను విషయములు వివాద గ్రస్తముగా నున్నవి. సామాన్యముగా పెద్ద జాతులు శాఖలుగా విభాగమై, గుంపులుగా వలస పోయి మరొక్కచోట నివాస మేర్పరుచుకొనినప్పుడు, కొంతకాలమైన తర్వాత వారి మధ్యగల నదీ పర్వతముల యడ్డుపాటుచే, పరస్పర సంపర్క సంబంధ వ్యవహారములు తగ్గిపోయి, ప్రత్యేక జాతులుగా పరిణమించును. ప్రక్క జాతివారిచే వారు ప్రత్యేక జాతినామముతో వ్యవహరింపబడుదురు. వారియందు సహజముగా కొన్ని విశేషలక్షణము లుండును.. ఆ ప్రత్యేకనామము వారి భాషకు, వా రాక్రమించిన దేశమునకుగూడ వాడబడును. కావున భాష ఆ జాతిని నిర్ణయించుట కవకాశము గల్గించును. పురాణములు, కైఫీయతులు, గాథలు మొదలైన వానియందలి విషయముల సత్యమును శాసనములు ఋజువు చేయగ, శాసన పరిశోధన ఫలితములను భాష ఋజువు చేయగల్గును. ఆర్యులు భారతదేశమునకు ఏషియా మైనరు నుండియో, మరొక్కచోట నుండియో రాక పూర్వమే, కోలులు, ఆస్ట్రియా వాసులువలె, ద్రావిడులువచ్చి యాదిమవాసుల స్థలముల నాక్రమించుకొనిరని పరిశోధకు లందరు విశ్వసించుచున్నారు. అట్లే ఆర్యద్రావిడుల విజ్ఞాన నాగరకతల మిశ్రమమే భారతీయ విజ్ఞాననాగరికతలని విశ్వసింపబడుచున్నది. అందుచే వానిని వేర్పరుచుటకు బహు జాగరూకతయు, సూక్ష్మబుద్ధియు కావలయును.

ఆంధ్రులను గూర్చి మొట్టమొదట ఐతరేయ బ్రాహ్మణమున శునశ్శేపుని తమ జ్యేష్ఠభ్రాతగా నంగీకరింపమిచే దన మొదటి యేబది కుమారులను విశ్వామిత్రుడు పుళిందులు, పండ్రులు, శబరులు, ఆంధ్రులు మూతిబాలలో గలసిపొండని శపించిన సందర్భమున చెప్పబడినది. ఈ జాతి వారార్యేతరులని కొందరును, వింధ్యకుత్తరమున నార్యావర్తమున నివసించియుండుటచే వా రార్యులే యని మరికొందరును వాదింతురు. కాని ఆంధ్రాదు లార్యేతరులు గానిచో విశ్వామిత్ర పుత్రు లాంధ్రాదులలో గలసిపోవునట్లు శపింపబడుటలో ప్రయోజనముండదు. తరువాత నాంధ్రులనుగూర్చి కొన్ని పురాణములందును, భారత రామాయణములందును చెప్పబడినది. వాయుపురాణమునందును, మరికొన్ని యితర పురాణములందు

నాంధ్రరాజుల పేర్లును, వారు రాజ్యమేలిన కాలములును తెలుపబడినవి. ఈ విషయములే సమానముగా శాసనములందుకూడ చెప్పబడినవి. కాని పురాణములందలి ఆంధ్రులు శాసనములందు శాతవాహనులని పేర్కొనబడిరి. ఇందుచే శాతవాహనులాంధ్రులే యనియు, శాతవాహన నామము రాజవంశ నామమనియు, ఆంధ్రపదము జాతినామమనియు పరిశోధకులు విశ్వసించిరి. పిమ్మట నాంధ్రులను గూర్చి గ్రీసు రాయబారియైన మెగస్తనీసు తెల్పినాడు. ఇతడు మౌర్య చంద్రగుప్తుని రాజ్యకాలమునవచ్చి, మౌర్యుల తర్వాత బలపరాక్రమముగలవారాంధ్రులనియు, వారికి లక్ష కాల్బలమును, రెండువేల అశ్వికదళమును, వేయి గజములును, కొన్ని కోటలును గలవని తెలియజెప్పెను. ఆంధ్రులు పాల్వ, వర్ని, కరూశ దేశములలో గూడ వ్యాపించిరని యితర గ్రంథములను బట్టి తెలియుచున్నది. పురాణములనుబట్టియు శాసనములను బట్టియు శాతవాహ నాంధ్రులు క్రీ. పూ. 230 నుండి క్రీ. శ. 225 వరకు సుమారు 450 సం. లు. శ్రీకాకుళ ధాన్యకటకములు రాజధానులుగ కృష్ణా గోదావరీ మధ్యస్థ దేశమును పరిపాలించిరని తెలియుచున్నది. ఈ కాలముననే కృష్ణాతీరమందలి శ్రీకాకుళమున 'ఆంధ్ర విష్ణు' దేవాలయము నిర్మింపబడి యుండును. ఈ కాలపు శాతవాహన రాజులలో సుకృష్ణుడను రాజు పేరనీ దేవళము నిర్మింపబడి యుండవచ్చును. సామాన్యముగ రాజును విష్ణ్వంశ సంభూతునిగా భావించుట హిందూజన సంప్రదాయము. బ్రహ్మాండ పురాణము ననుసరించి సుచంద్రుని కొడుకు 'ఆంధ్ర విష్ణు' వను పేరుగల రాజుగలడనియు, నతడు గోదావరీ తీరమున నిశంభుడను రాక్షసుని చంపి వాని రాజ్యము నాక్రమించెననియు గలదు. లేదా, నిశంభుడు పూర్వకాలమందలి నాగరాజైనను కావచ్చును. ఆంధ్ర విష్ణువు శ్రీకాకుళమున రాజ్యమును స్థాపించి, దేవాలయమునుగూడ నిర్మించి యుండవచ్చును. పిమ్మట వీర పూజాపరులైన ప్రజలీ మహావీరుని పేర క్రమముగా వ్యవహరించి యుండవచ్చును. లేదా, ఆంధ్ర రాజ్యధానియగు శ్రీకాకుళమునందు ఆంధ్ర రాజులచే స్థాపింపబడిన 'విష్ణు' దేవాలయమని యైనను కావచ్చును. ఈ యాంధ్ర విష్ణువునే శ్రీకృష్ణదేవరాయలు తన యాముక్తమాల్యదారంభమున పేర్కొనెను. శాతవాహనులు దక్షిణమున నెల్లూరునుండి యుత్తరమున గంగానది వరకును, పశ్చిమమున మహారాష్ట్ర దేశమును బొంబాయివరకును పాలించి, జావా మొదలైన ద్వీపములలో వలసరాజ్యములను స్థాపించిరనియు తెలియుచున్నది.

శాతవాహ నాంధ్రుల శాసనములును, కొన్ని సారస్వత గ్రంథములును ప్రాకృతభాషలో రచింపఁబడినవి. హాలుని 'గాథాసప్తశతి' మహారాష్ట్రీ ప్రాకృతభాషలోను, గుణాఢ్యుని బృహత్కథ పైశాచీ ప్రాకృతములోను వ్రాయబడినవి. ప్రాకృతభాషలు సంస్కృతభాషకు భ్రష్టరూపముగా పరిగణింపఁబడినవి. శాతవాహనులలో కొందరు బ్రాహ్మణ మతావలంబకులై అశ్వమేధాది యాగముల జేసిరి. ఇతరులు మగధమునుండి దక్షిణమునకు వచ్చిన బౌద్ధమతానుయాయులుగ నుండిరి. క్రీ. శ. మొదటి శతాబ్దపు ప్రాకృత శాసనములందు 'అంధ' యనుపదియు గానబడుచున్నది. ఈ పద మట్లే యైదవ శతాబ్దివరకు ప్రయోగింపఁబడి, తర్వాత 'ఆంధ్ర' మనగా వాడబడినది. పురాణములందు 'ఆంధ్రుల' నే వ్యవహరింపబడినది. ప్రాచీన బౌద్ధ త్రిపిటక వాఙ్మయమందును, జైన గ్రంథములందును "ఆంధ్రులు, అంధులు, అంధకు"లని గూడ వాడబడినవి. ఐతరేయ బ్రాహ్మణ కాలమునాటి కాంధ్రులు ఆర్యావర్తపు పొలిమేరలందు నివసించుచుండిరి. 'అంధవన' ముత్తర కోసలమున నుండినట్లు విదేశ బౌద్ధ యాత్రికుల గ్రంథముల వలన తెలియుచున్నది. ఇక్ష్వాకు వంశజుల యుత్తర కోసలమునకు రాజధానియైన 'శ్రావస్తి' నగరపరిసరమునసే యంధవనముగలదు. ఆంధ్రుల ననుసరించి, ఆంధ్ర జనపదము నంటియున్న యరణ్యప్రదేశము అంధవనమైనది. మరియు శ్రావస్తి నగరనిర్మాతయైన శ్రావస్త లేక శ్రావస్తక మహారాజు ఇక్ష్వాకువంశజుడైన 'వికుక్షి'కి యారవతరము వాడనియు, నతని తండ్రి 'ఆంధ్రు' డనియు వాయుపురాణము దెల్పుచున్నది. (వాయు పు. అ. 88,24—26; విష్ణు పు. అ. 4,2—12). కాని మత్స్య, బ్రహ్మపురాణములతడు 'యువనాశ్వ' తనూజుడనియు, 'ఆర్ధ' మహీపతి మనుమడనియు నుడువుచున్నవి. వాయుపురాణోక్త "ఆంధ్రు" డే యీ 'ఆర్ధుడు.' ఈ శ్రావస్తి సంయుక్త రాష్ట్రములందలి అయోధ్య జిల్లా (*oudh*) యందున్నది. దక్షిణకోసలము కళింగదేశము ప్రక్కనే యున్నది. ఇక్ష్వాకు వంశజులు కొందరు దక్షిణమునకు వలసవచ్చి, యచటనే నిలిచిపోవుటచే నిచట దక్షిణ కోసల యేర్పడి యుండవచ్చును. ఇక్ష్వాకుల కాంధ్ర దేశమునకు గల సంబంధము నాగార్జునకొండ, జగ్గయపేట శాసనములు స్థిరపరచుచున్నవి. పై విషయముల నన్నింటిని పట్టిచూడగ, శాతవాహ నాంధ్రులు వింధ్యకు తరము నుండి దక్షిణమునకువచ్చి, కృష్ణా గోదావరీ తీరములందు రాజ్యమును స్థాపించి సుమారు 450 సం. లు. పాలించిరని తేలికగ యూహింప

వచ్చును. శాతవాహనుల శాసన భాషయైన ప్రాకృతము గూడ నీ విషయమును సమర్థించుచున్నది.

శాతవాహనులు దమ సారస్వత గ్రంథములను వారి మాతృభాషలోనే రచించినారని మనము తలపవచ్చును. అగుచో, హాలుని గాథా సప్తశతి మహారాష్ట్రి ప్రాకృతమున రచింపబడుటచే, ఆ భాష వారి మాతృభాషయని తలపవలయును గదా? మనము దాని కంగీకరించుచో, మహారాష్ట్రియు మాతృభాష గాగల మహారాష్ట్రులును ఆంధ్రులు నొక్కరే కావలయును. ఆ పక్షమున, ప్రత్యేక నామములు వారికి గలుగు టెట్లు? ఆంధ్రులు మహారాష్ట్రుల కంటె భిన్నులని ప్రస్తుతము మనకు స్పష్టముగ తెలియును. అప్పు డాంధ్రు లితరుల భాషలో తమ కావ్యములను వ్రాయుట యేల? గొప్ప నాగరికతయు, విజ్ఞానమును గల్గి, శక్తివంతులైన యాంధ్రులకు స్వంత మాతృభాష లేదనవచ్చునా? ఉన్నచో వారిమాతృభాష యేది?— ఈ కాలమున గుణాఢ్యుడను కవి బృహత్కథను పైశాచీ ప్రాకృతమున రచించెను. శబ్దోత్పత్తిని బట్టి పిశాచముల భాష పైశాచియగుచున్నది. కాని గుణాఢ్యుని మాతృభాషకును పిశాచముల భాషకును సంబంధ మెట్టిది? పైశాచీ ప్రాకృతమునుండి తెలుగు పుట్టినదని కొందరు ప్రాకృతభాషావాదులు వాదించుదురు. ఇట్టి సమస్యలు పలుమార్లీ సందర్భమున నడ్డు తగులుచున్నవి.

శాతవాహనుల తర్వాత నాంధ్రదేశము నేలిన ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, పల్లవులును తమ శాసనములను సంస్కృత భాషలలో వ్రాసిరి. 7 వ శతాబ్దమున చాళుక్యులు రాజ్యమునకు వచ్చి, దేశభాషలను ప్రోత్సహించ బూని శాసనములలో దేశభాషయగు తెనుగును ప్రవేశపెట్టి, క్రమముగా తెలుగులోనే పూర్తిగ వ్రాసిరి. ఈ కారణములచే సంస్కృత ప్రాకృతభాషలనుండి తెలుగు పుట్టినదనియు, నందుచే తెలుగు ఆర్యభాషా కుటుంబమునకు చెందినదనియు కొందరు విద్యావంతు లూహించిరి. విశేష తత్సమ పదజాల మీ వాదమును పోషించుచున్నది. కాని, యాంధ్ర భాషావ్యాకరణ విషయములు, ఆర్యభాషా వ్యాకరణ విషయములకు శుద్ధ విరుద్ధముగా నున్నవి. కావున దాని నార్యభాషాకుటుంబమున కంటగట్టుట తగదు. భాషాకుటుంబ నిర్ణయమున వ్యాకరణ విషయము అతి ముఖ్యస్థానము వహించును. తెలుగు భాషయొక్క సంయుతి స్వభావమును, క్రియా నామ వాచకముల ప్రత్యయముల రీతియు, నీ భాష ద్రావిడభాషా కుటుంబమునకు చెందినదని దృఢపరచునుగాని, ఆర్యభాషాజాతికి చేరినట్లు తెలుపదు. మరియు తెలుగునందలి దేశీయపదములు సమానార్థముగల తమిళ కర్ణాట మలయాళ పదములతో గల సంబంధము గూడ నీ వాదమును బలపరచుచున్నది. దీనికితోడు, 7 వ శతాబ్దికి పూర్వ మాంధ్రదేశము నందలి సంస్కృత ప్రాకృత శాసనములలో గూడ కొన్ని అచ్చ తెలుగు పదములును, శుద్ధ దేశీయాక్షరములును గానబడుచున్నవి. ఇవి గ్రామములయు, సరిహద్దులయు, బిరుదులయు, మనుష్యులయు నామములు మాత్రమే. ఇవికూడ సంస్కృత వేషమును, సంస్కృత వర్ణక్రమమును ధరించియే యున్నవి; అనగా సంస్కృత ప్రత్యయములు వీనికి చేర్చబడి, మణిప్రవాళశైలిలో కూర్చబడినవి. ఉదా:—"ముణ్డూర గ్రామే; కమ్మురాష్ట్రే; గొల్లతెంకి; చెఱుకు ముళ్లుశ్చ; విరిపరు; తాన్తికొన్డ; కొజ్చుంకొన్డ; ఎందుబూరు; రేగోన్ఠం; "కూడూరాహారే గ్రామం పాంటూరారం బ్రహ్మదేయం దదామ" "మహాశిలవరేణ మహాదండనాయకేన ఛాపహేన వర్మణాకటతి"— జయవర్మ కొండముడి తామ్రశాసనము. వీనినిబట్టి క్రీ. శ. 5 వ శతాబ్దమునకు పూర్వమే తెలుగు భాష యేదో యొక రూపమున నాంధ్రదేశమున వ్యవహారములో నున్నదని తేలికగ యూహింపగలము. శాసనములలో గనబడిన మొట్టమొదట తెలుగు పదము "నాగబు," ఇది క్రీ. శ. 3, 4 శతాబ్దములకు చెందిన అమరావతి శాసనములోనిది. కావున మూడవ శతాబ్దికే తెలుగునకు రూపమేర్పడెనని యూహింపనగును. 7 వ శతాబ్దారంభమున చాళుక్యులు రాజ్యమునకు రాగనే దేశభాషలను పోషింప, కన్నడదేశమున కన్నడభాషను, ఆంధ్రదేశమున తెలుగును ప్రోత్సహించిరి. ఈ విషయమునే నన్నెచోడుడు తన కుమారసంభవ పీఠికలో నిట్లు తెల్పెను.

కం॥ మునుమార్గ కవిత లోకం
బున వెలయగ దేశకవిత పుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చాళుక్యరాజు మొదలుగ పలువుర్॥

7, 8, శతాబ్దులలో తెలుగు శాసనములు వచనములలో రచింపబడినవి. 9 వ శతాబ్దారంభము నుండి తెలుగు శాసనములలో గొన్ని పద్యములలో గూడ వ్రాయబడినవి. కాని యవి తర్వాతి కావ్యములందువలె కాక, దేశీయచ్ఛందములలో రచింపబడినవి. క్రీ. శ. 5, 6 శతాబ్దులలో తెనుగు దేశమందలి శాసనములలో తెలుగు పదములకు సంస్కృత ప్రత్యయములు కలుపబడి, వెనుక జూపినట్లు వ్రాయబడినను, 6, 7 శతాబ్దములందలి శాసనములలో ద్రావిడభాషా ప్రత్యయములు సంస్కృ

తాంధ్ర పదములకు కలుపబడి వాడబడి, తెలుగుభాష క్రమముగా వభివృద్ధిచెందినది. ఉదా:—"వర్ధమాన విజయరాజ్య సంవత్సరంబుల్; జయసింహ వల్లభ మహారాజులాకుక్; నిష్టసోములాకు; వసంతీశ్వరంబు నాకు; విన్నశర్మశాకు; చోళియరట్ట గుళ్యాకు.—" 13&14 శతాబ్దములలో ద్రావిడభాష లన్నింటియందు నొక విధమైన నూత్న పద్ధతియగు మణిప్రవాళశైలి, అనగా ద్రావిడ సంస్కృత పదములకు సంస్కృత ప్రత్యయములను కలిపిధారాళముగ వాడు నాచారము,— ప్రబలినది. ఈ పద్ధతి మలయాళమున ముఖ్యస్థాన మాక్రమించినది. తమిళ తెలుగు దేశములలోగూడ నట్టి పద్యములు గొన్ని రచింపబడినవి. కాని యీయన్ని భాషలలోను వైయాకరణు లీ పద్ధతిని గట్టిగా ఖండించిరి.

తెనుగు, లేదా, తెలుగు పదము భాషాపరముగ గాని, దేశపరముగ గాని, జాతిపరముగ గాని 10 వ శతాబ్దమునకు పూర్వ మెప్పుడు నెక్కడ వ్యవహరింపబడి యుండలేదు. దానిస్థానమున ఆంధ్రశబ్ద ముపయోగింపబడినది. తెనుగు—తెలుగుపదములు ద్రావిడ శబ్దములు. ఈ రెండింటిలో 'తెనుగు'పదమే ప్రథమరూపముగా గనిపించుచున్నది. నన్నయభట్టు తన భారతములో ప్రాసస్థానమునందు 'న' కారమును నిల్పి 'తెనుగు' అని వాడినాడు, కాని 'ల' కారమును ప్రాసస్థానమున నిల్పి 'తెలుగు' అని వాడినట్లు గానరాదు. ఇతర స్థలములందు ల, న, లు తర్వాత మార్పు చెంది యుండవచ్చును. దేశీయపదములలో 'న' వర్ణము 'ల' కారముగ మారుటయు గలదు. నన్నయపద్యమిది.

కం॥ జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారతబ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్॥

ఆంధ్రశబ్ద మార్యపదమైనట్లు వెనుకనే గుర్తించితిమి. ఈ యాంధ్రశబ్దమే శాతవాహనులకాలముననను, ఇక్ష్వాకులకాలముననను 'అంధ, అంధ్ర, పదములుగా ప్రాకృతమున వాడబడియుండును. తెలుగు పదము త్రిలింగాదిపదములనుండి యుద్భవించిన దని యనేక విధములుగ వివిధపండితులచే నూహింపబడినది. కాని యవి యేవియు సమంజసముగను, సంతృప్తికరముగను లేవని లోకము గుర్తించినది. ఆంధ్రదేశమున కుత్తర సరిహద్దు 'తేలివాహ' నది యైనట్లు బౌద్ధజాతక వాఙ్మయము తెల్పుచున్నది. ఇది మహానది కుపనదియై 'తేల్' అను పేరితో నుండెడిది. తేల్ నదీప్రాంతము నుండి వచ్చినవారు గాన ఆంధ్రులు తెలుగువారనబడి రని యొకవాదము గలదు. దీనికి ప్రబలమైన ప్రమాణముల వరయవలసి యున్నది. నన్నెచోడుడుగూడ వెనుక చూపిన పద్యమున 'తెనుగ'నియే వాడినాడుగదా. కొందరు తెనుగుశబ్దము, తెన్ = దక్షిణము; తెన్ గళు (బహువచనార్థము) — కలసి, తెన్గలు — తెన్గులు — తెనుగులు = దక్షిణాదివారు, అని తెల్పి, యిది సత్యముగను తగినట్లుగ నున్నదని వాదింతురు. ఇది యట్లే గనబడుచున్నది. కాని యొక యాక్షేపణమాత్ర మున్నది. ఈశబ్దోత్పత్తి ద్రావిడభాషానుగుణముగ నున్నది. ఇది సత్యమేయగుచో నీ శబ్దమును తమిళు లాంధ్రులను సూచించుట కుపయోగించి యుండవలెను. అట్లే యగుచో ఆంధ్రులు తమిళుల కెప్పుడును దక్షిణమున లేరు. తమిళదేశమున కెప్పుడును వా రుత్తరముందే యుండిరి. తమిళ వైష్ణవులలో రెండు శాఖలు 'తెంగళులు, వడగలు' అని దక్షిణోత్తరములవారు సూచింపబడుదురు. ఆంధ్రుల కుత్తరమున మహారాష్ట్రులున్నారు. వీ రాంధ్రులను సూచించుచు 'తెనుగుల'ను పదమును వాడినచో సమంజసముగ నుండును. కాని యిది ద్రావిడశబ్దము. ఇందుండి దక్షిణ మను అర్థమును గల్గించు మహారాష్ట్రి, లేక అర్య, లేక ప్రాకృత శబ్దోత్పత్తి క్రమము సిద్ధింపదు. కాన పై శబ్దోత్పత్తిని వెంటనే యంగీకరింప తగదు. కొందరు తెనుగులనగా 'దక్షిణాభిముఖముగా సంచరించినవారని యుత్పత్తిని చెప్పి, అర్యులైన ఆంధ్రుల యుత్తిడికి దక్షిణముగా పోయినవారని తెల్పిరి. కాని యార్యుల యొత్తిడికి దక్షిణముగా పోయినవారు ద్రావిడజాతి (ద్రు=గతౌ, అను ధాతువునుండి) కంతకు చెందును. కాని యిది తెనుగువారికిమాత్రమేల ప్రత్యేకముగ సార్థకమగును. కన్నడ మలయాళాదులుగూడ నట్టివారేకదా.

ప్రస్తుత మాంధ్రభాషను మాట్లాడు ప్రదేశములు తూర్పుతీరమున గల విశాఖపట్నము, ప్రాక్పశ్చిమ గోదావరులు, కృష్ణా గుంటూరు నెల్లూరు జిల్లాలు, రాయలసీమలో కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురము జిల్లాలును, చిత్తూరుజిల్లాలో సగము భాగమును, నైజామమండలములో అరుజిల్లాలును, మైసూరు రాజ్యములో కొన్ని ప్రదేశములందును, నాగపూరు రాష్ట్రములో స్వల్పప్రదేశములును గలవు. వ్యాకరణ దృష్టితో పరిశీలించినపుడు తెలుగుభాష ద్రావిడ భాషా కుటుంబమునకే చెందుననియు, అర్యభాషా జాతికి చెందదనియు సర్వజనులు నంగీకరించిరి. ఈ వ్యాసప్రారంభమున శాతవాహనుల శాసనభాష ప్రాకృతమనియు, గాన నది అర్యభాషాకుటుంబమునకు చెందినదనియు గ్రహించితిమి. మరియు తెనుగును ద్రావిడభాషా కుటుంబములోనిదిగ పండితు

లందరు పరిగణించిరి. ఇట్లుండగా ప్రస్తుతపు ఆంధ్ర – తెనుగుభాష, శాతవాహనుల శాసనపు ప్రాకృతభాష నుండి పుట్టినదని తలంపవచ్చునా? ఈ రెండు భాషలు రెండు భిన్న భాషాకుటుంబములకు చెందినవి. కాన ప్రాకృతభాషనుండి తెలుగుభాష పుట్టినదనుటకు వీలు లేదు. ఒక జాతి తన మాతృభాషనే మాట్లాడును. కాన ప్రస్తుతాంధ్రులు శాతవాహనాంధ్రుల సంతతి వారని చెప్పుటకు వీలుండదు. సామాన్యముగా మాతృభాషనుబట్టి తమ జాతి నిర్ణయింపబడును.

ఇట్టి పరిస్థితులలో క్రీ పూ. 230 నుండి క్రీ. శ. 225 వరకు కృష్ణా గోదావరీ మధ్యదేశము నేలిన శాతవాహనాంధ్రులు ఆంగ్లేయులవలె నొక రాజ్యపరిపాలకుల వంశము మాత్రమే యనియు, వారి ప్రాకృతభాష, ఆంగ్లభాషవలె రాజ్యవ్యవహారముల కొఱకుపయోగించిన భాషయనియు, తెలుగుకుటుంబముల గృహములలో మాత్రము ద్రావిడ భాషయైన తెలుగే మాట్లాడబడుచుండెడిదనియు విశ్వసింపదగును. శాతవాహనాంధ్రులకాలమందు వివిధ ద్రావిడభాషలిప్పటివలె వేరుపడక, మూల ద్రావిడభాషమాత్రమే కృష్ణా గోదావరీ మధ్యదేశమందలి జనుల గృహములలోగూడ మాట్లాడుకొనబడి యుండును. క్రీ. శ. 5 వ శతాబ్దమునకు పూర్వము కన్నడమునను, 7 వ శతాబ్దమునకు పూర్వము తెనుగునను, అంతకు తరువాతనుగూడ మలయాళమునను శాసనములు గనబడకుండుటచే నీవిధముగ యూహింపవలసి వచ్చుచున్నది. వేదభాషనుండి సంస్కృతభాష పరిణమించినట్లుగ, మూల ద్రావిడభాషనుండి తమిళభాష క్రీ. శ. ప్రారంభమున పరిణమించి యుండవచ్చును. వింధ్యోత్తరమునుండి శాతవాహనాంధ్రులు దక్షిణమునకు వచ్చి కృష్ణా నదీతీరమున శ్రీకాకుళము రాజధానిగ సామ్రాజ్యమును స్థాపించినపుడు, కృష్ణా గోదావరీమధ్యస్థ ద్రావిడులుమాత్రమే తమయేలుబడి క్రిందకు వచ్చిరి. కాన తమ పరిపాలనక్రిందనున్న వీరిని, కావేరీనదీప్రాంతమందుండి, తమ పరిపాలనక్రింద లేని యితర ద్రావిడులను ప్రత్యేకముగ గుర్తింపవలసిన యావశ్యకత వచ్చినది. కాని కృష్ణా గోదావరీ మధ్యస్థ ద్రావిడులు, కావేరీ నదీప్రాంత ద్రావిడుల నుండి నప్పటికి వేరుపడి యుండిరి. కాని వారి భాషలు మూల ద్రావిడభాషకు మాండలికములుగా (*Dialects*) నుండి యుండును. ఇట్టి స్థితిలో నాకాలమున కృష్ణా గోదావరీ మధ్యస్థ ద్రావిడులకు ప్రత్యేక నామము లేకుండుటచే, శాతవాహనాంధ్రులు తమ జాతి నామమునే తమ పరిపాలనలోబడిన యీ ద్రావిడైక దేశమున కొసగి యుందురు. అందుచే పాలకులు పాలితులుగూడ నేక నామముచేతనే వ్యవహరింపబడి పరస్పరము కలిసిపోయి యుందురు. కాని శాతవాహనాంధ్రులనుండి కృష్ణా గోదావరీ ప్రాంతవాసులను ప్రత్యేకపరచి, గుర్తించుటకుగాను తాముగాని, పరిసరమందలి తమిళులుగాని కృష్ణా గోదావరీమధ్యస్థులను తెన్ + గళు = దక్షిణాదివారని వ్యవహరించి యుండవచ్చును. ఇట్లు వారు ప్రత్యేక దేశీయ నామమగు ‘తెనుగు – తెలుగు’ అను పేరు గ్రహించినను గూడ దీనితోపాటా నామము గూడ నేటికిని వ్యవహారములో నున్నది. క్రీ. శ. 3 వ శతాబ్దమున శాతవాహనాంధ్రుల ప్రభావము క్షీణించగనే, వారు క్రమముగ మరుగుపడిరి. వారిభాషగూడ క్రమమున తన ప్రభావమును గోల్పోయెను.

శాతవాహనుల తర్వాత పాలించిన ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, శాలంకాయనులు, పల్లవులు మొదలైనవారికాలమునగూడ తమిళేతర ద్రావిడ భాషలు పరిణతిజెంది ప్రఖ్యాతికి వచ్చియుండవు. అందుచే నాంధ్రదేశమున పాలకులు సంస్కృతమునే రాజభాషగా గ్రహించి యందే శాసనములను వ్రాయించిరి. ద్రావిడకుటుంబమునకు చెందిన తెలుగు భాష శాతవాహనులకాలమున మూలద్రావిడమునుండి యప్పుడప్పుడే విడివడుచుండెను. ఆంగ్లభాష మొదట నార్మను, తర్వాత సాక్సనుభాషల సంపర్కమున పెరిగినట్లుగనే, తెనుగుభాష ప్రాకృతభాషాసంపర్కమున మొదట పెరుగవలసి వచ్చినది. తర్వాత సంస్కృతసంపర్కము గలిగినది. 7 వ శతాబ్దారంభమున తూర్పు చాళుక్యులకాలమునగాని, తెలుగుభాషకు స్వాతంత్ర్యము చేకూరలేదు. కన్నడ భాష తమిళభాషతో మరి కొంతకాలము కలసి పెరిగియుండును. ఇక మలయాళము చాలకాలమువరకు తమిళమునుండి విడిపోకుండెను. ఇందుచే తెలుగుభాష కన్నడముకంటె నెక్కువ దూరసంబంధమును తమిళముతో గల్గియున్నది.

ఆర్యేతరులైన ద్రావిడుల నాలుకలందు దుష్టముగా నుచ్చరింపబడిన వైదికభాషయే ప్రాకృతభాషయైనదని ప్రాకృతభాషోత్పత్తినిగూర్చి పరిశోధనలు సల్పిన భండార్కరు మొదలైన పండితులందరు విశ్వసించిరి. ఆర్యులకు పూర్వము భారతదేశమునకువచ్చి స్థిరనివాస మేర్పరచుకొనిన ద్రావిడులు, ఆర్యులచే స్థానభ్రష్ట మొనర్పబడి దక్షిణమునకు తరుమబడగ, కొందరుత్తరమునందే పర్వతారణ్య ప్రాంతములందు తలదాచుకొనుచుండిరని డాక్టరు కాల్డవెలు మొదలైన పండితులు సమ్మతిచున్నారు. అటువంటివారే ఐతరేయబ్రాహ్మణమున చెప్పబడిన వింధ్యోత్తరవాసులైన

పుళిందులు, పుండ్రులు, శబరులు, ఆంధ్రులు, మూతిబాలు మొదలైనవారని తలపవచ్చును. విశ్వామిత్రునిచే శప్తులైనవారు వీరిలో గలిసిపోయిరనుటచే. శాపప్రయోజనమునుబట్టి, ఈ జాతులనార్యులలో, ఆర్యేతరులలో చేరికగ గ్రహింపదగును. కావున యీ యార్యేతర జాతివారార్యుల సంపర్కమున వింధ్యోత్తర భాగమున పెరిగిరి. దక్షిణమునకు వచ్చిన ద్రావిడ శాఖలు ద్వీపకల్పము నాక్రమించి స్థిరనివాస మేర్పర్చుకొనిరి. అందుచే వింధ్యకు దక్షిణమునకుబోయిన కొలది యచటి ద్రావిడులకు ఆర్యులతోడను, సంస్కృత ప్రాకృతములతోడను సంబంధము క్రమక్రమముగా దూరమగుచు వచ్చినది. కావేరీ ప్రాంత ద్రావిడులకు సంస్కృత ప్రాకృతవాసనయే లేకపోయినది.

పై విచారణనుబట్టి వింధ్యోత్తర భాగమున నార్యులచే తరుమబడినపుడు అక్కడనే పర్వతారణ్య ప్రాంతముల దలదాచుకొనిన ద్రావిడులే శాతవాహనాంధ్రులనియు, వీరు క్రీ. పూ. 230 ప్రాంతమున కృష్ణా గోదావరీ మధ్యభూమి నాక్రమించి, అంతకుపూర్వమే యందున్న ద్రావిడ శాఖను క్రీ. శ. 225 వరకు పాలించి, వారికి ప్రత్యేక నామము లేకపోవుటచేతను జాతి నామమగు "ఆంధ్ర" ను వారికిచ్చి, క్రమముగా వారిలో గలిసిపోయిరని తలపవలసి వచ్చుచున్నది. క్రీ. శ. 225 సం. న శాతవాహన రాజ్యమస్తమింపగనే "ఆంధ్ర" నామము అసలు మూలస్థలమగు నుత్తరదేశమున పూర్తిగ రూపు మాసినను, పేరును స్వీకరించిన జాతి, భాష, దేశము మాత్రము దక్షిణదేశమున నిల్చియున్నవి. కావున నుత్తరదేశ ద్రావిడులగు శాతవాహనాంధ్రులు, కృష్ణా గోదావరీ మధ్యస్థస్వదేశీయులగు దక్షిణదేశ ద్రావిడులతో కాలక్రమమున కలిసిపోగా, తమ్ము శాతవాహనాంధ్రుల నుండి ప్రత్యేకపరచి గుర్తించుటకుగాను, తాముగాని, పరిసరమందలి తమిళులుగాని, తమ్మును, తెన్ + గళు = దక్షిణాదివారని వ్యవహరించి యుండవచ్చును.

ఈ యూహ సరియే యగుచో తెనుగు శబ్దమునకు పై యుత్పత్తి సమంజసముగా నుండును. 'న' కారము 'ల' కారముగా మారుట ద్రావిడభాషా స్వభావసిద్ధమగుటచే తెనుగు — తెలుగనిగూడ నైనది. తెలంగాన, తెలాంగు, తెలగాలు, తెలగాణ్యులు మొదలైన పదము లిట్టివి.

కడకు సారాంశ మేమనగా, ఆర్యులు భారతదేశమునకువచ్చి, అప్పటికే బహుపూర్వకాలమునుంచి నివాస మేర్పర్చుకొనిన ద్రావిడులను తరిమివేయగా, కొన్ని శాఖలవారు వింధ్యదక్షిణమునకుపోయి యచట స్థిరనివాస మేర్పర్చుకొనగా, మరికొన్ని శాఖలవారుత్తరదేశముననే పర్వతారణ్యప్రాంతములందు తలదాచుకొని నివసించిరి. అట్టితరి, వింధ్యోత్తర దేశమున నిలిచిపోయిన ద్రావిడశాఖవారే శాతవాహనాంధ్రులనియు, దక్షిణమునకు పారిపోయి వచ్చినవారు కృష్ణాగోదావరీమధ్య నివాసులనియు, మరికొంత కాలమున కుత్తరదేశ ద్రావిడశాఖవారైన శాతవాహనులు, దక్షిణదేశ ద్రావిడశాఖవారైన కృష్ణా గోదావరీ మధ్యస్థ తెనుగువారితో గలిసిపోయిరనియు, నందుచేతనే కృష్ణాగోదావరీ మధ్యస్థ శాఖద్రావిడులను 'తెనుగులు' = దక్షిణాదివారు, అని సార్థకనామముతో పిలువబడిరనియు తలపవగును. శాతవాహనాంధ్ర ద్రావిడశాఖ బహుకాలము ఆర్యుల సంపర్కమున పెరుగుటచే, ప్రాకృతభాష క్రమముగా మాతృభాష వారికగుటయే కాక, వారి మతాచారములుగూడ నలవడుటచే కొందరు యజ్ఞయాగాది క్రతువులొనర్చుటయు, మరికొందరుత్తరదేశమున జనించిన బౌద్ధమతావలంబులగుటయు సంభవించినది. ఆర్యమతాభినందనమువలన నార్యాచారములను ప్రస్తుతము శుద్ధద్రావిడులనబడు తమిళులుగూడ నవలంబించినంతమాత్రమున వారార్యులనబడుదురా! అట్లే శాతవాహనులుగూడ ద్రావిడశాఖవారే యైయుందురుగాని ఆర్యులు గాజాలరు.



ఉభయ భారతి

★

శ్రీ యస్వీ జోగారావు

(అమరు కావ్యగాథ యాధారము)

ఎవరా చల్లని తల్లి శంకరుని బ్రహ్మభూతు గీతాది భా
ష్య విధాతన్ పరమ ప్రమాప్రవణు మిథ్యావాద విద్యాధరున్
వివిధజ్ఞున్ నిఖిలజ్ఞు జేసిన యశోవిశ్వంభరా దేవి! ఆ
భవభూతి ప్రతిభాతిశాయి రసికత్వస్థాయి నూహించెదన్.

కిమిదం పూర్వపదార్థపారగుని శృంగేరీమఠాచార్యు ను
త్తమ శృంగార సముద్ర మందర మహీధ్రస్వామిగా జేసి న
య్యమరాఖ్యామరు కావ్యకార్యకలనాహంకారహంవీరు నా
ప్రమదన్ మండనమిశ్రు నాశ్రమరమారామన్ ప్రశంసించెదన్.

కౌమారిలమునకు కామసూత్రములకు నంబపలుకు జగదంబపలుకు
మండన మిశ్రకర్మబుభుత్సు కన్న పూర్ణాదేవి పుణ్యావాస్తోదకమ్ము
వ్యాసన్యాయంపాక మాదిశంకరు నభిఘారమ్ములకు వేల్పు టారగింపు
తర్కకర్కశ పండితమ్మన్యమతులకు తంతన్యమాన చింతాఫలమ్ము
ప్రౌఢకావ్యప్రబంధగిరాం ప్రమాతలైన రసికుల కమరు కావ్యావతార
యోగ మమరించినట్టి యమోఘవాణి మా యుభయ భారతిదేవి మహితఫణితి.

ఒకడు కర్మిష్ఠి, కర్మంది యొక్కరుండు
ఉభయులకు మధ్య తా నాడె నొక్కమాట
తారుమారాయె వారి జాతకము లామె
పలుకు ప్రత్యక్షరమ్ము నిష్పాక్షికంబు

మధ్యాక్కర

తదుపజ్ఞమైన యద్వైతతత్త్వ మన్వర్థమగుటకు
త్వదుపపాదిత మాయెనుగద తార్తీయ పురుషార్థ, మాయె
గద సర్వకూర్పాన మదియు, కడ నాదిశంకరు సూత్ర
మది యభిజిత్తు, 'తత్త్వమసి' యనిపించుకొంటివి దేవి!

వెంకడు

★

శ్రీ వాగంటి సోమయాజులు

వెంకడి కళ్లాం, పొలాలూ ఎంతదూరం నుంచైనా పోల్చుకోవచ్చు. వాస్తవానికి పూర్వంకన్నా మరింత కళకట్టి దిష్టికొట్టుకున్నాయి. ఒకచేతికి యింకోక చెయ్యి తోడైన తర్వాత తీరికే పోతుందా? అడ్డంగా కళ్లాం, కుక్కా అయినా దూర లేకుండా కంచె, నీళ్లతో జమజమలాడుతూ చెరుకులు, అరటి తోటలు కనబడతాయి. నల్లగా, నిఠారుగా తాటిమాని ఏతాం ఎంత దూరానికైనా స్పష్టంగా అనుతుంది. ఇహ, పొలాలు నల్లగా నూనె కక్కుతూ పంటపాసులతో సాగుకి సిద్ధంగానైనా ఉంటాయి, పచ్చని చేలతో ఉయ్యాల లూగుతూనేనా ఉంటాయి.

పుట్టిన దగ్గరనుంచీ వెంకడు ఆ పొలాల్లోనే పెరిగాడు. ఆ పొలాల గట్లంటే గోచీ అయినా లేకుండా గొడ్డపిల్లని మేపేవాడు. దూడలకి గడ్డి దవిరించే వాడు. పెద్దవుతున్న కొద్దీ వాడి ప్రాణం ఆ పొలాలకి కట్టుకున్న పెళ్ళాంతో సహా పెనవేసుకుంది.

పొలా లెంత కలకల్లాడుతున్నా యిప్పుడు వెంకడి కంతా వెలవెల్లాడు తున్నాది.

వెనకటి వెంకణ్ణి ఇప్పటి వెంకణ్ణి గణితశాస్త్ర రీత్యా అర్థం చేసుకోవచ్చు.

వెనకటి వెంకడు = వెంకడు + పొలం + పెళ్లాం. పై మూడూ పెనవేసుకు కలసిన పేరు వెంకడు. తొలి కోడితో లేచి, గుర్రుపెడుతూ నిద్రపోతున్న పెళ్ళాన్ని లెగ్గొట్టి పొలాల్లో పడేవాడు. రాత్రంతా నాటుమణిగాక కళ్లం పరిశుభ్రంగా తుడుచుకుని, పెళ్ళాని కెదురుగా చుట్టకాలుస్తూ, నులకమంచం మీద కూర్చుని, పాకలో నెమరువేసుకుంటున్న దూడలని, పాకమీదకెక్కి, చిక్కగా బలిసి, వెన్నెలతో పంతం ఆడుతూ తెల్లగా వికసించిన ఆనపపాదుని, తనివితో చూసుకుంటూ సేద తేరేవాడు.

ఇప్పటి వెంకడు = వెంకడు + పొలం — (పెళ్ళాం + కొడుకు). ఇంక పిల్లలు కలగరని నిశ్చయం చేసుకున్న తర్వాత మన్నుచేసి, నీళ్ళు పోసే కొడుకుని మధ్య వయస్సులో నాయురాలు కంది. కలక్క కలక్క కలిగిన కొడుక్కి శ్రీ కూర్మం కూర్మనాథుని పేరిట కూర్మిగాడని ముద్దుగా నాయురాలు పేరు పెట్టుకుంది. ఊరంతా కూర్మినాయుడని పిలవడం మొదలుపెట్టేరు. వెంకడికి మాత్రం కూర్మిగాడిలో కూరిమి కనపడలేదు. పుట్టిన దగ్గరనుంచీ వాడి వాలకం ఒక్కలాగుంది. తను ఏతాం తోడుతూ నాయురాలు చెరుకులకు నీరుపెడుతూ ఉంటే నడ్డి ఉయ్యాల్లోంచి కిందికి జారిపోతూ, కిరకిరలాడుతూ ఒకటే ఏడ్పు ఏడ్చేవాడు, అది ఏడుపు సంసారం కాదు. వెంకడి కాళ్లకింద నూతిగోడలు నాలుగూ కూర్మిగాడి ఏడుపును పులుగుపెట్టు స్వరంతో ప్రతిధ్వనించేవి. పిల్లణ్ణి సముదాయిస్తూ పొలం పాటుకి నాయురాలు విగనామం పెట్టేది. పొద్దస్తమానం కూర్మిగాడే నాయురాలి లోకం, వెంకడు కర్ర అందించమంటే, "చేతిలో పిల్లాడు కనబడ్డం లేదా?" అని కస్సుని లేచేది.

ఆ కూర్మిగాణ్ణి చూసి ఆ తల్లే మెచ్చుకోవాలి. కాస్తంత సుంట నాగమ్మవినాక వాడు పొద్దస్తమానం బుక్కరు కొచ్చిన గడ్డి ఒక్క దూడకైనా చాలేది కాదు. ఆ కూర్మినాయుణ్ణి ఊళ్ళోవాళ్ళే మెచ్చుకోవాలి. వాడు వేరుశెనగకి గొప్పుతవ్వితే కొనలన్నీ తెగిపోయి పొలం అంతా సర్వనాశనమైపోయేది. ఊరు ఊరంతా వాణ్ణి వెనకేసుకొచ్చేవాళ్ళే.

కూర్మిగాడు చేతికందివచ్చిన కొడుకుట. చిన్నవాడైనా సంతలో బేరసారాలు వాడితో సమానంగా యింకోడూరు చెయ్యలేరుట. వంకాయలు రాసులు పెట్టడంలో వాడిది అందెవేసిన చెయ్యిట. ముదరవీ, పుచ్చువీ కనబడకుండా పెట్టడం, ఉన్నవి తక్కువ కాయలే అయినా ఎక్కువగా కనబడేటట్లు సర్దడం, చూసీచూడ్డంతో కొన బుద్ధిపుట్టేటట్లు నీళ్ళు జల్లి సంత మెరుగు పెట్టడం కూర్మిగాడి కొక్కడికే తెలుసునట.

వెంకడు కూర్మిగాడితో వేగలేక పోతున్నాడు. వాడి బ్రతుక్కి వాడు వెంకడికి సలహాలు చెప్పడమా? పదేళ్ళు నిండని గుంటవెధవ. అరటిగెలలన్నీ ఒకేసారి కొట్టి బండీమీద పట్నం తోలుకెళ్ళి, పదిరూపాయిలు చేసుకొని, పట్నంలో నాలుగూ కొనుక్కుని, పదం పాడుకూ బండీ తోలుకురావడం వెంకడి అలవాటు. అలాగ కాదుట. నాలుగేసి గెలలుకోసి దగ్గర సంతలకి కావిడేసుకుపోతే రూపాయికి రూపాయి లాభం వస్తుందని కూర్మిగాడి సలహా. ముష్టివెధవ సలహా. ఏ గాలీవానా అయినా వస్తే గెలలు కిందబడి ముక్కలైపోతే లాభం గూబల్లో కొస్తుందని తెలీదు.

రోజు మొత్తంలో ఒక్కసారైనా వాడితో కసాలా తప్పటంలేదు. తెల్లారిందీ అంటే వాడు తెచ్చేడన్నమాటే జట్టీ.

"నాలుగు ఆనపకాయలు కోసెయ్యి. చల్దికూడు తిని మంగళారం సంతకి ఒట్టుకెల్తాను," అని పొద్దున్నే కూర్మిగా డడిగేడు.

"ఏ పాదుని కోసేపాటి కాయలు నేవు" అన్నాడు వెంకడు. నెమ్మదిగానే చెప్పేడు.

"నేకపోడ మేటి? గట్టుమీద పాదుల్ని ఉన్నాయి. సాలమీదా ఉన్నాయి."

"నీ కెలాగ తెల్సు?"

"నాను సూసినాను."

"సూసినావూ? ఇంక ఆటిపని అయింది. ఇంకో వారం పోతేగాని కొయ్యడానికి కాయల్నేవు."

"ఆ కాయ లిప్పుడే కొయ్యాలి. ఇప్పుడు కొస్తేనే కొనేవాళ్ళు కొంటారు. ఏపాటి ముదిరినా బాపనాళ్ళు కొన్రు. ముచిక దగ్గిర గోరుతో గిల్లి ఆళ్లు సూసుకుంటారు. నీ క్కాయ లెప్పుడు కొయ్యాలో తెల్దు. ఛీ, ఛీ," అని మొహం చిట్లించుకొన్నాడు కూర్మిగాడు.

వెంకడు అగ్గి అగ్గి అయిపోయినాడు. పది పన్నెండు పంటలు కళ్ళచూడని వెధవ ఏళ్ళైపోళ్ళు మళ్ళిన అయ్యని అంతమాటంటాడా? వెంకడు ఒక సంతచూశాడా? రెండు సంతలు చూశాడా? ఆనప కాయ లెప్పుడు కొయ్యాలో వాడికి తెలియదూ? సాలమీద, గట్టుమీదా ఉన్న ఆనప పాదులనిండా యిప్పుడిప్పుడే పిందెలు దిగుతున్నాయి. కొన్ని గంగాబొండాం కొబ్బరి కాయలలాగ ఉన్నాయి. వాటి నిప్పుడు కోసీమంటాడు కుర్రకుంక. అవే నాలుగు రోజులు పోతే కడవలంత లవుతాయి. కడవంత కాయకి అణాడబ్బులురావు. కొబ్బరికాయంత పింజకి ఎక్కువ డబ్బులు వస్తాయా?

"ఓరి గుంటగాడిదా! తాతకిరా దగులు నేర్పుతావు? ఈ పాలి పాదుల్లో కళ్ళు సెపుతాను. నీ కళ్ళుపడితే కాయలుంటాయా? అందుకే అన్ని మురిగిపోతున్నాయి. వాటి తోలికళ్ళావా టెంకి మాడుతుంది," అన్నాడు వెంకడు.

"ఈపాలి నన్ను సంతకెళ్ళమను సెపతాను," అన్నాడు కూర్మిగాడు.

"మానీ, ఇంటికాడ కూకో, నానే ఎల్తాను."

"అనాగే కూకుంటాను. ఇవసాయంకూడా నువ్వే చేసుకో."

"ఓ అనాగే ఐళ్ళు" అన్నాడు వెంకడు. సమయానికి దగ్గిర నాయురాలులేదు. ఉంటే మరింత కొంప అంటుకొనేదే. కూర్మిగాడు తిని తిరిగేవాడు. పొలంలో పూతికపుల్ల ముట్టుకోవడంకూడా మానేసేడు. ఉళ్లో ఊసుపోకపోతే నూక్కల్లో కెళ్ళి అక్కడ చదువుకుంటున్న కుర్రవాళ్ళని పోగుచేసుకొని బిళ్లాకర్రా ఆడుకొనేవాడు.

"కూసే గాడిద మేసే గాడిదని చెడగొట్టిందట. బడిమట్టు పక్కల కీమాటొస్తే బడితె బాజాపట్టిస్తాను. అలా తిరక్కపోతే వలుగురితోపాటు వచ్చి నాల్గు ముక్కలు నేర్చుకోరాదా?" అని బడిపంతులు చీవాట్లు పెట్టేడు.

"సెపతారా?" అన్నాడు కూర్మిగాడు.

"మేష్టర్లెందుకున్నారు? బళ్లెందుకున్నాయి?" అని చెపుతూ కూర్మినాయుణ్ణి చెవిపట్టుకొని ఈడ్చుకెళ్ళి, ఇసకలో అ, ఆ, లు రాస్తున్న పిల్లలదగ్గర కూర్చోపెట్టేడు.

మేష్టరుగారికి కూర్మిగాణ్ని చూడగానే చక్కటాలోచన తట్టింది. చురుగ్గా చాకులాగున్నాడు. నాలుగుముక్కలు చెప్పితున్నట్టుంటే యింటిదగ్గర నానాచాకిరీ చేయించుకోవడానికి పనికొస్తాడు. వాడక్షరాలు అవలీలగా పట్టుకొన్నాడు. పదంకెలు చెప్పి పదిపదులు చెప్పేసరికి అంకెలన్నీ యిట్టే పట్టేసుకొన్నాడు.

"నువ్వు బడికొస్తేచాలదు. యింటికికూడారా", అన్నాడు పంతులు. అంతవరకు ఏదో విరిగిపోయిన పలక, తన డ్రాయర్లో పుల్లలూ యిచ్చి చదువు

చెప్పేడు. ఇంక అలాకాక్కాదు. పుస్తకమూ పలకా కొనుక్కోమన్నాడు. యింటికి రమ్మన్నాడు.

కూర్మిగాడికి అయ్యతో మాటలు లేవు. వాడు పని - పాట్లు మాని ఊరపందిలా తిరుగుతూఉంటే వెంకడు కూకలెయ్యి లేదు. నాయురాలు తండ్రికీ కొడుక్కీ జట్టీలు లేకుండా ఉన్నాయని సంతోషించింది. బళ్లో కెళుతున్నట్టు, బడిపంతులింటి కెళుతున్నట్టుకూడా ఆరాలు తీసింది. వాడేం చేస్తున్నదీ చూస్తూ నేఉంది.

"నాను పుస్తకం - పలకా కొనుక్కోవాలి. డబ్బులియ్యవా?" అని కూర్మిగాడు తల్లి నడిగేడు.

"నువ్వు సదువు కెళుతున్నావా?" అని ఏమీ ఎరగనట్టడిగింది నాయురాలు.

"వచ్చి అడుగు"

"అయితే పద" అని నాయురాలు కొడుకుని వెంటపెట్టుకొని బరికెళ్ళింది.

"మేష్టేరుబాబూ; మాయోడు సదువుతున్నాట్ట నిజమేనా?" అని అడిగింది.

"వాడ్ని పలకాపుస్తకం కొనుక్కోమన్నాను" అన్నారు మేష్టరుగారు.

"కొనమని పీక్కుతింటున్నాడు. ఆడికి సదువొస్తాదా?"

"ఫస్టుగావొస్తుంది. కొను"

"అయితే మీరే కొనండిబాబూ. కాస్త ముక్క చెపుతే పంట నాడేటేనా యిచ్చుకుంటాను" అని మొల్లో డబ్బులుతీసి మేష్టరుగారికే యిచ్చింది.

ఆవేళ కూర్మిగా డరుగుమీద కూర్చుని పుస్తకం చదువుతూ ఉండగా వెంకడు చూసేడు. అరటి మొక్కలకి నీళ్ళు తోడి, తోడి జమాయించి పోయి వచ్చేడు.

"పుస్తకమే సదివేస్తున్నావేట్రో" అని అడిగేడు.

"ఆపాటి చదువొచ్చు" అన్నాడు కూర్మిగాడు.

"ఎవడిబొక్కు ఎత్తుకొచ్చినావు"

"ఎత్తుకురావడం ఖర్మమేమి? నానే కొనుక్కున్నాను"

"ఎదవా! పిడతలో డబ్బులు నాకు చెప్పకుండా ఎత్తుకుపోయినావా?" అని కళ్ళెర్ర జేశాడు.

"నా నేమీ ఎత్తుకుపోనేదు. మా యమ్మిచ్చింది"

"ఒరే ఈడికి డబ్బులిచ్చినా?" అని పెళ్ళాన్నడిగేడు.

"ఆ, యిచ్చినాను", అని నిర్లక్ష్యంగా జవాబు చెప్పతూ నాయురాలు గుడిసెలోంచి ఇవతల కొచ్చింది.

"మూడువారాలనించీ ఆడు పని సెయ్యడం లేదు. ఏమిరా ఎదవా, నీకీ పోగాలం, అని అడుగుతావా? ఆడికి పుస్తకమోటికొని బుగతల్లాగా సదువుకుంటూ కూకోమంటావా?"

"పొలంలో నువ్వూ - నేనూ పడుతున్న పాటు కానలే. సిగ్గు నేక మళ్ళా ఆడివూసెందుకెత్తినావు?

"అయితే అణ్ని తగలెట్టు" అన్నాడు వెంకడు. గ్రామంలో ముత్యాలనాయుణ్ని మినహాయిస్తే రైతు దనంలోఅంతా నిశానీగాళ్ళే. ఊళ్ళో ఎలిమెంటరీ సూక్కులున్నా ఏ ఒక్కడికీ అక్షరం అబ్బటంలేదు. మళ్ళా కూర్మిగాడు తలెత్తి చదువులవాడయ్యాడు. ఊళ్ళో సగం రంగం ఉత్తరాలు చదవడం, రాయడం వాడివొంతు కొచ్చింది. ఊళ్ళో ఐదోక్లాసుదాకా అయితే మూడుమైళ్ళదూరంలో ఉన్న పెద్ద ఊర్లో ఎనిమిదోక్లాసుదాకా అయింది. కూర్మిగాడు పట్నం వెళితే పనికొస్తాడని పదిమందీ అన్నారు. పనికిరాడని వెంకడు మూర్ఖపుపట్టు పట్టేడు. కూర్మిగాణ్ని వెన కేసుకుని ముత్యాలనాయుడితో సహా పెద్దలంతా వెంకడిమీద కొచ్చేరు.

"నలుగురు చెప్పినమాట ఇని అణ్ని ఇజానారం సదువుకి పంపు. ఈయాళ మనోళ్లకు ఎక్కళ్ళేని ఉద్యోగాలు వస్తున్నాయి. ఈ పెద్దపెద్ద మునసబీలు, కలకటేరులు మనోళ్ళే. ఏటనుకొన్నావో! ఆడు సదువుకు రానీ. దోసెడు రూపాయిలు బిళ్ళకుడుముల్లాగ గణిస్తాడు" అన్నారు వూళ్ళో పెద్దలు.

"సదువుకున్నోళ్లకి ఉద్యోగాలు ఎక్కడివి? ఆళ్ళంతా అగ్గురోరాల్లో వూరపందుల్లాగ తిరుగుతుంటే?" అన్నాడు వెంకడు. వాడు కళ్ళారా ప్రపంచాన్ని చూసే అన్నాడు. అగ్రహారాల్లో భూములన్నీ అమ్మేసుకు చదివి పదిరూపాయిల ఉద్యోగానికి గతిలేక పడిగాపులు పడుతున్నారు.

"ఆమాటనకు. అది శాపనార్థాలకి. మనకేటిరా ఆసాకు తెస్తావు? ఈయేళ పెన్నపట్నంలో మంతిరి మన రాజాగారు", అన్నారు పెద్దలు.

"వచ్చిందీ ఈమాట మళ్ళా? సుద్దబద్దం. రాజాగారేటి. పెన్నపట్నం మంతిరేటి ? అనోడికి బుద్దుందా? రాజాగోరు మంతిరేటిరా ఎదవల్లారా?" అన్నాడు వెంకడు.

"ఓరి ఎర్రోడా నీకు తెలకపోతే సదువుకునోళ్ళనడుగు" అన్నారు పెద్దలు.

"సదువుకునోళ్ళ అంసం విన్నాను. నాను విశాలీగాణ్ణే. అయినా పదికాలాలూ సూసినాను. రాజాగోరెక్కడా మంతిరికాడు. మంతిరంటే రాజాగోరి కిందివోడు. తెలిసిందా? ఢిల్లీలో కెళ్ళినాయింటే. సదువుకునోళ్ళు సెప్పినా నాను నమ్మను. గేనమున్న ఎవడూ నమ్మడు. ఇది సదువుకునోడి అబద్దం. అళ్ళబద్దాలు దేశాలు దాటిపోతాయి. రాజాగారు పెన్నపట్నం మంతిరి! ఇనాగే సెప్పండి సబువులు" అన్నాడు వెంకడు.

"పసందైనకోడుకుని పాడుచేస్తున్నావు"అన్నారంతా.

"మీరు బాగుసెయ్యడానికే సెప్పినారు. ఆడు పెద్దోడైనాడు మనం సూసినాము. అందుకూ సెడతాడు. యిందుకూ సెడతాడు. ఎప్పటికైనా మీనాగా నానాగా కూడుదున్నుకుబతుకవలసినోడే",అన్నాడు వెంకడు.

"అడె సదువుకుంటే యవసాయం సెయ్యాలా? నిన్ను కూకోబెట్టి కూడు పెడతాడు"

"కూకుడుంటే కూడు ఎలతాదా? బూమిని బద్దలుచేసుకు బతకమన్నాడురా నిన్నూ నన్నూ బెమ్మదేముడు." అన్నాడు వెంకడు.

"నువ్వు బూమి బద్దలుచేసుకుంటూ సవ్వు. నా కూర్మిగాడు పట్నం ఎళతాడు" అని సుడిశెలోంచి నాయురాలువచ్చింది. దానిమాటల ఖణేల్ లో 'నువ్వు పంపితీరాలి సచ్చితీరాలి' అని నాయురాలు ధ్వనించింది.

"ఓలెళ్ళ ఇక్కణ్ణుంచి," అన్నాడు వెంకడు.

"అందరూ ఎళ్లండి" అని మెడ తిణువుకుంది నాయురాలు. నాయురాలిమెడనిండా మెడ తిరగని బంగారం అందరికళ్ళకీ పచ్చగా కనపడ్డాది.

వెంకడుపెళ్ళాన్ని పెద్దలనీ తీక్షంగామూశాడు. చంటికుర్రాడిలాగ ఒక్క పిల్లిగంతువేసి సంతోసంతో నవ్వుతూ ఒక్క చిటిక వేసేడు.

"మా గనమైన ఆలోశన తట్టింది. దెబ్బతో బుద్ధి మారిపోయింది. ఎళ్లండ్రా అంతా ఎళ్ళండి. కూర్మిగాణ్ణి నాకే పట్నం అంపుతున్నాను. మరి జట్టు లేదు," అన్నాడు వెంకడు.

మర్నాడు కూర్మినాయుణ్ణి వెంకడే పట్నం చదువుకి పంపించేడు. పనులన్నీ పూర్తి అయినాక కళ్ళంలో చుట్టకాలుస్తూ పెళ్ళాని కెదురుగా నులకమంచంమీద కూర్చున్నాడు. కొడుకు పట్నం వెళ్ళిపోయాడని కొంచెం దిగులున్నా నాయురాలు మొగుడే పంపాడని సంబరపడుతున్నాది.

"ఈరోత్రి నా మనుసు మనసు నాసున్నాది" అన్నాది నాయురాలు.

"నామనుసూ మనుసు నాసుంది," అన్నాడు వెంకడు.



విజ్ఞాన విశేషాలు :

విద్యుచ్ఛక్తి - పూర్వకథ

★

శ్రీహరి ఆదిశేషవు

ప్రాచీన గ్రీకు ఇటాలియన్ శాస్త్రవేత్తలకు సృష్టిలో తఱచు కనిపించెడి మెరుపు విద్యుత్ శక్తి వికారమనే సంగతి తెలియనే తెలియదు. క్రీ. పూ 600 సంవత్సరముల నాడు థేల్స్ అనే శాస్త్రజ్ఞుడు అంబరు (పచ్చని కర్పూరపుపూస) ముక్కను గట్టిగా రుద్దినయెడల దానికి ఒక వింతస్వభావము కలుగునని కనుగొన్నాడు. అట్టి అంబరు ముక్క కాగితపు ముక్కలను బెండుబంతులను ఆకర్షిస్తుంది. అందుచేత దానికి ఒక విధమైన ఆవేశం కల్గించవచ్చు. గ్రీకు భాషలో అంబరును ఎలక్ట్రిన్ అందురు. అందుచేతనే దానిని రుద్దినపుడు కలిగే ఆవేశానికి ఎలక్ట్రిక్ ఆవేశమనే పేరువచ్చింది. ఆ ఆవేశము విద్యుత్స్వభావమువల్ల వచ్చిందనీ దాన్ని పూర్ణంగా వివరించే శాస్త్రానికి విద్యుత్ శాస్త్రమనీ, ఎలక్ట్రిసిటీ అనీ వ్యవహరిస్తారు. పాశ్చాత్యదేశాల్లో ప్రాచీన కాలంలో విద్యుత్‌ను గురించిన విజ్ఞానం మరి ప్రబలలేదు. థేల్స్ గమనించిన విశేషాన్నే ప్లినీ, థియోఫ్రాస్టస్ అనేవారుకూడా తమతమ రచనల్లో ఉదహరించారు.

ఆధునిక కాలంలో ఎలక్ట్రిసిటీని గురించి పరిశోధించిన వారిలో విలియమ్ గిల్బర్టు మొదటివాడు. అతడు 1544—1608 సంవత్సరముల మధ్యకాలంలో నివసించాడు. ఆ కాలంలో ఆంగ్లదేశాన్ని పరిపాలించిన ఎలిజబెత్ రాణికి ఆయన ఆస్థానవైద్యుడు. కుశాగ్రబుద్ధి. ప్రయోగసాధనలో అభిరుచికలవాడు. ఉన్నితో రుద్దిన వల్కనైటుకడ్డీ, ఫ్లానల్ దుద్దినగాజు కడ్డీకూడ అంబరులాగే విద్యుదావేశం పొందుతా యని అతడు కనుక్కొన్నాడు. దానివల్ల అవికూడా కాగితపు ముక్కలూ, కార్కుపొడీ మొదలైన వాటినీ చిన్న స్కేలుబద్దలనీ ఆకర్షింస్తాయని ఆయన గమనించాడు. అందుచేత విద్యుదావేశాన్ని పొందటం అంబరుయొక్క ప్రత్యేకలక్షణము కాదనీ అది ఒక తరహాపదార్థముల సామాన్య లక్షణమనీ తేలింది. మనసుకు ఉల్లాసము కలిగించేవి అవటంచేత ఇటువంటి ప్రయోగాలుచేయటంలోను, విద్యుత్ శక్తి లక్షణాలని శోధించుటంలోనూ, వెంటనే అనేకులికి కుతూహలము కలిగింది.


గిల్బర్టు తరువాత ఎలక్ట్రిక్ సిటీని గురించి పరిశోధనలచేసిన వారిలో స్టీవెన్ గ్రే ముఖ్యుడు. అతడు 1729 ప్రాంతంలో జీవించాడు. కొన్ని పదార్థాలు విద్యుత్ ఆవేశాన్ని చురుకుగా ఒక చోటినుండి మరొకచోటికి ప్రవహించేలాగ చేస్తాయనీ కొన్ని అలాగ చేయలేవనీ ఆయన కనుక్కొన్నాడు. ఈ గుణభేదాన్ని అనుసరించి పదార్థాలని విద్యుద్వాహకములనీ (*Conductors*) విద్యుద్నిరోధులనీ (*Insulators*) రెండు విభాగములు చేసేటందుకు వీలైంది. వీటిలో విద్యుద్వాహకాలు విద్యుత్ప్రసారాన్ని అడ్డుకొంటాయని వాటి పేర్లవల్లనే తెలుస్తోంది. ధాతువులన్నీ సామాన్యంగా మంచి విద్యుద్వాహకములే. విశేషించి, వానిలో రాగి, వెండి, ప్లాటినములు శ్రేష్ఠమైనవి. ఇవేకాకుండా రసాయనిక లక్షణాలవల్ల ఉపధాతువైనప్పటికీ గ్రాఫైటుకూడ మంచి విద్యుద్వాహకమే. అంబరు, లక్క, ఎబో

సైటు గాజుకడ్డీ, రబ్బరు, కర్రమెందలైనవి, విద్యుద్విరోధుల కుదాహరణములు. గ్రాఫైటుతప్ప తక్కిన ఉపధాతువులన్నీ విద్యుద్విరోధులే. గ్రీచేసిన ప్రయోగములు చేయటం ఎక్కువ శ్రమ కాదు. అంతే కాకుండా ఖర్చుకూడలేదు. మీరు మిక్కిలి అవి వినోదదాయకములుకూడాను. అందుచేత ఆప్రయోగ విధానము తెలుసుకొని చేసి ఆనందించండి.

ఒక రాగిపాత్రను తీసికో. దాన్ని ఒక రబ్బరు గుడ్డపైని ఉంచు. తరువాత కఱ్ఱపిడిగల రాగికడ్డీ తీసుకొని ఫ్లానలుగుడ్డతోటి గట్టిగారుద్దు. రాపిడివల్ల అది విద్యుదావేశము పొందుతుంది. దాన్ని వెంటనే రాగిపాత్రకు తగిలించు. వెంటనే ఆవిద్యుత్తు దానిలోకి ప్రవహిస్తుంది. అందువల్ల అది చిన్న చిన్న కాగితపు ముక్కల మొదలైనవాటిని ఆకర్షిస్తుంది. రాగికడ్డీని రుద్దేటపుడుగాని రుద్దిన తరువాత పాత్రకు తగిలించడంలోగాని చేతితోటి తాకరాదు. పరాకున్నైన అల్లాచేస్తే తయారైన విద్యుత్ శక్తితాకిన వారి దేహము ద్వారా భూమిలోకి ప్రవహిస్తుంది. రాగికడ్డీ వెంటనే విద్యుదావేశాన్ని పోగొట్టుకొంటుంది. అందుచేత దానిని తరువాత రాగిపాత్రకు తగిలించినప్పుడు ఏ విశేషమూ కనిపించదు.


1733 లో ఫ్రాన్సుదేశపు రాజుగారి ఉద్యానవనపాలకుడైన డూఫే అతి ముఖ్యమైన విద్యుత్ శక్తి లక్షణము ఒకదాన్ని కనుకొన్నాడు. పదార్థాల రాపిడివల్ల కలిగే విద్యుత్ శక్తి రెండు రకాలనటమే. అతని పరిశోధనలవల్ల తేలిన సారాంశము విద్యుత్ శక్తి విజ్ఞానానికి ఈ విషయము జీవంవంటిది. అందుచేత ఈ విషయము తెల్పటానికి అతని కుపయోగపడ్డ ప్రయోగ విధానాలని గమనించటం అవశ్యము.

అతడు రెండు చిన్న బెండు ముక్కలను తీసుకొని వానిపైని అతిపల్చని మెచ్చి బంగారపురేకుల్ని అతికించాడు. ఆ రెండింటిని సిల్కుదారాలకి వ్రేలాడగట్టి దగ్గరగా కలిపియుంచాడు. తరువాత ఒక గాజు కడ్డీకి విద్యుదావేశం కల్గించి ఆ బంతులకు తగిలించాడు. వెంటనే ఆబంతులు రెండూ విద్యుదావేశం పొంది ఒకదానికొకటి ఎడమొహమూ పెడమొహమూ కలవై దూరంగా పోయాయి. ఒక లక్కకడ్డీకి విద్యుదావేశము కల్గించి ఈ రెండు బంతుల్లో ఒకదాని దగ్గర పెట్టినపుడు అది దానిదగ్గరగా ఆకర్షింపబడింది. ఈ ప్రయోగమువల్ల గాజుకడ్డీని రాపిడిచేసినపుడు ఒకరకమైన విద్యుత్ శక్తి లక్కకడ్డీని రాపిడిచేసినపుడు మరొరకమైన విద్యుత్ శక్తి, ఏర్పడినట్లు కన్పిస్తుంది. రెండు బెండుబంతులకీ ఒకే రకమైన విద్యుదావేశం కలిగినపుడు అవిజ్ఞాతి వైరం కలవానిలాగ ఒకదానికి ఒకటి దూరమైపోయాయి. లక్కకడ్డీని రుద్దినపుడు మరొరకమైన విద్యుత్ శక్తి తయారైందని అందువల్లనే వేర్వేరు రకాల విద్యుత్ ఆవేశముకల బెండు రెండూ లక్కకడ్డీ స్నేహితుల మాదిరిగా ఒక దాని దగ్గర కొకటి చేరుకొన్నాయనీ తేలుతోంది. ఈ విషయం ఈక్రింది బొమ్మలు చూస్తే స్పష్టమౌతుంది. ఈ రెండు రకాల విద్యుత్ శక్తి రూపములకీ (విట్రియస్) విద్యుత్తు అనీ (రెసినస్) విద్యుత్తు అనీ మొదట పేర్లు పెట్టారు. కాని వాటినే మనము ధనాత్మక విద్యుత్తు అనీ (పాజిటివు) ఋణాత్మక విద్యుత్తనీ (నెగటివు) వాడుతున్నాము. పాజిటివు నెగటివు లలో ఏదో ఒకే రకపు ఆవేశముకల రెండు వస్తువుల్ని దగ్గరగా పెట్టినపుడు కాశీగావడి వారి బొమ్మల్లోని సీత రావణుడిని చూచినప్పుడు గిర్రున మొగముటు



ధన, ఋణ, విద్యుత్తు

త్రిప్పుకొన్నట్లు ఒకదాని కొకటి దూరంగాపోతాయి. అలా కాకుండా ఒకటి పోజిటివు, మరొకటి నెగటివు విద్యుదావేశము కలవైనప్పుడు అవి ఒకదానిని ఒకటి ఆకర్షించుకొంటాయి. దూఫేశాస్త్రజ్ఞుడు చేసిన ప్రయోగాలవల్ల ఏ పదార్థమైనా విద్యుదావేశపూరితమో కాదో తెలిసికొనేందుకుపయోగించే 'స్వర్ణపత్ర విద్యుత్సూచి' అనే సాధనం నిర్మించటానికి వీలైంది. (ఈబొమ్మను పరిశీలించి నిర్మాణాన్ని గమనించు.)



స్వర్ణపత్ర విద్యుత్సూచి

ఒక పెట్టె పైభాగములో ఒక వల్కసైటు బిరడా అమర్చబడియుంటుంది. (C) ఆ బిరడాలో ఒక కడ్డీని అమర్చిదానికి పెట్టెలోపలవైపు ఉన్న చివర (A) ని రెండు అతిపల్చని ముఖ్య బంగారు రేకుల్ని అతికిస్తారు. వాటికి వెనుకప్రక్క గ్రాఫు (చదరపుగళ్ళు) కాగిత మొకటి యంటిస్తారు. పెట్టెకు ముందువైపున ఒక గాజు పలకని అమర్చి లోపలఉన్న బంగారపురేకుల స్థితిని గమనించేందుకు వీలు కల్పిస్తారు. అతి తేలికగా నిర్మించడానికి వీలైన ఈ సాధనాన్ని స్వర్ణపత్ర విద్యుత్సూచీ సాధనమంటారు.

ఏ వస్తువుకైనా విద్యుదావేశము ఉందో లేదో తెలుసుకోవలెనంటే దాన్ని B అనే రేకుమీద ఉంచుతారు. అవి విద్యుదావేశం కలదైతే విద్యుత్తు దాని నుండి A వరకు ప్రవహించి బంగారురేకులకు ఆవేశము కలిగిస్తుంది. ఒకే స్వభావముకల విద్యుదావేశపూరితము లవటంచేత అవి వెంటనే ఎడమొంగమూ పెడమొగమూ పెట్టుకొని ఒకదాని కొకటి దూరమవుతాయి. ఒకదాని కొకటి అవి యెంతదూరము పోయారెూ వెనుక షీటులో ఉన్న గళ్ళకాగితంపైన చూసి గ్రహింపవచ్చు. వాటి మధ్యనున్న దూరాన్ని బట్టి విద్యుదావేశాన్ని లెక్క పెట్టడానికికూడా వీలవుతుంది. (బి) పైని ఉంచిన వస్తువుకి విద్యుదావేశం లేకపోతే బంగారు రేకులు ఉన్నట్లే ఉంటాయి.

ఒక పదార్థముతో మరొకదాని రాపిడివల్ల తయారుచేయటానికి వీలైన విద్యుత్‌శక్తి చాలా స్వల్పమూ; క్షణికమూను. కాని కొద్దికొద్దిగా తయారయే ఆ విద్యుత్‌ను పోగుచేయటానికి వీలైతే దానిని ఉపయోగించటానికి కూడా వీలవుతుంది. శీతాకాలంలోగాని ముసురు రోజుల్లోగాని, తివాసీలమీద ఇటు అటూ చాలాసేపు పచారుచేస్తు నడచిన వారిలో రాపిడివల్ల విద్యుదావేశముకలుగుతుంది. తరువాత వారు మరొకరిని తాకినపుడు ఆ యిద్దరి దేహాల్లోనూ విద్యుత్ప్రసారమై చురుక్కుమని విద్యుదాఘాతము కూడ ఒక్కొక్కప్పుడు కలుగుతూంటుంది.

రాపిడివల్ల లభించే విద్యుత్ చాలా స్వల్పమూ క్షణికమూ. అయినా దాన్ని యంత్రసహాయం వల్ల పోగుచేసి మెరుపుతీగలవంటి విద్యుత్ చెణుకుల్ని కూడా శాస్త్రజ్ఞులు తయారుచేశారు. అందుకు పనికి వచ్చే యంత్రనిర్మాణానికి కృషిచేసిన వారిలో (*Guericke*) గెరిక్ అనే శాస్త్రజ్ఞుడు మొదటివాడు.


అతడు గంధకముతో ఒక గుండ్రని పెద్ద బంతిని తయారుచేసి తరవాత దాన్ని ఒక యినుపకడ్డీకి తగిలించాడు. ఆ తరువాత దాన్ని గిర్రున త్రిప్పటకై కంచు, యిత్తడి, తగరము మొదలైన లోహపు పాత్రలను తరిమిన పెట్టుట కుపయోగించే చక్రములాంటి సాధనము వాడాడు. గంధకపుగుండు గిర్రున తిరుగుతూన్నపుడు దానిని రాపాడి విద్యుత్ ఆవేశము కల్గించాడు. ఈ ప్రయోగముచేసే సమయములో గంధకమును రాపాడించువారు అవిద్యుద్వాహకముపైని నిలబడియుండటం మిక్కిలి అవసరము. అట్లు చేయని యెడల తయారైన విద్యుత్ వారి దేహముగుండా భూమిలోనికి ప్రసరించి పోతుంది. అందుచేత తలచిన పనికాక విఫలమవుతుంది.

గెరిక్ యంత్రము నిర్మించిన తరువాత మరి తొమ్మిది సంవత్సరములకు హాక్స్బీయనే శాస్త్రవేత్త విద్యుత్ చెణుకులను కూడా కల్పించే సమర్థత కల యంత్ర సాధనం నిర్మించాడు. దానికి అతడు గాజు


గోళములను ఉపయోగించాడు. ఒకచేతితో గోళములని త్రిప్పుతూ మరొకచేతితోటి దానిని రాపాడాడు. ఈ యంత్రములో తయారైన విద్యుత్‌ను పోగుచేయటానికి కూడ అనువైన విధానముపయోగింపబడింది. యంత్రము పనిచేసేటప్పుడు దానిలోని గోళం ఒకవైపును రాపాడింపబడుతుంది. అట్లు రాపాడింపబడే వైపు కాకుండా దానికి అవతలవైపున ఒక విద్యుద్విరోధ పదార్థంతో చేయబడినట్టి రేకు ఒకదాన్ని తగిలిస్తారు. యంత్రాన్ని కొంతసేపు నడిపినప్పుడు ఈ రేకుపైని విద్యుత్తు క్రమంగా పోగుపడుతుంది. దాని దగ్గరా వ్రేలు పెట్టినప్పుడు చిటపట ధ్వనిచేస్తూ చిన్న మెఱుపులవంటి నెరుసు లేర్పడుతాయి.

విద్యుద్యంత్రములలో తయారయే విద్యుత్‌ను వెనువెంటనే ఉపయోగింపవలెనే కాని నిలవచేయుటకు వీలులేదు. అట్లు నిలవచేసేందుకు లెయిడెన్ పాత్ర అనే సాధనమొకటి పనికివస్తుంది. ముషెన్ బ్రెక్ అనే శాస్త్రజ్ఞుడు 1745 లో ఆ సాధనాన్ని నిర్మించాడు. అతడు లెయిడెన్ నగరవాసి యగుట చేత ఆ సాధనానికి లెయిడెన్‌పాత్ర అనే పేరు వచ్చింది. ఒక వెడల్పు మూతిగల గాజు సీసా తీసికొని దానికడుగునా లోపలా తగరపు రేకును తొడుగుదురు. ఆ సీసామూతికి ఒక వల్కనైటు బిరడాను వేయుదురు. బిరడాలో ఒకవైపున గుండుగా వుండు యిత్తడికడ్డీ అమర్చబడియుంటుంది. అదిగాని, దానినుండి ఒక గొలుసుగాని లోపలి తొడుగుని తగులునట్లు చేయుదురు. ఈ లెయిడెన్ పాత్రలో లోహపు గుండును విద్యుద్యంత్రమునందున్న వల్కనైటు రేకుతో సంధానముచేయుదురు. అందువలన లెయిడెన్ పాత్రలోపలనున్న తగరపు రేకు ధనాత్మక విద్యుదావేశమునందును. వెంటనే తగరపురేకు ఋణాత్మక విద్యుదావేశమునందును. అందుచేత రెండు తగరపు రేకులమధ్య విద్యుత్ అంతరము పెరిగిపోతుంది. అవి భిన్నస్వభావముకలవి అవటంచేత ఒకదాన్ని ఒకటి యాకర్షించుకొంటాయి. మధ్యనున్న గాజు పలక వానిని వేరుచేయుచుండుటవల్ల అవి రెండూ కలిసి విద్యుత్‌ను నష్టపోవు. విద్యుత్ అంతరము హెచ్చుగా ఉన్న ఈ రెండు తగరపు రేకుల్ని ఏదైన తీగెతో సంధించినప్పుడు దానియందు విద్యుత్ ప్రవహిస్తుంది. ఒకచేతిలో విద్యుత్ ఉన్న లెయిడెన్ పాత్రనుంచుకొని మరొకచేతితో లోపలి యిత్తడిగుండును అంటిన యెడల దేహములో వెంటనే విద్యుత్ ప్రసరిస్తుంది. అప్పుడు మెఱుపువంటి నెరుసు లేర్పడి దేహానికి మెఱుపుదెబ్బ తగులుతుంది. విద్యుత్‌శక్తి విజ్ఞాన సంపాదనకు ఈ లెయిడెన్ పాత్ర శాస్త్రజ్ఞులకు ఎంతో వుపకరించెను. దీనివల్ల వారికి శాస్త్రప్రయోగముల కుపయోగించుటకు వీలైనట్లుగా విద్యుత్‌ను నిలవచేసే సాధనము దొరకెను. అందుచేత విద్యుత్‌ను పయోగించి వివిధ గా ప్రయోగములచేయుటకూ దాని స్వభావమూ కొన్ని లక్షణములనూ శోధించుటకు వీలయ్యెను.

ఈ శాస్త్రాభ్యాసపు మొదటి రోజుల్లో వాడబడిన విద్యుద్యంత్రములన్నింటిలోనూ 'విమ్‌షర్స్ట్' యంత్రము అనేది చాలా ముఖ్యమైంది, అందుచేత దాని నిర్మాణ వివరాన్ని నేర్చుకుందాము. ఈదిగువను



నిజరూపము



విద్యుద్వివరణ

విమ్‌హర్స్ట్‌యంత్రము.

వున్న దాని బొమ్మను చూడండి. దానిలో రెండు గాజు పళ్ళెములుంటాయి. వాటిపైని వార్నిషు పూతపూసి మొత్తం ఒక్కొక్క దాని దళసరి అంగుళంలో పదోవంతు వుండేలాగచేస్తారు. వాటి పైభాగంలో అంచులకు కొంచెం క్రిందగా, అక్కడక్కడ తగరపు ముక్కల్ని అంటిస్తారు. తరువాత వాటిని ఒకదాని కొకటి రాసుకోనేలాగు అమర్చి ఒక గాజుపళ్లాన్ని ఎడమవైపుకీ రెండో దాన్ని కుడి వైపుకే తిరిగేలాగు చేస్తారు. గాజు పలకరాపిడివల్ల విద్యుత్ శక్తి కలుగుతుంది. పైనున్న గాజు పలకలలో పైభాగంలోనూ, క్రిందవున్న గాజు పలకలలో అడుగు భాగంలోనూ ఋణవిద్యుత్ను పోగుపడుతుంది. గాజు పలకల్లోని తక్కిన భాగముల్లో ధనవిద్యుత్ పోగుపడుతుంది. ఆయా భాగాల్లోవున్న తగరపు ముక్కలను కూడగట్టివిద్యుత్ను లోహపుగుండ్లలోనికి ప్రవహించేలాగుచేస్తారు. ధనవిద్యుత్ పోగుపడ్డ లోహపుగుండును ధనధ్రువమనీ, ఋణవిద్యుత్ ప్రవేశించిన గుండును ఋణధ్రువమనీ అనవచ్చును. ధనధ్రువానికి దగ్గరగా ఋణధ్రువాన్ని త్రిప్పుతారు. అపుడు వాటి విద్యుత్ అంతరము మధ్యనున్న గాలికలిగించే నిరోధంకంటె బలమైనది కావడంతో నే విద్యుత్ ధనధ్రువం మీదనుంచి ఋణధ్రువంమీదికి దూకుతుంది. ఆ దూకడంలో చిటపటలూ తళుక్కునే మెరుపూ కలుగుతాయి. వాటినే విద్యుత్ చెణుకులంటారు. విద్యుత్ను సేకరింపదలచినపుడు ధనధ్రువాన్ని లెయిడెన్ పాత్రలోనున్న లోహపుగుండుకీ, ఋణధ్రువాన్ని దానిపైనున్న తగరపు రేకుతోటి కలుపుతారు.

ఘనపదార్థాల పరస్పర ఘర్షణవల్లనే కాకుండా ద్రవ వాయు పదార్థముల అణువుల పరస్పర ఘర్షణవల్ల కూడా విద్యుత్ శక్తి తయారవుతుంది. చూపులకి మనోహరముగా కనుపించి చేరువైనప్పుడు విపరీత నష్టంకలిగించే మెరుపుకూడా సృష్టిలో పదార్థాల ఘర్షణవల్లనే యేర్పడుతోంది. మేఘాలు గాలిలో తేలియాడే నీటియావిరి అని అందరికి తెలిసిన విషయమే. ఒక్కొక్కప్పుడు వాటి విస్తీర్ణము సుమారు ఒకమైలువరకూ వుంటుంది. వర్షము పడుతున్నప్పుడు నీటిబిందువులు జలజలా క్రిందికిపడతాయి. ఆ పడటంలో అవి యింకా ఆవిరి రూపంలోవున్న అణువులతోటీ మరో మేఘంతోటీ ఢీకొక్కవడం జరుగుతుంది. వాటి రాపిడివల్ల విద్యుత్ శక్తి యేర్పడుతుంది. మేఘానికి పైభాగంలో ధనవిద్యుత్తూ క్రింది భాగంలో ఋణ విద్యుత్ పోగుపడతాయి. వాటి విద్యుత్ అంతరము క్రమంగా హెచ్చుతుంది. దానిబలం గాలియొక్క నిరోధంకంటె ఎక్కువకాగానే విద్యుత్ పైనుంచి క్రిందికి జరజరా ప్రాకుతుంది. దానినే మనము మెరుపు అంటాము. దీనిని సృష్టిలోకల్లా పెద్ద విద్యుత్ చెణుకు అనవచ్చు. దానితో పాటుకలిగే ధ్వనే పిడుగు. మెరుపులు సామాన్యంగా మేఘంపైనుంచి క్రిందిదాకానే వ్యాపిస్తాయి. ఎప్పుడేనా పరకపాటుగా అది మేఘముయొక్క అడుగుభాగమునుంచి చెట్లమీదికికాని, యిండ్లమీదికిగాని, మనుష్యులమీదికిగాని దూకి వినాశంకల్గిస్తూంటుంది. మెరుపు మెరియుటతోనే ప్రోగుపడ్డ విద్యుత్ ఖర్చయిపోతుంది. తిరిగీ మెరుపు మెరియడానికి అవసరమైన శక్తిపోగుపడేందుకు సామాన్యంగా 20 సెకనులకాలము పట్టుతుంది. ఉరుములు, మెరుపులు ఈటారుతీగలతో కూడిన వర్షంకురిసేటప్పుడు సృష్టిలో యెంతో విద్యుత్ శక్తి తయారై నిరుపయోగమై పోతుంది. అంతటితో పోకుండా అది ఒక్కొక్కప్పుడు ఆస్తికీ, ప్రాణాలకీ నష్టంకూడా కలిగిస్తుంది. క్షణికమూ విపరీతమూ అయిన యీ శక్తిని పూర్తిగా అదుపులో పెట్టి వాడుకచేసేందుకు వీలైనప్పటికీ, సాధనాలు ఇప్పటికీ నిర్మింపబడలేదు.

నీటి ఆవిరిలోని అణువులు, యితరవస్తువులతో రాపాడినపుడుకూడా విద్యుత్ శక్తి తయారవుతుంది. ఈ విశేషాన్నుపయోగించి విద్యుత్ శక్తిని విరివిగా తయారుచేసే యంత్రాలు వాడుకలోకి వచ్చాయి. వాటి మూల సూత్రం తలవని తలంపుగా దొరికింది. ఒక రోజున న్యూకాసిల్ దగ్గర ఒక ఫాక్టరీలో పనిచేసే మెకానిక్ తన అజమాయిషీలోవున్న ఆవిరికాగులోంచి నీటి యావిరి యెక్కువగా పైకిపోతూండడము చూశాడు. చూడగానే అతనికి ఆ బయటికిపోయే ఆవిరిని తగ్గిద్దామనే అభిప్రాయం కలిగింది. వెంటనే చేతికి ఒక చర్మపుతొడుగు వేసికొని సలసల మరిగే నీటి ఆవిరిలో ఉన్న వాల్వుని చేతితో సర్దబోయాడు. అల్లాచేస్తుండగా అతనిచేతికీ, వాల్వుకీ మధ్య చిన్న మెరుపు మెరిసింది. వెంటనే అతనికి మెరుపుదెబ్బ తగిలివళ్ళు ఝల్లుమంది. అతడు తన యీ వింతఅనుభవాన్ని వెంటనే ఆరమ్

స్టాన్లీ గ్రే శాస్త్రజ్ఞునికి తెలిపాడు. ఈ విశేషము శాస్త్రజ్ఞుల గోష్ఠిలో కొంతకాలం నలిగింది. చివరకు ఫారడే యీ విద్యుత్ ఏర్పడటానికి నీటిలోవున్న అణువులు తోలుతో చేయబడిన తొడుగులతో ఘర్షణ పొందుటయే కారణమని, ప్రయోగమూలముగా ఋజువు చేశాడు. అతడు చేసిన ప్రయోగవిధానాలవల్లనే విద్యుత్తుని విరివిగా తయారుచేసేందుకు ఉపయోగించే హైడ్రో ఎలక్ట్రిక్ యంత్రాలు వాడుకలోకి వచ్చాయి.

మనం పాశ్చాత్య దేశాల్లో విద్యుత్ శక్తి పూర్వ చరిత్రను గమనించాము. ప్రాచ్యదేశాల్లో పూర్వము యీ శాస్త్రవాసనే అసలు లేదనే అపోహపడకండి. వీరికి విద్యుత్ నుగూర్చి యింతకన్న యెక్కువగా తెలుసునని ఋజువుచేసేందుకు ఆధారాలున్నాయి. పాశ్చాత్యులు ఆంబరు అన్న పదార్థానికే మనవారు తృణమణి, తృణగ్రాహి అనే పేర్లువాడారు. ఆ పేర్ల వల్లనే అది గడ్డిపరకలనూ, తృణప్రాయమైన జీలుగు బెండు, కాగితపుముక్కలూ మొదలగువాటిని ఆకర్షిస్తుందని వారెరుగుదురనీ తెలుస్తోంది. అంతేకాక యిటీవల మెసొపొటేమియా దేశంలో పురాతన వస్తువు శేషమైనా దొరుకుతాయేమోనని త్రవ్వినపుడు విద్యుద్ఘటము ఒకటి బైటపడింది. అది అడుగులేని రాగిపంచ పాత్ర. దానికి అడుగునా పైనాకూడా పేరినతారు వేయబడివుంది. అది నేడు వాడుకలోవున్న విద్యుద్ఘటాలన్నీ చాలవరకు పోలివుంది. అందుచేత ప్రాచ్య దేశాలవారికి విద్యుత్ ను గురించి తెలుసుననీ దాన్ని సాధనంగా ఉపయోగించేవారేమోననీ అనుకోవచ్చు. ఇదేకాకుండా మనపూర్వులు విద్యుత్శక్తినాల్ని ఉపయోగించేవారేమోననడానికి నలదమయంతుల కథలో ఒక వర్ణనుంచికూడా మనం అనుమానించడానికి అవకాశం ఉంది. ఆ కథను సంస్కృతంలో రాసిన శ్రీహర్షుడూ, దాన్ని తెలిగించిన శ్రీనాథుడూ 1600సం వత్సరానికి పూర్వం నివసించినవారే. అందుచేతే పాశ్చాత్యదేశాల్లో విద్యుత్తుని గురించి అప్పటికి తెలిసినదానికంటె ప్రాచ్యదేశంవారికి, అంతో, దానికంటె కొంచెం ఎక్కువో, తెలుసునేమో అనిపిస్తుంది. ఇది కేవలం అనుమానించవలసిందే కాని ఋజువైందని ఏవ్వరూ అనుకోవద్దు.

ఈ చర్చకి కారణమైనదీ మనోహరమైందీ ఐన శ్రీనాథుని పద్యాన్ని ఉదహరించి ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"ఒక దీపమార్పిన నున్న దీపంబులు
అప్పుడే తమకుతా మారుటయును.
తాలవృంతానిల చేలాంచలాదిక
వ్యాపారముల దీపమారమియును
ఆజీన దీపంబు లప్రయత్నంబున
మరిమాడజూడంగ నుండుటయును.

మండి అణీయు, ఆరిమండిన దీపంబు
వెలుగుచీకటియు కావించుటయును
కలుగునట్లుగ వరశిల్పికలన రాజ
శిల్పుల నవ్వులాలకు జేయుచుండె."



విశ్వకర్మ

★

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

గంగయ్య ఉదయాన్నే లేచి స్నానంచేసి, వొంటికి విభూతికట్లు, నుదుట కుంకంబొట్టు పెట్టుకుని, బాడిత చేతబుచ్చుకుని, గడపదాటి వీధిలోకి వచ్చాడు. అతనికి ఒకేఒక సమస్య. ఆరోజు కూలి సంపాదించి, కడుపులో ఏమైనా వేసుకోవాలి. అంతకు మించి అతనికి కావలసినదేమీ లేదు. కాని అన్నిటికన్న అదే చిక్కు సమస్య. ఈ సమస్యా పరిష్కారార్థమై బయలుదేరేడు.

శీతకాలం కావడం వల్లనూ, ముడుతలు పడిన శరీరంమీద సరియైన బట్ట లేకపోవడంవల్లనూ, కొంచెం చలివేసింది. గంగయ్యకు గడచిన జీవితం ఒక్కసారి జ్ఞాపకం వచ్చింది.

తను యవ్వనంలో వున్నప్పుడు మంచి బలశాలి. ఎంత చలికాలమైనా తెల్లవారు గట్ల నాలుగోగంటకు లేచి చన్నీళ్ళ స్నానం చేసేవాడు. ఎప్పుడూ ఇంత చలి అనిపించలేదు. శుభ్రంగా స్నానంచేశాక, విభూతి కట్లుపెట్టి, దైవప్రార్థన చేసుకుని, బట్టలేసుకుని, భుజంమీద ఎర్రటి సిల్కుకోకీ గాలికి రెపరెప లాడుతూంటే, మీసం మెలివేస్తూ, మందగమనంతో మెల్లిగా అడుగులు వేసుకుంటూ వీధిలోకి వచ్చేవాడు. ఎవరైనా దారిలో పలకరించి "ఎక్కడికోయ్" అని అడిగితే, ఏ మిల్లులో పనికో, ఏ మేడ కట్టడానికో అని చెప్పేవాడు. అనడమే కాదు పని చేసి చూపించేడు లోకానికి. మాటమీద మాటొచ్చి పంతంమీద పట్నంలో ప్లీడరుగారిల్లంతా తన వొక్కచేతిమీదే కట్టిచూపించేడు. నలుగురి పని ఒక్కడే చేసేవాడు. లాల్చీ విప్పి, చేత్తో రంపంపట్టుకుని మారుబల్ల కోస్తూంటే చెమటపట్టిన శరీరం ఎండకి నిగనిగ మెరిసేది. కండలు పెరుకక్రలా పెళపెళమనేవి. సాయంత్రమయేసరికి రెండుమూడు రూపాయలు కళ్ళజూసేవాడు.

వెధవ డబ్బు. బాడిత పడితే రూపాయి. రంపం పడితే రెండు. చిత్రికపట్టేడంటే ఎలాంటి పేడైనా అద్దంలా తళతళ లాడేది.

"మనం చిత్రికపడితే బల్ల పెక్కుమీద, నీడ కనిపించేది నీడ. అదీ, పనోడి తన మంటే! సీ, యిప్పటోల్లకి పనే సేతకాదు" అనుకున్నాడు మనసులో గంగయ్య.

అంతవరకెందుకు? తన కొడుకు చేస్తున్నాడు పని, చూస్తున్నాడు గదా తను. లేక లేక ఒక్క కొడుకు. వాడిని యీ చుట్టుపట్ల వూళ్ళన్నిటికీ గొప్ప పనివాడిగా చెయ్యాలని ఎంతో తాపత్రయపడ్డాడు తను. కాని తల్లే వాడిని ముద్దుచేసి పాడుచేసింది. వెధవ? పోకిరీ అయిపోయాడు. పెళ్ళిచేస్తే దారిలో కొస్తాడని వాడి తల్లి పోరుపెట్టింది. పెళ్ళిచేశాడు. వెంటనే వాడు పెళ్ళాన్ని తీసుకుని వేరైపోయాడు. ఆ వెధవ తిరిగిన తిరుగుళ్ళు చూడకుండా ముసిలిదాని కళ్ళు పోయాయి.

ఇప్పుడు తన శరీరం ముడతలు పడింది. ఒంట్లో శక్తి తగ్గిపోయింది. దృష్టి సమంగా ఆనదు. రోజులు గడవడం కష్టమైపోయింది. ముసిలిది అదృష్టవంతురాలు, వేగమే వెళిపోయింది. తను ఆశలు పెట్టుకున్న కొడుకలా అయిపోయాడు. తన కింకెవ్వరూ లేరు. తనొక్కడే. తనొక్కడికీ రోజుకి పావలో అర్ధో దొరికితే చాలు. కాని అది దొరకడమే కష్టమై పోయింది.

బాడిత భుజాన్న వేసుకుని నాలుగువీధుల

మళ్ళ రామమందిరం దగ్గరికి వచ్చాడు గంగయ్య. మందిరంవేపు తిరిగి దండంపెట్టుకున్నాడు.

అక్కడే కనిపించాడు వెంకడు. వెంకడు సన్నంగా పొడుగ్గా ములంకొడలా వుంటాడు. దూరం నుంచే వెంకడని పోల్చుకోవచ్చును. వాడిని చూసీ చూడనట్టు పక్కకు తిరిగి గబగబ అడుగులు వేశాడు గంగయ్య. అయితే వెంకడు వెనకనుంచి గంగయ్య చెయ్యి పట్టుకున్నాడు.

"ఏటి గంగయ్యా తప్పుకు తిరుగుతున్నావ్. అప్పు తీసికెళ్ళిన డబ్బులు తిరిగియ్యక్కర్లేదటి? ఏటి ఎగేసిద్దామనే" అన్నాడు వెంకడు.

"పారేస్తాను నేరా, యింతోటి అప్పును. పావలా డబ్బులికి యీాదిలో నిలబెట్టేసినావు. మాంచి పెద్దమనిసివే," అన్నాడు గంగయ్య చెయ్యి విడిలించుకుంటూ.

"ఎవరు నువ్వా నేనా. అ పావలా డబ్బులు కోసం వొచ్చి బతిమాలి వొట్టికెల్లినావ్. ఏటి, అంత యిస్పారమైతే పారేరాదూ. పావలా డబ్బులట! పావలా డబ్బులు! ఏం వుత్తినే వొచ్చినాయేటి డబ్బులు! తే, పడే" అని అల్లరిపెట్టేడు వెంకడు. వెంకడు పాపం మంచివాడే. కాని డబ్బు లెవడు వొదులుకుంటాడు.

"నాకొడిప్పు డేటి నేదు సుమా. ఇచ్చేస్తాను నేరా, నీ డబ్బు లెవడికి కావాలి"

"ఇలా పాలకాలమైంది నాయనా, నీ మాయలు నాకొద్ద తేసీ" అని వెంకడు గంగయ్య భుజంమీది బాడిత లాక్కున్నాడు. "నా డబ్బులిచ్చి నీ బాడిత వొట్టుకెల్లు, అంతే."

"నాయన్నాయన, నీ పున్నె ముంటాదిరా బాబూ. సాయింతిరం నీ డబ్బులు నీకిస్తారా! బాడిత నాక్కుంటే యిక నే తినేదేటి? ఒగ్గిరా నాయనా," అని బతిమాలుకున్నాడు గంగయ్య.

ఈ తగువు వినడానికి నలుగురు పెద్దమనుషులు మూగేరక్కడ. వారంతా గంగయ్యమీద జాలి పడ్డారు.

"అదికాదేటుందిరా, అడి నొట్టుకున్నావ్" అన్నాడొక పెద్దమనిషి.

"ఆ, నేదు. నేకపోడమేంటి? క్లబ్బులో కూకుని టీ నీల్లు తాగడానికుంది" అన్నాడు వెంకడు.

అప్పుడప్పుడు బియ్యానికి డబ్బులు లేకపోతే, పట్నమెళ్ళే రోడ్డుమీదున్న క్లబ్బులో అణా యిచ్చి టీ తాగేస్తాడు గంగయ్య. కాని ఊళ్ళో చాలమందికి టీ తాగడం విలాసం. బియ్యానికి డబ్బులేక టీ నీళ్ళు తాగుతూ వుంటానని చెప్పుకోవడం యిష్టం లేక పోయింది గంగయ్యకి. సాయంత్రం ఎలాగైనా డబ్బులు తెచ్చియిస్తాను బాడిత వదిలేమని బతిమాలేడు, గంగయ్య సాయంత్రం డబ్బులు తెచ్చియివ్వడానికీ, వెంకడు గంగయ్యను వదిలిపట్టడానికి పెద్దమనుషులు తీర్పు చెప్పేరు.

గంగయ్య మళ్ళీ భుజంమీద బాడిత వేసుకుని నడక ప్రారంభించేడు. ఇవాళ ఒక పావలా డబ్బులు సంపాదించి అప్పు తీర్చాలి. ఈ పెదవసాళ్ళో పావలా కూలి ఎలా దొరుకుతుంది. నాలుగు బ్రాహ్మణ కొంపలు, రెండో మూడో రాజుల, కోమట్ల కొంపలు వున్నాయి. తక్కిన వాళ్ళంతా కాపు, గొల్ల, సాలె, కంసాలి, చాకలి, మంగలి, మాల, మాదిగ కులాల వాళ్ళు. వీళ్ళ కొంపల్లో వడ్రంగివాడికి కూలిచ్చి చేయించుకునే పనులేమిటుంటాయి. వాళ్ళకే తిళ్ళు లేక ఏడుస్తున్నారు. వాళ్ళంకొకరికి పెట్టేదేమిటి? పోనీ రాజుల ఇళ్ళకు వెళదామా అంటే అక్కడ మాత్రం ఏం దొరుకుతుంది, వాళ్ళ ఇళ్ళెంత పెద్ద పెద్దలోగిళ్ళే. కాని వాళ్ళంతా, ఆస్తులు పాస్తులు అన్నీ హరించుకుపోయి, ఏదో గుట్టుగా బదుక్కొస్తున్నారు. ఆ లోగిళ్ళన్నీ ఒక మూల పడిపోతున్నాయి. ఇళ్ళమీది పెంకులు రాలిపోతున్నాయి. గోడల పగుళ్ళలో చెట్లు చేమలు మొలుస్తున్నాయి. పాపం, వాళ్ళస్థితి అలావుంది. ఇక ఏమైనా ఆశవుంటే బ్రాహ్మణకొంపల్లోనే. అసలు సామెతేవుంది. పనిలేక పోతే బాపనవీధికి వెళ్ళమన్నారు. ఇంటికొచ్చిన ప్రతివాడికీ ఏదోపని పురమాయిస్తారు. అయితే, పని చేయించుకుని డబ్బు లివ్వడానికిదొరారు. బతిమాలుకుంటే గంజో కడుగో పడేస్తారు. కాని తనకి పావలా డబ్బులు అవసరం. కడుపులో ఏమైనా వేసుకోడానికి మరో పావలా డబ్బులు కావాలి. ఇవాళ్ళ అర్ధ

రూపాయి సంపాదించాలి. ఎలాగ. ఈ ఊళ్ళో అసాధ్యం. పట్నంపోవాలి. ఇక్కడికి మూడుమైళ్ల దూరం. తను అంతదూరం నడిచివెళ్ళి, కూలిచేసి పట్టుకొచ్చే దేమిటి? ఇప్పటికే బాగా పొద్దెక్కిపోయింది. సరే ముందు బ్రాహ్మణ ఇళ్లకువెళ్ళి ప్రయత్నించి చూడాలి, అనుకుని బ్రాహ్మణవీధి వెళ్ళేడు గంగయ్య.

మొదటి మూడిళ్ళలోనూ ఏమీ పనిదొరకలేదు. నాలుగో ఇంటికి వచ్చాడు. శీతకాలపు ఎండ చుర్రున తగులుతూంది. గంగయ్య అప్పుడే అలసిపోయాడు. కొంచెం అలసట తీర్చుకుందామని ఇంటి అరుగుమీద చతికిలబడ్డాడు. కడుపులో కిందటి రాత్రి నుండి ఏమీ లేదు. ఆకలివేస్తూంది. గంగయ్య కేమీ తోచడం లేదు. బుర్రలో ఎటువంటి ఆలోచనా లేదు. అత నెప్పుడు ఆలోచించినా తనగురించే ఆలోచిస్తాడు. కడుపు అగ్నిహోత్రంలా మండుతూంది. ఏమైనా లోపల పడాలి. అదే అతని ఆలోచన. అంతకు మించి అతనికే గొడవా అక్కరలేదు.

ఎదురుగుండా దూరాన్న వేపచెట్టుకింద ఎవరో పదిమంది మూగేరు. ఏమీ లేదు, గొర్రెపోతును వేసేరు. అంతే, గొర్రెపోతు చర్మం వొలిచి, చెట్టు కొమ్మకు బాగా కిందికి వేలగట్టి, మాంసం తీసి బండరాయిమీద వంతులు వేశారు. ఒక్కొక్కరువచ్చి మాంసం మర్రిఆకులలో పెట్టి పట్టుకుపోతున్నారు. ఒకడు తల, యింకొకడు కాళ్ళు, పట్టుకుపోయారు. చర్మం కోసమని వచ్చిన చమారివాడు, కొంచెం మాంసంపడేయమని ప్రాధేయపడుతూ నిలుచున్నాడు. ఈ దృశ్యాన్ని గంగయ్య తదేకదీక్షగా చూస్తున్నాడు. మాంసం రుచితగిలి చాల కాలమైంది. తింటే కార్జం తినాలి! ఏమి రుచి! గంగయ్యకు నోరూరింది. మరో పదినిముషాల్లో మాంసం పంపకం అయిపోయింది. ఎవరిమానాన్ని వాళ్ళు పోయారు. గంగయ్య లేచి, మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళి సావిడిలో గుమ్మంలో నిలబడ్డాడు. లోపల ఎవరో వసమటింట్లో వండుకుంటున్నారు.

"అమ్మా, నరసమ్మగోరూ" అని పిలిచేడు గంగయ్య. నరసమ్మ వంటింట్లోవుంది. ఆవిడ రాలేదు. అయితే పక్కగదిలో వున్న కోడలు కాంతమ్మ వచ్చింది.

"ఏం గంగయ్యా, ఇలా వచ్చావు" అని ప్రశ్నిస్తూ, కాంతమ్మ వాకిట్లో ఎండలో మంచం మీద కూర్చొబడి, జడ విప్పుకోవటం మొదలు పెట్టింది.

"ఏం లేదమ్మా, పనేమైనా వుంటేమోనని" అంటూ గంగయ్య సావిడిగుమ్మందాటి లోపలి కొచ్చి కూర్చున్నాడు.

"మాయింట్లో ఏమీ పనిలేదే. ఏం, ఇవాళ ఎటూ వెళ్ళలేదా ఏమిటి?"

"లేదమ్మా, ఎటూ లేదు. నిన్నటినుంచి పనీ లేదూ పాటూ లేదు. ఏదైనా పనుంటే యియ్యండమ్మా, చేస్తాను"

"మాయింట్లో ఏమీ లేదోయ్"

"లేకపోవడమేటి, ముసలమ్మగోరిని పిలవండమ్మా, మీ కేటి తెలుస్తాది" అని గంగయ్య వాకిట్లో వున్న మంచాలవేపు చూసేడు, దేనికైనా మరమ్మత్తు అవసరమేమోనని. "ఇంట్లో నలుగురు కుర్రవాళ్ళున్నారు. మంచాలేవా ఇరగ్గొట్టరు నాయనలు" అనుకున్నాడు గంగయ్య.

"అమ్మా, నరసమ్మగోరూ" అని కేక వేశాడు గంగయ్య. వసమటింట్లోంచి నరసమ్మ బయటికి వచ్చింది. కోడలు ఎండలో కూర్చుని వుండడం చూసి, "అదేమిటమ్మా, వాకిట్లో కూర్చున్నావ్. శీతకాలపు ఎండ ఒంటికి మంచిది కాదు. అరుగుమీద కూర్చొ వెళ్ళి" అంది. కాంతమ్మ లేచి చీడీమీదకొచ్చి కూర్చుంది.

"ఏం గంగయ్యా ఇలా వచ్చావు" అంది నరసమ్మ.

"ఏం లేదమ్మా, కొంచెం కాఫీ నీల్లుంటే ఇప్పించండమ్మా" అన్నాడు గంగయ్య, స్తంభానికి జారబడుతూ. గంగయ్యకు ఆకలి దంచేస్తోంది.

"బాగుందిరా నాయనా, ఇప్పుడేం కాఫీ, మా భోజనాలయిపోలేదు" అంది నరసమ్మ.

"అమ్మ, మీకు పున్నెముంటాదితల్లీ. కడుపులో కాకయ్య కుయ్యి, కుయ్యిమంటున్నాడు."

"ఇప్పుడు కాఫీ లెక్కడిది గంగయ్యా, నీకేం వెర్రా ఏమిటి?" అంది కాంతమ్మ ఊడివస్తూన్న జుత్తు దువ్విన పళ్లలోంచి తీసి పరిశీలిస్తూ.

"చూసేరా అత్తయ్యా జుత్తు ఎలా వూడి పోతోందో" అని ఊడిన వెంట్రుకలు అత్తగారికి చూపించింది కాంతమ్మ.

"అవునమ్మా నీకు జాగ్రత్త లేదు. నీళ్ళాడి మూడువారాలు కాలేదు. అప్పుడే ఏది బడితే అది తినేస్తున్నావు, పత్యం చెయ్యకపోతే ఎలా చెప్పు? ఒళ్ళు జాగ్రత్తగా చూసుకోకపోతే ఎలాగ! ఏం చిన్న పిల్లవా?" అని కేకలేసింది అత్తగారు. జుట్టు ఊడి పోవడానికీ పత్యం సమంగా చెయ్యకపోవడానికీ సంబంధ మేమిటో కాంతమ్మకు సమంగా బోధపడలేదు కాని మాటాడకుండా వూరుకుంది. గంగయ్య కునుకు పాట్లు పడుతున్నాడు. వీళ్ళు వెంట్రుకలు పోతున్నాయని ఏడుస్తున్నారు, తన ప్రాణాలే పోతూవుంటేను. వెధవ వెంట్రుకలు వూడిపోతే పోనీరాదూ. నూనె ఖర్చు మిగులుతుంది అనుకున్నాడు గంగయ్య. నరసమ్మ గంగయ్యవేపు చూసింది. "నాగమ్మకు ఆకలేస్తాందికాబోలు పాపం" అంది కోడలితో. కాంతమ్మ నవ్వింది.

"గంగయ్యా, గంగయ్యా" అని పిలిచింది నరసమ్మ.

"ఏటమ్మా, కాపీ నీళ్ళటే..." త్రుళ్ళిపడి లేచాడు గంగయ్య.

"కాఫీ లేదుసుమా. పోనీ కొంచెం చల్దివణ్ణం వుంది తింటావా?"

"ఛ. అదేటమ్మా, ఇప్పటికి నా జలమలో మా కులపోళ్ళదగ్గర తప్ప ఎక్కడా పచ్చి మంచి నీల్లయినా తాగలేదు. కులస్థుడినికదా, మీయింట్లో సలిదిగంజి తాగమంటారా?"

"చాల్లేరా, దిక్కుమాలినకులం. అలా పెరట్లో నూతిదగ్గర కూర్చుని తినీ, ఎవరూ చూడరులే" అంది నరసమ్మ.

కాంతమ్మ పకపక నవ్వింది. "తినకేం చేస్తాడత్తయ్యా, ఈవూళ్ళో పిళ్ళవాళ్ళందరూ మాంసం కూడా తినేస్తారట."

"ఛ. ఛ. ఈరబ్రెమ్మంతోడమ్మా. వూళ్ళో నా తక్కువ వెధవ లెవరో తింటే అందరినీ అనేస్తారేటి, మంచోరే."

"పోనీలేరా ఓ చిన్న పని చేసిపెడుదూ. నాలుగు మెతుకులు పడేస్తాను తిని, పెరటరుగుమీద పడుకుందువు గాని" అంది నరసమ్మ.

"ఆ. సెప్పండమ్మా, ఏంపని?" అని చేత్తో బాడిత తీసి పట్టుకున్నాడు.

"బాడితపని గాదురా నాయనా, ఎల్లుండి మాయింట్లో మా పిల్లడి బారసాల."

"ఊయ్యాల మంచం సెయ్యమంటారేటి. నే సేసిన వుయ్యాలలో బొట్టడిని తొంగో పెట్టండమ్మా, గొప్పోడైపోతాడు. సూసినారా, పట్నంలో ఇనసిపెక్టరుగారింట్లో పిల్లలందరూ నే సేసిన మంచం మీద తొంగున్నోరే. ఇప్పు డెంతేసివోరైనారు. ఒకడు వోకీలు, ఒకడు తాసీల్దారు, ఒక డేదో సాల పెద్ద ఉద్యోగం...'గంగయ్యా నీసేతిసలవరా' అంటూ దిప్పటికీ ఆ తల్లి మాలచ్చిమి. పనిసేసినానంటే అల్లిచ్చే మజూరీలుండి పోతాయేటి. పేరుండి పోతాది గాని."

"మా కిప్పుడేం వద్దు గాని ఓచిన్న పని చెయ్యాలి చెయ్యగలవా?"

"సెప్పండమ్మా, పని మంతుడు సెయ్యలేని పనేటి?"

"ఎల్లుండి మాయింట్లో మా మనమడి బారసాల. నాలుగు కొబ్బరికాయలు తీసి పెడుదూ."

"ఏటో కొబ్బరిసెట్టెక్కమంటారా, మంచోరే. నా సేతకాదమ్మా. ఏతోడిని పిలవండి."

"నాయన్నాయన, నా బాబువుకావూ. ఏత వెధవ అత్తారింటికి పోయాడురా. పదిరోజులదాకా రాడట"

"ఇదేటమ్మా, నన్ను సెట్టెక్కమంటారేటి, నావురుతి కాదది"

"బాబ్బాబు, నీకో శేర డబ్బు లిచ్చుకుంటానురా. కాయలన్నీ కోతులు పాడుచేసేస్తున్నాయి. ఎల్లుండి ఇంట్లో బారసాల కూడాను."

గంగయ్యకు ఆశ పుట్టింది. చల్ది అన్నం కడుపులో పడుతుంది. వూరగాయ నంజుకుంటే మహా రుచిగా వుంటుంది. ఇప్పు డింత కడుపులో పడితే మళ్ళీ రాత్రివరకూ పచ్చి మంచినీళ్ళయినా తాగక్కరలేదు. తరవాత శేర డబ్బు లిస్తానంటూంది ముసిలిది. ఇవాళ రాత్రి, రేపు పొద్దున్నా టీనీళ్ళు తాగవచ్చును. అన్నట్టు వెంకడి అప్పో? సరే శేడడబ్బులు చేతిలో పడినతరవాత ఆలోచించవచ్చును.

"అయితే పడేండమ్మా నాలుగు మెతుకులు"

"నాలుగు కాయలు కోసి వెళిపోరాదా, తరవాత పావకాలంగా తిందువుగాని. ఇప్పుడు తింటే ఆయాసంతో పడుకుంటావ్,—మరి నువ్వు కాయలు కోసేదేమిటి? వెళ్లు. ఎంతసేపు, అయిదునిముషాలపని," అని దబాయించింది నరసమ్మ. అవును, లేకపోతే చెట్టెక్కడు వెధవ. ఇలాంటివాళ్ళతో పనులు చేయించుకోవడంలో నేర్పు వుండాలి, అనుకుంది నరసమ్మ.


"పోనీ కొంచెం సుద్ది దాహం యిప్పించడమ్మా" అన్నాడు గంగయ్య. నరసమ్మ మజ్జిగనీళ్ళు తెచ్చి చెంబులో పోసింది. గంగయ్య చెంబెడు మజ్జిగ తాగి, జ్రరున తేన్చి, పెరట్లో కొబ్బరిచెట్టుకిందికి వెళ్ళి నిలుచున్నాడు. చెట్టు పొడుగ్గా, స్తంభంలా నున్నగా వుంది. దీన్ని తెగగొయ్యాల, ఎంత ఎత్తుంది అనుకున్నాడు గంగయ్య. పనివిషయంలో గంగయ్య ఎన్నడూ ఓటమిని వొప్పుకోలేదు. తన శక్తిసామర్థ్యాల మీద అతనికి ఎంతో విశ్వాసముంది.

కాళ్ళకు తాడు, మొలకు అపు[illegible]కుని, కొయ్యడానికి కత్తిలేకపోవడంవల్ల [illegible]జాన్ని వేసుకుని, చెట్టు ఎక్కడం ప్ర[illegible]ంభించేడు. అలవాటులేనిపని, మొదట్లో చాల కష్టమయింది. కాని మొండి పట్టుదలపడితే సాధ్యం కానిదంటూ వుండదు. మీద కెక్కిపోయి కాయలు కోశాడు. కిందనున్న నరసమ్మ కాయలు ఏరి తట్టలో పెట్టింది.

"చాల్లే గంగయ్యా, ఇక దిగు" క్రిందనుంచి కేక వేసింది నరసమ్మ.

గంగయ్య బాగా అలసిపోయాడు. దాహం వేస్తూంది. ఒక్కత్రుటి ఆగి నాలుగు ప్రక్కలా చూసేడు. వూరంతా కనిపిస్తూంది. దూరాన్న పొలాలు, కళ్ళాలు కనిపిస్తున్నాయి. చెరువు వొడ్డున కళ్ళంలో రైతులు అంబలి తాగుతున్నారు. గంగయ్యకు చల్ది అన్నం, వూరగాయ జ్ఞాపకమొచ్చింది. అంతే, అతని కళ్ళు చీకట్లు కమ్మేయి. వూరూ, పొలాలు, కళ్ళం ఏదీ కనబడడంలేదు. "అమ్మో" అని కేక వేశాడు.

కిందనున్న రాయిమీద మోసింది గంగయ్య తల. అతని మొహం అతిప్రశాంతంగా వుంది. చేతిలోబాడితను పట్టు విడవలేదు. గంగయ్య మరణించేడు. కాని గంగయ్య విశ్వకర్మ. విశ్వకర్మకు చావేమిటి?



ఉన్మీలనము

★

శ్రీ మొక్కపాటి కృష్ణమూర్తి

ండిన యాకొక్కొక్కడు నిపాతము జెందగ విస్మృతావనిన్
గ ండొక శ్లక్ష్ణరాగ పరిగూఢ వినిశ్వసనమ్ము పుచ్చి యే
మండన లేక నిల్చె మధు మానము కోసము వేపమాను; నా
యెండిన జీవనమ్ము భరియించెద నే యడియాస కోసమో!

అతుకుల బొంత యీ బ్రతుకహర్నిశముం దలపోత మోతలన్
గతుకుడు బాటనే గదలగానవు; రివ్వన రేక వెట్టిపై
జతనగు పుల్గుబాట, కనుచాయల వెల్గు మలంకలన్ గళా
చతుర సమూఢ పుణ్య పరిపాక పథాంక మొకండు గలియున్!

జలకములాడు పెన్నెరుల చాయల మున్గి రసార్ద్రిమాధురీ
కలల ప్రపూతమై, పృథులకైశ్య విమోహన బంధనా వృతిన్
బులకలు దేలి, కొండకొన బాల్పగు దేవి హజార మెక్కె వే
కలల యొయారి యార్చు నునుగ్రాల్ జికురమ్ముల దేలు భావముల్!

తీయని యేటిపాయ, వ్రతతీనతి తూగు తురాయి మోక, ఓ
హోయను కొండ, కొండ యెదనూగు కళోన్నయ దివ్యరత్న హా
రాయిత చిద్విహార మధురాంచిత నర్తకి, చిత్రబాల యీ
కోయిల గొంతు విచ్చెనిట క్రొంజివురాకు మెఱుంగు మోవితో;

వేపపువున్ విహాసముల వేడ్క మెయిందులకించి వెల్గులన్
శేపు కనుంగవన్ గదిపి చీకటి వేకటి చిందువంద శో
భా పరిణద్ధ కాంతుల గవాక్షమునన్ దిలకించు గొమ్మలా
తూపదరక్తి యచ్చుపడగా గదలాడదొ నా యెడందలో!

ఇరియు నుగాది నవోదయ
పదవీ ప్రచలత్ప్రక్లృప్త భాసురకవితా
స్పద పద చరణోర్మిల
స్వ్రదు ఘంటా మంజుగాన మేదుర రవమో!

స్త్రీల పాటలు

★

"కృష్ణ శ్రీ"

ఆంధ్ర వాఙ్మయంలో స్త్రీలపాటలకి విశిష్ట స్థానమున్నదని భావుకు లెందరో గుర్తించి చెప్పినారు. లలిత సుందరమైన భావన, గుండెను దూసుకుపోయే అనుభవగర్భిత పదావళీ, నైసర్గికమైన సంగీతమూ చేరి స్త్రీల పాటల్ని అందమైన వాఙ్మయ శాఖగా తయారుచేశాయి. ఈ పాట లనంతములు.

శకారంభ కాలములో దేశమంతటా ఇంచుమించు ప్రతిచేయీ తీర్చిదిద్దిన కళావిభూతి కాలక్రమాన్ని రాజకీయపరిస్థితుల బలమువల్ల సన్నగిల్లి, ఇంటికిబయట క్షీణించిపోయినా, ఇళ్ళలో మాత్రము గృహిణుల కరకంకణారావముల పొత్తిళ్ళలో సదా మురిపెములు కురిసినది. ఈ గృహశ్రీకళా సంపదకు స్త్రీలపాటలు సుందరముఖము. ఈ గేయములన్నిటినీ సంపుటీకరించడానికి ఇంతవరకూ అచ్చైన తెలుగుపుటలు చాలునా అనిపిస్తుంది.

పురుషుల ఆశలకు హద్దుండదు. 'తరులెక్కి అలనీలగిరులెక్కి మెలమెల్ల చదలెక్కి జలదంపు నీలంపు నిగ్గులై' పోవాలనీ, 'ఆ మృదుచంద్రికా యవనికావృత నీల నభోనికాంత శోభామయ సీమ'లలో, అమృతవాటులలో, స్వప్నపథాల్లో తిరుగులాడాలనీ, ఇంకా ఏమేమో చెయ్యాలనీ వారాశిస్తారు. గృహిణుల లీలా విహారమంతా శ్రీ గృహసీమలోనే. వారి ఆచరణలన్నీ గృహసౌందర్య పోషకాలే. వారి ఆశయాలూ ఆశలూ గృహ సంపద చుట్టూనే తిరుగులాడతాయి. కనుక వారి కల్పనకూడా గృహశ్రీసైరంధ్రిగనే నర్తిస్తుంది. గృహవ్యాపారాలలో, పనీ, తీరుబాటూ, వినోదాలూ ఉంటాయి. పని తన యింటికీ, తన కాముడికీ, తన బిడ్డలకీ సేవ. వినోదాలు తన యింటా, పొరుగింటా విచ్చిన సంతానపుష్ప సౌరభాన్ని ఆనందించే ఘట్టాలు. తీరుబడి కష్టార్జితము. కాబట్టి ఇవన్నీ గృహిణికి అభిమాన పాత్రములే. వీటన్నిటి చుట్టూ ఆమె కల్పన బంగారు గూళ్ళల్లుతుంది. కనక స్త్రీలపాటలు సామాన్యముగా ఈ మూడు వ్యాపారాల్ని అంటి పెట్టుకుంటాయి. కనక వాటిని స్థూలంగా మూడు భాగాలుగా విడదీయవచ్చును. గృహయాత్రా వర్తనములో యదాలాభంగా వచ్చే సుందర సన్నివేశాలను పట్టిన రచన 'గృహశ్రీగానము'నీ పెండ్లీ, పుత్రోత్సవమూవంటి వినోదోత్సవాల నాశ్రయించిన రచన 'మంగళకవన'మనీ, తీరుబాటు సమయాల్లో పాడుకునేది కథా 'కవనమనీ' అని, ముందుగా గృహశ్రీగానాన్ని పరిచయము చేస్తాను.

గృహశ్రీకవనము.

గృహిణి జీవితంలో ఇంటిపనిదే ఎక్కువపాలు. పురుషుల పనివలె జీతముకోసము చేసే పని కాదిది. కనుక ఆమెకి తానుచేసే పనిలో ఉత్సాహమూ ఆనందమూ ఉంటాయి. ఈ ఆనందాన్ని జ్ఞాపకానికి తెచ్చుకుని ఆ సుందర సన్నివేశముచుట్టూ ఆమె రచన చేస్తుంది. అక్షరాభ్యాసముచేసి చదవడమూ వ్రాయడమూ నేర్వనంతమాత్రాన ఆమె మూఢురాలు కాదు. నిత్యమూ విద్యార్థులూ తన వారూ నడిపే విద్యావ్యాసంగము ఆమె చెవినిపడుతూనే వుంటుంది. ఈ సంస్కారబలమే ఆమె రచనకు జీవగఱ్ఱ. దీనికి చేరి, ఆమె, పుస్తకానుసారికాని స్వేచ్ఛాజీవితములో

మెరిసే లోకోక్తులూ, సామెతలూ, జాతీయాలూవిన్న సంస్కారము ఆమె రచనకి, పదును తీరుస్తాయి.

గృహజీవనమే ఈ పాటల వస్తువు. కంటికి మిరుమిట్లు గొలిపే రాజసభలూ, రాజులవేట, వారి వివాహాలూ చూచీ, ఊహించీ, పండితకవులు రచించిన ప్రబంధాల పూతమెరుగుకి అనుభూతిని పురస్కరించుకొని గృహసీమ లలిత సౌందర్యాన్ని వర్ణించే ఈ పాటలు చక్కని గీటురాళ్ళు. బిడ్డని తలుచుకుని తల్లి అంటోంది.

గోరంత దీపమ్మ కొండల్ల వెలుగు
గోపాలకృష్ణమ్మ గోవులకు వెలుగు
మాడంత దీపమ్మ మేడల్ల వెలుగు
మాచిన్ని అబ్బాయి మాకళ్ళ వెలుగు

కళ్ళకు వెలుగట! కాదామరి? అందుకే.

చిట్టినా అబ్బాయి చీలు మొగము చూచి
పిగ్గుపడి చంద్రుడు పొడవ జాలాడు

అబ్బాయి పనులన్నీ నాజూకు పనులే

ఊచక్క ఊగజే ఉయ్యాలచేరు
పాడక్క నిద్రపోడు పట్టి అబ్బాయి.

అబ్బాయి ఏ వుద్యోగం చేస్తాడో తెలుసునా? వినండి.

విశాఖపట్నాన విసిరింది గాలి
వింజరపురేవున తేలింది వాడ
వర్తకుడి పేరేమి వాడ పేరేమి
వాడలోనున్నట్టి దినుసు పేరేమి
వర్తకుడు అబ్బాయి వాడనావాడ
వాడలో నున్నట్టి దినుసు ముత్యాలు!

అబ్బాయికి మాత్రమేనా ఈ మురిపెము? అమ్మాయికో?

పూసపాటి వారి లోగిళ్ళలోను
పురివిప్పి ఆడింది పుణ్యంపు నెమలి
భాగ్యపాటివారి లోగిళ్ళలోను
పాల్గాగి ఆడింది పట్టి అమ్మన్న.

బిడ్డలగన్న తల్లి సంపద చూడండి.

ఆడుకో అమ్మన్న వచ్చె గాబోలు
అందెల్లు చప్పుడాయె పందిళ్ళలోను
చదువుకో అబ్బాయి వచ్చె గాబోలు
దస్త్రమ్ము చప్పుడాయె సావిళ్ళలోను
పెళ్ళాడి అబ్బాయి వచ్చె గాబోలు
పెద్ద సావడి వద్ద భేరి మోగింది.

తాను కన్న బిడ్డ అత్తవారింటికి వెళ్ళడమును కనబడేదాకా చూచి అంటుంది పాపం

ఏరంత వెలుపమ్మ యిసుకపన్నమ్మ
యేరుదాటి వెళ్ళింది ఎవరాడపడుచు
మూటనున్నది పసుపు పొట్లాన కుంకం
వడినిండ పోకల్లు పండుటాకుల్లు
ధనికి శ్రీ పిల్లమ్మ సాగివెళ్ళింది.

ఆదర్శ గృహిణి కుటుంబ జీవనములో ఆవుల స్థానము చూడండి.

కొటుక్క కన్నెల్ది కత్తావు పడ్డ
చెరువునీళ్ళా తాగి చెంగలి మేసె
గుంటనీళ్ళా తాగి గుర్రైన్న మేసె
వచ్చెనే మనవీధి వాని వాడలకు
కట్టరా అన్నయ్య గాజుకంబాల
ముడివేయర తమ్మయ్య ముత్యాలకోలి!
పితుకురా అన్నయ్య బిందెల్లలోను
అందుకోవే చెల్లి అ పాలచెంబు
కాగబోయ్య వదిన కాగుల్లలోను

గృహలక్ష్మి పుట్టింటి యాభిమానము—పండిత కవుల రచనలలో వాచ్యమాత్రంగానే గోచరించేది ఎంత చక్కగా బింబిస్తోందో ఈ పంక్తులు చూడండి.

కాళ్ళకళ్ళదామం టె కదలవే కాళ్ళు
తల్లి వళ్ళదామం టె తిరగదే మనసు
మారాచ పుట్టింటి కళ్ళదాము అంటె
నాకాళ్ళు పన్నిన్న రథములై నడచు
నాచేతు లుయ్యాలచేరులై ఊగు!

ఈ కవనములో ఉపమాలంకారము వాచ్యము కాకుండా ధ్వనిరూపంగా వ్యాపించి వుంటుంది. ఎంతసేపూ

'ఆటకూటంబులో ఆడిన్న నెమలి
వేటకాడొచ్చాడు ఆట చాలించు' అని
ఉపమానాన్ని తెరవేసి చూపించి. తరవాతే

నా రాచపుట్టింట నవ్విన్న కోడిన
నా అన్న లొచ్చారు నవ్వు చాలించు

అని ఉపయేయాన్ని దానితో సంబంధములేని దానివలె చూపించడమే కనబడుతుంది ఈ రచనలలో 'వలె' 'లాగు' అన్నమాటల్ని వది లేస్తే, మొదటి పంక్తులవల్ల ఏర్పడ్డ చిత్రం రెండో పంక్తులలో ఎంత చక్కగా ధ్వనిస్తోందో చూడండి.

ఈ పాటలలో అతిశయోక్తి తరుచుగా కనబడుతుంది.

'ఆడుకో ఆడుకో అందాల బరిణ
కులకుల నాట్యాలు కుప్పపడిపోని
పాడుకో పాడుకో రత్నాలమొలక
తేనె వాకలు మమ్మ ముంచుకొచ్చేని' అని.

అతిశయోక్తి ధ్వనిస్తుంది ఈ పంక్తులు చూడండి.

వీధి నెందరు వున్న విసరదే గాలి
రచ్చ నెందరు వున్న కురవదే వాన
నా చిన్న అబ్బాయి వీధి నిలుచుంటే
మొగలిపువ్వుల వాన ముత్యాలగాలి.

భ్రాంతిమంతము కూడా తొంగి చూస్తూంటుంది ఒకొక్క రచనలో.

వాకిటా అబ్బాయి ఆడంగజూచి
వజ్ర మాణిక్యమని వాలె చిలకల్లు!

బిడ్డలమీది అభిమానమువల్ల కల్పించిన రచనలివి.

కనక ఈ 'డాబుల'లో ధ్వనించే మాతృప్రేమే మన మనసునిండుతుందిగానీ వీటి వాచ్యవస్తువు నిలవదు.

అక్కడక్కడ పొడచూపే హాస్యము పల్లెటూరి బండహాస్యమే. మానవుల నైజాన్ని విడదీసి చూపించి నవ్వించదు.

పదేళ్ళనాటికే పాత దూలమ్మ
పడిపోయె మాభావ పల్వరుసమీద
పళ్ళన్ని పిప్పాయె నోరెర్రనాయె
వీధిలో బావగారికి వినసిగ్గులాయె

*   *   *   *

అన్నల్లు వచ్చేరు కూరేమిలేదు
అరటి కాకరకాయ అలచందపప్పు!
మరుదుల్లు వచ్చేరు కూరేమిలేదు
మంచాన నల్లుల్లు గోడ బల్లుల్లు!
అత్తవారింటికి కొత్తల్లుడొస్తేను
కొత్త సున్నము తెచ్చి మెత్తరమ్మ

ఈ పాటలు 'ద్విపదలో ఉన్నవి' అని చెప్పడమే కాని ద్విపదకున్న గణఛందస్సును ఇవి అనుసరించవు. అయితేని లఘువుల గణాలు మూడూ, వాటి తరువాత మూడు లఘువుల గణము ఒకటీ వుంటాయి ఈ ద్విపద మాలిక పాదాలలో. ఈ లఘువుల సంఖ్య నిండేటందుకు పాడేవారు (దీర్ఘాలులేని చోట్ల) దీర్ఘాలు పెట్టి నింపేస్తారు. ప్రతీపాదముచివరా వున్న నగణానికి చివరి అక్షరాన్ని సాగతీసి, మొత్తానికి దానికీ అయిదు లఘువులు కట్టించేస్తారు. తెలుగు జానపద ఛందము ద్విపదయే. అయితే ఇది మాత్రా ద్విపదయే గాని గణద్విపద కాదు. ఈ ద్విపదని పాడడానకి లెక్కలేనన్ని వరసలున్నాయి. కనక ఈ రాగములో పాడతారని చెప్పడములో గాని, వాటి స్వరావళిని వ్రాయడంలో గాని అర్థములేదు. తాళము వేసే మాటయితే ఐదైదు లఘువులకీ ఒక దెబ్బ వేసుకోవచ్చు. అప్పుడు పాదానికి నాలుగు దెబ్బలు పడతాయి. యతులు ఒక పాదంలో మూడో 'గణము' మొదటి అక్షరముమీద గానీ, అది తప్పినట్లైతే వెంటనే వచ్చే పాదము మొదటి అక్షరముమీద గాని పడతాయి.

భావ వాకుక భాషే.

ఈ పాటలు ఎవరు రాశారో, ఏకాలంలో రాశారో ఎక్కడ రాశారో చెప్పడము కష్టము.

ఓయి ఓయి రాజ వద్దాది రాజ
పాడిచి గెలిచిన రాజ బొబ్బిల్లి రాజ
బొబ్బిల్లి పాడుగాయె కిమిడి కిందాయె
మాడుగుల మనదాయె మన్నెమీ రాజ.

అన్న పాదాలు మాత్రం నైజాము స్వతంత్రించిన 1740 సంవత్సరానికీ బొబ్బిలి పడిన 1757 కి నడుమ రచించబడి వుండునని చెప్పవచ్చునేమో. ఇలాంటిదే

పూసపాటివారి లోగిళ్లలోను
పురివిప్పి ఆడింది పుణ్యంపు నెమలి

పెద విజయరామరాజు కాలం (క్రీ 1740—1757)లో కాకపూసపాటిపారిభాగ్యలక్ష్మిఎప్పుడు వర్తించింది?

తెలుగుదేశంలోని నగరాల పేర్లన్నీ వీటిలో 'వడిచీది నరసన్న పేట', 'ఎంత చక్కని దమ్మ విలూరుకోట', 'ఊరు మంచిదమ్మ ఉభయకావేరి'. 'గోల్కొండ కడనుండి ధంకౌనగరా', 'సింహపురి సింహపురి అందురేకాని', అని కనబడుతూండడాన్ని బట్టి ఈ పాటలు దేశమంతటా ప్రచారములో ఉండే వనీ; 'తిరుపతీ వెంకయ్య తిట్టలోకయ్య', 'చిన్ని పాపలగాయి శ్రీరంగశాయి', 'పరమాత్మ నా చేతి పంజందుకోరా', 'మమ్మేలు వేదగిరి శ్రీ నారసింహా', 'కంచి కామాక్షమ్మ ఎవరాడపడుచు 'ముక్కంటి మా తల్లి మొక్క వచ్చేని' 'తిరుమంత్రమే వీరి తిరు మేమలైయుండు' 'ఉరునాభి కమలమే ఓంకారము' 'పరంజ్యోతి ప్రణవమే పట్టెమంచమ్మ' అనే పాదాలనుబట్టి అన్ని మతాలవారూ ఈ ఛందస్సుని స్వీకరించివారనీ తెలుస్తుంది. విచిత్రమైన ప్రయోగాలు కొన్ని 'ఆడోడుచు' 'పాముపాయ' 'వచ్చ' 'పెద వాయన', 'పదలం' 'యొలిక' 'పర్న' 'పారు వేట' 'ఖిట్టలు' 'తీసుకరా' అన్నవి మాండలికాలేమో ననిపిస్తోంది. కాని ఈ పాటలలో పాదాలకి పాదాలే ఇటు గుంటూరులోనూ అటు విజయనగరంలోనూ, స్థలాను కూలంగామారి కనబడుతున్నాయి. 'ఇక్కడికి సింహాద్రి యెంతదూరమ్మ' 'ఇక్కడికి తిరుపతీ యెంతదూరమ్మ?' 'ఇక్కడికి శ్రీశైల మెంత దూరమ్మ' అని యాత్రాగానము రకరకాలుగా గనబడుతోంది. ఇలాగే 'ఓయమ్మ గుర్రాలు ఓయమ్మ మంది, ఓయమ్మ కోటలో దండు దిగెనమ్మ' అన్న పాదాలుకూడా అటు దాక్షారామంనీ, ఇటు ధరణికోటనీ తలుస్తున్నాయి. వివిధమండలాలనించీ వినబడే పాటలు చాలా పోలికల్ని ధ్వనిస్తున్నాయి. కాబట్టి ఇది తెలుగుజాతి కంతటికీ సమానములే అనాలి.

ఈ పాటలన్నీ ద్విపదలు; పిల్లల్ని నిద్రజోకొట్ట డానికి ఉయ్యాల ఊచుతూనో, లేక వీపుమీదతట్టి జోగొట్టుతూనో ఈ పాటల్ని పాడడము ఉత్తర విశాఖ మండలంలో పరిపాటి. అందుకే కొందరు వీటిని 'జోలపాటల'న్నారు శేషమర్ల కామేశ్వరరావు గారు. వీటి చివ్వర 'జోజో' అని లేదూ, ఉండడము నేను వినలేదు. పాడేటప్పుడు వీటినీ శ్రీరాగములో పాడతారు. తక్కిన 'జోల'లు నవరోజు రాగములో వున్నాయి. నిద్రకి శ్రీరాగముకంటే నవరోజు ఎక్కువ అనుకూల మనిపిస్తోంది నాకు. విశాఖపట్టణప్రాంతంలో నిద్రతో సంబంధమేలేని లక్ష్మణమూర్ఛనుకూడా శ్రీరాగములోనే పాడడము జానపదులనుండి విన్నాను నేను. కాబట్టి ఈ వినోద కవనము జోలపాటలుగా (పనికిరావడానికి) కూర్చబడలేదేమో ననిపిస్తున్నది. వీటిలో జోలలలోనూ, లాలిపాటలలోనూ వుండే హరినామాలూ, పూర్ణానుస్వారశబ్దాలూ, లేనేలేవు. విశేషించి,

ఉత్తముని పేరేమి ఊరి పేరేమి
సత్యపురుషునిగన్న సాధ్వి పేరేమి
ఉత్తముడు దశరథుడు ఊరు అయోధ్య
సత్యపురుషుని గన్న సాధ్వి కౌసల్య
జగతిలో రామయ్య జన్మించినాడు
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు

అంటూ నడిచిపోయే కథాకవనము జోలల కుద్దేశించినదై యుండదు. ద్విపదలలో వుండుట చేతనో, జోలల్ని చక్కగా పాడలేకనో, అవి నోటికి రాకనో, పాటమార్పుటకోసమో, వీటినికూడా జోలల స్థానములో పాడుతున్నా రనుకుంటాను.

Chatrapathi Shiviji.



Typed By.
Prof.A.P.V.Jagannadha Row,
Vizianagaram City.

చత్రపతి శివాజీ

టైపురైటర్ పై తయారుచేసిన చిత్రము.

కర్త. శ్రీ ఎ. పి. వి. జగన్నాథరావు.

Sir Isaac Pitman.



Sir Isaac Pitman.

Typed By:
Prof. A.P.V. Jagannadha Row,
Vizianagaram City

ఇజాక్ పిట్మేన్

టైపురైటర్ పై తయారుచేసిన చిత్రము.

రచన శ్రీ ఎ. పి. వి. జగన్నాథరావు.

ఆంధ్రనాటకరంగానికి జై

★

శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి

[“శ్రీ రామ పాదుకాపట్టాభిషేక” నాటకం జరుగుతున్న సమయంలో ఈ నాటిక ప్రారంభమవుతుంది. తెర లేచేసరికి నడుస్తున్నది, పాదుకాపట్టాభిషేక నాటకంలో, శ్రీరామచంద్రుని భరతుడు కలుసుకుని పాదుకలు పుచ్చుకునే ఘట్టం. చిత్రకూట పర్వత సమీపారణ్యభాగం సూచించే వెనక తెర. తెర లేచేసరికి ఎవరూ వుండరు. తరవాత శ్రీరామచంద్రుడు ప్రవేశం.]

శ్రీరా : ఇక్కడ...తమ్ముడా...ఇటురా.

లక్ష్మ: (ప్రవేశించి) అగ్రజా! మహాప్రమాదము సంభవింపనై యున్నది. సీతాదేవి నెచటనైన భద్రపరచవలయును. మనమిద్దరమును కవచితాంగులమై, ధనుష్పాణులమై, ఆ మహాసైన్యమును పర్వతాగ్రమెక్కి మార్కొనవలయును. తొందరపడుడు. తొందరపడుడు...మీ ధనుస్సు ధరించుడు ... సందేహించుచుంటిరేల. మనకన్నిటికంటె జానకీ రక్షణమే ప్రధానము గావున మీరు తత్సంరక్షణార్థమై ఆమె యొద్దనే యుండుడు. నేనొక్కడను పోయి...

శ్రీరా : (చిరునవ్వుతో) పోయి యేమిచేసెదవు.

లక్ష్మ : సేనను చీల్చి చెండాడి వైచెదను.

శ్రీరా : ఆ సేన యెవ్వరిదో బాగుగ కని పెట్టితివా?

లక్ష్మ : దుష్టబుద్ధి, సౌహార్ద్రహీనుడు క్రూరుడు, భరతుని సేన యది...అగ్రజా సెలవిమ్ము.

శ్రీరా : తొందర ఏమియును లేదు. అనవసరము కోపము చల్లార్చుకొనుము.

లక్ష్మ : అగ్రజా! రామభద్రా! ఇక నేను సహింపను. వాని చిత్రవధమును చేసి, దుశ్చేష్టురాలైన కైక తల త్రెంపి...

శ్రీరా : ఏమి యీ కఠినోక్తులు. నేనన్న నీకెంత భక్తియో అంతకంటె నెక్కుడు భక్తి భరతునికి నాయందుగలదు ... లక్ష్మణా! ఎంత వెఱ్ఱిపడితివి. చిరంజీవియైన భరతుడే వచ్చుచుండ, గాఢాలింగనమును జేసికొనవలయును గాని, కత్తులేల? కటారులేల? కవచములేల? ఈ కఠినోక్తులేల? మనల జూచి, సుకుమారియగు జానకిని తీసుకొనిపోవుటకు తండ్రిగారే విచ్చేయుచున్నారేమో.

లక్ష్మ : తండ్రిగారు విచ్చేయుచున్నట్లు తోచదు.

శ్రీరా : ఏల?

లక్ష్మ : ఆయన శ్వేతచ్ఛత్రాది చిహ్నము లేవియు నగుపించుటలేదు.

శ్రీరా : హా! హా! కనుపించుటయే లేదా, లక్ష్మణా?

---

* గమనిక : ఈ నాటికకి కథావస్తువు పాదుకాపట్టాభిషేక నాటక ప్రదర్శనం నడుస్తూవుండగా జరిగిన ఒక సంఘటన. జరుగుతున్న నాటక ప్రదర్శనం సూచించే నిమిత్తం, భరతప్రవేశందాకా సంభాషణలు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి పాదుకాపట్టాభిషేక నాటకంలో, ఏడవ అంకపు సంభాషణలని అనుసరించి వ్రాయబడినవి. మొదటి రెండు పద్యాలూకూడా ఆ నాటకంలోవే. మిగతా మూడు పద్యాలూ, భాస్కర రామాయణంలోనివి.

ఏదైన కీడుమూడియుండదు కదా! తండ్రిగారు జీవించియుండెనో లేదో?

లక్ష్మ : ఉపద్రవమేదైన జరిగిన మనకు వార్త రాకుండునా?

శ్రీరా : ఏమోకాని మనసు కలత నొందు చున్నది. మనముపోయి భరతాదులను పర్ణశాలయొద్దనే కలుసుకుందము రమ్మ.

"అమ్మలను దమ్ములను జూతునంచు ముదము
గలగజేలకో? కడుపులోపలను జెద్ద
రాయిపడె : నెట్టివార్త కర్ణములబడునో
హేతుహూన్యార్తి యూరికే యేగదపుడు!"

తమ్ముడా! ఇటురా!

[రామలక్ష్మణులు వెళిపోతారు, రెండో పక్క నించి భరతుడు ప్రవేశం. అతని వెనకాల వశిష్ఠుడు, సుమంత్రుడు, జాబాలి, వొస్తారు.]

భర : సురోత్తమా? భరద్వాజులవారు చెప్పిన ప్రదేశమిదియేయై యుండునా?

వశి : అటులే తోచుచున్నది.

జాబాలి : తోచుట మాత్రమే కాదు. నిశ్చయ ముగ నిదియే. అదెచిత్రకూట పర్వతము. అల్లదెమందా కినీ నది.

సుమ : అల్లదిగో ఒక కుటీరముగూడ కాన్పించు చున్నది. ఏమునీశ్వరుల కుటీరమో.

జాబా : ఏ మునీశ్వరులో యననేల! మన ముని బాలకుల యాశ్రమమే యిది!

భర : హా రామచంద్రా! ఎంత విపత్తు వాటిల్లిన దయ్యా! మునీంద్రులారా, రండు. సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుని కలుసుకుందము(ఒక్క అడుగు నడిచి, ఆగి) సుమంత్రా, రామనివాసముచే పవిత్ర మయిన యీ ప్రదేశమునకు మన గుఱ్ఱములు గాని, గజ ములు గాని, సమ్మర్దము గలగజేయకుండునట్లు నీవు పోయి సేనాధిపతి కాజ్ఞాపింపుము...పొమ్మ [అని నించుంటాడు]

సుమం : [కొంచెం ముందరికి వెళ్ళితనలో] ఇదే మిటి? నాపార్టులోనే ఇక్కడే వుండి కే కెయ్యాలని వుంది. పొమ్మంటాడేమిటి? (అని భరతుడి కేసి చూస్తాడు. భరతుడు తీక్ష్ణంగా చూస్తాడు. సుమం త్రుడు, నాకేంలే అన్నట్టు భుజాలెగరేసి తలవొంచు కుని) చిత్తం. (అని వెళిపోతాడు).

భర : మునీంద్రులారా! రండు [అని వెళతాడు. అతని వెనకాల మిగతావాళ్ళు వెళ్ళగానే సుమంత్రుడు లోపలికొస్తాడు.]

సుమం : ఇంకోమాటు నాపార్టు మళ్ళీ గజిబిజి చేస్తే డొక్క బద్దలు కొడతాను, ఏమనుకున్నాడో. [పార్టు అందుకు నేటట్టు, లోపలినించి, ప్రాంప్టింగ్ వినిపిస్తుంది. "అదుగో రామలక్ష్మణులు...అదుగో రామలక్ష్మణులు." సుమం. అందుకుని] అదుగో రామ లక్ష్మణ జాబాలి వశిష్ఠ భరతు లిటకే వచ్చుచున్న ట్లున్నారు. సీతాది స్త్రీ జనము శత్రుఘ్న పూర్వక ముగ పర్ణశాల ప్రవేశించినట్లున్నది.

[రాముడు, జాబాలి, వశిష్ఠుడు, భరతుడు ప్రవేశము]

వశి : వత్సా! శ్రీరామచంద్రా! విచారింప కుము. భరతుడు నీతో నొక విన్నపము చేసుకొన వచ్చేసినాడు. భరతా! అన్నగారితో మనవి చేసు కొనుము.

భర : అగ్రజా (అని వాక్యం ప్రారంభించ గానే శ్రీరాముడు అందుకుంటాడు)

శ్రీరా : వత్సా, భరతా!

"యుష్మదభిసంధి యిప్పటి కుంచుమటులు
వల్కలములేల? జటలేల? వనము లేల?
సుఖ విసర్జనమేల? యీ శోకమేల?
ముని గతులి వేల? చెప్పుము ముందు తండ్రి.

భర : (తనలో) నాపద్యం అయిన తరవాత పీడి పద్యం చదవవలసింది. నాకంటె ముందుగానే చదివి టోకరా తినిపిద్దామనుకున్నాడు. వెంటనే నే పద్యం చదవనే చదవను. నా దగ్గరా ఈ ట్రిక్కులు! (పైకి) నీచురాలయిన కైకేయి మాటమేరకు మీరు కానసం బుల నుండి, నే నయోధ్యా రాజ్యపరిపాలనము జేయు లోకులు 'నన్ను గర్హింపరే! అగ్రజా, మగుడిరమ్ము'

[అక్కడ చదవవలసిన పద్యం చదవకుండా ప్రోజుముక్కలు చెప్పేసరికి అందరూ తెల్లబోయి చూస్తూ వుంటారు. శ్రీరాముడు బదులు చెప్పడు.]

భర : రామచంద్రా! నిరుత్తరడవై యుండుట తగునా? వశిష్ఠా! జాబాలీ!

"మహనీయమణి మయమందిరంబుల నుండు
ప్రభుడు నేడున్నాడు పర్ణశాల
మెత్తనిపాన్పున మేనొత్తు సుఖి నేడు
తనువుసేర్చిన వాడు దర్భశయ్య!

లలితమాల్యంబులు లలి బూనుపతి నేడు
వలనొప్ప గయికొన్న వాడు జడలు
మృదులాంబరంబులు మెఱయు పుణ్యుడు నేడు
వలనొప్పగ కైను వల్కలకములు
కోరి రాజన్య లోకంబు గొల్చు రాజ
మౌళిమణి నేడు మునిసేవ మరిగినాడు
వలసి నాకిప్పుడీ దురవస్థ చూడ
కైక కడుపున పుట్టిన కారణమున.

వశిష్ఠా! జాబాలీ! మీరైనను చెప్పరాదా!

[దీనితో అసలే గలభా అవుతుంది. ఈ పద్యం పోర్షనులో లేనిది చదివాడు]

వశిష్ఠుడు [ముందుకొచ్చి, జాబాలితో] ఏమివ. ఎక్కడివో పద్యాలు ఝుణాయిస్తున్నాడు.

జాబాలి : వీడెప్పుడూ వున్న రోగమే. ఓ మాటు బాగా బుద్ధి చెప్పాలి.

వశి : చిల్లర పాత్రగాళ్ళం మనకెందుకులే.

జాబా : మనలాంటి వాళ్ళ దగ్గిరే తన ప్రతాపం మరీ చూపిస్తాడు.

బయటకిరానీ! కాళ్ళిరగగొడతాను.

భర : మునీశ్వరులారా! ఏల నిరుత్తరులైనారు. శ్రీరామచంద్రా! ఇదిగో నా కడపటి విన్నపము. వినుము.

"నీ దగు రాజ్యలక్ష్మి ధరణీ
వర యేను ధరింపజాల ని
త్యోదయ సంపదల్ పొదలుచుండ
ప్రజాపరిపాలన క్రియా
పాదన లీలతో భువనభారము
పూనగ జేగుద మ్మయో
ధ్యాపయిలత్వ మన్యులకు
నర్హము గా దటుగాక దక్కవన్.

[ఆడియన్సులో ఒక పక్కనించి చప్పట్లు వైభాస్. వన్సుమోర్ అని కేకలు. భరతుడు ఆ పద్యం మళ్ళీ చదువుతాడు. ఆ పద్యం ఆఖరవుతున్న సమయంలో, భరతుడిని మెచ్చుకుంటున్న వైపునించి స్టేజిమీద పువ్వులు పడతాయి. భరతుడు, ఆ పువ్వులు కొన్ని, ఏరి, కళ్ళనద్దుకుని ప్రేక్షకులకి దండం పెడతాడు. మళ్ళీ చప్పట్లు మరో మూలనించి ఈలలు. ఒక ప్రేక్షకుడు గబగబావెళ్ళి స్టేజిఎక్కి రాముడికీ భరతుడికీ మధ్యనిలుచుంటాడు. గుక్కతిప్పుకోకుండా ఉపన్యాసం ఇస్తాడు. భరతుడు తప్ప మిగతా పాత్రధారులందరూ తెల్లబోయి చూస్తూ వుంటారు.]

ప్రే : సోదర సోదరీ ప్రేక్షకులారా! సీను మధ్యలో ఈ విధంగా నేనిక్కడికొచ్చి ఉపన్యాసం ఇవ్వడానికి పూనుకున్నందుకు, సాహాసం మీరందరూ మన్నించాలనీ, మన్నిస్తారనీ భావిస్తున్నాను. సీను అయిపోయేదాకా వుంటే బాగుండునేమో కాని, ఇది ఆఖరిసీను. ఈ సీను అయిపోగానే, నే ఉపన్యాసం ప్రారంభించినా, ఎవరూ వినకుండా వెళిపోవొచ్చు. పైగా కాలుకదపడానికైనా వీల్లేకుండా ఇరుక్కుపోయి కూచున్నాం. నాటకం అయిపోయిన తరవాతకూడా బాధ పెట్టడం భావ్యం కాదు. అంచేతే ఇప్పుడే వొచ్చేశాను. మొదట చెప్పినట్లు మన్నించారనుకుంటాను.

ఆడియన్సులోనించి ఒకడు : సంగతేమిటో తేల్చండి, ఉపోద్ఘాతం కట్టిపెట్టి.

మరోపక్కనించి ఇంకోడు : త్వరగా దిగండి. మంచి రసగండాయం పట్టులో ఆపేస్తున్నారు.

ప్రే : నాకు తెలుసు. ఆ రసతన్మయత్వమే నన్నీ పనికి పురికొల్పింది. అందులో ముఖ్యంగా భరత వేషం. భరత పాత్రధారి శ్రీ శ్రీ నారాయణగారు మనవూరికి కొత్తగాదు. ఇదివరకు అనేక నాటకాల్లో అనేక వేషాలు వేసినవారు. నేను వారినాటకాలు చాలా చూశాను. వారు ఏ పాత్ర వేసినా, అందులో లీనమయిపోతారు. కనక చాలా గొప్పనటకుడని నాకు చాలా కాలంకిందటే తెలిసిపోయింది. కాని ఈ రోజున వారు చదివిన పద్యాలూ, చూపించిన నటనాకౌశలం, అద్భుతం. ఇంత చక్కగా భరత వేషం ఇదివరకు ఎవ్వరూ వెయ్యలేదు! ఇహ ముందుకూడా ఎవరూ వెయ్యలేరనే నా వుద్దేశం. ఇంత అద్భుతనటనాకౌశలం చూసే భాగ్యం మనకీనాడు కలిగించిన శ్రీ శ్రీ నారాయణగారికి మా అందరితరఫునా సాధన్యవాదాలు ... కళారాధనకోసం నారాయణగారు చేస్తున్న కృషివర్ణించడానికి నాకు తరంగాదు. ఇతర నటకుల్లా డబ్బుకక్కుర్తికి, వేషం ఒప్పినా, ఒప్పకపోయినా ప్రతిపాత్రకీ ఒప్పుకుని నాటకాలు తగలేసే నటుడు కాదు ఈయన. ఈయన తనకినచ్చిన పాత్రలనే ప్రదర్శించడానికి అంగీకరిస్తాడు. ఒక్క హస్తవిన్యాసం, ఒక్క కళాభంగిమం!—అంటే పోజ్— పెర్ ఫెక్టుచేసే నిమిత్తం, ఆయన అహోరాత్రాలు

నిద్రాహారాలు మాని కృషిచేస్తారంటే నమ్మండి. ఇటువంటి అనన్యసామాన్య వ్యక్తిని, కళారాధకుణ్ణి సత్కరించడానికి లక్షలిచ్చినా చాలదు కాని, ఇవ్వడానికి మా దగ్గిర లక్షలు లేనందువల్ల చంద్రునికో నూలుపోగన్నట్టు, మా శక్తినిబట్టి, ఈ సువర్ణ పతకం బహూకరిస్తున్నాం. [సువర్ణపతకం ఎత్తి ఆడియన్సుకి చూపిస్తాడు. ఇప్పుడలచిన ఉపన్యాసం పూర్తి అయింది] వోరేయ్ దండతీసుకురా [అని అరుస్తాడు. ఆడియన్సులోంచి ఒకడు లేచి స్టేజి ఎక్కి దండ "ప్రేక్షకుడి"కి అందిస్తాడు. ప్రేక్షకుడు భరతుడి మెడలో వేస్తాడు. పతకం చేతికిస్తాడు. భరతపాత్రధారి నారాయణ ముందుకొచ్చి వందనం పెడతాడు,)

భర : మీ పొగడ్తలకి నేను అర్హుణ్ణి కానని నాకు తెలిసినా, కళారాధకుడిని గనక, నాకళ ప్రజల మన్ననపొందటమే నా పరమోద్దేశం కనక, మీరీనాడు నానటన మెచ్చుకున్నారంటే ఆనందించి, మీరిచ్చిన పారితోషికం కృతజ్ఞతతో స్వీకరిస్తున్నాను. నాటక కళకే నాజీవితం అంకితం చేసుకున్న సంగతి మీ అందరికీ తెలిసిన విషయమే. కళలన్నిటిలోకీ, నాటకకళ, ఉత్తమకళ అని నా అభిప్రాయం. ఇతర కళల విషయంలో ఒక్కొక్క కళకి ఒక్కొక్క ప్రతిభ చాలితే, నాటక కళారాధకుడికి, అంటే నటుడికి, సర్వతోముఖ ప్రతిభవుండాలి. సంగీతం. సాహిత్యం, వేషధారణ, ఉచ్చారణ, అన్నిటిలోనూ సిద్ధహస్తుడయివుండాలి. ప్రజారంజకత్వంకూడా తెలియాలి. కనకనే నాటకకళ, అన్ని కళల్లోకి ఉత్తమకళ : ఆంధ్రులకి అభిమానకళ. మరోసంగతి. నేను నాటక కళారాధనకి పూనుకున్నది కేవలం వ్యక్తి గత కళారాధన నిమిత్తమే కాదు—డబ్బు సంపాదన నిమిత్తం అసలే కాదనుకోండి. ఈ నాటక కళ ద్వారా, ఆంధ్రుల ప్రతిభ, ఆంధ్రుల నైపుణ్యం, భారత దేశంలో వివిధమూలలా, దైవం అనుకూలిస్తే, బ్రిటను అమెరికా దేశాల్లోకూడా, చాటాలని నా ఉద్దేశం. ఆంధ్రులలో ఇతరులని ప్రోత్సహించడం కొంచెం తక్కువ. మీరు నన్ను ఈ విధంగా ప్రోత్సహించినందుకు నే చాలా కృతజ్ఞుణ్ణి. ఈ భరతపాత్ర నిర్వహించడానికి నేను ఎంత శ్రమపడ్డానో చెబితే మీరు ఆశ్చర్యపోతారు. ఒక్క ఈ సీనులో చదివే నాలుగు పద్యాలే రెండు నెలలు ప్రాక్టీస్ చేశాను.

[ఇప్పటి దాకా ప్రేక్షకులు నిశ్శబ్దంగా కూచున్నారు. గాని దీనితో కొంచెం కలకలం బయలుదేరుతుంది. ఆడియన్సులో ఒక పక్కనించి.]

ఒకడు : కోయ్.

రెండోవాడు : వేయించుకున్నావుగా దండ!

మూడోవాడు : ఇహ కానివ్వండోయ్ నాటకం.

[దండవేసిన ప్రేక్షకుడు ఆడియన్సువైపుకి తిరిగి "సైలెన్సు" అని అరుస్తాడు. దానితో, ఆడియన్సులో మరింతగలభా]

ఒకడు : నువ్వే సైలెన్సు.

రెండో : దిగుదిగు.

[ఆలస్యంచేస్తే ఇంకా గొడవయిపోతుందని గ్రహించి భరతుడు అందరికీ దండంపెట్టి]

భర : ఆలస్యానికి క్షమించాలి. [దండవేసిన ప్రేక్షకుడు ఏదో మాట్లాడబోతే వారిస్తాడు] రసజ్ఞ ప్రేక్షకలోకం రసవత్తరమయిన నాటకాన్ని విలోకించడానికి కుతూహలపడుతోందంటే ఆశ్చర్యంలేదు. కనక మరొక్కమారు, కృతజ్ఞత తెలియజేస్తూ నాటకం తిరిగి ప్రారంభిస్తున్నాను. [స్టేజిమీదకి ఎక్కిన ప్రేక్షకుడు దిగిపోతాడు. ఒక్క నిమిషం నిశ్శబ్దం. నాటకం తిరిగి ప్రారంభమవుతుంది. భరతుడి మెడలో దండ అలాగే వుంటుంది.]

భర : అగ్రజా! శ్రీరామచంద్రా!

"దేవ కైకేయి కీడు చింతించి
పాప నింద కింతయు రోయక నిన్నడవి
కరుగుమని యన్న మాటకు నరుగ ధర్మ
మగునె : విచ్చేయుము, మీ తెంపుదగునె సేయ!"

శ్రీరామచంద్రా! కైక కోర్కె మన్నించదగునా!

కైక : (అకస్మాత్తుగా ఒక్క ఉరుకు ఉరికి లోపలికొస్తుంది) మన్నించదగదు. రామా. మన్నించదగదు. పశ్చాత్తప్తదగ్ధను, నాయనా, నన్ను కరుణించవా! మంథర దుర్బోధలవల్ల నేనట్టి కోరికను కోరితినిగాని, నీవన్న నాకు ప్రేమలేదా? ఆ సంగతి నీకు మాత్రము తెలియదా? నీ తల్లి కౌసల్యకన్న నేనే యెక్కుడు అదరాను రాగములతో నిన్ను లాలించెడిదానననీ ఎన్నిమార్లనలేదు. రామా! నా మాట మన్నించి పురికి రమ్ము. ఈ భరతుడు నన్ను అనరాని దుర్భాషలాడి నిద్రపోనీయుట లేదు. భర్తను చంపుకొంటినన్న నింద యెటులను వచ్చినది. నీవు తిరిగి

పురమునకు రాకపోయిన నిన్న రణ్యములు పాలుచేసితి నన్ను వాదుకూడ నాతలను శాశ్వతముగ జుట్టుకొనును. ఆ అపకీర్తి నే భరింపజాల. ఈ భరతుని తిట్లు తింటూనే బ్రతికజాల. రానని నిరాకరించకు. నిరాకరించిన, కరుణాసముద్రా, రామభద్రా, నాతల నీ శ్రీపాదాల ప్రక్కలు చేసుకొని అసువుల బాసెద (అని రాముడి కాళ్ళు పట్టుకుంటుంది. వొదలదు.]

[ఆడియన్సులో ఒక పక్కనించి చప్పట్లు.]

ఒకడు : వండర్‌ఫుల్.

మరోడు : ఎక్సలెంట్ బ్యూటిఫుల్. వన్సుమోర్.

[రాముడికి ఏం చెయ్యాలో తెలియదు. ఈ సీనులో కైక ప్రవేశం అసలు నాటకంలో లేదు. ఒక్క సెకెండు నిశ్శబ్దం. రాముడు పై మీద వల్కలం తీసి నేలకేసికొట్టి, కోపంతో]

శ్రీరా : ఛీ ఛీ [అని గబగబ లోపలికి వెళిపోతాడు]...

[ఆడియన్సులోనించి ఈలలు. చప్పట్లు. భరతుడు కైకకేసి కొరకొర చూస్తాడు. కైక లెక్క చెయ్యకుండా]

కైక : శ్రీరామచంద్రా, శాంతమూర్తివి, నీకే కోపము తగునా [అని కీచిగా నడిచివెళిపోతుంది.

ప్రేక్షకుల్లోంచి ఈలలు చప్పట్లు ఎక్కువవుతాయి గ్రీన్ రూములోనించి; తెర. తెర. తెర వెయ్యండి అని కేకలు. తెర దింపేటందుకు సూచనగా విజిలు. తెరపడడం ప్రారంభిస్తుంది.]

ఆడియన్సులో ఒక ప్రేక్షకుడు లేచి నించుని: తెరవెయ్యకండి. తియ్యండి తెర. (అనిగట్టిగా అరుస్తాడు. తెరమధ్యలో ఆగిపోతుంది. వెనకాలనించి మళ్ళీ గట్టిగా విజిలు. "వెయ్యి తెర" "వెయ్యి తెర" అని కేకలు. తెర కొంచెం దిగుతుంది)

మొదటి ప్రేక్షకుడు : తెర వేస్తే చింపి పారేస్తాం ! జాగర్త! తియ్యండి తెర! [తెర మళ్ళీపైకి లేస్తుంది. మొదటి ప్రేక్షకుడు స్టేజిమీదికి ఉరుకుతాడు. అతని వెనకాల అయిదారుగురు స్టేజి ఎక్కుతారు. వాళ్ళలో ఒకడు జాబాలిగడ్డం పట్టుకుపీకబోతాడు. రెండో వాడు వశిష్ఠుణ్ణి బెదిరిస్తాడు. జాబాలిగడ్డం ఊడబెరుక్కుని లోపలికి పారిపోతాడు. వశిష్ఠుడు గోచీ సవరించుకుంటూ పారిపోతాడు. ప్రేక్షకులు కొంతమంది లోపలికి వెళతారు. సుమంత్రుడూ వెళిపోతాడు. స్టేజిమీద మిగిలిపోయిన భరతుణ్ణి జబ్బపట్టుకుని]

మొ॥ ప్రే॥ నాటకం ఆపడానికి వీల్లేదు.

భర : నాటకం ఆపుతానని నేను అనలేదు. ఆపలేదు.

మొ॥ ప్రే॥ అయితే, నాటకం ఆడు.

భర: మీ రందరు స్టేజిదిగిపోయి, నటకులందరూ సమ్మేళనమైతే అలాగే ఆడతాం.

మొ॥ ప్రే॥ సమ్మేళనం గిమ్మేళనం జాంతానై. నాటకం వెయ్యి.

[లోపనిలించి శ్రీరామచంద్రమూర్తి పాత్రధారి విశ్వనాథం గొంతుక వినిపిస్తుంది.]

విశ్వ : నే చస్తే వెయ్యను.

[స్టేజిమీదికి గబగబ విశ్వనాథం వొస్తాడు. కట్టుకున్న వల్కలం అలానే వుందికాని, తలకి విగ్గులేదు. మామూలు క్రాపింగుజుట్టు. అతని వెనకాల రెండో ప్రేక్షకుడు వొస్తాడు]

రెం॥ ప్రే : మంచిగా చెబుతూవుంటే మాట విను.

విశ్వ : వెయ్యను. వెయ్యను. చస్తే వెయ్యను.

రెం॥ ప్రే : అయితే ఇక్కడ నీకు ఎలాగా చావు తప్పదు.

విశ్వ : చస్తే చస్తాను. కాని వెయ్యను.

రెం॥ ప్రే : ఎంచేత?

విశ్వ : ఇది నాటకం గాదు. కప్పల తక్కెడ.

రెం॥ ప్రే : ఎంచేత?

విశ్వ : ఆ భరతుణ్ణి అడుగు. కైకేయిని అడుగు.

ఆడియన్సులోనించి : అరేయ్ కస్తూరీతిలకాన్నికూడా లాక్కురండి రా!

[స్టేజిమీదవున్న ప్రేక్షకుల్లో ఒకడు గ్రీన్ రూమ్‌లోకి వెళతాడు]

రెం॥ ప్రే : [విశ్వనాథాన్ని వొదలక] చెప్పు.

విశ్వ : అరే. నన్ను తగులుకున్నా వేమిటి? వాళ్ళని అడగమన్నానుగా!

రెం॥ ప్రే : ఎవడికొకాvాలి నీ బోడి సలహా! నాయిష్టమొచ్చినవాడిని- అడుగుతాను నిన్నడుగుతున్నాను. నువ్వే చెప్పు! [అని ఉరుముతాడు]

కవి : [నారాయణతో] ఏ ప్రేక్షకుల అవసరాలు, అభిరుచులు తెలుసునాయనా, నీకు? పాదుకా పట్టాభిషేకంలో శ్రీరామచంద్రుణ్ణి యెంకిపాటలు పాడమని కోరే ప్రేక్షకులదేనా?

ఆ॥ రం : ఏమండోయ్ కవిగారూ మామీదేవో విసురుతున్నారు. మేమేం తేవార్సుగా నాటకానికి రాలేదు. అయిదురూపాయలు పెట్టి టిక్కట్టుకొనుక్కుని మరీ వొచ్చాం. చెమటోడ్చి సంపాదించిన సొమ్ము. మా డబ్బువిలువ మాకు ముట్టకుండా యెగేస్తామంటే ఊరుకునేదిలేదు. తిన్నగా నాటకం ఆడితే తిన్నగా నాటకం చూసిపోదుం. మధ్యలో రభసచేస్తే యెంకి పాటలు పాడిమన్నాం, తప్పేమిటి?

ఆ॥ మా : నాటకం నోటీసు చూశారా కవిగారూ! విశ్వనాథంగారు అద్భుతంగా యెంకి పాటలు పాడుదురు అని నోటీసులో అచ్చేశారు!

నారా : అసలు సరుకు లేకపోతే చీప్ పాప్యులారిటీ కోసం ఇలాటి యెత్తులు తప్పవు!

విశ్వ : పాప్యులారిటీ కోసం బోగంటక్కులేసేది నువ్వు! నావి యెత్తులట! తను చేసేది కళారాధన!

నారా : ప్రేక్షకుల క్షుద్రకోరికలకి, అభిరుచులకి ప్రోత్సాహమివ్వడం.

ఆ॥ రం : అయ్యా! నారాయణగారు, మాటలు తిన్నగా రానివ్వండి. ప్రేక్షకులవి క్షుద్రకోరిక లనకండి. వాళ్లకి నాటకాలు చూడాలని కోరిక లుండబట్టీ, ఆ కోరికలు తీర్చుకునేందుకు డబ్బు తగలేసుకోడానికి సిద్ధంగా వుండబట్టీ, మీరు బతుకుతున్నారు. నాటకాలు, ఈమాత్రంగానైనా బతుకుతున్నాయి!

ఆ॥ మా : మేమే స్ట్రిక్టుగా వుంటే, నాటకాన్ని మీరుచేసే ఖూనీలకి మిమ్మల్ని కక్కడి పాతెయ్యకుండా వుందుమా? ఈ నాటకంలోనే, మొదటినించీ ఎన్ని అభాసులు చేసినా వూరుకోలేదూ? వెయ్యిమంది పట్టే హాలులో రెండువేల టిక్కట్లు అమ్మారు. పేర్లు వేసిన నటకులు రాలేదు. సీతమ్మగారు ఆఖరిసీనులో రావలసింది రాకుండా పెందరాళే రైలెక్కింది. ఓ లోకలక్ష్మణుడు, పద్యాలన్నీ దాటేశాడు.

నారా : వాటన్నిటికీ మేం బాధ్యులం కాము. ఈ నాటకం ఆడించిన కంట్రాక్టర్ని అడగండి.

ఆ॥ రం : డబ్బు చేతులో వేసుకున్నాక కంట్రాక్టరెక్కడ కనిపిస్తాడు.

నారా : అదే వొచ్చిన ఖర్మం. ఈనాటి నాటకాలసంధాన కర్త కేవలం ధనాశాపరుడైన కంట్రాక్టరవడం, మన దౌర్భాగ్యం. కంట్రాక్టరు నాటకాలకి పట్టిన చెదపురుగు.

[తెరవెనక నించి కంట్రాక్టరు వొస్తాడు]

కంట్రా : ఉరిమి ఉరిమి మంగలంమీద పడిందిట! మీ రందరూ విరుచుకు పడడానికి కంట్రాక్టరు తేరగా దొరికాడా! ఈ వూళ్ళో నా సొంత సోడాదుకాణ ముంది. బెస్టు రంగులు మా షాపులోనే దొరుకుతాయి. నా దుకాణంమీద ఘరానాగా బతికే పెద్దమనిషిని నేను. డబ్బు చేతులో వేసుకోగానే పరారీ అయిపోవలసిన అవసరం నాకేం లేదు. వెయ్యిమంది పట్టేహాల్లో రెండువేల టిక్కట్లు అమ్మినన్నారు. అబద్ధం! హాల్లో పదిహేనువేల మందికి టిక్కట్లు అమ్మొచ్చునని, పోలీసు, మునిసిపలు పర్మిట్లున్నాయి. ఎలా ఇచ్చారో వాళ్లనే అడగండి. మిగతా అయిదొందలూ తేవార్సులూ, కాంప్లిమెంటరీలూ! ఈ హాలు కిక్కిరిసిపోయింది నిజమే! ఎంతమంది అసలు టిక్కట్టే లేకుండా దూరి కూచున్నారో లెక్కెట్టండి!! పోలీసు డిపార్టుమెంటుకి, మునిసిపాలిటీకి, కలెక్టరాఫీసుకి, ఎంటర్‌టెయిన్‌మెంటు టాక్సు డిపార్టుమెంటుకి, ఆఫీసర్లకి, గుమాస్తాలకి, డఫేదార్లకి అందరికీ కాంప్లిమెంటరీ టిక్కట్లు. డబ్బుకోసం నే కంట్రాక్టు పుచ్చుకున్నానని నామీద ఓ పెద్ద నిందా? ఎవరండీ, డబ్బుకోసం కాకుండా ఏ పనైనా చేస్తున్నది? కళకోసం కడుపు మాడ్చుకుంటున్నట్టు మాట్లాడుతున్న నారాయణగారు, నాటకానికి రెండొందలు పేరేసి పుచ్చుకోడం లేదూ? అడ్వాన్సుగా కూడా! ఏ కారణం చేతనయినా నాటకం ఆగిపోయినా, సొమ్ము వాపసు ఇవ్వరు. విశ్వనాథం గారు లోగడ రెండువందల కొచ్చేవారు, వారి యెంకి పాటల గ్రామఫోను రికార్డు చెలామణి అవడంతో రేటు పెంచారు. ఈ ఖర్చులన్నీ పెట్టగా, నాకు నాటకంమీద ఓ వంద రూపాయలన్నా మిగలవు! మొత్తంమీద నా సోడాకొట్టుమీద సంపాదించిన సొమ్ము ఈ నాటకాలమీద పెట్టాను. నాకు నాటకాలంటే పిచ్చి సరదా! మా వాళ్లందరూ, నష్టపోతున్నావు, వొద్దని పోరినా విడిచిపెట్టక నాటకాలాడిస్తున్నాను. చెప్పండి ఇప్పుడు, ఎవరు కళాభిమానులో, ఎవరు డబ్బుకోసం నాటకాలేస్తున్నారో? డబ్బు తిన్న విశ్వాసం లేక నాటకం కంగాళిచేసి పైగా నన్నంటారా!

మొదటి ప్రేక్షకుడు : చాలించండయ్యా ఈ చర్చలు. చెవులు హోరెత్తి పోతున్నాయి. తప్పెవరిదయితే ఎవరికెక్కువాలి. నా అయిదురూపాయల టిక్కెట్టు ఫలం నాకు ఏదో రూపేణా ముట్టించండి నారాయణగారూ, నాలుగు పద్యాలు రెండు పెలలు ప్రాక్టీసు చేశామన్నారు. రెండు చదివారు : మిగతా రెండూకూడా చదవాలి. విశ్వనాథం గారు స్థిరమైన నసివసి చదివి, నాలుగు యెంకి పాటలు విసరాలి.

అడియన్సులో నించి : అవునవును. పాడాలి. పాడాలి.

[అని చప్పట్లు : ఈలలు]

మొ॥ ప్రే : నారాయణగారూ మొదలెట్టండి. [హార్మోనియమ్ వాయించడానికి విజిలు. నారాయణ మొదలెట్టాడు]

అడియన్సులో నించి ఒకడు : ఏయ్ నారాయణా! పద్యం విసురు!

నారా : అయ్యా! నే నా పద్యాలు విడిగా చదవను!

అడియన్సులో నించి ఒకడు : అంతా నీ యిష్టమే! రెండొందలు మింగేసి పద్యాలు చదవవుట.

నారా : సొమ్ము పుచ్చుకున్న మాట వాస్తవమే. అది భరత పాత్ర ధరించడానికి. సందర్భం లేకుండా పద్యాలు చదవడానికి కాదు.

ఆ॥ ఒకడు : అయితే నాటకం వెయ్యి

నారా : నటసమ్మేళనం సక్రమంగా జరిగితే వెయ్యడానికి నే సిద్ధమని మొదటే చెప్పాను.

విశ్వ : ఈ పరిస్థితుల్లో వెయ్యనని నేనూ చెప్పాను.

ఆ॥ ఒకడు : అయితే అందర్నీ దంచుతామని మేమూ చెప్పాం... చూస్తారేం... తన్నండి [తన్నండి. తన్నండి అని కేకలు. స్టేజిమీదికి చాలా జనం చేరి పోతారు. కొంతమంది నారాయణచుట్టూ, మరి కొంత మంది విశ్వనాథం చుట్టూ చేరతారు. తెర ఎప్పుడో మెల్లిగా పైకి జారుకుంది]

కంట్రా [గుస్సురుముతూ] ఆగండి. [అందరూ అతని కేసి చూస్తూ నిలుచునిపోరు.] నాటకాలు చూసి, ఆనందించడంలో చాలా రసికులని మనవూరి వాళ్లకి పేరు. వీళ్ళని తంతే మనకి వొరిగేదేమీ లేదు. పోయిన డబ్బు రాదు. చెడ్డపే రొస్తుంది.

స్టేజిమీద ఉన్న ప్రేక్షకుల్లో ఒకడు : అయితే ఏంచెయ్యమంటా వయ్యా! తువరమయిపోయిందని, నెత్తిన ముసుగేసుకు పోవడమే. వాళ్లకి బుద్ధి చెప్పొద్దూ.

కవి : చేసిన తప్పుకి మరో తప్పు జోడిస్తే రైటవదు. పద్యాలూ యెంకి పాటలూ పాడమని దండించడం మూలాన వీరికి బుద్ధిరాదు. చేసే అభాసులకి ప్రేక్షకుల వక్రబుద్ధే కారణం అని దాటేసుకు పోడానికి అవకాశం ఇస్తారు. దీనికి మందు సక్రమమైన మార్గంలో నాటకం ఆడించి తీరడం. అప్పుడు బుద్ధొస్తుంది.

ప్రే : అలా నాటకం ఆడకపోతే

కవి : అప్పుడు దానికి దండించండి.

ప్రే : ఏయ్ నారాయణా! విశ్వనాథం! విన్నారా! తిన్నగా ఈ సీను మళ్ళీ వెయ్యండి. లేకపోతే వీపు హోరెత్తిపోతుంది.

కవి : ఇతగాడు అంతా నాటక పాఠాన్ని ఎవరిష్ట మొచ్చినట్టు వారు సంస్కరించి నందువల్ల వొచ్చింది. అలా చెయ్యకుండా వుంటామని హామీ యిచ్చి నాటకం ప్రారంభించండి.

ప్రే : అవునవును. ఇహ యెప్పుడూ సొంత పైత్యాలు పెట్టమని లెంపలేసుకోండి. ఊ విశ్వనాథం! నారాయణ! మీరు వేసుకోకపోతే మేం వేస్తాం!

నారా : జయప్రదమైన నాటక ప్రదర్శనానికి ఒక ఉత్తమ నాటకం, ఉత్తమ నటకులు ఎంత అవసరమో, రసిక ప్రేక్షక జనం అంతే అవసరం [ప్రేక్షకులని చూపిస్తూ] మీరు హద్దుదాటి ప్రవర్తించి, నాటకంలో లేనిపాటలు, పద్యాలు పాడమని నిర్బంధిస్తూ, మమ్మల్ని ఈ విధంగా శాసించడానికి మీకే మధికారముంది?

కవి : నిజం! నిజం! ప్రేక్షకులూ తమ విధులు నిర్వర్తించాలి. అప్పుడే ఇతరులని శాసించడానికి అధికార ముంటుంది.

ప్రే : [స్టేజి ముందుకొచ్చి] అందుకు మేం తయారు. ప్రేక్షకులందరి తరఫునా నేను హామీయిస్తున్నాను. నాటకంలో లేని అసందర్భమయిన పద్యాలూ, పాటలూ పాడమని మేం ఎప్పుడూ కోరం. నాటకం సక్రమంగా ప్రదర్శించమంటాం. ఇదివరకు అక్రమమయిన, కోరిక కోరినందుకు లెంపలేసుకుంటున్నాం

[లెంపలేసుకుంటాడు. ఆడియన్సులోంచి చప్పట్లు] ఇప్పుడు, వేసుకోండి, మీరుకూడా లెంపలు [అని నారాయణని, విశ్వనాథాన్ని నిలవదీస్తాడు]

నారా : నేనేం తప్పు చెయ్యలేదు.

ప్రేక్ష : మరి లెక్చర్లివ్వకండి. మీరు వేసుకుంటారా! మమ్మల్ని వెయ్యమంటారా, చెప్పెయ్యండి. ఆలిస్యంతే, గుంజీలు తీయించి, గోడ కుర్చీకూడా వేయిస్తాం. ఊ [అని బాగా మీదికికొట్టి వాడిలా వెళతాడు నారా జంకుతాడు]

నారా : ఏమనమంటారు.

కవి : నాటక ప్రదర్శనానికి, నటకుల కలయిక, నటకులు ఒక్క సూత్రం మీద నడవడం అవసరం. స్వవిజృంభణ పనికిరాదు. ఈ సూత్రాలకి విరుద్ధంగా ఏమీ చెయ్యము" అని హామీయిచ్చి, లెంపలేసుకోండి.


ప్రేక్ష : [ఉరుముతూ] వేసుకోండి!

[విశ్వనాథం, నారాయణ లెంపలేసుకుంటారు. ఆడియన్సులోంచి మళ్ళీ చప్పట్లు]

కంట్రా : ఇంతమంది లెంపలేసుకుంటూ వుంటే నాకూ అదే బుద్ధిపుడుతోంది. ఇహ నెప్పుడూ, ఫలాని పాత్రధారి, నాటకంలో లేనిపాటలు వగైరా పాడతాడని నోటీసులు పంచిపెట్టను. సక్రమంగా నడుస్తున్న నాటక సమాజాలనే పిలిపించి నాటకాలాడిందడానికి కంట్రాక్టు పుచ్చుకుంటానుగాని, విడి విడిగా ఆక్టర్లని బుక్ చేసి నాటకం ఆడమనను [అని లెంపలేసుకుంటాడు. చప్పట్లు]

కవి : మాటమీద నిలిచి, మనస్ఫూర్తిగా ప్రయత్నించి, సక్రమంగా నాటకాలాడితే ఆంధ్రనాటకరంగం దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. నటనలో, నాటక రచనలో, అభిరుచి, రసికతలలో, ఆంధ్రనట, కవి, ప్రేక్షకులు భారతదేశంలో ఏ ప్రాంతీయులకి తీసిపోరు. నాటకకళ ఆంధ్రులకి ప్రత్యేక అభిమాన కళ. ఒక్క సూత్రంమీద నడవడం, కలయిక, నాటక కళారంగంలో ప్రారంభించి సాధిస్తే, జీవితం అన్ని రంగాల్లోనూ సాధించగల మేమెా! ఆ శుభపరిణామం కోసం ఆశించి, కాంక్షించి కృషిచేద్దాం; అందరమూ కలిసి. ఐక్యకంఠంతో అనండి. "ఆంధ్ర నాటక రంగానికి జై" [విశ్వనాథం, నారాయణ భుజంమీద చెయ్యేస్తాడు. "ఆంధ్ర నాటక రంగానికి జై" అన్న నినాదంతో హాలు మారుమ్రోగి పోతూవుంటే,

—తెర.



కళాపూర్ణోదయ ప్రశంస

పాత్ర చిత్రణము

★

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

'.........కలకాలము నీ
క్షించిన నిది నిచ్చలు నొక
యంచితరుచి నెఱపుచున్న యది కనుగొంటే'

నారదుడు మణికంధరుడితో ద్వారక ప్రవేశించి అక్కడి కొలువుకూటాన్ని చూచి తత్ప్రశంసాపరంగా చెప్పిన యీ మాటలు కళాపూర్ణోదయ ప్రశంసకూడా అవుతుంది. సూరన్న కళాసృష్టి అపూర్వమూ, బహుముఖ ప్రజ్ఞాభాసురమూ, ప్రతిభాసంపన్నమూ. నిత్యనవీనంగా యిది వెలయడానికి వృత్తంలోని వక్రత, ఉపాఖ్యానాల కూర్పు, కికతలతో పాటు పాత్రచిత్రణంకూడా ప్రధాన కారణం. కళాపూర్ణోదయంలో పాత్రలు ఒకే ప్రబంధపు అచ్చుదిమ్మతో తీర్చిన నిర్జీవప్రతిమలు కాక జవజీవాలతో నిచ్చక్రొత్తలుగా కళాకాంతుల నీనే మధురమూర్తులు!

ఒక కావ్యంయొక్క గొప్పదనాన్ని నిరూపించటంలో విమర్శకుడు పరిశీలింపవలసిన కావ్యాంశాలు రెండు. ఒకటి దాని శిల్పసౌందర్యం. రెండు అందులోని ధర్మధ్వని. ధర్మం నీతికి పర్యాయపదం కాదు. నీతి సాంఘికాచారానికి సంబంధించింది. ధర్మం తాత్త్వికమైన సత్యం. అయితే యిలాంటి ధర్మధ్వని లేనంతమాత్రాన ఆ కావ్యాల కావ్యత్వానికేమీ భంగం రాదు. కాని ధర్మధ్వనికూడా వున్న కావ్యాలు లేనివాటికంటె వుత్తమము లయినవని చెప్పక తప్పదు. నేటి విమర్శపరిభాషలో యీ ధర్మధ్వనినే జీవిత సమస్యాపరిష్కారం అంటారు.

మానవజీవితం ధర్మార్థ కామాలనేమూడు పురుషార్థాల సంపుటీకరణం. ఏ ధర్మశాస్త్రప్రమాణాలకూ కట్టుపడని జీవితసమస్యలు యెన్నో యిందులో సంఘటిల్లుతూ వుంటవి. ప్రపంచ మానవజీవితంపై తన దృష్టిని లగ్నంచేసి లోకసామాన్యానికి దురవగాహమైన యీ జీవితసమస్యలను గోచరింపజేసుకొని వాటిని తన కావ్యవస్తువులో గర్భీకరించి శిల్పమర్యాదలు చెడకుండా ధర్మప్రతిపాదనరూపంలో కవి వాటిని పరిష్కరించడంలోని వ్యంగ్యవిధానమే కావ్యంలోని ధర్మధ్వని.

కళాపూర్ణోదయం అంటే ప్రణయదేవతా విశ్వరూప ప్రదర్శనం అన్నమాట. జగల్లీలకంతా ఆదికారణమైన యీ కామపురుషార్థం అధికారి తారతమ్యాన్నిబట్టి యెన్నివిధాలుగా వర్తిస్తుంటుందో యెన్ని రూపాంతరాలు పొందుతుందో ధ్యానించి వాటిని సాక్షాత్కరింపజేసుకుని దానికి రూపకల్పన చేయటం అన్నది బ్రహ్మసంకల్పానికి అర్థం చెప్పటం అన్నమాట. కళాపూర్ణోదయంలో ప్రతిపాదింపబడిన ధర్మరహస్యం యిదే. తన కావ్యం అపూర్వకథాసంవిధానవైచిత్రీ మహనీయమూ, పుణ్యవస్తువర్ణనాకర్ణనీయమూ కావడంతోపాటు 'శృంగార రసప్రాయము' కూడా కావలెనన్న సూరన్న సవిశేష ప్రతిజ్ఞకుకూడా కారణం యీ ధర్మధ్వన్యుద్బోధమే!

ఈ రహస్యాన్ని వ్యక్తీకరించటానికి పురాణేతిహాసాలన్నీ గాలించినా యే వుపాఖ్యానమూ కూడా అతడికి ప్రయోజనకారి కాదు. ఆ వుపాఖ్యానాల్లో యేదైనా ధర్మధ్వని వుండనీ గాక! అది తాను లక్షించిందిమాత్రం కాదు. అంచేతే సూరన్న తన ప్రపంచాన్ని తాను సృష్టించుకోవలసి వచ్చింది. కళాపూర్ణోదయం 'కేవల కల్పనా కథ' కావలసివచ్చింది. ఆలంకారిక నిర్దిష్టమైన రాచబాటమీద ఆయన

శృంగారసరస్వతి నడవకపోవటానికీ యిదే కారణం. ఆయన స్వయమూ తాను సృష్టించుకొన్న ఆ శృంగార ప్రపంచంలోని వ్యక్తుల ప్రణయజీవితాలు మానవ జీవితాలకు అత్యంతమూ సన్నిహితమైనవి కావటమే కావ్యంయొక్క నిత్య నవీనతకు కారణం!

తెలుగుప్రబంధాలలో స్త్రీపాత్ర ప్రధానాలైనవి చాలాతక్కువ. ఉన్న ఆకొద్దిపాటి ప్రబంధాలలోనూ కూడా కళాపూర్ణోదయమూ, ప్రభావతీప్రద్యుమ్నమూ మేలుత్తరములు. కళాపూర్ణోదయంలో కలభాషిణీ, ప్రభావతీ ప్రద్యుమ్నంలో శుచిముఖీ యీ యిద్దరూ సూరన్న పాత్ర చిత్రణంలో చూపిన అసాధారణ కౌశలానికి దృష్టాంతాలు. అసలు యీ రెండుపాత్రల కోసమే సూరన్న యీ రెండు ప్రబంధాలూ వ్రాసినాడా అనిపిస్తుంది. ఈ యిద్దరిలో కలభాషిణి ప్రేమ మూర్తి! శుచిముఖి ప్రజ్ఞామూర్తి!

కళాపూర్ణోదయంలో కలభాషిణి జీవితం మానవ జీవితానికి సన్నిహితంగా వుండి మనోజ్ఞంగా వుందనడానికి సందేహం లేదు. కలభాషిణి ద్వారకలోని ఒక నట ముఖ్యుని ప్రియనందన.

'కూకటి వేణితోఁ గురులు
గూడకమున్న కుచప్రరోహముల్
పోకలతోడి సామ్యమును
బొందకమున్న నితంబసీమకున్
బ్రేకదనం బొకింత
ప్రభవింపకమున్న' — విటావళి నవ్వాకల
బెట్టిన కలభాషిణి

'తొలుఁ బ్రాయపు మగకోడముల
తలపుల తమకములు మిగులఁ దను పెనురుకొనన్
జలజాక్షి జవ్వనము' — ప్రతిక్షణము వింత వింతగ వలయుగా విటసంచయుచిత్తవిత్తములను అప్సరః కీర్తి బలెన్ హరింపనొడగినది. తన గానవిద్యాకౌశలం చేత శ్రీకృష్ణుడికొలువులోనికి ప్రవేశంకూడా సంపాదించుకొన్నది. కొలువుకుపోతూవస్తూవుండినఆదివాలలో నేఒకప్పుడు నారదుడి వెంటవచ్చివుండిన అతడి శిష్యుడు మణికంధరుడు శ్రీకృష్ణుడిమీదిచెప్పిన దండకాన్ని ఏకసంథన గ్రహించి తిరిగి పఠించి కృష్ణుడిచేత నారదుడిచేత మెప్పు పొందింది. అప్పుడే యీ మెకు మణికంధురుడిమీద అనురాగం యేర్పడింది. కాని నారదుడికి తెలిస్తే శపిస్తాడేమో నని ఆ అనురాగం బయటికి పొక్కనీయకుండా లోలోపలనే అడచుకొని వుండినది. మణికంధరుడి తపోవనంలో తన్ను పొందింది మణికంధరుడే అని తెలిసింతర్వాత కలభాషిణే

'....................
..........నీదుపొందు నా
కనభిమతంబె? నీకుఁ దగ
నన్నతలంపున నీతలంపు నేఁ
గనమిని ద్రిప్పుదున్ హృదయ
కాంక్ష నమం గనుగొన్న వేళలన్.

నీ సౌందర్య విలాసభాసుర తనూ
నిర్నిద్ర సౌభాగ్యమున్
నీ సంగీత విశేషకౌశలము నీ
నిర్దోష నానాగుణో
ల్లాసంబున్నను నన్ను నెంతపర
మాహ్లాదంబు నొందించెనో
యీ సుద్దుల్ హృదయైక సాక్షికము
లేమన్నన్ వృథా యుక్తిలేన్.
అవిధి నుండునంతట
నొకప్పుడు నిన్నును జూముచో మణి
గ్రీవుని పేరు దోఁచె మదికి
న్మణికంధర! యేకదేశ సా
మ్యవశగుణంబుచే నతని
నాతని యన్నను మద్దిచెట్లుగా
దైవతమాని తిట్టినవిధంబు
మనంబునఁ దాఁకె నంతటన్.
దానను గుండె గుబ్బు మనదా
పెరియన్ విడిచెం ద్వదంగసం
గానుభవేచ్ఛ యొట్టిడినయట్లు
తదాదిగ నాదు చిత్తమో
మానితశీల!....................
......................'

అని అంటుంది. నలకూబరుణ్ణి చూచేదాకా మణికంధరుణ్ణే మనసార ప్రేమిస్తూనే వుండినది కలభాషిణి. నలకూబరుణ్ణి చూచింతర్వాత మాత్రం అదిడామె హృదయంలో లేదు. నలకూబరుడి పొందు కలభాషిణి పాపం! యెన్నో కడగండ్లపాలు అవుతుంది. నారదుడిదగ్గర యేదో మిషమీద కామరూపం దాల్చే శక్తి సంపాదించింది. మణిస్తంభుడువచ్చి మణికంధరుడి తపోవనంలో రంభ అతడి కౌగిలిలో వున్నట్టూ, నలకూబరుడు తపోవనం బయట రంభ కోసం కాచుకునివున్నట్టూ చెప్పగా యెలాగయినా రంభ లేనిసమయంలో తన కామరూప శక్తిసాధనంతో నలకూబరుణ్ణి పొందాలని, సిద్ధుణ్ణి ప్రార్థించి అతడితో

సింహాసనం అధిష్ఠించి బయలుదేరుతుంది. మృగేంద్ర వాహనాలయంలో సుముఖాసత్తివల్ల మణిస్తంభుడి దుష్టప్రయత్నం తెలిసి చావుకు సిద్ధపడ్డ కలభాషిణి దేవి మహిమవల్ల మణికంధరుడి తపోవనంలో పూల పాన్పుమీద పడుతుంది. మణిస్తంభుడామెతోబాటు అక్కడే పడి ఆ స్థితిలో ఆమెను చూడడంచేత మదనావేశం కలిగి ఆమెను కౌగలించుకోబోతే ఆమె ఆర్తనాదం చేస్తూ పరుగెత్తుతుంది. అప్పుడు నలకూబర రూప మణికంధరుడామెను రక్షించి ఆమెను పొందుతాడు. ఇంతలో సత్యారంధ వచ్చి తగాదా పెడుతుంది. ఎంతో నేర్పుతో మాటలాడినా తుదకు కలభాషిణి బయటపడక తప్పింది కాదు. సత్యారంధ శాపంపొంది తిరిగి మృగేంద్రవాహనాలయం చేరుకుని అక్కడికే వచ్చిన మణికంధరుడి మూలాన తన్ను పొందింది అతడే నని తెలుసుకుని పశ్చాత్తాపం ప్రకటించి శాపఫలితంగా మణికంధరుడి కత్తి కాహుతి అయి దేవి అనుగ్రహంకారణంగా ద్వారకలో సజీవితయై పడుతుంది. కొంతకాలం ద్వారకలో శేష జీవితం గడపిం తర్వాత ఉత్తర జన్మలో పురుష స్త్రీరూపాలను ధరించిన సుముఖాసత్తీ మణిస్తంభులకు 'మధురలాలస' గా జన్మించి కళాపూర్ణుణ్ణి వివాహం చేసుకుంటుంది. కళాపూర్ణోదయంలో కలభాషిణి జీవితం యిలా ముగుస్తుంది.

తనకు స్నేహితుడూ, గానకళాసహాధ్యాయీ అయిన మణికంధరుణ్ణి మనసారా ప్రేమించిన కలభాషిణి నలకూబరుడి పొందు ఆసించడానికి కారణం యేమిటి? పొందు జరగకపోనీ గాక! అది మానసిక వ్యభిచారంకదా! వేశ్య కాబట్టి ఆ పదం ప్రయోగించడానికిగూడా మనకు అధికారం లేదేమో! అయినా కలభాషిణికీ హృదయదౌర్బల్యం యెందుకు కలగాలి? అంటే దానికి సమాధానం యిది. కామ్య వస్తువు దుర్లభం అయినప్పుడు దాని కాభాసం అనిపించుకొనేదాని ఛాయైనా కొంతవరకూ మనస్సుకు తృప్తి చేకూరుస్తుందనడం ప్రకృతిసిద్ధమూ, మానవ సహజమయిన ధర్మమూ. ఎప్పుడో చచ్చి స్వర్గాన వున్న తాతముత్తాల చిత్రపటాలను మన గోడలమీద మనకంట్ల కెదురుగా అలంకరింపజేసుకొనడానికి యిదే కారణం. రత్నంయొక్క ఛాయ గాజుపూసలో కొంతకు కొంత వుండడంచేతనే లభ్యంకాని ఆరత్నానికై లోలోపల కుందుతూనే గాజుపూసను ఎదను చేర్చుకోవటానికి కలభాషిణి వుద్యమించింది. కలభాషిణిమణికంధరుడితో అన్నది.

శ్రీయుతమైన దివ్యమణి
చేతికి నబ్బఁగఁ బాలుపైచి త
చ్ఛాయ యొకింత యున్కి గని
చాలఁ గ్రహించితి గాజుపూసకై
నా యవివేక మేమనుకొనం?
దుదఁ దన్మణి యబ్బె నన్న న
య్యాయతి తత్పరాగను సుఖాప్తికి
నోఁచమి నెంచి కుందెదన్.

ఎంత ధీరగుణం కలవారికైనా ఒక్కొక్కప్పుడు ఏదో హృదయదౌర్బల్యం కలగడం, దానికి వశమై మృగతృష్ణలవెంట పరుగుపెట్టడం, కడపటికి వివేకం తెచ్చుకుని పశ్చాత్తాపం చెందటం, చేసిన తప్పు ఒప్పుకొని శుద్ధులు కావటం యివన్నీ మానవ లోకంలో నిసర్గంగా వున్నదే కాని లేనిది కాదు. కలభాషిణిలోని యీ ఛాయాభిలాష, యీ హృదయ దౌర్బల్యమూ యేకమై ఆమె చరిత్రను సందేహాస్పదం చేసినవి. అంచేతే కళాపూర్ణోదయంలోని కథాపాత్రలలో కలభాషిణి చరిత్ర మనోహరమయినదప్పటికీ కొంతవరకూ అది అనూహ్యంగా వున్నట్లు అనిపిస్తుంది. పాత్రచిత్రణంలోని యీ రహస్యం తెలుసుకుంటేనే కాని ఆ అనూహ్యత యెందువల్లో మనకు సుబోధం కాదు. హృదయదౌర్బల్యం కారణంగా కొంతదారి తప్పినా భగవదనుగ్రహంవల్ల కొసకి తను కోరిన మణికంధరుణ్ణే పొంది కలభాషిణి కష్టాలన్నీ గడిచి గట్టెక్కింది. కలభాషిణి పాత్ర మానవ జీవిత ప్రతిబింబం.

పెద్దన్న వరూధిని చిత్రణానికీ, సూరన్న కలభాషిణి చిత్రణానికీ భేదం వున్నది. వరూధిని దేవవేశ్య. శ్రోత్రియ బ్రాహ్మణుని ప్రవరుని వలచినది. అతడామె వలపును చెడనాడినాడు. ఆమె హతాశురాలయింది. రసాభాసమయింది. ప్రవరుడు వెళ్ళిపోయినాడు. మాయాప్రవరుడు వచ్చినాడు. అమాయకురాలు వరూధిని. అతడే ప్రవరుడని నమ్మింది. నమ్మి తన శరీరాన్నతడికిచ్చింది. అతడామెతో భోగించినాడు. వరూధిని యీవిధంగా ప్రవర రూపాన్ని పొందినా ప్రవరుణ్ణిమాత్రం పొందలేదు. ఇక్కడ కలభాషిణి అలా కాదు. మణికంధరుణ్ణి ప్రేమించింది. శాపభయంవల్ల దాన్ని పొక్కనీయలేదు. నలకూబరుణ్ణి చూచింది. అతడి ఛాయ నలకూబరుడిలో గోచరించింది. అతడి పొందుకోసం తంటాలు పడింది. నలకూబరరూపంతో మణికంధరుడు ఆమెను పొందినాడు. శీలభ్రంశం జరిగిందేమో, సత్య నలకూబరుడే కలభాషిణిని పొందినాడేమో నని అనుమా

నించి ఆందోళనపడేటంత బిగువుగా కథ నడిచింది. అలాంటి అత్యాచారం యేదీ జరగలేదు. ఎవరు ఎవరిని పొందాలో వారే వారిని పొందారు. ప్రియాప్రియుల వినిమయం జరగలేదు. అంతటి శిల్పంతో నడిచిందికళాపూర్ణోదయం. వరూధినికి పయిచేయిగా సూరన్న సృష్టించినపాత్రమే కలభాషిణి!

ఆంధ్రప్రబంధ పురుషులలో శాలీనుడు ఒక మధురప్రకృతి. ప్రవరుడు పయికోనివచ్చిన వరూధిని నొల్లని ధార్మికతపస్వి అయితే శాలీనుడు కులకాంతలోనే సహజసౌందర్యాన్ని అభిలషించి తదనుగ్రహం పడసిన కళాతపస్వి. సూరనార్యుడి కావ్యకళా సృష్టిలో యిత డొక సురుచిర సన్నివేశం.

శాలీనుడు ఇల్లటపుటల్లుడు. అతడి తల్లిదండ్రు లెవరో మనకు తెలియదు. సుగాత్రి అతడిభార్య. ఇల్లటపు టల్లుళ్లకు సాధారణంగా అత్తవారింటిలో ఎలాంటి చనవుసంతనా లుంటవో శాలీనుడికీ అలాంటివే వున్నవి. అత్తగారికి నోరుపెద్దది. ఆ యింటిలో ఆమె మాటకు చెలామణీ యెక్కువ. తన కోరికలను కళ్ళెంపట్టి వాటిని లోలోపలనే అడుచుకుంటాడు కాని ఆమెదగ్గిర ఎప్పుడూ నోరు మెదపడు.

తొలి కలయిక నాడు ముత్తయిదువలు ముచ్చటపడి సుగాత్రిని చక్కగా అలంకరించి పడకటింటికి పంపినారు. శాలీనుడికి సహజసౌందర్యమువందు ప్రీతి. బుట్టబొమ్మకు తొడిగినట్టు ఒక్కటే అలంకారపు తొడుగు అతడికి నచ్చదు. అందుచేత అతడామెను చేరదీయలేదు. పాపము! 'తరుణి యుండి యుండి తిరిగిపోయినది.' రెండు మూడు రాత్రులు యిలాగే గడిచిపోయినవి. సుగాత్రికి వట్టిరాకపోకలు మాత్రము దక్కినవి. శాలీనుడు మాత్రం 'అది నే భావమునం జూచె నట్లు చూచు'చుండినాడు. మగడు తన్నొల్లక పోవడానికి కారణం సుగాత్రికి తెలియదు. శాలీనుడయినా తన కిష్టం యిలాంటిది అని చెప్పలేదు. చెలికత్తెలకూ, తల్లికీ విషయం బోధపడలేదు. తల్లి అనుమతితో ప్రియవయస్యలు సుగాత్రికి 'పతివశీకరణ మంత్రాలు' వుపదేశించి పంపినారు. సుగాత్రి ఆ మంత్రాలన్నీ ప్రయోగించి చూచింది. శాలీనుడి ప్రవృత్తిలో మార్పులేదు. సుగాత్రికి పతిభక్తి సడలలేదు సరికదా మంగళసూత్రం లీపాటి శుభస్థితి నుండుటయ పదివేలని భావించింది. అతడికి ఆయురభివృద్ధికరములని వివిధాలంకారాలను యేమరకుండా నోలుస్తుండినది. శాలీనుడు ఉలుకడు. పలకడు. తన కది అయిష్టమని తెలపడు. అత్తగారికి ఓరిమి అంతకంతకూ సడలిపోవడం ప్రారంభించింది. రుసరుసలు ఆరంభమయినవి. ఫలితం శాలీనుడు తోటపనులు చూడవలసి వచ్చింది. అతడూ సంతోషంతో అందుకు అంగీకరించాడు.

ఒకనాడు సుగాత్రి మగడు తోటలో శ్రమిస్తూ వుండగా అతడి కష్టం చూడలేక అతడికి సహాయం చేయవెంకోపమని సొమ్ములన్నీ వూడ్చి 'పిరిచుట్టు చుట్టుకొనిన వలువతో' మగడికి సహాయపడింది. తన కిష్టమయిన సౌందర్యాన్ని సుగాత్రిలో శాలీనుడు చూచినాడు. అతడి మనసులో తలపులు రేగినవి. సుగాత్రిని తలగ్రుచ్చి కౌగలించుకుని మదనమహారాజ్యభోగమహిమలో ఆమెను తేల్చినాడు. సుగాత్రి తనపుణ్యం పండిందనుకొన్నది. మగడు తన్ను ముట్టినందుకే మురిసిపోయింది. ఇంతకాలం తన్ను ఒల్లకపోవడానికి కారణం సుగాత్రి అడగలేదు. అతడు చెప్పలేదు. మగడిదగ్గర అనుమతి తీసుకుని యిల్లు చేరుకున్నది.

ఆనాటి రాత్రి సుగాత్రి యెప్పటికంటె బాగా అలంకరించుకుని పడకటింటికి పోయింది. ప్రొద్దుటి అనురాగం స్మరించి అత డాదరిస్తాడని ఆశించింది. అతడు రెప్పలుకూడ విచ్చి చూడలేదు. ఆమె కేమీ పాలుపోలేదు. సాహసించి శాలీనుడి దగ్గరకు పోయి చెవిదండ 'మీకు శ్రమగానున్నది కాబోలు. పోదునా' అన్నది. అతడు బరువెక్కి మూతలు పడుతూవున్న కండ్లను ప్రయత్నంమీద మీదికెత్తి 'యే కోర్కెని వచ్చి' తని అడిగినాడు. సుగాత్రి యేమంటుంది? అయినా సాహసించి 'లోకము వారలు పతికడ కేకోర్కెని వత్తు' రన్నది. తాలిమి తూలి అతణ్ణి తూలనాడింది. కాని అతడి హృదయంలో కదలిక కలగలేదు. శాలీనుడు అప్పు డొక్క చిగిరింత లేనిమోడు. అతడి హృదయం ఒక్క పలుగు రాయి!

సుగాత్రి పానుపుదగ్గరే కూర్చుని అతడికి పాదసంవాహనం చేస్తూ—

'చిత్తము వేఱొకర్తెపయిఁ జేర్చి
మఱల్పఁగనేర రేమొ మీ
రత్తరళాక్షిఁ దెచ్చుకొనుఁ
డాయక నావలెమైనఁ బంపుఁ డేఁ
దెత్తు నవశ్యముగా మఱియు
జేవరకుంబలె నవ్యధూటికిఁగా
తొత్తుగుచుగా బనుల్ సలుపుదుగా
నిజమాసెద దైవసాక్షిగా.
గుదఁ జక్క లేల? మీ మది
కొద దీఱెనఁ జాలు నమ్మకొనవలసిన వ

చ్చెద నమ్ముకొనుఁడు నన్నో
హృదయేశ్వర! యేమి చింత యిది దెల్పఁదగున్.

సుగాత్రి పత్యనురాగమూ, పాతివ్రత్యమూ పరాకాష్ఠ చెందింది. పతిచిత్తము మెచ్చిన తొత్తునకు తొత్తునయ్యెద నన్నది. అది తన చేతిలోనిపని అయితే ఆమెను తెచ్చియిస్తానన్నది. తన్నే అమ్ముకొమ్మన్నది. ఆమె పాదసంవాహనం చేస్తూనే వున్నది. అతడు అవునని గాని కాదని కాని యేమీ చెప్పలేదు. ఇంతలో తెల్లవారి పోయింది.

మరుసటిదినం సుగాత్రి తోటకు పోయి మగడికి తోటపనుల్లో తోడ్పడింది. పతి ఆదరించినాడు. సుగాత్రికి కిటుకు తెలిసిపోయినది. తన మగడికి 'అట్టి సొంపులే గాని భూషణాలింపుగావు, తెలుసుకున్నది. వారి హృదయాలలో పొరల తెరలు వీడిపోయినవి. అనురాగరసంలో వారి హృదయాలు రంజించినవి. వారి దాంపత్యజీవితం తిన్నగా సాగిపోయింది.

ఇందులో శాలీనుడు అలంకారభూషిత అయిన ప్రియురాలి ముఖాన్ని కన్నెత్తి అయినా చూడకుండా ఉండటం, అనలంకృత అయి గ్రామ్య రూపంలో వుంటే ఆమెనే అక్కున చేర్చుకోవడం వింతకాదూ! ఇలాంటి ప్రవృత్తి కలవాళ్లుకూడా కొంద రుంటారనే సమాధానం చెప్పుకుందాం. కానీ అలా యెందుకుండాలీ అనే ప్రశ్నమాత్రం ఆలోచింపదగ్గదే. శాలీనుడు నిరాడంబర చిత్తవృత్తి కల సాధుజీవి. అతడికి కృత్రిమాలంకారాలు గిట్టవు. ప్రణయధర్మాల్లో యిదికూడా ఒకటి. అసలు మన్మథుడు యువతీ యువలకుమీద యెల్లవేళలా పూవుటమ్ములు విసురుతూవుండడు. అలా విసిరినా తాకవు. ఏకాంతం అతడి విహారక్షేత్రం అంటారు. కానీ అదీ సంపూర్ణసత్యం కాదు. అతడి బాణాలు తాకడానికి యేకాంతంకూడా అవశ్యకం కాదు. దానికి మనోవస్థే కారణం. ఈ మనోవస్థ అన్నది ఆ యిరువురిలో ఒకరికి రెండవవారిలో ఉద్బాటుగా పొడగట్టే రేఖాపరిణామం (*A Change in Feature*) వల్ల యేర్పడుతుంది. ఈ ప్రణయసూత్రంతోనే శాలీనపాత్ర చిత్రణం చేయబడ్డది.

నూరన్న పాత్రలలో శాలీనుడికి తర్వాత మన దృష్టికి తగిలేవాడు శల్యాసురుడు. మన ప్రబంధ నాయకులకన్న యితడు వేయిరెట్లు నయం. ఉద్దేశం చెడ్డదే అయినా యితడి ప్రవర్తనం మాత్రం వుదారంగానూ, దయనీయంగానూ వున్నది. రాక్షసులకు సహజమయిన కాఠిన్యం యితడిలో మనకు కనపడదు. అధమపక్షం అభినవకౌముది విషయంలో నైనా.

మృగేంద్రవాహన తన బంధువైన మహిషాసురుణ్ణి చంపిన సూడు మనసున బాయక పగదీర్చు నుపాయము నన్వేషిస్తుండగా అభినవకౌముది అనే చంద్రకిరణ సంభూత అప్సరఃకన్య అతడికి యెదురైనది. ఆమెను చూచినమాత్రాన అతడి హృదయం చలించింది. ఆమె వెంటపడినాడు. ఆమె చలపట్టి 'నిన్ను మడియించినవానిని దక్క నే వరింప'నన్నది. అతడూ 'శక్తి ప్రహారతకు ఘనంబుగా గినిసియుఁ బోవనిచ్చె నొకకీడును జేయక యవ్విలాసినిన్.' మృగేంద్రవాహన యిచ్చిన అవితథ మయినశక్తిని ధరించి మణికంధరుడికోసం పోతుంటే అభినవకౌముదిని చూచి శల్యాసురుడు తన్నే చంపటానికి వస్తున్నదేమో నని—తన్ను చంపినవారు చస్తారనే మహాశక్తివరం వుండడంచేత—ఆమె నాశనం చెందుతుందేమో నని తనపాటు మరచి ప్రియురాలి శుభాశుభములనుగూర్చి తలపోసి ఆ కాస్తవిషయం ఆమె చెవిలో వేశాడు. ఆమె అతడి కేదో నమ్మబలికినది. అతడు నమ్మినాడు. ఆమె అతణ్ణి యేలయించుకొని పోతుండినది. తన ప్రతాపం ఆమెకు తెలియపర్చడం కోసమని శిలలవర్షప్రయోగంచేత జంతుజాలాల్ని సంహరించడం ప్రారంభించాడు. భూతకోట్లను రక్షింపవలెననే దయచేతనైనా అభినవకౌముది తన్ను అంగీకరిస్తుందేమో అని అతడి ఆశ. తనకు పరమార్థం ఆమె. ఆమెను నొప్పింపడు. కినియడు. లోకాన్నంతా హింసించి, ఆ హింస మాన్పడానికి ఆమె తన్ను అంగీకరిస్తే చాలునంటాడు. ఆహా! కాఠిన్యమూ, మార్దవమూ రెండూ వున్నవి అతడిలో. అభినవకౌముది అతణ్ణి మణికంధరుడిచేత చంపిస్తుంది. వ్యసనకరమూ, వ్యర్థమూ అయిన శుష్కజీవితం శల్యాసురుడిది. నిష్కళంక ప్రీతిచేత విశోభితం అది!

కళాపూర్ణోదయంలో కథకంతా సూత్రధారుడు నారదుడు. కళాపూర్ణుడిసుద్ది భూమిలో వెలయడానికి తోడ్పడినవా డతడు. తెలుగులో యితర ప్రబంధాలలో నారదుడికీ, కళాపూర్ణోదయంలో నారదుడికీ చాలా భేదంవున్నది. ఇతర నారదులకి మల్లే యితడు కేవలం కలహభోజనుడు కాడు. రంభా ప్రతిరంభల జగడం తెచ్చిపెట్టడం యితడి అభిమతం కాదు. మాట మీద మాటవచ్చి యిత డన్నమాట యథార్థమయింది. రంభతో మాట్లాడేటప్పుడుకూడా కలభాషిణి నామెకు సవతిని చేయాలనే ఆలోచనే అతడికి లేదు. కలభాషిణి రంభావిషయం ప్రస్తావించి అడిగినప్పుడే కలభాషిణిని సవతిని చేయాలనే అభిప్రాయం అతడికి కలిగింది. బ్రహ్మదేవుడి సంకల్పసంతానం

అయిన కళాపూర్ణుడు భూలోకంలో వెలయడానికీ, సరస్వతీ చతుర్ముఖుల శృంగారకేళీవృత్తం భూలోకంలో వెలయడానికీ మణిహారంలాగే నారదుడూ ఒక సాధనమాత్రంగా మాత్రమే వుపకరించినాడు కళాపూర్ణోదయ కథలో. నారదగానమాత్సర్య కథలో నారదుడు ఎదుటివాని పాండిత్యం గుర్తించడం విషయంలో మొదట కొంచెం పొరబడ్డా తరవాత యెంత వుదారంగా ప్రవర్తించిందీ మనకు తెలుసు. అలాగే శ్రీకృష్ణుడి కొలువుకూటంలో నారదుడు కృష్ణుణ్ణి కొలవడానికి వచ్చిన ఆమాత్యాదులలో ముందు మాట్లాడి ఆ కార్యం ముగించమని అర్థించడంలో అతడి పెద్దమనిషి తరహా మనకు ప్రవ్యక్తమవుతుంది. సూరన్న నారదచిత్రణమే ఒక ప్రత్యేక శిల్పం! ఇలాంటి ఉదారచిత్తుడూ, మర్యాదజ్ఞుడూ అయిన నారదుడు మన ప్రబంధాల్లో యితరత్రా మృగ్యం అంటే అతిశయోక్తి కాదు.

కళాపూర్ణోదయంలో పాత్రలు నాటకీయాలుగా చిత్రింపబడ్డ పాత్రలు గనుక కవి ప్రతిదానితోనూ తాను తాదాత్మ్యం పొందివుండాలి. కానీ వాళ్ళల్లో అతడి ఆత్మీయత అన్నది దేనిలో మూర్తీభవించి వున్నదో వూహించడం అంత దుష్కరం కాదు. శాకుంతలంలో కాళిదాసే కణ్వుడు. అలాగే కళాపూర్ణోదయంలో సూరన్నే, నారదు డేమో!

కలభాషిణీ, శాలీనుడూ, శల్యాసురుడూ, నారదుడూ — యీ నలుగురూ కళాపూర్ణోదయ కథా భవనానికి నాలుగుమూల స్తంభాలు. ఈ మనోజ్ఞ పాత్రల చిత్రణంలో సూరన్న చూపిన ప్రజ్ఞ ప్రశంసార్హం!

విద్యానగర ప్రభువులకాలంలో వెలసిన తెలుగు కవుల కృషిఫలితంగా యేర్పడ్డ ఆంధ్ర ప్రబంధ సాహిత్యోద్యానంలో కళాపూర్ణోదయం క్రమ శృంగార రసఫలాలగెలను పండించిన కదళీతరువు. అలనాటి సాహిత్య రంగస్థలంపై అపూర్వభంగిమతో నిలిచి విలక్షణమైన కళావిన్యాసం చేసే నట్టువకత్తె విలాసరేఖ కళాపూర్ణోదయం. అద్భుతమయిన శిల్పంతో, అపూర్వాలయిన పాత్రలను సృష్టించిన అద్భుత ప్రతిభాశాలి సూరన్న కళాప్రతిభకు జోహారులు! *

* ఈ వ్యాసములను తయారుచేయుటలో నీ క్రింది గ్రంథములు, వ్యాసములు సంప్రతింపఁబడినవి. తత్కర్తలకు కృతజ్ఞుఁడను.

1. కవిత్వతత్త్వ విచారము — శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారు.
2. కళాపూర్ణోదయము — శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి గారిచేఁ బరిష్కృతము.
3. కళాపూర్ణోదయము–శ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి గారిచేఁ బరిష్కృతము.
4. కళాపూర్ణోదయము — శృంగారము — శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారి వ్యాసము—విరోధి సంవత్సరాది సంచిక 'త్రివేణి' లోని వ్యాసము.
5. *Symbolism In Hindu Drama.*





దినదినమునకు
ఇంక మృదువైనటువంటియు,
ఇంక మనోహరమైనటువంటియునైన చర్మము

రెక్సోనాలోని **కేడిల్‌తో** ఈ అద్భుతమైన మార్పును మీరు తెచ్చుకొంటారు

రెక్సోనాయొక్క కేడిల్‌తోగూడుకొన్న నురుగును మీ చర్మముమీద బాగా రుద్ది తరువాత కడిగివేయండి. మీ చర్మము దినదినమునకు ఇంక మృదువుగాను, ఇంక స్వచ్ఛముగాను అగుటను చూస్తారు.



రెక్సోనా

ఇది ఒక్కటే కేడిల్*తో గూడిన సబ్బు

* చర్మమును పోషించేటటువంటియు, చర్మమును మెత్తగాచేయునటువంటియునైన నూనెల ఒక ప్రత్యేక మిశ్రమమునకు రిజిస్టర్డ్ పేరు.

RP. 101-50 TL

రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ వారి తరఫున ఇండియాలో తయారుచేయబడినది

అల్పజీవి



శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

(గత సంచిక తరువాయి)

11

నేను ఎక్కడ వున్నాను?
ఎక్కడ ఉన్నాను నేను?

సుబ్బయ్యకి జరిగినదేమిటో గుర్తుకు రావటం లేదు.

జరిగినదంతా అతనికి పూర్తిగా గుర్తుకు వస్తోంది.

నే నెక్కడున్నాను?
పర్వతంమీంచి పడిపోతున్నాను.
సముద్రంలో మునిగిపోతున్నాను.

ఉన్న బలం అంతా ఉపయోగించి నా తలమీద సమ్మెటలతో ఇనప సమ్మెటలతో ఎవరు కొడుతున్నారు?

దెబ్బలు!!!
ఇందాట్లా నన్నెవరు కొట్టేరు?
అల్లప్పుడు నాన్నని ఎవరు కొట్టేరు?
ఇందాట్లా నన్ను కొట్టేరా?
లేదే! భయపించేరా? అంతేనా?
కాని నొప్పి! ఒళ్ళంతా నొప్పి!
నొప్పి నొప్పి తెగనొప్పి!
చస్తాను కాబోలు.
ఊహుఁ! చావురాదు!
నాకు చావురాదు!
నారాత ఇలా వుండగా...
ఏమిటి చెప్మా రాయించేరు...
నా చేత నారాత రాయించేరు.
—రాయ్‌రా! రాస్కెల్!
—సంతకం చెయ్‌రా గాడిదా!
—చేస్తావా చెయ్యవురా??
ముప్పై ఎరుపెక్కిన కళ్లు.
తాగుడువల్ల ఎరుపెక్కిన కళ్ళు.
చూస్తూఉండగా
మరొక జత ఎరుపెక్కిన కళ్ళు గల తాగుబోతు చేతిలో సుబ్బయ్య పొడుగాటి వెల్లటి జుత్తు.
అదే గవరయ్య కుడిచెయ్యి!!
—చెయ్‌రా డర్టీ రాస్కెల్!
దండాలు బాబూ! నమస్కారాల్నాయనా!
మీకందరికీ నమస్కారాలు!
చంపేయ్‌కండి బాబూ! పిల్లలుగలవాణ్ని!
—ఎంద్రా?
—ఇద్దరే?? ఇంతే? హహ్హహా హెహ్హెహ్హే!
—ఎక్కడ్రా వుంది నీ పెళ్లాం?
కంపు కంపు కంపు నోళ్ళు!
సావిత్రిని రక్షించు దేవదేవా!
—రాసేవా?
రాసేనండీ రాసేస్రాసేన్!
సంతకం పెట్టవేమిరా ఇడియట్
—పెడతాను బాబూ పెడతాను
—నీదీ పైకోసారి చదువు. అంతా వింటాం!
చదువుతా న్చదువుతా న్చదువుతా న్చదు...
...—ఆగురా వెధవా ఏమిటా వ్రిథోరణి.
చిత్తం చిత్తం.
—చదువ్వేగిరం!

చిత్తం. అక్షరములా వెయ్యిరూపాయీలు... అడిగిన తక్షణం చెల్లించి......సుబ్బయ్యవ్రాలు... సాక్షులు......

—ఇప్పుడేమంటావురా?

—గాడిద కొడకా!
—అయిదువంద లెగ్గొడదామని చూసేవేం?
—హాహ్హాహ్హా నవ్వొస్తూంది ... కొడుకు ఇంక వెయ్యిచ్చుకోవాలి.
—నాకూ నవ్వొస్తుందిరా.
పదహారుమంది తాలూకు కర్కశ కంఠాలు తిట్లే తిడుతున్నాయి.
బిగించిన పిడికిళ్ళు గభేల్ గుభేల్మని మీద పడుతున్నాయా?
నేను చచ్చిపోతాను.
నాన్న చచ్చిపోయాడు.
వీళ్లు నన్ను చంపేస్తారు.
కమలా! కమలా!
క్రిష్ణుడేడీ?
మనోరమా! మనోరమా!
కొండలకింద నలిగిపోతున్నాను.
మరిహ బతకను. లాభంలేదు.
అందర్నీ అడిగేనని చెప్పు.
రెయిలుపట్టాలు గొలుసు చైయిన్లు.
ఇనపపట్టాలమీద ఇనపగొలుసులు
వేసి కట్టేసి పడేశారు!
ఇనపచక్రాల మెయిలుబండీ
వస్తోంది! వస్తోంది!
కంఠానికి దగ్గరగా దగ్గరగా!
రక్షించండి! కాపాడండి!
మీ కాళ్ళకి వెయ్యివేల నమస్కారాలు!
ఎలా గెలా గెలాగ?
దయలేదు. దాక్షిణ్యంలేదు. జాలిలేదు. హృదయంలేదు.
వీళ్లు మనుష్యులు కారు కారు కారే!
పశువులు పశువులు అడివి జంతువులు!
రౌడీలు గూండాలు రాక్షసులు
—ఫో! ఇంటికి ఫో!
వెళ్తాను. వెళ్తాను.
కాని నేను లేవలేను.
చస్తా న్చస్తాన్
—ఈ వెధవ, భయంతో గుండెలాగి చచ్చేటట్టున్నాడు!
—ఇంటికి తీసికెళ్ళి ఒదిలెయ్యండి.
—ముందిక్కణ్ణించి ఈడ్చి పారెయ్యండి.
ఎక్కడ? ఎక్కడ?
నేనెక్కడ ఉన్నాను?
నాయింటి మెట్లమీద ఇక్కడే ఉన్నానా?!
నన్నిక్కడే పడేశారు!
విసిరేశారు!
ఈడ్చి పారేసి
విసిరి పడేశారు.
"కమలా! తలుపుతియ్యి కమలా"
అనలేక పోతున్నానే!!
మూలుగు వస్తోందే!
మాట రావడం లేదేం??
తలుపు తెరిచేరా ఎవరైనా?
తెరవకపోతే ఇంట్లోకి ఎలా వచ్చేను?
నాన్నా నాన్నా
అని ఏడుస్తున్న దెవరు?
అయ్యో అయ్యో
అని అంటున్న దెవరు?
కమల క్రిష్ణుడు సావిత్రి
బాధ బాధ
నొప్పి నొప్పి
"నాన్నా నాన్నా ఏమయింది నాన్నా"
"ఏమయిందండీ?"
సావిత్రికూడా ఏడుస్తోందా?
లేదు ఏడిశావం లేదు.
కాని భయపడుతోంది.
అవును. నాకు తెలుసు.
అంతా భయపడుతున్నారు.
నాబాధ చూసి భయపడుతున్నారు.
చచ్చిపోతా నేమోనని భయపడుతున్నారు.
చస్తాను! ఎలాగా చస్తాను!
"ఏమయిందో? ఏమిటయింది? ఎందుచేత మాట్లాడరు"
ఏమయిందని ఎవరో అడుగుతున్నారు.
చెప్పలేను. చెప్పలేను. చెప్పలేను.
ఏమయిం దేమయిం దేమయిం దేమయిం దేమయిం దే.........
హబ్బ! చెప్తాను చెప్తా న్చెప్తా న్చెప్తాను.
ఏమయిం దేమయిం దేమయిం......
"పడిపోయానర్రా పడిపోయేను"
అబద్ధం అబద్ధం! అబద్ధం చెప్పేను.
వీళ్ళు ఊరుకుంటారా?!
ఎక్కణ్ణుం చెక్కణ్ణుం చెక్కణ్ణుం చెక్కణ్ణుం చెక్కణ్ణుం చెక్క ..
"జటాక్కమించి"
పచ్చి అబద్ధం పచ్చిగా అబద్ధం పచ్చడవని అబద్ధం.
ఇంక దయుంచి నన్నేమీ అడక్కండి

నన్నొదిలేయండి. నేను ఛస్తున్నాను.
నన్నేమీ అడక్కండి.
ఛస్తున్నాను. బాధపడుతున్నాను.
చస్తూ బాధపడుతూ
అబద్ధాలాడుతున్నాను.
చావబోతూ అబద్ధం చెప్పేను.
చెప్పేను అబద్ధం చావబోతూ
చావబోతూ బోతూ అబద్ధం చెప్తూ చెప్తూ చస్తాను.
చెప్పేది అబద్ధం
చావబోయేది నిజం.
చావే కాదు ఈబాధకూడా నిజం.
నిజంకన్న నిజం చావుకన్న నిజం అబద్ధంకన్న నిజం ఈ బాధ!
మనిషిమాట అబద్ధం
మనిషి బాధ నిజం
మనిషి చావు నిజం.
అబద్ధపు బతుకు బతుకుతూ నిజం బాధలు పడుతూ అతినిజంగా చస్తాం.
వీళ్ళంతా భయపడుతున్నారు.
ఎందుకెందుకు?
నే చస్తానని!
వెర్రి వెధవలు!
అయినా వీళ్ళనని లాభంలేదు.
ఎలాగా భయపడతారు వీళ్ళు.
మనిషికి భయం ఎలానూ తప్పదు.
మనిషికి చావుకూడా ఎలానూ తప్పదు.
నే చస్తానని వీళ్ళు భయపడ్డం...
కమలా క్రిష్టా సావిత్రీ,
కొంచెం మంచినీరు!
గొంతుక ఎండిపోయింది.
"ఇదిగో మంచినీరు"
హాబ్బాబ్బ! హామ్మమ్మ! హాయ్యయ్య!
హాయ్ హాయ్‌గా ఉంది!
ప్రాణం లేచిలేచి వస్తోంది.
కన్ను మూతమూత పడుతోంది.
ఎవరో వస్తున్నారే!
ఎవరెవరో వస్తున్నారే!
ఎవరది?
ఎవరెవరది?
ఎంతసేపయింది నేనిక్కడికి వచ్చి?
ఎన్నాళ్ళయింది నేనీలోకంలోకివచ్చి?
ఎంతకాలం ఇలా బ్రతికివుంటాను?
మీరు చెప్పగలరా?
చెప్పలేరా!
అయితే మీ రెవరు?
ఎవరో హో మీరు?
ఇపుడా నను పలుకరింతురు?
మంచంమీద పడుక్కున్నానని
చస్తూ పడుక్కున్నాననీ తెలీదూ?
ఎవరు మీరు? మీరెవరు?
"హల్లో! హల్లో!"
"*What is all this?*"
ఓహో ఓహో డాక్టర్ గారా!
గుండెలమీదస్టెతోస్కోపు("డాక్టర్ డాక్టర్")"
కడుపుమీద చల్లటిచెయ్యి ("డాక్టర్ డాక్టర్")
"మరేం ఫర్వాలేదు" ("డాక్టర్ డాక్టర్")
అబ్బా నొప్పి నొప్పి, డాక్టర్ డాక్టర్
"అబ్బే! దెబ్బలూ గిబ్బలూ ఏమీ లేవండీ! *He is Quite all Right*! కొంచెం 'షాక్' అయ్యేడు మనిషి. ఆ *effects* కన్పిస్తున్నాయంతే! నిద్రకి మందిస్తాను! మరి నే వస్తా"
డాక్టర్ వెళ్ళారా?
కమలా ఏడవకే!
క్రిష్టా పడుకోరా!
మీరుకూడా పడుకోండి.
ఇదిగో ఇది తాగండి.
మరింక పడుకోండి.
బాధాలేదు గీధాలేదు. నిద్రలేకపోతే సరి.
పడుకోండి.
పడుక్కునేదా?
నిద్రరాదే
రాదే నిద్రరాదే
నిద్రరాదే నిద్రరాదే నిద్ర నిద్రరాదే రాదే...

* * *

మర్నాడు. శనివారం. ఉదయం.
సుబ్బయ్య తల భారంగా ఉన్నాది.
సుబ్బయ్య మనసు భారంగా ఉన్నాది.
సుబ్బయ్య ఒళ్లు నొప్పిగా లేదు.
గత రాత్రి అంతా కలిసి, గవరయ్యింట్లో అంతా కలిసి దంచేస్తారేమోనని భయపడ్డాడు.
ఎవరూ కొట్టలేదే!
సిగ్గు సిగ్గు వెధవది సిగ్గు సిగ్గు
జుత్తు పట్టుకున్నాడు.
గవరయ్య సుబ్బయ్య జుత్తు పట్టుకున్నాడు.
వెధవ బతుకు!
నరకం! యమయాతన!

కొట్టలేదు! నిజమే! కాని అంతకన్న ఇంకేం కావాలి?

ఇంకేం చెయ్యాలి.

అందర్లోనూ బలవంతంగా రాయించేడు.

ఎవరో వాళ్ళు? ఏమో!

"కాని ఏంచేసేది రాయక"

అయిదువందలు ఇచ్చుకో నక్కర్లేదు.

వెయ్యిరూపాయిలు మాత్రం నిక్కచ్చిగా ఇచ్చుకోవాలి!!!

"ఎలా ఇచ్చుకో నేది?"

సుబ్బయ్య తల భారంగా భారంగా ఉన్నాది.

సుబ్బయ్య తల తీవ్రంగా తీవ్రంగా పని చేస్తోంది.

అతని తలలో ఆలోచనలు జోరుగా జోరుగా పరుగెడు తున్నాయ్.

గోడమీద, సుబ్బయ్యగదిలో గోడమీద గడియారం మెల్లిగా మెల్లిగా నడుస్తోంది.

నెమ్మది నెమ్మదిగా కదుల్తూన్న ముళ్ళు తొమ్మిది తొమ్మిదే అవొస్తూందని చెప్పగా.

గడియారం విధిలేక విధిలేక తొమ్మిది గంటలు కొట్టింది.

అతని తలమీద ఎవరో ఠంగ్ ఠంగ్ మని కొట్టి నట్లయింది.

ఎవరు కొడుతున్నారు?

ఎవరూ కొట్టలేదే!

అవును ఎవరైనా కొడితే తల ఇంత తేలిగ్గా ఉంటుందా?

సుబ్బయ్య తల ఒక్కసారిగా తేలికయింది.

ఎంత తేలిగ్గా ఎంత హాయిగా ఉంది!

ఛా! ఛీ! ఛూ!

సుబ్బయ్య ఒక్కసారిగా అటుంచి ఇటు తిరిగేడు.

ఎందు కింతభయం నాకు?

భయం మనిషికి తప్పదు.

బాధ మనిషికి తప్పదు.

తప్పనప్పు డిహ భయమెందుకు?

అయిదువందలు పదివంద లయింది.

అవుతే అవనీ!

పదివేలవనీ!

అయిందేదో అయింది.

భయపెట్టి నాచేత రాయించేడు.

నేను రాసేను.

భయపడి రాసేను.

ఏదో ఒకహ టవుతుంది.

భయం ప్రతివాడికీ వుంటుంది.

ఆఫీసులో అడగడానికి గవరయ్య భయపడ లేదూ!

ఇవ్వాళ నాచేత రాయించగానే సరా!

ఏదో ఒకటవుతుంది!

అనుకొని అనుకొని బాధ పడి పడి.

మ రిహ లాభం లేదు.

* * * *

ఆరోజే తరువాత సుబ్బయ్య చెప్పేడు. రాత్రి జరిగినదంతా సవిస్తరంగా చెప్పేడు.

పోతన్న, వెంకట్రావు, అవధాని, మనోరమ నలుగురితోనూ చెప్పేడు.

పోతన్న సుబ్బయ్య చెప్పినదంతా విన్నాడు. అందుకు, అంటే, గవరయ్య చేసినదానికి అతను ఆశ్చర్యపడలేదు. కోపం ప్రకటించ లేదు.

పోతన్నతో చెప్పిన తరువాతి భోగట్టా అంతా సుబ్బయ్య వెంకట్రావుతో చెప్పేడు.

వెంకట్రావు కోపంతో మండిపడి పోయేడు.

ఆఫీసులో అవధానికి భోగట్టా తెలియజేసేడు.

అవధాని కోపంతో గవరయ్యని బూతులు తిట్టేడు.

సాయంకాలం మనోరమతో చెప్పేడు.

తన క్కలిగిన కొత్తబాధ ఆమెకి తెలియజేద్దా మనే ఆత్రతలో ఆమెయందు కలిగిన భయం గురించి మర్చిపోయేడు సుబ్బయ్య.

ఆమెకూడా అతను చెప్పినది వినడంలో తన విషయం మర్చినట్లుంది.

"అయ్యబాబ్బో! మీతో చెప్పడం మర్చి పోయేను, కాని విన్ననే జ్ఞాపక మొచ్చిందండీ! ఈ గవరయ్య మావూరువాడే నండీ! గంగమ్మ కొడుకు! చిన్నతనంలో వాళ్ళనాయన రంగంపోయాడు. తరువాత గంగమ్మ కొడుకుని తీసుకొని ఇటువైపు వచ్చేసింది. మావూళ్లో ఉన్నప్పుడు మా యింటిపక్కనే ఉండేవారు. నేను చిన్నదాన్నయినా అప్పట్లో నన్నెరుగుదురు వాళ్ళు"

సుబ్బయ్య ఆశ్చర్య పోయాడు.

ముందుగా భోగట్టా విన్న పోతన్న,

"సరేలెండి సుబ్బయ్యగారూ! భయపడకండి! నేనుండగా మీకేభయమూ లేదు" అన్నాడు తాజాగా.

జరిగినది తెలుసుకున్న వెంకట్రావు,

"గవరయ్యగాణ్ణి నరికిపారేసి నోటు తెస్తా" అన్నాడు.

విషయం విన్న అవధాని బూతులు తిట్టడం అయాక,

"నోటు ఇస్తేనేగాని బిల్లు పాసవ్వని రామారావుచేతనే చెప్పిస్తాన్లే! మరేం ఫర్వాలేదు. ఆఫీసులో ఆమాత్రం యూనిటీ ఇంకావుందిలే, ***in spite of Ramaswami***" అన్నాడు.

"గవరయ్య నన్ను బాగా ఎరిగివుండాలండీ. గంగమ్మ నన్నుచూస్తే ఎంతో ముచ్చటపడేది. రేపొద్దున్నే వెళ్ళి అంతా సెటిల్ చేసుకువస్తానుండెండి." అన్నాది మనోరమ.

"అయ్యయ్యో! ఆడమనిషివి. నీ కెందుకు వాగురించి అంత శ్రమ"

అని సుబ్బయ్య ఆమెతో అనలేదు.

* * * *

ఆదివారం, సాయంకాలం.

ఆదివారం సాయంకాలం అయిదుగంటలకి పోతురాజుని పిల్చేడు గవరయ్య.

"పోతురాజూ! అయితే ఆ నోటు వాడికిచ్చేద్దాం"

"అదే మంచిదండి"

"పాపం! మావూరు పిల్లవచ్చి అడిగింది కూడాను"

"అవునండి"

"వాడిమీద మనసులో ఉన్నట్టుంది పాపం"

"అవునండి"

"వాడు దొంగవెధవని చెప్పినా విన్నాది కాదు"

"దానికి మనమేం చేస్తామండి"

"ఆ వెధవ దీన్నికూడా ద్రోహం చెయ్యక మానడు"

"అవునండి"

"పాపం అమాయకురాలు"

"చిత్తం. అలాగే కనిపిస్తోంది"

"మా అమ్మకి ఎంతో ఇష్టంగా ఉండేది"

"అలాగాండి!?"

"అవున్రా...పాపం దాన్ని కష్టపెట్టడం నాకిష్టం లేదు"

"చిత్తం"

"నోటివ్వనంటే నొచ్చుకొంటుంది. అయిదు వందలూ కావలిస్తే తను తీర్చుకుంటానంది"

"వాడంటే బాగా మోజుగా ఉన్నట్టుందండి"

"అవున్రా! అప్పటికీ చెప్పేను, వాడికి పెళ్లాం పిల్లలూ ఉన్నారని. చెప్పినా విన్నాది కాదు. ఆడదాని మనసుకి తెలా తొక్కా లేదురా పోతురాజూ"

"చిత్తం అలాగే నండి"

"సరే! ఏదో ప్రాధేయపడ్డాది...సరే అనేశాను"

"చిత్తం"

"తరువాత చూసేవు కదూ......"

"చిత్తం"

"ఆ దగుల్బాజీ వెధవ..."

"పోతన్నాండీ?"

"ఆ! ఆ వెధవ మనకెదురు తిరిగేడు"

"అవున్లెండి! వాడిపని తరవాత చూడొచ్చున్లెండి"

"సరేలే! కాని ఇప్పుడు?"

"నోటు ఇచ్చేద్దామండి"

"అవధానిగాడు డోకాడు పేచీపెడుతున్నాడు"

"వాడు దేవాంతకుండా కొడుకండి"

"అయితే ఆ నోటు వాడి మొహాన్న విసిరేదామా?"

"విసిరెయ్యండి! మొన్నరాత్రి జరిగిన అవమానం చాల్నండి వాడికి"

"వాడు దొంగవెధవ కదూ?"

"అవునండి"

"అవమానం బాగా జరిగింది. ఏం?"

"అవునండి"

"అయితే అది పట్టుకువెళ్ళి వాడి మొహాన్న విసిరికొట్టు"

"చిత్తం!"

పోతురాజు వెళ్ళేడు.

వాలుకుర్చీలో చేర్లబడి పడుకున్న గవరయ్య "అబ్బా" అంటూ కళ్ళు మూసుకున్నాడు.

అబ్బా! తలనొప్పిగా ఉంది!

బిల్లు! బిల్లు!

బిల్లుపాస్ కాకపోతే ఎలా?

అవధానిగాడు అడ్డువచ్చేడు.

నోటుకీ బిల్లుకీ లంకె పెట్టేడు.

అందరి కాళ్ళా పట్టుకున్నాడు.

ఆ వెధవ సుబ్బయ్య వెధవ!

ఎంత ద్రోహి! ఎంత ద్రోహి!

ఛీ! ఎవడికీ విశ్వాసం లేదే!

ఆపదలో యిచ్చేను అయిదువందలు.

కాణీ యివ్వలేదే అందులో తిరిగి.

అవధానిగాడు అనవసరంగా ఆ వెధవ పతొన్న పూనుకొని వచ్చేడు గాని లేకపోతే వెధవని హత మార్చేద్దును.

వెంకట్రావుగాడు ఎంతమందితో ఏమేమని అరుచుకున్నా సరే! నాకు లక్ష్యంలేదు. నిజంగా?

పోనీ! పోలేపోయింది!

అప్పటి సంగతులు ఇప్పు డెందుకు?

వెంకట్రావుగాడు చెప్పినా ఎవరికీ తెలీదు.

ఎవరిక్కావాలా వెధవ పాత ఊసు.

కాని ఇప్పుడు, ఇప్పుడు, ఇప్పు డాపోతన్నగాడి పని పట్టించాలి.

విశ్వాస ఘాతకుడు!

ఆ సుబ్బయ్యగాడికీ వీడికీ ఉన్న చుట్టరికం ఏమిటో?

వాడో విశ్వాస ఘాతకుడు! వీడో విశ్వాస ఘాతకుడు.

ఈ వెధవకూడా బ్లాక్‌మార్కెట్టని వేల్దమే!

నమ్మి నాగుట్టు ఇవ్వడం తప్పయింది.

నమ్మక స్వామి ద్రోహం చేసేవాణ్ణి

ఏంచేస్తే పాపముంది?!

అబ్బా! తలనొప్పి!

ఎన్నడూ లేన్ది ఇవాళ తలనొప్పి ఎలా వచ్చింది?

పోతన్న అవధాని, బిల్సు, బ్లాక్‌మార్కెట్ ఇవేనా నా తలనొప్పికి కారణాలు?

కావే!

ఆరోజా బీచిని కూర్చున్నప్పుడు ఇలాగే తల నొప్పి!

ఏ రోజున?

అయ్యయ్యో! మర్చిపోయా ననుకున్నాను!

జరిగిన దేదో జరిగిపోయింది.

గతం గతించింది.

జరిగిన దేదో జరిగిపోయి, గతం గతించి పోయింది.

అంతా జరిగినదంతా పూర్తిగా చచ్చిందను కున్నాను.

"గతం" చచ్చిం దనుకున్నాను.

కాని బతికే వుంది.

నన్ను చంపుకుతింటోంది.

అబ్బా! తలనొప్పి!

హబ్బా! రామ...చంద్రా! తలనొప్పి!

కారులో నా మోటారుకారులో నేను వెళ్తా వుంటే ఆపినదెవరు? పొద్దుట నన్నాపిన దెవరు?

ఓహో! వెంకట్రావా?

ఎందు కాపేడు వీడు.

నన్నా నా కారునీ?

ఈ వెధవకి ఎడంగా నిల్చున్న ఆడమనిషెవరు?

మనిషి చాలా బావుందే!

"ఎవరో ఎరుగుదువా?"

అబ్బా! తల వేడిగా ఉంది!

అమ్మా! తల భారంగా ఉంది!

"ఎవరో ఎరుగుదువా?"

ఎరుగుదు నెరుగుదు నెరుగుదు నెరుగుదు నెరు గుదు.........

తెలుసు. తెలుసు. తెలుసు. నాకు తెలుసు.

హబ్బబ్బా! శ్రీరామచంద్రా!

రామయ్యమ్మా! రామయ్యమ్మా!

నాపాలిట భాగ్యలక్ష్మి!

నన్ను పట్టుకున్న పిశాచమా!

హబ్బబ్బా నొప్పి! నొప్పి!

రామా రామా ఎంత బాధ ఎంత బాధ!

నన్ను చంపి చచ్చిపోయిన రామయ్యమ్మ!

నన్ను రాక్షసుడిగా మార్చిన రామయ్యమ్మ!

నన్ను స్వర్గంలోకితీసుకుపోయిన రామయ్యమ్మ!

నన్ను నరకంలోకి దిగద్రోసిన రామయ్యమ్మ!

ఎరక్కేమి? ఎరుగుదు నెరుగుదును!

ఎక్కడుంది? ఎక్కడుంది?

వాడు, ఆ నీచుడు, ఆ తాచుపాము. ఆ అడివి జంతువు,

ఆ నిర్భాగ్యుడు వెంకట్రావుగాడిదగ్గరా!!

"...ఎవరికీ తెలియదు...నోటుఇచ్చేస్తే ఎవరికీ తెలియదు..."

వెంకట్రావుగాడి పేలాపన! వెధవ్వాగవ! జమీం దార్ల వంశంట! వైభవ్యంశం!

చూస్తే ఇదీ బ్రతుకు!

నేనా భయపడేవాణ్ణి!

అవధానే అడ్డురాకపోతే,

సుబ్బయ్య గాడికి, వెంకట్రా వ్వెధవ గాడికి ఇలాంటి వెధవలందరికీ చూపిద్దును నా తడాఖా!

హబ్బా! బాధ పోలేదే ఇంకా!

పాడుముండ ఎలాపోతే నాకేం?

అలా అయితే నా కెందు కింతబాధ?

గుండెల్లో నొప్పి! గుండెల్లో మంట!

ఎందు కింతబాధ? ఎందు కీబాధ!

"ఫో ఫో! గెటవుట్! కారుపోనీరా డ్రైవర్!"

అనేశాను. అనేశాను.

కాని ఈ గవరయ్యకి ఇప్పు డెందు కింత బాధ?

పొద్దున్న ఏదో జరిగింది.
వెంకట్రావు గారు అప్పుడే పోయేరు.
వాడిసవక...
నా కెందుకీ బాధ?
చీ-చీ
చీకట్లో
ఆరాత్రి
బాధ! బాధ!
నెత్తి మొత్తుకొంటూ పోయింది.
పాడు ముండ! వెధవముండ!
చంపెయ్యవలసింది! తప్పు చేశాను!
ఎందుకీనొప్పి, ఈమంట ఈబాధ?
అయ్యో! అయ్యయ్యో!
రామయ్యమ్మ వెళిపోయిందే
వెళిపోయిందే నాజీవితంలోంచి!

నా బతుకంతా మాడ్చి మసిచేసి, ధ్వంసంచేసి నన్ను మార్చి, నన్ను చంపి, నన్ను పాతిపెట్టి ఆరాత్రే వెళిపోయిందే!

"అమ్మలు చక్కటి చుక్కరా గవరయ్య బాబూ!"

అమ్మలు అమ్మలూ అనేది రామయ్యమ్మని
ఎవరు? అమ్మ!!
చక్కటి చుక్కల్లే అమ్మా! నిజమే!
కాని ఎంతపనిచేసిందే! అమ్మా!
అమ్మా ఎక్కడే ఉన్నావ్?
నువ్వంటే అమ్మలుకూడా ఉండునే!
నన్నెందుకు విడిచిపెట్టేవమ్మా!
అమ్మా అమ్మలూ ఇద్దరూ లేరే!
నా జీవితంలోంచి ఇద్దరూ వెళిపోయేరే!
హాయ్యో! ఎంత బాధగా ఉందయ్యా నాకు!
రామయ్యమ్మా! రామయ్యమ్మా!
మళ్ళీ ఎందుకొచ్చేవు?
పాతగవరయ్య ఆరోజే పోయేడు నీతో.
మళ్ళీ ఎందుకు బ్రతికిస్తా వ్వాణ్ణి!
రామయ్యమ్మా! వేగిరంగా పో!
నాకు బాధగా ఉంది.
నన్ను తిరిగి చంపకు.
నన్ను పొడిచి చంపకు.
పొడిచి పొడిచి నన్ను తిరిగి చంపకు.
పో పో వెళిపో వెళిపో!
హాబ్బా! శ్రీరామచంద్రా!
ఏమి తల నొప్పిగా ఉందయ్యా!
నా తలనొప్పి తీర్చేందుకు
ఎవరున్నా రిక్కడ?
ఎవరూ లేరా?
అయ్యయ్యో! ఎంత దిక్కుమాలిపోయేను!

అమ్మా అమ్మా! ఎంత దిక్కుమాలి పోయేనో మాకు!

నొప్పి! నొప్పి! నాకు తల నొప్పిగా ఉంది!

నుదుటిమీద చెయ్యి పెట్టుకొని కళ్ళు మూసుకున్నాడు గవరయ్య.

సాయంకాలం అయింది.
చీకటి మూసుకు వచ్చింది.
రాత్రి మళ్ళీ వచ్చింది.

12

ప్రాణోటు ఇచ్చేసి ఆ వెంటనే వెళిపోయాడు పోతురాజు. ముడతపెట్టిన కాయితాన్ని వణుకుతూన్న చేతుల్తో పుచ్చుకున్న సుబ్బయ్య కంపించే కాళ్ళతో వెళ్ళేడు వంటగదిలోకి.

వంట గదిలో మండుతూన్న పొయ్యిలో ప్రాణోటు భగ్గుమంది.

భగ్గుమని మంటమండి, బూడిదగా మారింది.
అయిదు వందలు వెయ్యిగా మారి
వెయ్యీ పొయ్యిలో పడి
కాలి కాలి
మసిగా మసిగా
మారిపోయేయి!!
నా కష్టాలన్నీ తీరిపోయేయి!!
నా బాధలన్నీ ఎగిరిపోయేయి!!
కమలా కమలా!
క్రిష్టా క్రిష్టా!
సావిత్రీ సావిత్రీ!
అందరికీ అందరికీ
చాటించి చెప్పాలి.
వెంకట్రా వేడీ?
పోతన్న ఇంకా రాలేదే!
అవధాని లేపుకాని కనిపించడు.
మనోరమ ఇంటిదగ్గరే వుంటుంది!!
వెళ్ళాలి! అక్కడికి వెళ్ళాలి!
కాని—
ఇదంతా ఎలా జరిగింది?
ఇంత అద్భుతంగా ఇదంతా ఎలా జరిగింది?
ఈచిక్కంతా ఇంత విచిత్రంగా ఎలా విడిచింది?

ఎలా జరిగిందో ఎలా విడిందో నాకు తెలుసు.
సంక్రాంతి, పోతన్న, అవధాని, మనోరమ
అంతా కలిసి నాకోసం
నాకోసం కష్టపడి
ఈరీతిగ చేసేరు.

ఇదంతా సాధించేరు.

చిలకలా, అడదాన్లా సింగారించుకొని వీధిలోకి వచ్చేడు సుబ్బయ్య.

సాయంకాలం ఆరుగంటలయింది.
సుబ్బయ్య వీధిలోకి వచ్చేడు.
అదేసమయంలో సరిగ్గా ఆదేసమయంలో
ఎదటింటి మాస్టరుగారు వీధిలోకి వచ్చేరు—
అంటే—ఆయన్ని వీధిలోకి తీసుకు వచ్చేరు.

ఆదివం మధ్యాహ్నం టైఫాయిడ్ జ్వరం అతణ్ణి వదిలింది.

జ్వరం వదలగానే 'మరింక నే నెందు'కని ప్రాణంకూడా అతణ్ణి వదిలింది.

డాక్టరు గారు వచ్చివచ్చి
'ప్రిస్క్రైబ్' చేసిన మందులన్నీ మింగి మింగి
బ్రతకాలని తింటాలబడ్డ
ఎదటింటి మాస్టరుగారు
అయిదు ప్రాణాలనీ అకస్మాత్తుగా విడిచేరు.
మాస్టర్ గారి శవాన్ని వీధిలో పడేసేరు.

"శివశివా! మాస్టరుగారి సంగతే మర్చేను" అనుకున్నాడు సుబ్బయ్య.

శవాన్ని తీసుకుపోతున్నారు.

నల్లటికుండలో రాజుకుంటోన్న ఎర్రటినిప్పుని పట్టుకొని
ఏడుపువల్ల ఎర్రగా ఎరుపెక్కిన కళ్ళతో
పదహారేళ్ళ కుర్రవాడు ముందు నడుస్తున్నాడు.
ముందుకి కాళ్ళు పెట్టిన మాస్టరుగారి శవం
పదహారేళ్ళ పిల్లవాడు దారి చూపించగా
అందరూ వెళ్ళవలసినచోటుకి వెళ్తోంది.

శివశివా! హరహరా!
అనుకొంటూన్నా నేను
చకచకా చకచకా
ఎక్కడికి వెళ్తున్నాను? ఎక్కడికి?
భార్యకాని ఆడమనిషిదగ్గరకా?
వస్తే తప్పేముంది?

నాకు సహాయం, ఎవరూ చేయలేని సహాయం, ఎందుకూ పనికిరాని నాకోసం, ఎంతో దయతో చేసిందే!

ఆమెకి ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణిగా ఉండాలే!

భార్యకాని ఆడమనిష నే పాకుతో, సెపంతో, పనక్కి వెళ్ళిపోనా?

ఈశ్వరా! సర్వేశ్వరా! విశ్వేశ్వరా! హరహరా!
ఎంత దయామయుడివయ్యా!
నా బాధలన్నీ హరించేవే!
మాస్టర్ గారి బాధలన్నీ హరించేవే!

మాస్టర్ గారి బాధలన్నీ ఇవాళతో తీరిపోతే ఇంట్లో అంతా ఎందు కేడ్చేరు?

అయిదువందలబాధ తీరిందని నేనే సంతోషిస్తూ ఉండగా

అన్ని బాధలూ తీరిన మాస్టరుగారి ప్రాణం ఎంత సంతోషిస్తోందో!

వీళ్ళందరికీ ఏం తెలుసు?
జల్దీ జల్దీ! జోర్ జోర్! క్విక్ క్విక్!
మనోరమ నాకోసం ఎదురుచూస్తూ వుంటుంది.

మాస్టరుగారికోసం ఎవ రెదురు చూస్తూ ఉంటారు?

ఛఛా! ఏమిటి ఇటువంటి చెడ్డ ఆలోచనలన్నీ నాకు!

మనోరమదగ్గరకి వేగిరం పోతే—

మనోరమకి ఎందుకో ఇంత అభిమానం నామీద!

గవరయ్యదగ్గరకి నాకోసం వెళ్ళిందా?

వెళ్ళేవుంటుంది! లేకపోతే నోటు ఇంటి కెలా వస్తుంది?!

వెళ్ళాలి వెళ్ళాలి వేగిరం వెళ్ళాలి.

"మాస్టరుగారి శవం" డాక్టరుగారు భాషలో చెప్పినట్టు

"......*has turned the Corner!*"

మాస్టరుగారి శవం సందు మళ్ళింది.
ఈశ్వరా! పరమేశ్వరా! రక్షించు రక్షించు!
దేవా! జగన్నాథా! రక్షించు రక్షించు!

అన్నట్టు నాది పూరీ ప్రయాణం ఉంది! వీలు చూసుకొని వేగిరం వెళ్లాలి.

ఎడంవైపుకి తిరిగింది మాస్టరుగారి శవం.

కుడివైపుకి తిరిగిన సుబ్బయ్య కిల్లీ కొట్టుదగ్గర ఆగేడు.

"ఏదయ్యా! కత్తెరమార్కు పెట్టె?"
"అగ్గిపెట్టెకూడా ఇయ్యి!"

పహెల్వాన్ సత్తెయ్య ఫోటోకీ, నేషనల్ లీడర్ నెహ్రూ చిత్రానికీ మధ్య వుండే గడియారంలో

ఆరుంపావయింది.

సిగరెట్టు కాలుస్తూ నడుస్తూన్న సుబ్బయ్య ఆలోచిస్తూ అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాడు.

నాకేమీ అర్థం కావడంలేదు.

మబ్బు వేసింది.

మబ్బు విడింది.

ఎందుకు వేసింది?

ఎందుకు విడింది?

నాకేమీ అర్థం కావటంలేదు.

ఆలోచిస్తూ అన్నివైపులా చూస్తూనే ఆలోచిస్తూ నడుస్తున్నాడు సుబ్బయ్య.

స్టూడెంట్సు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. స్టూడెంట్సు కానివాళ్ళు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. షాపుల్లో దీపాలు వెలుగుతున్నాయి. షాపులబైట దీపాలు వెలుగుతున్నాయి. ఫలానా నంబరు బీడీ సే కాల్చమని కేకలు వేస్తూ పద్దెనిమిదిమంది చిన్నా పెద్దా ప్రొసెషన్‌లో వెళ్తున్నారు. నలుగురు అందమైన ఆడవాళ్ళని ఆరుగురు అందంలేని మొగవాళ్ళు వెంబడిస్తున్నారు. పొట్టిగా ఉండే పంతులుగారికి చెరోపక్కా పొడుగ్గా ఉండే ఇద్దరు బోడి ముండలు నడుస్తున్నారు. మత్తీలో ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టరు షాపులోకి వెళ్ళబోతూ కాలుజారి కాలవలో పడ్డాడు. అది చూసినవాళ్ళు చాలామంది నవ్వేరు. పడ్డవాడు పోలీసువాడని తెలిసిన దుకాణదారుడు నవ్వలేదు. నల్లకోటు వేసుకోని మునిసిప్లీడరు నడవలేక నడుస్తున్నాడు. నల్లకోటు వేసుకున్న నడుచు ప్లీడరు నడవగలిగి రిక్షాలో వెళ్తున్నాడు. నిక్కర్లో బనియన్ టక్ చేసుకొని—ఇంటిదగ్గర నడుచు పెళ్లాం గల నడుచు డాక్టరు—టెన్నిస్ బేటు చంకని పెట్టుకొని ఎవ్వరివైపూ చూడకుండా ఛాతి బిగించి నడుస్తున్నాడు. ఆ డాక్టర్ని తను బాగా ఎరుగుదునని ఆవీధిలో ఎవడో ఒకడు అనేవుంటాడు. కళ్ళల్లో కామం పెట్టుకున్నవాడు సానివీధి ఎక్కడుందో ఎరక్క ఎవర్నీ అడగలేక బాధ పడుతున్నాడు. "ధర్మాసుపత్రికి దారేదయ్యా" అని ఒకనాటు రకం ఒరియావాణ్ణి ఒకనాటు రకం తెలుగువాడు అడిగేడు. రోడ్డుమీద న్యూస్ పేపరు చదివేవాణ్ణి నూనె డబ్బా నెత్తిని పెట్టుకువస్తూన్న వయసు మళ్ళిన ఆడమనిషి గుద్దేసి పడిపోయింది. సారా తాగిన ఇద్దరు పెద్ద మనుష్యులు సారా తాగని అనేకమంది పెద్దమనుష్యుల్ని పచ్చిబూతులు తిడుతున్నారు. కొత్తగా రెండో పెళ్ళి చేసుకున్న ఆడమనిషిని ఆమె మొట్టమొదటి ప్రియుడు పలకరించేడు, పక్కనే రెండవ పెనిమిటి ఉన్నాడని ఎరక్క. కాబూలీవాణ్ణి తప్పించుకుందికి జేబులో సరిగ్గా రెండణాలతో కాఫీహోటల్లోకి దూరేడు లినెన్ షర్టు వేసుకున్న రెయిల్వే అంప్లాయీ. "సింగ్నేరీ గాణ్ణిచూస్తే నా కసహ్యం" అని చెముడులేని స్నేహితుడితో ఒకడు గట్టిగా చెప్పేడు. చెప్పినా అతని వైపు ఎవరూ చూడలేదు. మహాత్మా గాంధిగారి గురించి ఒకడు ఆలోచించుకొంటూ వెళ్తున్నాడు. మహిళా మందిరానికి వెళ్తూ ఒకావిడ "ఆడముండకి దాని కెందుకో అంత గర్వం, దాని మొగుడుకే లేనప్పుడు" అని తనతో వస్తూన్న మహిళతో ఇంకొక మహిళాభ్యురాలి గురించి చెప్పింది. బట్టలు వేసుకోని పిచ్చివాడివైపు బనారసు చీర కట్టుకున్న తన భార్య చూసినందుకు ఒకడు ఎంతో బాధపడ్డాడు. ఆ సాయంకాలం ఎర్రచీర మనిషి ఎర్రచీరే కట్టుకొని సైకిల్ రిక్షాలో వెళ్తోంది.

నాకేమీ అర్థం కావటం లేదు.

ఏదైనా బోధపడ్డకోవాలంటే దాని కారణం తెలుసుకో అన్నాడు చిన్నప్పటి సైన్సు మాష్టరు.

ఈ జరిగిన దానికి కారణం ఏముంది?

నేను గవరయ్యని అయిదురూపాయలడిగేను.

ఎందు కడిగేను?

వెంకట్రావు అడగమన్నాడు. సావిత్రి అడగమనకుండా అడగమంది. అడక్కపోతే బావుండదేమో అని నాకనిపించింది. అడగను అనడానికి మొహమాట పడ్డాను. అడిగితే ఏం పోయిందనుకున్నాను, ఇంకా చాలా చాలా కారణాలబట్టి అడిగేను.

వెంకట్రావు ఎందు కడగమన్నాడు? సావిత్రి అడగమనకుండా ఎందు కడగమంది? అడక్కపోతే బావుండదేమో నని నా కెందుకనిపించింది? మొహమాటం ఎందుకు పడ్డాను? అడిగితే ఏంపోయిందని ఎందు కనుకున్నాను?

వీటి కారణాలు! వాటి కారణాలు!

ఒక్కొక్కదానికీ కారణం చెప్పేసరికి ఎంత కాలం పడుతుంది?

జీవితం చాలదే!

నే నిప్పుడు మనోరమ ఇంటికి ఎందుకు వెళ్తున్నాను?

కారణం చెప్పేసరికి తాతలు దిగివస్తారు.

మనోరమ ఇంటికి ఎలా వెళ్తున్నాను?

నడిచి వెళ్తున్నాను?

నేను నడవడానికి నడవగలగడానికి కారణాలేమిటి?

నా పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పుకురావాలి!
నా పుట్టుపూర్వోత్తర మంతా నాకే తెలియదే!
తెలిసినా చెప్పేదానికి బ్రతుకే చాలదే!
నేను ఇప్పుడు ఎలా నడవగలుగుతున్నాను అనే చిన్న ప్రశ్నకి కారణం నేను చెప్పలేనన్న మాటే!
నాకు పిచ్చి ఎత్తేటట్లుంది!
అలా ఉండడానికి కారణం?
కారణం ఏమిటి అని నే నడగడానికి కారణం?
నిజంగా నాకు పిచ్చెక్కుతుంది.
అంతా భగవంతుడి విలాసం.
అనేస్తే అతి సులభంగా అంతా తేలిపోయే దానికి
పిచ్చి తెచ్చిపెట్టుకోవ డెందుకు?
దేనికైనా కారణం చెప్పడం నీ తరమా నా తరమా?
ఎదటింటి మాస్టరు నడివయసులో ఎందుకు చావాలి?
వాడెవడో ఇందాట్లా కాలవలో ఎందుకు పడాలి?
వాళ్ళెవరో సారా ఎందుకు తాగాలి? తాగి ఎందు కంపెనీ లిట్టాలి?
వాడు రోడ్డుమీద న్యూస్ పేపరెందుకు చదవాలి?
వాళ్ళిద్దరూ బోడిముండ లెందుకవాలి?
కారణం చెప్పడం నీతరమా నాతరమా!
"...తరంతం! ఇంటా బయటా జంట కవుల వలె..."
వెళ్ళాలి! వేగిరం వెళ్ళాలి! నేనూ మనోరమా జంటగా బీచికి వెళ్ళాలి.
మనోరమ ఇంటిదగ్గరే ఉంటుందా?
ఉంటే ఉండడాని క్కారణమేమిటి? లేక పోతే లేకుండా ఉండడాని క్కారణ మేమిటి?
అనుకొంటూ అతను వెళ్ళేసరికి మనోరమ ఇంటిదగ్గర లేదు.
గది తాళం వేసివుంది.
"ఎవరో మాస్టర్ గారు చచ్చిపోయారటండీ. భోగట్టా ఇప్పుడే తెలిసి బయల్దేరి వెళ్ళింది. మీరు వస్తే గదిలో కూర్చోమంది. తాళం నా చేతికి ఇచ్చింది. ఇప్పుడే వచ్చేస్తుందట"
అన్నాది నోట్లో నలకైపళ్ళుగల ఇరవయ్యేళ్ళ మనిషి.
ఈవిడే కాబోలు కల్యాణి!

ఈమెకి ఎదురుగా ఒంటరిగా ఈ గదిలో కూర్చోగలనా?
చచ్చే నన్నమాటే! కూర్చోలేను!
అయితే ఏంచేసేది?
"బీచ్ని లైట్ హౌస్ దగ్గర కూర్చుంటాను. మనోరమని అక్కడికి రమ్మని చెప్పండీ దయచేసి"
"ఓ అలాగే చెప్తా!......అయితే గదిలో కూర్చోరా మీరు?"
"ఊహూఁ?"
"సరే అయితే చెప్తాలెండి మనోరమతో...... కాని...గదిలో కూర్చోబెట్టమని మరీ మరీ చెప్పిందండీ మనోరమ"
"ఫరవాలేదు లెండి. బీచికి రమ్మనండి"
"సరే అయితే మీ ఇష్టం"
బీచికి మెల్లిగా వెళ్ళేసరికి ఏడుగంటలు దాటింది.
వెన్నెల్లో సముద్రం మెరుస్తోంది.
వెన్నెల్లో సముద్రపు ఇసిక మెరుస్తోంది.
దీపస్తంభంమీద దీపం మెరుస్తూ తిరుగుతోంది.
సుబ్బయ్య తెల్లగా, శుభ్రంగా పొడిగా, మెత్తగా ఉన్న ఇసకలో కూర్చున్నాడు.
సముద్రతీరాన్న చాలా చల్లగా ఉంది.
సముద్రతీరాన్న ఎంతో హాయిగా ఉంది.
దూరదూరంగా అనేకులు కూర్చున్నారు. మసక మసగ్గా, తెలతెల్లగా అనుపిస్తున్నారు!
మనోరమ వస్తుందా, రాదా?
ఎక్కడికి చెప్తా వెళ్ళిందని చెప్పిందీ, కల్యాణి?
ఎక్కడికి?
ఆ! ఆ! మాస్టరు చచ్చిపోయేరు కదూ. వాళ్ళ వాళ్ళని కాబోలు చూడ్డానికి వెళ్ళింది.
ఇంతే ఈ మనోరమ! ఛీ!
మేష్టరింట్లో అంతా ఏడుస్తూ కూర్చుంటే వాళ్ళని ఇప్పుడు చూడ్డం అంత ముఖ్యమా?
రేపు వెళ్ళకూడదా, మర్నాడు కూడదా!
పొద్దున్న ఏం జరిగిందో యేమిటో?
గవరయ్య ఏమన్నాడో ఏమిటో?
ఇటువంటి అతి ముఖ్యవిషయాల గురించి మాట్లాడుదామని నే వస్తే ఇంటిదగ్గర ఉండకుండా...
ఎన్ని ముఖ్య విషయాలున్నాయి! ఎన్నెన్ని ముఖ్యవిషయా లున్నాయి!!
ముఖ్యం ముఖ్యం విషయం విషయం.
అన్నట్టు, హన్నట్టు మర్చిపోయేను.

మొన్న నేకదూ మనోరమ అన్నాది?!

"మీతో ఓ ముఖ్యవిషయం మాట్లాడాలి?" అన్నాది మొన్న.

ఏమిటో ఆ ముఖ్య విషయం?

నిన్న నాతో అదేమిటో ఎందుకు చెప్పలేదు?

నిన్న నే "చెప్తాను. మాట్లాడాలి" రమ్మంది.

నిన్నటి గొడవలో నేనా విషయం మర్చేను.

ఆమెకూడా ఆ గొడవలో నాలాగే మర్చిందా?

మర్చిపోయి వుండదు.

నిన్న గొడవలో చెప్పడం మంచిది కాదను కొని వుంటుంది.

ఇవాళ చెప్దాం అనుకొని వుంటుంది.

ఇవాళ ఆ మేష్టరు చచ్చిపోవడం బట్టి

ఇంతవరకూ కలుసుకోడం తప్పింది ఇద్దరం.

ఏమిటో కాని నాకు భయంగా వుంది.

ఎన్నడూ ఎరగని నాలాటి వెధవకి ఒక్క రోజులో లొంగిపోయింది!!!

ఇలాగ ఎంతమందికో??

అయినా పాపం ఇవాళ గవరయ్య దగ్గరకి వెళ్ళి......

నాకోసం అలా తంటాలు పడుతుందా నామీద నిజమైన అభిమానం లేకపోతే?

నన్నింకా గట్టిగా బంధించడానికి ఇదీ ఒహ ఎత్తేమో......

నీ కింత ఉపకారం చేసేను.

నీకే అప్పగించేను నా వళ్ళంతా

ఇహ నామాట ఏం చెపావ్

అంటుందో యేమిటో!

ఇవాళ వచ్చి ఏమడుగుతుందో ఏమో?????

పెళ్ళి పెళ్ళాం కన్న పిల్లలూ ఉన్న వాణ్ణి!!!

పెళ్ళాం పిల్లలూ ఉండగా వచ్చి పీకలమీద కూర్చుందంటే చస్తాను. అమాంతంగా చస్తాను.

పెళ్ళి చేసుకోమంటుందో?! ధరణమే ఇమ్మంటుందో?!

మొన్న నేరకపోయి గదిలోకి వెళ్ళేను.

కల్యాణి చూసింది కూడా!

వెధ వొళ్ళు కట్టుకోలేక పోయేను!!!

ఇప్పు డిప్పుడు గుర్తుకి వస్తోంది.

వెల తప్పిన మనిషిలా అవుపించిందా?

లేదు లేదు. ఆమాట సర్వాబద్ధం. కాని—

కీడెంచి మేలెంచ మన్నాడు.

ఎక్కడ లోసుగున్నా నామీద సులభంగా తోసెయ్ వచ్చు!

నేరకపోయి ఇరుక్కున్నాను ఈ లంపటంలో.

ఇహ వస్తుం దనుకుంటాను—!!

కల్యాణి చెప్తుంది. కల్యాణి తప్పకుండా చెప్తుంది.

"మీ వారు లైట్ హౌస్ దగ్గర తీరిగా కూర్చొన్నారమ్మా! వెళ్ళు వెళ్ళు! వేగిరం వెళ్ళు!" మొహం తిప్పకుంటూ చెప్తుంది.

ఇక్కడ కూర్చుంటానని దాన్తో నేరక చెప్పేను—!!

మనోరమ తొందరగా వచ్చేస్తుంది—!

ఏముంది? ఇట్టె వచ్చేస్తుంది!

వచ్చి బాధిస్తుంది. నా గొంతుకమీద కూర్చుంటుంది. నన్ను సతాయిస్తుంది. నన్ను చంపుతుంది. చంపుకుతింటుంది.

నాకు భయంగా ఉంది.

ఛీఛీ! పాడు బ్రతుకునాది!!

ఏదో బాధతో ఎప్పుడూ భయపడుతూనే ఉంటాను.

ఇంటికి పోదునా? ఇక్కడే ఉందునా?

మేష్టరు చావకపోతే ఈపాటికి నా పీకలమీద వచ్చి కూర్చొనే ఉండేది. బతికిపోయేను. మరింక ఇంకా ఇలా కూర్చోవడమెందుకు? అది రాకుండా ఇంటికిపోతే నయం! ఏమో?

సముద్రపు కెరటాలు తెల్లగా విరుగుతున్నాయి.

తెల్లటి పొడి ఇసుక వరకూ రాబోయి రాలేక పోతున్నాయి. పిలక పట్టుకొని లాగినట్టు వాటి వెనకో వెనక్కి లాగుతున్నారు.

ఇంటికి వెళ్ళనా? ఇక్కడే ఉండనా?

నాకు ఈ భయాలూ, సందేహాలూ ఎందువల్ల కలుగుతాయి? ఏమో!!

సముద్రంలో అలలెందుకు పుడుతున్నాయి? ఏమో!!

సముద్రంలో కెరటాలు పుట్టినట్లు

నాకు బాధలే ఎందుక్కలగాలి?

ఆనందోత్సాహాలు సముద్రపు తరంగాల్లాగ నాలో ఎందుకు కలుగకూడదు?

నాలాగే అందరూ బాధపడతారా?

ఇంటికి వెళ్ళేదా? ఇక్కడే ఉండేదా?

ఉంటే ఒకబాధ. ఉండకపోతే ఇంకొకబాధ.

బాధలు వస్తాయేమోనని నేబాధ.

హాబ్బబ్బ! ఈ ఆలోచనల్తో నాతల పాడవుతోంది.

పాడు సందేహాలు, పాడు బాధలు, పాడు ఆలోచనలు,

పాడు భయాలు,
అన్నింటితో నా మనసు పాడవుతోంది.
నా మనసుకి విశ్రాంతి లేకుండా పోతోంది.

చల్లగా హాయిగా గాలివీస్తోంటే మెత్తటి ఇసికలో కూర్చొని వెచ్చగా మనోరమ పక్కనకూర్చొగా హాయిగా హాయ్ హాయ్‌గా ఉండక

నా మనసంతా భయాల్తో బాధ పెట్టుకుంటున్నాను.

నాకు శాంతిలేకుండా చేసుకుంటున్నాను.
నాకు శాంతి లేదు.
నాకు విశ్రాంతి లేదు.
విశ్రాంతి తీసుకోండికి ఎక్కడికి పోయేది?
ఎక్కడికి పోగలను?
భయం దుఃఖం, విచారం, సంతోషం.
మనసుకి ఇవేవీ లేకుండా ఎలా ఉండడం?
ఎక్కడికి పోతే అలా ఉంటుంది?

ఎక్కడికి పోయినా సరే నీ మనసుకి నామనసుకి ఎవడిమనసుకైనా సరే శాంతి వుండాలి! శాంతి!

శాంతిలేన్డి మనసుకి విశ్రాన్తి ఎక్కడిది?
లేదే! ఉండదే!
నా కిప్పుడు శాంతి లేదు. విశ్రాంతిలేదు.
ఇంకెవరికైనా ఉన్నాయ్యా అవి.

ఈ చుట్టుపక్కల ఎవరైనా వచ్చి ధైర్యంగా వచ్చి "నేను శాంతి సంపాదించేను" అని చెప్ప గలడా?

ఎవడు చెప్పగలడు?
ఏంచేస్తే శాంతి వస్తుంది?
ఏం చెయ్యకపోతే శాంతి కలుగుతుంది?
మనిషికి శాంతిలేదు. మనిషికి విశ్రాంతి లేదు.
పుట్టింది లగాయితు చచ్చేవరకూ
క్షణక్షణం క్షణక్షణం ప్రతిక్షణం
అలా కదుల్తూ కదుల్తూ తిరుగుతూ తిరుగుతూ కొట్టుకొంటూ కొట్టుకొంటూ బాధపడుతూ బాధపడుతూ
ఉంటూ ఉంటూ ఉండవలసిందే!
చచ్చేక అప్పుడేమైనా ఉండాలి శాంతి!
అంతవరకూ ఉండదు మరి.
అయితే చావడమే మంచిదా?

చావే మంచిదయినప్పుడు పుట్టుక ఎందుకు పుట్టించేడు భగవంతుడు?

అందర్నీ చావమని!!
చస్తే శాంతి వస్తుంది!...వస్తుందా?
ఏమో ఎవడెరుగును?
చచ్చేక శాంతి లభ్యమవడానికి ఎవరికవుతుంది?
బతికివుండగా ఎవరికీ శాంతి లేదా??
శాంతి! శాంతి!
అయితే శాంతి అంటే ఏమిటి?
బాగుంది. ఈ ప్రశ్న బాగుంది.
శాంతి అంటే ఏమిటి?
నాకు తెలియదే!!!!

శాంతి అంటే ఏమిటో తెలియకుండా అది లేదని బాధ పడుతున్నానే!!

సుబ్బయ్యకి 'శాంతి' అంటే ఏమిటో తెలియ లేదు.

వెన్నెల రాత్రిలో సముద్రతీరాన్న తెల్లటి మెత్తటి ఇసుకలో కళ్ళు మూసుకొని పడుకొన్న సుబ్బయ్య "శాంతి" అనే పదానికి అర్థం తెలియని సుబ్బయ్య "ఇక్కడ ఉండేదా లేక మనోరమ రాకుండా ఇంటికి పోయేదా" అని తర్కిస్తూ తర్కిస్తూ, ఏదేదో తలపోస్తూ తలపోస్తూ ఏమేమో ఊహిస్తూ ఊహిస్తూ తెల్లటి ఇసికలో, సముద్రపు తీరాన్న, వెన్నెల రాత్రిలో కళ్ళు మూసుకొని పడు కున్నానే వున్నాడు.

సముద్రంలో కెరటాలు లేస్తూ లేస్తూనే ఉన్నాయి.

సముద్రం కదుల్తూ కదుల్తూనేవుంది.
ఈ సముద్రం కదలకుండా ఎప్పుడుంది??!!

[సంపూర్ణం]



ఇమ్మడి కులోత్తుంగ చోళుడు

[క్రీ. శ. ౧౧౩౭-౧౧౪౭]

★

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావు

భూలోకమల్లుడు వేంగీ రాజ్యమును సంరక్షింపను అనంతపాల దండనాయకుని తరువాత, దండనాయక గోవిందరాజును నియమించెను. గొంకరాజుకు గోవిందరాజుతోడ మహాసంగ్రామ మొకటి గోదావరి యొడ్డున ప్రాయశః దాక్షారామమున కనతిదూరమున నున్న గోదావరియొడ్డున నిర్ణయింప వీలులేనిస్థలమున జరిగెను. అందు సంపూర్ణముగ విజయము గొంకరాజుకు సమకూరెను. ఆ యుద్ధము క్రీ. శ. ౧౧౩౩ సంవత్సరాంతమునందు, అక్టోబరు (ఆశ్వయుజము) నందు జరిగియుండును. గొంకభూపతి అ, ఆనాటి కింకను త్రిశతోత్తర షట్సహస్రావనీ విషయాధిపతిగా నున్నాడు. గోదావరియుద్ధమునందు గోవిందరాజ లక్ష్మణదండాధిపుల నిరువుర నోడించి వెన్నిచ్చి పారునట్టి కుంతలవల్లభుని సేనలను చీకాకుపరిచి దారివారిహాటక, ఖోటక, ఉష్ట్రనివహములను బలిమి వాటించి బట్టుకొని, గొంకరాజు సంగరమందు వీర లక్ష్మిని చేబట్టెనట.1 ఏదిద్విజయసూచకముగ కొలోలు గొంకరాజు భీమయమహాదేవునకు అఖండ దీపములు నిత్యము వెలిగించుటకు ౫౦౦ గేదెలను (ఇనపరొక్లు) దానము చేసెను. తమ్ముని పేరట వీరపండరాజు పేరట ఒక కనకవలయమును, తన పేరట నింకొక కనకవలయమును, పహిణ్డపల్లెమును, కొలగమును సమర్పించెను. గారాగేరాయమంటపమని తన పేరట మంటపము గట్టించెను. మరియు కొట్టారమండపమును గట్టించి, దవనమును పాతించి తటాకము త్రవ్వించెను.

ఆ గోదావరి యుద్ధానంతరము దండనాయక గోవిందరాజు కుంతల దేశమునకు చక్రవర్తి పిలుపున మరలిపోయినట్లు తోచును. వేంగీమండలమునందు యుద్ధము చివరవఱకు సాగించి, కుంతలవల్లభునికి జయముగూర్పను భూలోకమల్లుడు, దండనాయక లక్ష్మణరసును నియోగించి, యాతని మహాప్రధానుని జేసినట్లగపడును.2 కుంతలవల్లభుని మహాప్రధానితోడి కడపటియుద్ధము క్రీ. శ. ౧౧౩౬వ సంవత్సరారంభమున జరిగియుండినట్లు మండనారాయణగుడి శాసనమునుబట్టి నిర్ణయింపవచ్చును. మహాప్రధానం లక్ష్మణరసు నాటి కడపటియుద్ధమున మృతిచెందిన ట్లూహింపవచ్చును. ఆ యుద్ధము జరుగుటకు ఇంచుకపూర్వమే భూలోకమల్లుడుగూడ మరణించెను. అది రాక్షస సంవత్సరము. ఆ రాక్షస సంవత్సరాంతములో కుంతల వల్లభుని వేంగీయాక్రమణము సమాప్తి నొందెను.

క్రీ. శ. ౧౧౩౬ మొదలుకొని (శ. ౧౦౫౮) యైదారేండ్లు గొంకరాజు అంధ్రభూమిని సంపూర్ణముగ జయించి తన యేకచ్ఛత్రాధిపత్యము క్రిందికి దీసికొని వచ్చెను. కళింగమందు అనంతవర్మయైన చోడగంగ దేవుడు క్రీ. శ. ౧౧౪౭వ సంవత్సరమున మరణించెను. అతని మరణమునకు బూర్వము కొంతకాలమునుండి కళింగదేశవ్యవహారములు విపరీతములుగా పరిణమింప సాగెను. అందువలన వెలనాంటి గొంకరాజు కళింగమునందు విద్రోహులను బలిమివాటించి అదుమవలసి

---

1. S. I. I. Vol. IV. No. 1141.

"వీరశ్రీ లలనాకటాక్షరుచిరా
    విద్రావ్య బాహాసినా
సేనాం కుంతలవల్లభస్య నికటే
    గోదావరీ సంగరే
ప్రాపల్లక్ష్మణ దండనాథ సహితం
    గోవింద దండాధిపం
జిత్వాహాటక ఖోటకోష్ట్రనివహై
    ర్వీరశ్రియం యః పరమ్"

2. S. I. I. Vol. V. No. 68, ఈ శాసనమందు దండనాయక లక్ష్మణరసరు మహాప్రధానం అను పదవిని దెలుపు బిరుదముతో పేర్కొనబడినాడు.

వచ్చెను. అటుతరువాత మహేంద్రగిరిపర్యంతము గల కళింగదేశము అనంతవర్మ చోడగంగదేవుని మరణానంతరము వేంగీ సామ్రాజ్యమునందు కలిసి పోయెను. ఆరీతిగా క్రీ. శ. ౧౧౪౦ నాటికి గొంకరాజు కర్ణాటాంధ్ర త్రికళింగ, కుంతలవల్లభులను సంగ్రామ రంగములందు జయించి మహామహీరాజ్యమును సామ్రాజ్యచిహ్నములతో స్వాధీన పఱచుకొనెను1 ఆపని క్రీ. శ. ౧౧౩౬ ప్రారంభమునాటికి పూర్తి యయ్యెను. పిమ్మట తాను విక్రమైక సహాయుడై కర్ణాటాంధ్ర కళింగ కుంతల లాట మరాటపతులను జయించి, బాహాదర్పమున జయించిన మహాసామ్రాజ్యమును పాంచజన్యరత్నాకరుడై జగన్నుతయశఃకాముడై రెండవ కులోత్తుంగ చోడదేవునికి భక్తితత్పరుడై సమర్పించెను.2 పిమ్మట చక్రవర్తి పరితుష్టుడై, మహేంద్ర శిఖరి శ్రీశైలముల నడుమ గల యాంధ్ర భూభాగమును పరిపాలింపను వేంగీశ్వరునిగా సామంతరాజ లక్షణములను మేఘాడంబర చామర వియచ్చంద్రోదయాది చిహ్నములనిచ్చి యభిషేకించెను.3 ఆ వృత్తాంతము క్రీ. శ. ౧౧౩౬-౧౧౪౪ సంవత్సరములమధ్య నెప్పుడో జరిగెను. దానిని ఇంతకంటె సూక్ష్మముగా నిర్ణయించుటకు ప్రస్తుతము సాధనసంపత్తి చాలదు.

మహామండలేశ్వర వెలనాంటి గాంగేయ గొంకరాజు ఆంధ్రేశ్వరుడై ఇరువది సంవత్సరములు యశస్స్వామియై (క్రీ. శ. ౧౧౪౨-౧౧౬౧) పరిపాలించెను. కేయూర బాహు చరిత్ర రచించిన మంచెన కవి గొంకరాజును

శా॥ "ప్రాగ్దిక్పశ్చిమ దక్షిణోత్తర
    దిశాభాగ ప్రసిద్ధక్షమా
భృగ్గర్వాంతకు డైన
    గొంక విభుడీ భూచక్ర మక్రూరతన్
వార్ధి ద్వీ స్తనహార నిర్మల
    యశోవా ల్లభ్యసంసిద్ధితో
దిగ్దంతి శ్రవణానిల జ్వలదిట
    తీవ్ర ప్రతాపాఢ్యుడై॥

మంటికడవ నులకమంచంబు పూరిల్లు
నూలిచీర రత్నకీలితంబు
గాని పైడిలోవు గలుగు వెలుంగరు
గవదుపురములోని జనములెల్ల॥

అని ప్రస్తుతించినాడు.

ఈ రెండువెలనాటి గొంకరాజుకు, కుంతలవల్లభుని సేనానులను జయించిన తరువాత, రత్నపురాధీశుడైన కలచురి రెండవ రత్నదేవునితో వైరము సంభవించి నట్లు అగపడుచున్నది. రెండవ రత్నదేవుడు ఇంచుమించుగా కళింగ భూధవుడైన అనంత వర్మచోడ గంగాదేవునికి కడపటి నుప్పది రాజ్యవర్షములందు సమకాలికుడు. అతడు క్రీ. శ. ౧౧౧౪—౧౧౪౧ సంవత్సరముల నడుమ రాజ్యముచేసెను. ఈ రత్నదేవుని శాసనములు గావరావు; అతని కాలమంతయు నిరంతరము సంగరములతో గడచిపోయినట్లు గాన్పించును. రత్నదేవుడు కళింగ నృపతి నోడించి యొకసారి త్రికళింగాధిపతి యయ్యెను. గొంకరాజు అనంత

---

1. *S. I. I. Vol. IV, No. 1113.* దాక్షారామ.

అస్తి శ్రీ వెలనాంటి గొంకనృపతి
    స్త్రైలోక్య దర్పాంకురో।
[బాహాసి ప్రవిదారితారి నికర
    స్పాంచజన్య రత్నాకరః।]
కర్ణాటాంధ్ర కలింగ కుంతలపతీ
    న్నిర్జిత్య యస్సం యుగే।
స్వాధీనా మ్మహతీమ్మహీమనుభవ
    త్సామ్రాజ్య చిహ్నైస్థితిం॥

2. *S. I. I. Vol. IV. No. 1041.* (ద్రాక్షారామ)

సోయం శ్రీ వెలనాంటి గొంకనృపతి
    స్త్రైలోక్య దర్పాంకురో।
బాహాసి ప్రవిదారితారి నికర
    స్పాంచజన్య రత్నాకరః।
ప్రోద్యల్లాట మరాటకుంతలపతీ
    న్నిర్జిత్య బాహాసినా।
తత్సర్వస్వ మదాజ్జగన్నుతయశః
    కామీ నిజస్వామినే॥

3. *S. I. I. Vol. IV. No. 1182.* (ద్రాక్షారామ)

శ్రీమాన్విక్రమ చోడదేవతనయో
    యస్మై ప్రభుర్విశ్రుతః।
ప్రాదా—UU—మనా
    మహేంద్రశిఖరి శ్రీశైలయో।
మధ్య—UU—U—U:UUU
    సామంత సల్లక్షణై
ర్మేఘాడంబరయుగ్మచామర
    వియచ్చంద్రోదయా ద్యైస్సహ॥

వర్మచోడ గంగదేవుని పక్షముబూని ఇమ్మడి రత్నదేవునిమీదికిబోయి, అతని బరిమార్చి యాతని త్రికళింగాధిపత్యము నూపజెటికి యుండెను. గొంకరాజు కోసలను వీరాటికి పిండెత్తి పోయినట్లు, అనంతవర్మ చోడగంగదేవుని శ్రీకూర్మములోని శాసన మొకటి సూచించుచున్నది.1 "చోడగంగదేవ చక్రవర్తి శ. ౧౦౫౮ నాటికి (క్రీ. శ. ౧౧౩౬) పశ్చిమోత్తర ప్రాచ్య దేశముల జెల్ల సనిమీనసాధించి గౌతమీ భాగీరథ్ గంగలూ మంసుల......" అని యేమో నుడువుచున్నది. శకలమైన ఆ శాసనమునుబట్టి వివరములు తెలియరావు.

గొంకరాజు వీరకృత్యములో, సిద్ధిచేత రాజును జయించిన దొకటి. అందుకలన నాతనికి సిద్ధిచేత చీఱ్ఱువలి హరిణమృగేంద్రుండు" అని బిరుదము కలెగెను. సిద్ధిచేత రాజు పొత్తపి నాడేలిన తెనుగు చోడుడు. చీఱువలి అతని రాజధాని. అది రేనాటి సీమయందున్నది. నేడిది కుగ్రామముగా, చిత్తూరు మండలములోని మదనపల్లికి రెండుమైళ్ళ దూరముననున్నది. ఆదియందు చీఱువలి వైదుంబుల రాజధాని. సిద్ధి చేతరాజు, విక్రమ చోడచక్రవర్తికి, మొదట సామంతుడై యుండి, ద్రోహియై, త్రిభువనమల్లునికి, చోళదేశ దండయాత్రయందు సాహాయ్యము చేసి యుండె నేమొ. రాజద్రోహి యైన సిద్ధిచేతరాజును జంపి రెండవ గొంకరాజు తెలుగు చోడరాజవంశము నందు స్వామి ద్రోహులు లేకుండ జేసెను.

కులోత్తుంగ చోడ గొంకరాజు మహావీరుడు, మహాపురుషుడు, అతి ఈశ్వరాంశమని యానాటి ప్రజల విశ్వాసము అతడు సమధిగత పంచమహాశబ్ద మహామండలేశ్వరుడు. చాళుక్య రాజ్యభవన మూలస్తంభుడు, ధరణీధర దుర్లభుడు, రణరంగ రాక్షసుడు, భీమసేన భీముడు, బసిగోలా జగ్గనుడు, రాయగజ సింహుడు, పరనృప జీవాపహరణ కరయమదండుడు, శివపాద శేఖరుడు. వీరమాహేశ్వరుడు. అతడనేక శివాలయములను ప్రతిష్ఠించెను. శివకేశవ దేవర సుశ్రూకు, సముదుగా దేవభోగములకై దానధర్మములు ధారవోసెను. దక్షవాటి భీమేశ్వర మహాదేవుడు గొంక నృపతికి ఇష్టదైవము. ఆ భీమయ దేవునికి అతడు సమర్పించిన ధర్మవృత్తులకు మేరలేదు. భీమనాథుని గుడికి అతడు గోపురముల నెత్తించి వాటి శిఖరములపై దివాకర బింబములను పయితము అపహసించు సువర్ణ కుంభకలశముల నెత్తించెను.2 దేవాలయ ప్రాకారాదులను నిర్మించెను. భీమేశ్వర మహాదేవునికి నిత్యము క్షీరాభిషేకము నిమిత్తము ఏబదియావులను దేవర కీలారమున కిచ్చెను. ఆ ధర్మమును వారిసు కుంతల సేనాధిపతులు గోవిందరాజు లక్ష్మణమారులతోడి కసపటి యుద్ధమునకు పూర్వము శ. ౧౦౫౫ కు సరియైన క్రీ. శ. ౧౧౩౩ సంవత్సరమున చేసెను. ఆ తిరుణమండే నిత్యము నేతితో అఖండవర్తి దీపములు అయిదింటిని స్వామి సన్నిధిని బెట్టుటకు ౫౦౦ గెదెలను సమర్పించెను. ఇది రెండవసారి చేసిన ధర్మముగా కనిపించుచున్నది. గొంకరాజును, అతని తనయుడు, తల్లి సుందాంబిక, తమ్ముడు పండరాజు, రాజకుటుంబము వారందరు, ఎప్పుడెప్పుడు పెట్టిన నేమి, మొత్తము నూరు అఖండదీపములను భీమనాథేశ్వరునివగరునందు, దివ్యసన్నిధిని, పెట్టించిరి. దివియొక్కంటికి ఏబది గెదెలు చొప్పున కావలయును. ఆనాడు ఒక్క గొంకరాజును అతని రాజకుటుంబము వారే ౧౫౦౦ యిన్ని యెన్లను దేవరకిలరమునకు సమర్పించిరన్న ఆనాడు దాక్షారామ—జననాథపురములందు పసిసంపద ఎంత యుండెనో సులభముగ నూహించుకొనవచ్చును. మరియు గొంక భూపతి శ్రీమన్మహాదేవుని సన్నిధిని నిత్యము అచ్చముగ కర్పూరముతో వెలుగుట అఖండదీపములను గొన్నింటిని దానము చేసెను. ఇంక ఆనాటి భీమయదేవుని భాగ్యమేమని వర్ణింపవలయును! క్రీ. శ. ౧౧౪౧ వ సంవత్సరమున గొంకరాజు ఆంధ్ర దేశాధీశ్వరుడైననాడు దాక్షారామమునకు తన రాణులనూ సకల బంధుకోటిని వెంట నిడుకొని తీర్థయాత్ర వచ్చెను.3 ఆనాడు రాజకుటుంబములో నివారందరు తలయొకంటికి నాలుగేసి అఖండ నేయిదీపములను తమ పేరట బెట్టించిరి.4 తరువాత మరియొకసారి ఆరేండ్ల తరువాత, క్రీ. శ. ౧౧౪౭ సంవత్సరమునందు 5 గొంకరాజు ద్రాక్షారమునకు తీర్థయాత్రకువచ్చి, భీమేశ్వరుని గుడియందు విశాలమును రమ్యమును అగు మండపమును గట్టించెను. మరియు నానా రత్నాలంకార శోభితమైన కనకరించితో దేదీప్యమానముగ ప్రకాశించు

1. *S. I. I. Vol. IV. No. 675*; సిద్ధి చేత రాజు—పొత్తపినాటి తెలుగు చోడులలో విక్రమసింహపుర తెనుగు చోడులకు మూలపురుషుడుగా వచ్చును.

A. R. S. I. Episraply, 1900, పుట 16. ఈ విషయ మింకను నిష్పంశయముగాదు.

2. *S. I. Vol. IV. No. 1182.*

3. *S. I. I. Vol. IV. No. 1137.*

4. *S. I. I. Vol. IV. No. 1138.*

5. *S. I. I. Vol. IV. No. 1140.*

గోళకమును భీమయలింగముపై పెట్టించెను. ఆస్వామికి యేటేట చైత్రమాసమందు పూర్ణిమకు ముందు మూడు దినములు దమనోత్సవము జరుపుటకు శ్రీ భండారము నుండి ౫౫ బంగారు నిష్కములను (గద్యలు లేక వరాహ ముద్రికల నాణెములు) ఒసగుచుండునట్లు కట్టడిచేసెను. మరియు దేవరగుడియందు కోష్ఠాగారమును, మరియొక మంటపమును నిర్మించెను. గొంకరాజు మరియొకప్పుడు, భీమేశ్వరమహాదేవుని గుడికిని, శ్రీ పర్వతమందున్న మల్లికార్జున దేవుని ప్రాసాదమునకును, పురీక్షేత్రమున పురుషోత్తముడను శ్రీ జగన్నాథస్వామి మందిరమునకును తన దిగ్విజయములను సూచించు జయస్తంభములవలె ప్రకాశించు, సువర్ణ కుంభములను పెట్టించెను. అనేక శ్వ్రాలయములను గట్టించెను గొంక భూపతి. దేవాలయములను ప్రతిష్ఠించెను. వేదవేదాంగ పారంగతులకును విద్వాంసులకును అశేషముగ సర్వకర పరిహారముగ అగ్రహారములను ధారవోసెను.2 గొంకరాజు వీరమాహేశ్వరుడు, శంకర శ్రీ పాదాబ్జ ద్వితీయ భజనుడు. విభవజితధనేశ్వరుడు. సమరస మయశీలుడు. అతనికి భార్యలు పెక్కండ్రు ఉండిరి. వారిలో వగ్రమహిషి సబ్బాంబిక. వారిరువురకును ఉదయించెను. నెలనాంటి వీరరాజేంద్ర చోడుడు.

రెండవ కులోత్తుంగచోడుడు సుస్థిరముగ నంధ్ర చోళ మండలరాజ్యములను పాలింపగలిగినది మహామండలేశ్వర కులోత్తుంగచోడ గొంకరాజువంటి మహా సేనాపతి సమరసముయదక్షుడు అతనికి విశ్వాసముతో బాసటగా నిలుచుటయే కారణము. గొంకరాజు తాను స్వబాహాదర్పమున గెలిచి సంపాదించుకొన్న రాజ్యమును నిజస్వామికి సమర్పించకుండ తానే స్వతంత్రుడై, తన రాజవంశమును అంధ్రసింహ పీఠముపై నెలకొల్పగల్గియుండియు నట్లు చేయలేదు. దానికి కారణము దురూహ్యము. అయినను చాళుక్యరాజ వంశముపై నాతని పూర్వులకు నాతనికి గల అసమాన ప్రభువిశ్వాసము కారణము కావచ్చును.

రెండవ కులోత్తుంగుని కాలమున అంధ్రదేశమందట్లు కుంతల (కర్ణాట) భూమియందు చోళమండలమందు అనేక విపరీత రాజకీయకల్లోలములు పుట్టెను. కళ్యాణ కటక చాళుక్యులలో నించుమించుగా సాఖరివాడు ముమ్మడి తైలపదేవుడు (క్రీ.శ.౧౧౫౧-౧౧౬౩), అతడు శక్తి చాలనివాడు. అతనినెదిరించి, కాకతి రెండవ ప్రోలరాజు క్రీ. శ.౧౧౫౮-౧౧౬౧ అనుమకొండ (హనుమకొండ అనుట తప్పు) రాజధానిగ నొక చిన్న స్వతంత్రరాజ్యమును స్థాపించుకొనెను. ప్రోలరాజు ఒకప్పుడు ముమ్మడి తైలపునికి పూర్వుడైన ముమ్మడి జగదేకమల్లుని (క్రీ.శ.౧౧౩౮-౧౧౫౦) యాజ్ఞచొప్పున తనపైకి వచ్చిన మహాప్రధానం దండనాయక గోవిందరాజు నోడించి బందిగాగొని యాతని రాజ్యమును కొల్లగొని విడిచిబంపెను.1 జగదేక మల్లుని యనంతరము అతని తమ్ముడు ముమ్మడి తైలపదేవుడు, కాకతి ప్రోలరాజును శిక్షింప దండెత్తి వచ్చెను. ప్రోలరాజు యుద్ధభూమిని ప్రోలరాజును ఓడించి, జీవగ్రాహముగా బట్టుకొని, ప్రభువిశ్వాసమున విడిచి పుచ్చెను.2 అంతకు పూర్వము ప్రోలరాజు రెండవ కులోత్తుంగుడింకను రాజ్యము చేయుచుండిన కాలమున వేంగీమీదికి దాడిచేసెను. జగదేకమల్లుని జయించినానని దర్పమున గండెత్తి వచ్చెను. ఆవేళ గొంకరాజు సేనానులలో నొకడు మహామండలేశ్వరకోట చోడయరాజు ప్రోలభూపతిని రణరంగమున ఘాత్రిగ నోడించి, యాతని కాకతిపురమునుతిరుగబెట్టెను.3 'కాకతిప్రోల నిర్దహను'డని పేరు గాంచెను. గొంకరాజుచేత పరాజితుడైనను కాకతి ప్రోలరాజు అనుమకొండ రాజధానిగా స్వతంత్రరాజ్యమును స్థాపించెను.

రెండవ కులోత్తుంగచోడుని కాలమున కుంతల చాళుక్యసామ్రాజ్యము విచ్ఛిన్నము కాసాగెను.

మాటమాత్రమునకు పూర్వాంధ్రదేశము చాళుక్య చోళుల సామ్రాజ్యమునందు చేరియుండెనుగాని, వెలనాంటి రాజవంశము సర్వస్వతంత్రముగ పరిపాలింపసాగెను. గొంకరాజు సామ్రాజ్యచిహ్నములతో సింహాసన మధిష్ఠించిన నాటనుండి యించుమించుగా క్రీ. శ. ౧౧౪౨ నుండి చందవోలు అంధ్రరాజధానియయ్యెను. పురమయ్యెను. జననాథపురము ఘాత్రిగా వన్నెయు వాసియు గోల్పోయి, క్రమముగా శిథిలాక్రయ్యెను.

రెండవ కులోత్తుంగుని కాలమును, (క్రీ. శ. ౧౧౩౨-౧౧౪౬) గొంకరాజు కాలమును (క్రీ. శ. ౧౧౪౨-౧౧౬౧) అంధ్ర సారస్వత చరిత్రయందు

---

1. *S. I. I. Vol IV. No. 1164.*

2. *S. I. I. Vol IV. No. 1182.*

I. Ind. Int. Vol. XI pp. 9.32 పంక్తులు *30-32* శ్లో 9. (రుద్రదేవుని అనుమకొండ శిలాశాసనము)

2. పూర్వోక్త ప్రమాణము శ్లో. 9.

3. *S. I. II. Vol. IV. No. 1242.*

చిరస్మరణీయమైన కాలములు. ఇంచుమించుగా మహాసామంతులు, మహామండలేశ్వరులు, అందరును తమ దానశాసనములను పద్యరూపముగ వ్రాయించుకొనిరి. మహామండలేశ్వర ఒంగేరుమార్గమున భీమయ పండరాజు తాను స్వయముగ కవియై, సర్వకలాప్రవీణుడై "తలఁపు సదర్థభావమునఁ దగ్గతనూ కులంగూడ వర్ణనలు, గొలుసుగొనంగ వ్రావ్లు గోరిన భంగిక వచ్చి మట్టం గోములగతి దేశిమార్గములు మట్టుపడంగట (వ)నంబులొప్ప నాద్యులక్రియఁ జెప్పనేర్చె నృపధూర్జటి భీమయపండమండిమ్మహీన్" అనుచు శాసనమందు వ్రాసికొనెను.1 గొంక క్షితిపాలకునకు అనిమిషపతియందు సురునిలోలిన కంటనమంత్రి,2 దశురుసుధా శుద్ధమహామతి విప్రకులావతంసునింతమ్ముడు కుప్పనామాత్యుడు నాదెండ్ల మూలస్థానేశ్వర మహాదేవునికి తానుబెట్టి ధర్మములను మనోహరమయిన పద్యములందు వ్రాయించుకొనెను. గొంకరాజే తన విజయములను దానములను సంస్కృతాంధ్ర కవుల నాదరించి వారిచే కావ్యములుగా రచింపజేసెను. మహామండలేశ్వర వెలనాంటి రాజవంశప్రశస్తి, గొంకరాజుచే, వర్ధిష్ణులయిన సంస్కృత కవులచే వ్రాయబడి సుస్థిరమయ్యెను. ఆంధ్రమున కుమారసంభవ మహాకావ్యమును రచించిన నన్నెచోడమహాకవి, గొంకరాజు కాలమువాడే యగును.

కులోత్తుంగ చోడ గొంకరాజు సేనయందు బ్రాహ్మణ చమూపతు లనేకులుండిరి. వారిలో ప్రసిద్ధుడు, ప్రధాని, సమస్త సేనాధిపతియునగు వాస(వ) ప్రెగ్గడ.3 మొదటివాడు. అతని వెనుక ఆ పదవియందు నియోగింపబడిన మంత్రిసంధి విగ్రహి, సమస్త సేనాధిపతి నండూరి గోవింద ప్రెగ్గడ, అతడు కాశ్యప గోత్రుడు, పెరువంగూరు గ్రామాధిపతి.4 మంచెనకవి యా గోవింద ప్రెగ్గడను

విహితా స్థానములందుఁ జూపుఁదగ
 గోవిందా భిధాన ప్రభుం
డహితోర్వీధర వజ్రి గొంక విభు
 రాజ్యాధిష్ఠుడై సంధి వి
గ్రహా ముఖోచిత కావ్యసంఘటన
 వాక్ప్రౌఢత్వమున్ బాధసట్
సహానో ద్రగరిపుక్షితీశ బహు
 సైన్య ధ్వంస నా టోపమున్||

అని వర్ణించెను. గోవింద ప్రెగ్గడ మరణించిన తరువాత నాపదవికి యాతని కుమారుడు కొమ్మన ప్రెగ్గడ నియమింపబడెను.

కులోత్తుంగ చోడ గొంకరాజు కాలమున వెలనాటి రాజవంశము జగన్నుతి గాంచెను. ఆంధ్రదేశము కాంతితో, మహైశ్వర్యముతో సుఖపడెను. ఆనాడు యావదాంధ్ర దేశమును మహోచ్ఛదశకు వచ్చెను. ఒకవంక కాకతీయులును, రెండవవైపు వెలనాంటివారును ఆంధ్రభూమిని స్వర్గతుల్యముచెసి పరిపాలించిరి.

---

1. S. I. I. Vol. VI. (బాపట్ల తాలూకా చేంబ్రోలు నాగేశ్వరస్వామి దేవాలయ శిలాశాసనము) No. 103.

2. S. I. I. Vol. IV. No. 675.

3. S. I. I. Vol. IV. 1089.

4. S. I. I. Vol. IV. No. 181, 183. కేయూరు బాహుచరిత్రము ప్రథమాశ్వాసమునుగూడ చూడదగును గ్రామాధిపతియనగా గణకముఖ్యుడు (కరణము) గాడు ఆ గ్రామమును అగ్రహారముగా ననుభవించువాడని యర్థము.



సేనాపతి వీరన్న

★

శ్రీ కాళీపట్నం రామారావు

"వీరన్న పోయాడు సుమీ—"

ఇంటికి వెళ్ళిన మరునాడు ప్రొద్దున్న గత రాత్రి రెండు జాములవరకూ చెప్పుకున్నా పూర్తి కాక మిగిలిపోయిన 'విశేషాలు' మాట్లాడుకుంటూంటే అట్లాంటి సందర్భాలలో సహజంగా సంఘటిల్లే కొన్ని మౌనవిముషాల తరువాత అన్నది అమ్మ.

నేను అంతరాంతరాలలో త్రుళ్ళిపడ్డాను. అయినా అది బయటకు కానవచ్చే అంత తీవ్రవంతమై ఉండేదు. ఆమె అన్నది—

"పదిహేను రోజులయ్యింది — అప్పుడే పోయి!..." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయింది. నేను గత వాళ్ళ అమ్మ వినిపించిన మరణవార్తలు నెమరుకురాగా తత్తన్మయాల పొందిన చిత్రానుభూతుల పునరనుభూతిని మరల పొందుతూ తక్కిన శేషచరిత్రులతో పాటు వీరన్నను కూడా మానసిక ప్రతిబింబంగా మొదటసారి చూడసాగాను. అమ్మ అన్నది.—

"అలాంటి వాళ్ళకు సాధారణంగా ఎలాంటి చావు వస్తుందని పెద్దలు చెపుతారో సరిగా అలాటి చావే వచ్చింది!......"

నేను ఆమె చెపుతున్న విషయాలు ఒకవంక వింటునే వేరొకవంక ఏటేటా ప్రతి మూడు నాలుగు నెలలకూ మావూరు వెళ్ళినప్పుడల్లా ఆమె ఎవరికో ఎక్కడిదో ఒక మరణవార్త వినిపించటం—ఊరు కూడా అనుక్షణం ఏదో ఏదో క్రొత్త క్రొత్త మార్పులు పొందుతూ నానుండీ, నా 'ఈ మావూరు' నుండీ దూరమౌతున్నట్టు తోచడంవల్ల కలిగే దిగులులో, యిట్లా నా పరిచితులూ వయసులో నాతో సమానులూ చిన్నలూ పెద్దలూ కూడా అకస్మాత్తుగా చెప్పి పెట్టకుండా పోయినట్లు మాయమౌతూండటం వల్ల కలిగే విభ్రాంతికూడా లీనమైపోతూ రావడం జ్ఞాపకం తెచ్చుకుంటున్నాను.

అమ్మ స్త్రీ సహజమైన తన ధోరణిలో అలాంటి వాళ్ళకు ఎలాటి చావు వస్తుందని పెద్దలు సూత్రీకరించారో అక్షరాలా అలాటి చావే అతడికి కూడా ఎలా వచ్చిందని అభివర్ణిం చివరకు తన అభిప్రాయాలు అనుబంధ రూపంలో చేర్చి ముగించింది.

ఆమె ధోరణి మొదట మొదట ఎట్లాఉన్నా చివరకు వచ్చేసరికి కరిగి వెల్లువయే ఆమె స్త్రీ హృదయపు హోరును వినిపించసాగింది.

అన్నది—

"—అయితే ఒక్కమాట చెప్పుకోవాలి. వాడు బ్రతికి ఉన్నంతకాలం వాడిని వీళ్ళమన్నా ఎలా చూసినా ఏంచేసినా చచ్చిపోయాక— అందులో దక్షత లేకుండా ఆ యిద్దరాడకూతుళ్ళూ అయిదుగురు పిల్లలూ అలో లక్షణా!...' అని మొత్తుకుంటున్నది చూసైనా ఆదుకోవలసింది. చుట్ట పక్కాలూ ఇరుగు పొరుగులూ ఏకకులస్థులూ అన్నా వారెందుకు చెప్పూ! మరి వాళ్ళకు చెలువులు కావడానికి గుండెలే లేవో—లేక ఉన్నా ఆ కథవిని ఎవరిముట్టుకు వారే ముట్టుకుంటే అంటుకుంటే తమ మీదకేం వస్తుందో అని జడిసే మానేశారో తెలియదు—అందరూ ఎవరిముట్టుక వారే ముఖాలు చాటేసుకున్నారు. ఇరుగు పొరుగుల వాళ్ళయితే ఏకం తలుపులే తాళాలువేసుకొని ఏవో పనులున్నట్టు అవీధీ యీవీధీ పోయారు! తక్కిన కులాలవాళ్ళయినా అదేమ్రా మీ కొచ్చిన పోయేకాలం అనలేదు! అంతా జరిగిపోయాక మళ్లా అందరూ వచ్చారు— అంతా చేశారు. ఎందుకూ—దండగకు!"

అంటూ క్షణకాలం గుక్క త్రిప్పుకోవటానికిలా ఆగి అన్నది—

"ఆ ఆడకూతురు గుండె ఎంత మండిందో! జామున్నర ప్రొద్దువరకూ వాళ్ళొస్తారో వీళ్ళొస్తారో

అని ఎదురుమాసి ఎవ్వరూ రాకపోయేసరికి అడ్డంగా వీధినిపడి ఊరు ఊరందర్నీ తిట్టిపోసింది.

అది ఏడ్చి ఏడ్చి వాచిఉన్న మొహంతో చేతులు తిప్పుకుంటూ దీర్ఘాలుతీస్తూ దండాలు పెడుతూ 'సూర్యనారాయణమూర్తి! తండ్రీ! భగవంతుడా! నువ్వన్నా వాడివిలేవా—ఉంటే ఇదంతా చూస్తూ ఊరుకుంటావా!? ఈవూరివాళ్లు మనుషులా! వీళ్ళకు మాకు పట్టినగతులు పట్టవా! పుట్టెడు దుఃఖంలోఉన్న మామీద యింకా కత్తులు సాధిస్తూ ఉన్న వీళ్ళను సహిస్తావా?—వీళ్లకు రోజులు వుంటాయిరా!' అంటూ శాపాలు పెడుతూవుంటే నిజంగా అది జాలో భయమో—నేనైతే చెప్పలేను—నా కాళ్ళల్లోంచీ ఒణుకు పుచ్చుకున్నది. వీధిలో నించొని వింటున్న దానివల్లా తరిమినట్టు యింట్లోకి వచ్చి పడ్డాను........"

ఆమె అట్లా మరికొంతకూడా చెప్పి ముగించింది. చివరకు చెప్పవలసేది ఒక్కటే ముక్క—అంత తతంగం జరిగాక శవాన్ని ఆ ఆడవాళ్ళిద్దరే శ్మశానానికి మోసుకపోవడానికి కూడా సిద్ధపడ్డాక అప్పటికి కొందరు పెద్దలలో మనుష్యత్వం మేలుకున్నదని! తోడనే "చాస్...వాళ్ళా వీళ్ళా మీకు బుద్ధులున్నాయా లేవా...మీరు మనుష్యులేనా... మమ్మల్ని ముట్టుకోమంటారా?..." అంటూ హడావుడిచేసి చివరకెట్లానో దహన సంస్కారాదులు పూర్తయ్యాయనిపించారట.

ఇందులో ఆశ్చర్య కారణం కాగల విషయమేమీ లేదు. మనం సాధారణంగా గ్రామాలూ గ్రామీణులూ స్వర్గఖండాలూ దేవతలుగా అభివర్ణింపబడుతూండటం వింటూఉంటాం. అవి పాపం—పోకపోక ఒకనాడు పల్లెపోయి మాచివచ్చిన వారి సహృదయోపన్యాసాలు. నిజానికి గ్రామాలు పట్టణాలకు ఏవిధంగానూ తీసిపోవు. క్రౌర్యం, దౌర్జన్యం, అత్యాచారం, మోసం, దగా, ఈర్ష్యాసూయలు, నైచ్యం, అవినీతి, అసత్యం, వ్యభిచారం, భీరుత్వం, —ఒకటేమిటి — మానవజీవితంలో ఏహ్యమైనవీ దూష్యమైనవీ అవాంఛనీయమైనవిగా వేనిని మనం గర్హిస్తామో అవన్నీ అక్కడకూడా కానవస్తాయి. కాకపోతే అజ్ఞానం అమాయకం అనే ముసుగులో మన పెద్దలు వానిని దాచి దాపుతూ ఉంటారు.

కనీసం ఇది నా అభిప్రాయం. అందుచేతే వీరన్న చరమయాత్రనుగూర్చిన కథనంలో ఊరివారి ధోరణి నాలో ఆశ్చర్యాన్నిగాని జుగుప్సనుగాని లేక అట్టిదే ఇంకొక ఉత్తేజకరమగు భావాన్నిగాని కలిగించలేదు. పోతే వీరన్న కోసరం మాత్రం నా గుండె కలవరించి.

ఆవాళ్లా ఉండీ ఉడిగీ చనిపోయిన వీరన్నా బ్రతికిఉన్న వీరన్నా జ్ఞాపకం వస్తూనే వచ్చారు. ముఖ్యంగా రాత్రి మంచంమీదకు చేరుకున్నాక ఆనాపెద్దచీకటిగదిలో కండ్లు మూసుకొని నిద్రపట్టక మంచపై వెల్లకిలా పడిఉన్న స్థితిలో సన్నగా రివటల్లే కమ్మెచ్చునదీసినట్టు కనుపించే కండరాలతో పొడుగ్గా ఎర్రని పెద్దకండ్లతో పలుచని మీసంతో నవ్వుతూ వాదిస్తూ పౌరుషపడుతూ నా ప్రక్కను, నా కెదురుగా, నాచుట్టూ, నాపైన అవీధుల్లో, చనిపోయే ముందు పోట్లాట జరిగి ఉంటుందనుకొన్న సందర్భంలో, రొజుకుంటూ మూలుగుతూ, బాధపడుతూ మరణిస్తూ, చేతిలో కర్రతో, తన పూరిఇంట్లో మంచమీద ఆరిపోయిన పొగచుట్టతో, బాణా త్రిప్పుతూ, ఒకప్పుడు గిరజాలుగా ఉండి ముడికి పెరిగిన జుట్టు ముడివేస్తూ, అలనాడు తొలిసారి నేను వీరన్నను గుర్తించినరంగస్థలంలో అసిరినాయుని ఊపిరాడనీయకుండా తిరుగుతూ వివిధస్థలాలలో, వివిధావస్థలలో ఎక్కడచూసినా తానుగా కనిపిస్తూ వచ్చాడు. ఆరాత్రిల్లా నాకు అతడి కలలే! భయంకరమైన కలలు!!

* * *

దురదృష్టజీవి! వీరన్న పోయాడు!!

* * *

వీరన్న నిజంగా దురదృష్టజీవి! నిర్భాగ్యుడు! లోకంలో నిష్ప్రయోజనమైన నా కుప్పసాము ధూతిని మారగొన్న కొద్దిమంది దురదృష్టవంతులలో వీరన్న ఒక్కడే కాదు, ప్రథములలో ఒకడు.

నిజానికి వీరన్నకూ నాకూ ఎట్టి లౌకికమైన— లేక లోకం సాధారణంగా వాడే అర్థంలో పారలౌకికమైన — సంబంధం ఉన్నదనటానికి వలనుకాదు. కులంచేగాని వయసుచేగాని వృత్తిచేగాని మా యిద్దరికీ ఎట్టి సంబంధం లేదు. నేను అతడి పెరిగిఉన్న నిండు ఇరువదిరెండుఏండ్లకాలంలో అతడూ నేనూ ఒక్కసారికూడా మాట్లాడుకొన్నైనా ఉండమంటే యీ ఒక్క విషయంవల్లా అతడికీ నాకూ గల లౌకికసంబంధమేపాటిదో స్పష్టంగా అర్థం అవుతుంది.

అట్లా అని ఏసంబంధమూ లేదనటానికీ కాదు. నా మానసిక రజతపటలంమీద నేను ప్రదర్శించుకునే చిత్రజగత్తులో వీరరసప్రసక్తి గల ప్రతి చిత్రంలోనూ

మహా వీరపాత్రను ధరించేది యీ వీరన్నే. అతడు నా మేఘనాథుడు, అతడు నా కర్ణుడు, అతడు నా గన్నారెడ్డి అతడు నా ప్రతాపవర్మ, అతడు నా మార్తాండుడు అతడు నామరి ఒకడు ఇంకొకడు. ఇదీ అతడికీ నాకూ గల సంబంధం.

ఇతడిని ఈవిధమైన నా అంతరంగిక చిత్రజగత్తులో పాత్రధారినిగా తీసుకొన్నది ఒక విచిత్ర సన్నివేశంతో — పాతికేండ్లక్రిందట సంఘటిల్లిన ఒక సన్నివేశం ఫలితంగా ననుకుంటాను.

జీవితంలో వివిధవ్యక్తులతో ఏర్పడే సంబంధాలన్నీ ఎట్లా ఒక సన్నివేశంతో ఆరంభమౌతాయో అట్లానే ఇదీ ఏర్పడ్డది. నాకప్పటికి బహుశ పన్నెండు సంవత్సరాలవయసై ఉండాలి. ఆ ఏడాది గ్రామదేవత పండగలలో గరిడీ ప్రదర్శనంవద్ద అతడిని నేను మొట్ట మొదటసారిగా చూసివున్నట్టు జ్ఞాపకం.

విషయాలు అంత స్పష్టంగా గుర్తులేవు. వాడు తక్కిన అట్టివాళ్ళలో సాధారణంగా నిజ్జనజ్జగా ఉండే మా గ్రామీణ వాతావరణం చాలా ఉద్రిక్త స్థితిలోఉన్నట్టు జ్ఞాపకం. అరిసెలు మొదలగు పిండి వంటల కమ్మనివాసనలవెనుక క్రొత్తదుస్తులు, చుట్టు పక్కల తడికలవెనుక పేకాటలు నవ్వుతాలూ, మేక పోతుల వేటలవెనుక — ఏదో అపాయం — అను హృ అప్రియసంఘటన జరుగనున్నట్టు మొదటినుండీ సూచితమౌతూ వచ్చినట్టే గుర్తు — లేక అది ఈనాటి జ్ఞాపకంవల్ల కలిగే భ్రమో — ఏమైనా అనాడు నేను పంజరంలోనికి వెళ్ళనుండగా అక్కడ దొమ్మీలూ అవీ జరగవచ్చునీ ఎవరికైనా పెద్దవాళ్ళను పట్టుకొని కూడాకూడా తిరుగుతూండమనీ అమ్మ హెచ్చరించి నట్టుకూడా జ్ఞాపకం.

పోతే స్పష్టంగా గుర్తువున్నది — అమ్మవారి గుడివద్ద గరిడీరంగం. మా వూరుకూ పొరుగు పేటకూ పొలిమేరవద్ద విశాలమైన ఒక సమప్రదేశంలో జన సమూహం బాగా కూడి ఉన్నది. నేవెళ్ళేసరికే మర్కట సాంప్రదాయాలను ఇంకా విడువనేరని మానవ సముదాయంతో సమీపస్థములైన చెట్లూ చేమలూ విరగ కాచిన మామిడిగున్న లలా వంగి ఊగిసలాడుతూ ఉన్నాయి. చచ్చి చెడి నేనూ ఒక చెటుమీద కొస్తంతచోటు చేసుకున్నాను.

కొందరు పెద్దలు ఆ సరికే జనం నడుమ కడియం యేర్పాటు చేస్తున్నారు. జనం ఊరికనే పక్కా పావుగంటకుపైగా త్రొక్కిసలాడి ఆడి చివరికెట్లానో కావలసిన మేరకు చోటు పెట్టామన్నారు.

గరిడీలగురించి నా కంతకుముందే కొంత తెలు సనుకుంటాను. నా గుండెలలో అప్పటికే కొంత దడ ప్రారంభమయ్యింది. అయినా అక్కడ చేరివున్న జనమేకాక దశదిశలనుండీ చుట్టుప్రక్కల గ్రామీణులు వర్షానంతరం పర్వతసానువులనుండి క్రింది లోయలోనికి పారే చిన్న, పెద్ద ప్రవాహాలలా జట్లుజట్లుగా గుంపులు గుంపులుగా రావడం ఒకవంక ధైర్యంకలిగిస్తూ ఉండెను. అనాటిజనం ఆ త్రొక్కిస లాటా మా వూరిలో యింకెన్నడూ చూచిన జ్ఞాపకం లేదు. రంగురంగుల దుస్తులూ, తలనూనెలతో కలిసి కారే చెమటలూ చేపాటికర్రలూ, శిగముడులూ, నల్లని బలిష్టమైన ఉక్కునుబోలిన దేహాలూ, పాయల ముంలలోడులూ, కొనకాసెలూ, ఓణీలూ, రుమాళ్లూ, దస్తీగుడ్డలూ, తలపాగలూ — గ్రామీణ వస్త్రధారణా లంకారవైచిత్రులన్నీ ఉన్నవైవిధ్యం అంతటతోటి అక్కడ చూడవచ్చు. అంత జనంచేసే ఆ రొదకు అంతు లేకుండెను.

గరిడీలో చూస్తూండగానే ఇరుప్రక్కలనుండీ కొత్త కాల వస్త్రవిన్యాసంతో ఇరువురు వ్యక్తులు దిగారు.

అటు ఒక నాయుడు. మనిషి అంత ఎత్తరికాడు కాని భయం కొలుపుతూ ఉంటాడు. తెలసైన నల్లటి బొద్దుమీసాలు భీకరమైన పెద్ద ఎఱ్ఱనికండ్లూ చేవ దేరినవానిలా తోచే బలిష్ఠమైన కండరాలూ తలపై పెద్ద శిగముడీ — అన్నిలక్షణాలనూ మించి తామసాన్ని విరజిమ్మే పెద్ద ముఖం — అతిడి లక్షణాలు.

ఇటు వీరన్న

అది అతడు మావూరివాడనేభావంవల్లనే కలిగినదో లేక బక్కపలచని వీరన్న ఆకారాన్ని నేను బలహీనతగా తీసుకోవడంవల్లనే కలిగినదో స్పష్టంగా ఇప్పుడు చెప్పలేను — అనాడు నా సానుభూతిమాత్రం పూర్తిగా వీరన్నవంకనే ఉండెను.

చూస్తునే ఉన్నాం — ఎప్పుడు ఎట్లా ఆరంభ మయ్యిందో జ్ఞాపకం లేదు. పోట్లాట ప్రారంభ మయ్యింది. కర్రలు అంతరాళంలో టకటకమంటూ వివిధ తాళగతుల్లో మాపరులదృష్టులను మోసంచేస్తూ కలియడం మధ్యమధ్య విడివడుతూండటం ఒడుపులకై తారాడి ఉన్మత్తున దూకిదేసి ఎదురొడ్డుకొని జడివాన పాటుగా దండతాడనధ్వనులు మారుమోగటం బాగా జ్ఞాపకమున్నది. చివరి కొక పరిస్థితిలో జనం ఘొల్లు మన్నారు!

అది ఒక దురదృష్టం. నన్ను విన్నవాళ్లు పిరికివాడనేఅన్నా మరేమన్నా జరిగినదానిని చెప్పితీరాలి. చుట్టూ ఉన్న జనం చక్కన సుడిగుండంలా మధ్యకు త్రోసుకొనిపోవడం చెట్లమీద వాళ్లు దుభీదుభీమని క్రిందికి దూకి పరుగులు తీయడం చూచేసరికి నేను అమ్మ హెచ్చరించిన 'దొమ్మీ' ఆరంభమయ్యిందనుకొని ఒకటే పరుగు పుచ్చుకున్నాను. తరువాత ఏమి జరిగిందో నాకు తెలియదు.

కొంతసేపుపోయాక నేనుపడ్డ పొరపాటును గ్రహించి వెనుకకు వెళ్ళి తెలుసుకొన్న విషయమిదీ—

అసిరినాయుడు ఓడిపోయాడు. వీరన్న మూడు దెబ్బలు వరుసగా వూపి ఆతడిని పరాజితుణ్ణి చేశాడు. కాని కాపులు ఓటమిని అంగీకరించటంలేదు.

ఆ జనంలో ఆ సందడిలో ఆ పూరివారూ మాపూరివారూ జట్లుజట్లుగా మూకమూకలుగా మూగి ఉద్రేకజనితములైన అభినయాలూ పెద్దపెద్ద గొంతుకలూతో వాదించుకుంటూంటే అది నా పాలిట ఒక వంక ఎంత ఆకర్షకములుగా ఉండేవో వేరొకవంక అంత భయజనకములుగాకూడా ఉండేవి. అయితే తరువాత విన్నట్టు కొందరి పెద్దలధర్మమా అని ఆనాడు మరెట్టి దొమ్మీలూ జరుగలేదు.

సంగతేమంటే మా రెండుగ్రామాలకూ మరి కొన్ని గ్రామాలతో అవినాభావసంబంధ మొకటి ఉన్నది. ఇవన్నీ ప్రభుత్వశాఖలో ఒక గ్రూపునకు చెందినవి. ఒక గ్రామంక్రింద తక్కినవన్నీ మజురలు. ఈ సోదరగ్రామాల నడుమ స్నేహబాంధవ్యాలు ఎంత దట్టమో స్పర్థా ఈర్ష్యాసూయలూకూడా అంతే తరచు. విద్యలూ ఆడంబరాలూ మొదలైనవానిని ప్రదర్శించుకోవటంలో వీనికి రంగాలు ఎంతసమీపమో స్పర్థలుకూడా అంత తీవ్రం. అందుచే అప్పుడప్పుడు సంఘర్షణలేర్పడి కాలం కర్మం తప్పిననాడు తీవ్రపరిణామాలకు దారి తీయడంకూడా వింతకాదు. అయితే ఈ రెండు గ్రామాల ముసలిబుర్రలూ తెరవెనుక ఏం భాగవతాలాడినా బయటకుమాత్రం మర్యాదపడటం మామూలు. ఇప్పుడుకూడా అటువంటిదే ఒకటి జరిగింది. అయితే ఆవాదుమాత్రం నన్ను బహుఅందోళితునిగనూ సహతేయునిగనూ చేసినదిది. అందుచే జనం ఎక్కడ నలుగురు మూగితే అక్కడికల్లా పోయి వింటూ వచ్చాను.

ఆరోజల్లా మా ఊరిజనం తమ ప్రతిష్ఠ నిలచినదని అంతరంగంలో ఎంతసంతసించారో దానిని నిలపిన వీరన్నను బయటకు అంత పొగిడారు.

ఆనాడేమిటి మరునాడూ మూడవనాడూ ఇంచుమించు పదిరోజులవరకూ ఊరిలో యింకొక ప్రసంగమన్నదిలేదు. రచ్చరాయివద్ద రామమందిరంవద్ద ఎగువవీధి సంగిడీల దిబ్బపై—ఎక్కడవిన్నా వీరన్న నైపుణ్యాన్ని వీరన్న గ్రామప్రతిష్ఠకు చేకూర్చిన మహావిజయాన్ని వీరన్న అందుకైచేసిన మహత్తర కృషిని గూర్చినప్రసక్తే. విన్నవారికి విసుగుపుట్టేవరకూ సాగిందది—

ఇదీ వీరన్నను నాకు పరిచితుని చేసిన సంఘటన. ఆరోజులలో వీరన్ననూ వీరన్న సేవనూ కృషిని గూర్చి పొగడినవారు వాటన్నిటివిషయం యింకొక నాటికి మరచిపోయినా ఆరోజుల్లో వారు తమ అనూనవాక్యరచనచే ఆనాటి నా పసిహృదయంలో ఘటించిన వీరన్న పరిచితిమాత్రం నాటికీ నేటికీ స్థిరంగా నిలచిపోయింది. నానాసందర్భాలలో వివరించిన వీరన్న పూర్వచరిత్రకూడా నేనెన్నడూ మరువలేదు. వారు వేసిన పునాదులపైననే నేను తరువాత తరువాత విన్నదానినీ కన్నదానినీచేర్చి వీరన్న చరిత్ర సౌధం నిర్మించుకుంటూ వచ్చాను. నేడది అమ్మ వినిపించిన చరమాధ్యాయంతో సంపూర్ణమయింది.

కళంకితాంతమూ దుఃఖావహమూ అయిన వీరన్న జీవితచరిత్ర ఆదిని వాటితోనే ప్రారంభం కాలేదు. చాలామందికి లానే అతడూ వ్రేలెత్తి చూపించుకొనని కుటుంబంలోనే పుట్టాడు. నోటికీ చేతికీకూడా ఎడములేని కుటుంబమే అతడిది—

కులంచే అతడు సాలె. తండ్రికి ఒక్కడే కొడుకు తల్లిలేదు. అతడి తండ్రి కులవృత్తిచేతే జీవిస్తుండేవాడు. ఆసరికే యార్క్ షైర్ లాంకాషైర్ మిల్సు రాక్షసహస్తాలు భారతదేశంలో నాలుగు వంకలా లక్షలాదితంతువాయకుల నోటిముందరి ముద్దలు ఒడుచుకుపోవ నారంభించినా ఈ మారుమూల పల్లెలవరకూ అవి సాగిఉండలేదు. అందుచే వీరన్న తండ్రి కాలంలో వారి కావృత్తివల్ల బాగానే కిట్టుబాటయేది. తిన్నది శాల్యన్నాలు కాకపోయినా ఉన్నది మహాభవనాలు కాకపోయినా కూటికీ కొంపకూ లోటులేకుండా ఉండేది.

వీరన్న తండ్రినిగూర్చి పరమధార్మికుడని చెప్పుకునేవారు. వృత్తిధర్మరీత్యా మంచిపనివాడు—గొప్ప

పట్టుదలా ఓపికా ఉన్నవాడు అనేవారు. వీరన్నలో ఆ లక్షణాలు ఒక్క సాము నేర్చుకోవడంలో తప్ప యింకెందులోనూ కనుపించవు. తండ్రి ఎంతశాంతుడో కొడుకంత దుందుడుకుతామసి కాకపోయినా రాజసం ఎక్కువ. అయినా 'విద్యావంతుల'ఎడ అంత వినయుడు—అన్నారు అతడి స్వభావంగురించి.

ఇందులో 'చచ్చినవారికళ్ళు……'ఆదిగా గల సామెతలు జ్ఞాపకం తెచ్చుకొని ఎంత కొట్టివేయవలసేది ఉండినా కొంత నిజంకూడా ఉన్నట్టు ఉన్న నిదర్శనాలనుపట్టి తెలుసుకోవచ్చు.

ఇంక చదువు సంధ్యల విషయమంటే—

ఆ రోజుల్లో ముఖ్యంగా పల్లెటూళ్ళలో—అందులో ఆ కులంవారి యెడ చదువనేది చాలా అనవసరపు వస్తువు. అందుచేత వీరన్నకు బడి ముఖమైనా తెలియదంటే వింతలేదు. పోతే చెప్పవలసేది అతడు కులవిద్య నేర్చుకోవటంలో కూడా అశ్రద్ధచేశాడని.

సాటి వయస్కులు వేరేమగ్గం పెట్టుకొని స్వంతంగా నేత ఆరంభించిన రోజులలోకూడా వీరన్న ఒక అంచుతీతలో గాని పరికట్టులో కాని తండ్రికి సహాయానికి వచ్చేవాడు కాడు. అసలా విద్యలో ప్రథమ పాఠాలైనా అతడికి తెలియక. పరిటె త్రిప్పటంకూడా అతడికి చేతకాదంటే వీరన్నకు కులవిద్యలో గల జ్ఞానం అపక్తిగూర్చి వేరే చెప్పనవసరం లేదు.

తండ్రి అంతరాంతరాలలో ఏమనుకున్నా బయటకు మాత్రం ఇట్లా అనేవాడట "నెట్టంత కొడుకును ఇంటపెట్టుకొని ఏనుగును మేపినట్టు మేపుతూ అంచు నేతకు కూలీలను పెట్టడమంటే మఖ్య నాకు తలవంపులుగా ఉన్నదిరా! అనుభవిస్తావులే. నేను బ్రతికి ఉన్నంతకాలం నువ్వు ఇంతే. నేను హరీమన్నాకగాని నీకు తెలియదు. అప్పుడు నీపాట్లు కుక్కలూ నక్కలూ పడవు." అనే వాడు.

గ్రామీణులు వీరన్ననుగూర్చి తమ లోకాభిరామాయణాల వేళ ఈ జోస్యాన్ని స్మరించి ఆశ్చర్యాన్ని ప్రకటించినా అందులో వింతేమీ లేదు. బాల్య యవ్వనాలలో బేఖాతరుగా తిరిగినవాళ్ళు ఎంతటి ఇంటబుట్టినా కౌమారవార్ధక్యాలలో కష్టపడక తప్పదు. ఇది సహజం.

అయినా దురదృష్టవశాత్తు వీరన్నకు ఆరోజుల్లో ఈ సత్యాన్ని గుర్తించగలిగే జ్ఞానం లేకపోయింది.

బాల్య యవ్వనాలలో అతడి దినచర్య ఇంచుమించు ఇట్లా ఉండేదిట.

తెల్లవారు జామునే లేచి కాలకృత్యాలు తీర్చుకొని సంగిడీల దిబ్బమీద తనవంటి బాపతే మరికొందరితో కలసి కసరత్ చేయటం మొదటిపని. తరువాత సాము. జాము ప్రొద్దువేళ మస్తుగా చల్దన్నం తినటం. పశువులను మందకు త్రోలేవేళవరకూ రచ్చరాయి దగ్గర బాతాఖానీ. తరువాత ఋతువులనుబట్టి ఫలహారాపేక్షతో ఊరిలోని ఒక కిష్కింధ సైన్యంలో తానూ చేరి ముంజకాయలకై తాటితోపులకో పండ్లకోసరం ఏ జీడితోటలకో లేక దగ్గరి అడవికో విహారం సేవించి అపరాహ్ణ వేళ ముద్దకై ఇంటికి చేరుకోవటం. మధ్యాహ్న మళ్లా గాలిపటాల దివాలైతే—గాలిపటాలు ఎగరవేయటం లేకపోతే గోనేబిళ్ళాటో గొట్టికాయలాటో బచ్చీలాటో ఆడుకోవటం. సాయంకాలం మళ్ళా సామూ కసరత్. రాత్రి రామమందిరం అరుగులమీద కాలక్షేపం. చివరకే జాము జామున్నర రాత్రికో ఇల్లు పట్టడం. ఇదీ అతడి దినచర్య తీరు.

ఇందులో పరిస్థితులను బట్టీ ఋతువులూ కాలాలూ భేధాల ననుసరించీ వయస్సునుబట్టీ కొన్ని కొన్ని మారుతుండేవి. స్థిరములూ తప్పనిసరి తెగకు చెందినవీ సామూ, కసరత్, రామమందిరంవద్ద కాలక్షేపం.

ఒక్కొక్క ఊరికి ఒక్కొక్క ప్రదేశం గ్రామ కేంద్రంగా ఉంటుంది. ఊరిలో తీరికున్నవారందరూ లేక తీరిక చిక్కించుకున్నవారు—అక్కడకు చేరుతూ ఉంటారు. మా ఊరిలో అట్టిది రామమందిరం.

రామమందిరం గ్రామకేంద్రం కావటానికి కారణం అది ఉమ్మడి కట్టడం కావటమే కాదు—మా గ్రామపు ప్రత్యేక స్థానిక పరిస్థితులు కూడా అందుకు చాలామట్టుకు దోహదకారులై ఉంటాయి.

ఊరు గ్రాండ్ ట్రంక్ రోడ్ను అనుకొని ఉన్నదవటంవల్ల ఆ పూర్వం రోజుల్లో అప్పుడప్పుడు బాటసారులు మా వూరిలో ఆగిపోవడం కద్దు. వాళ్ళు ప్రక్కనే ఉన్న ప్రాత సత్రవులో వంటలు వండుకొని తిని ఈ మందిరంలో నిద్రపోతూ ఉండేవారు. వార్తా పత్రికలూ ప్రయాణ సౌకర్యాలూ ఇప్పటంత ముమ్మరంగా లేని రోజుల్లో ఈ బాటసారులే పల్లెల్లో వార్తా పత్రికలుగా కథలు పుస్తకాలుగా నడచివచ్చిన పుణ్యక్షేత్రాలుగా కూడా ఉపయోగపడేవారు. వీరి సాన్నిధ్యమే రామమందిరం గ్రామకేంద్రం కావటానికి ముఖ్యమైన హేతువని చెప్పాలి.

ఇక్కడ ఆ బాటసార్లు వారు వారు ఆయా ప్రదేశాలలో విన్న, విన్నామన్న వింతలూ విశేషాలూ భోగట్టాలూ వర్ణించేవారు—చూసినవీ, చూసినట్టు చెప్పగా విన్నవీకూడా చూసినట్టే చెప్పేవారు.

గ్రామంలో ఉబుసుపోని వారందరూ ముఖ్యంగా, కౌతుకం, కాస్త ఒక మోతాదు ఎక్కువగా గలవారు ప్రొద్దుపోగానే కలిగిన కాడికి పొట్టలో వేసుకొని తలగుడ్డలో దుప్పట్లో ధరించి నోటిలో కణకణ వెలిగే చుట్టలతో ఒక్కొక్కరే ఈ కేంద్రంకు చేరుకునేవారు. వీరంతా ఆశ్చర్యచకితులై 'ఓహో' లు "ఔరా—హా!" లూ 'అబ్బా!' లు మొదలైన ఆశ్చర్యార్థకాలతో మధ్య మధ్య హుంగు చేస్తూ ఉండేవారు. అంతూ ఆపూ లేకుండా గంటలతరబడి కొందరు కొందరికి నిద్రలు వచ్చేవఱకు తమతమ కవితా చమత్కృతినీ వాక్చమత్కృతినీ జోడించి విషయాలు అల్లి విడదీసి చెప్పేస్తూ ఉండేవారు. ఈ శ్రోతలలో కాస్త నాలుగు ఊళ్లు తిరిగిన వారుకూడా తామువిని సత్యాలని నమ్మకపోయినా తమలో మానవ సహజమైన కౌతుకాన్ని తృప్తిపరచుకొనేందుకు అన్నీ నమ్మినట్టు వింటూవస్తే వీరన్నవంటి రెన్నడూ ఊరు విడువని బాపతువారు అవన్నీ అక్షరసత్యాలుగా గ్రహించి ఊరుకునేవారు.

ఉపన్యాసకులుగా ఒక్కొక్కప్పుడు సాధు సజ్జనులు దిగేవారు. వారు మంత్రతంత్రాలూ భూత పిశాచాదులు గురించిన కథలూ సర్వపుణ్య క్షేత్రవర్ణనలూ జన్మ పునర్జన్మాది ఆధ్యాత్మిక విషయాలూ వివరించేవారు. ఇవి పైన చెప్పినట్లె నమ్మని వారుకూడా నమ్మినట్లు నటించగా ఏమీ తెలియనివారు పూర్తిగా నమ్మేవారు.

ఇట్లా సత్కాలక్షేపానికి అక్కడ అవకాశాలు ఎక్కువ ఉండటంచేతే రాత్రులు అక్కడ చాలా మంది చేరేవారు. ఒకవేళ ఒకనాడు అట్టివారెవ్వరూ లభించక పోయినా కొరత ఉండేదికాదు. ఊళ్లో ఒక తాత ఉండేవాడు. అతడుకూడా నిత్యం అక్కడకు చేరుకునే వాళ్ళలో ఒకడు. అతడు చెప్పిన కథ చెప్పకుండా ఏండ్లతరబడి కథలు చెప్పగల సమర్థుడు. అతడి కథలతోనైనా అక్కడ కాలం గడిచేది.

ఇవికాక ఆ వూరిపై పై వూర్లపై భోగట్టాలూ ఎవరెవరి చిన్నవాటి గాథలూ పూర్వకాలపు ముచ్చటలూ కూడా మంచి కాలక్షేప వస్తువులుగానే ఉపకరించేవి. పైగా యిట్టి సందర్భాలలో మాట్లాడేవారి తాహతునూ సామర్థ్యాన్నీ బట్టి నవ్వీ నవ్వించీ ఏడిపించీ భక్తి శ్రద్ధలతో గౌరవించీ అవందించటానికి కూడా అక్కడ ఎంతో అవకాశముండేది. అందుచేతే చాలా మందితో పాటు వీరన్నకూడా ఇక్కడకు ఏది తప్పినా ఇది తప్పదన్నట్టు నిత్యం హాజరయ్యేవాడు.

సువిశాలమూ వివిధ చిత్రవిచిత్ర నదీ, నగ, సాగర ప్రదేశ సంశోభితమూ బహువిధ భాషా సాంప్రదాయ సంస్కార స్వభావ జనసంయుతమూ, అయిన యీ ప్రపంచం గురించీ ఇందలి తదితర అనంతకోటి జీవరాసుల గురించీ మహాత్ములూ మహానుభావులూ మహా మేధానిధులూ అనిర్వచనీయుడని పేర్కొని విడిచిన ఏతత్సృష్టికర్త గురించీ, అన్వయ క్లిష్టాతి క్లిష్టమైన మానవజీవితం గురించీకూడా వీరన్నకు అవి కుంటివో గ్రుడ్డివో సత్యసమ్మతములో సత్యదూరములో ఎట్టివైనా అభిప్రాయము లంటూ కొన్ని ఏర్పడి వుంటే అవి ఇక్కడే ఈ మహా విజ్ఞాన వేదిక వద్దే బాహ్యతా బాహ్యతలూ, జ్ఞానాజ్ఞానములూ, మొదలైన ద్వంద్వాల కతీతులైన యీ బాటసారి గురుదేవుల పాదాలముందరే ఏర్పడి వుంట వనటానికి సందేహంలేదు.

ఈ విజ్ఞానవేదిక వీరన్న లోకజ్ఞానాన్ని వృద్ధి పరచడమే కాక అతడి అభిమాన విద్య విషయంలో కూడా చాలా దోహదకారిగా పనిచేసేది.

ఒక్కొక్కప్పుడు ఇక్కడ వీరవరుల ప్రసక్తి కూడా వచ్చేది. సాము నేర్పినవాడు అరేడు ఆమడల యీ నడుమ ఎక్కడ వున్నాడన్నా తాత్కాలికంగా వచ్చివున్నాడని విన్నా వీరన్న తన బాణా తీసుకొని బయలుదేరేవాడు. తన ప్రజ్ఞచూపి మెచ్చికోలు పొందో తెలియని మెళుకువలు తెలిసికొనో తిరిగి వచ్చేవాడు.

ఈ విధమైన పరిశ్రమ అతడికి పాతిక ముప్పది ఏండ్ల వయసు వచ్చేవఱకూ సాగింది. అక్కడకు అతడు కండ్లు విచ్చిన రోజులుకూడా ఎంతో ఎడం కావు.

లోక మెట్టిదంటే చిత్రమైనది. నేను దానిని నెపపెట్ట యత్నిస్తున్నానని ఎవ్వరైనా అనుకుంటే వారు నన్ను అపార్థం చేసుకున్నవారౌతారు. నేను సహజమైన దాని యథార్థ నైజాన్ని బయట పెడుతున్నాను—దానిని మారేవిధంగా అర్థంచేసుకున్నా దోషిగా నిరూపించే ఉద్దేశం నాకు లేదు.

లోకం కొన్ని విషయాలలో పిల్లి కోతీ జీడి పిక్కలూ కథలో చిత్రింపబడ్డ కోతివంటిది. అది

తాసై కర్తృత్వం వహించడంవల్ల కొన్ని రకాల ఆనందాలు పొందటానికి మరికొన్ని కష్టనష్టాలను కూడా ఎదుర్కోనవలసి వుంటుందనే టప్పుడు ఆ వూబిలోకి తాను దిగకుండా ఆ వూబినీ అందుకు సాహసించే వారినీ ఊరికనే తెగపొగుడు తుంది. దమ్మిడీ దండగకు ఎడమియ్యని యీ పొగడ్తలను ఎడా పెడా ఖర్చు చేయటంలో అది నష్టపోయే దేమీ ఉండదు. కాని మూర్ఖులైన ప్రజ్ఞావంతులు కొందరు ఈ రహస్యం గుర్తించలేక తమ ప్రతిభనూ అమూల్యమైన కాలాన్నీ జీవితాన్నీ కూడా ఆ మెర మెచ్చులకై లోభించి దుర్వ్యయం చేస్తూవస్తారు. చివరి కొకనాటికి ఆ నిర్భాగ్యులు ఈ శుష్కప్రియాల నుండి కూడా వంచింప బడతారు. ప్రజలు అన్యుల కష్టనష్టాలలో నుండి లభించే యీ ఆనందంతో చాలా వేగంగానే మొహం మొత్తేయంగానో, లేక అంతకు మించిన సమర్థుడింకొకడు తారసిల్లగానో, అదీ కాక పోతే ఒకనాటికి వాళ్ళ అభిరుచే మారిపోగానో, సమస్తం మరిచిపోతారు.

ఇది లోక పరిపాటి.

ఇట్టి విషయాలలో అన్నిటినీ మించిన దుర దృష్ట మేమంటే అన్నిరకాల జూదగాండ్రకులానే ప్రజాగౌరవ సంపన్నాపేక్షతో సమస్తం ఒడ్డి కోల్పోయే యీ జూదగాండ్రకు కూడా కడవరకూ కన్నులు విడవు. ఒకవేళ విడివడ్డా ఆ అఘటుకు పగిలే గుండెలు మళ్ళా కుదుటపడటానికి సాధారణంగా జీవితకాలం — ఒకొక్కప్పుడు చాలా కాలం — పడుతూ ఉంటుంది.

వీరన్న కూడా ఈ సత్యాన్నే ఋజువు చేశాడు.

అతడు తన జీవనపథ నిర్దేశవిషయంలో జరి గిన పొరపాటును గుర్తించ వచ్చేసరికి సరిగా అతడొక ఎడారి నడుమ ఉన్నాడు. ఆ దెబ్బనుండి అతడు కోలుకొనే సరికి మళ్ళా ఇరువదేండ్లు పట్టాయి. అప్ప డైనా అందులో అతడి ప్రయత్న మేమీ ఉన్నట్టు లేదు. పరిస్థితుల ప్రాబల్యమే అతడిని మరలా సజీవు డైన మానవుణ్ణి చేసి ఉంటుంది.

జరిగిన దిదీ

తండ్రి బ్రతికి ఉన్నంతకాలం అత డన్నట్టు వీరన్నకే చింతా లేకపోయింది. చనిపోతూ కూడా ఆ ముసలివాడు తన ప్రాలుమాలిన సుపుత్రుని సంగతి తెలిసిన వాడు కావటంవల్లనో అన్నట్టు కొంతకాలం వరకూ నిర్వ్యాపీగా బ్రతకడానికి సరిపడా మిగిల్చే పోయాడు. కాని ఆ కొంతకాలం గడవటానికి ఎంతో కాలం పట్టలేదు. అక్కడనుండీ వీరన్న జీవితంలో క్రొత్త అధ్యాయాలు ప్రారంభ మయ్యాయి.

ఆ రోజుల్లో ఒక రోజున వీరన్న జీవితపు జమా ఖర్చుల చిట్టా చూస్తే జమలలో విస్పష్టరీతిని కాన వచ్చేవి—అతడు అంతవరకూ కొండో గోపురమో అని పదేండ్లకు తక్కువ కానికాలం నిరంతరాయ మైన కృషికి వెచ్చించి సాధించిన ఘన విద్య ఘన విద్య కాదనీ, ఒకవేళ అయినా నిర్వీర్యులైన ప్రజలు దాని ఆధిక్యతను గుర్తించే స్థితిలో లేరనీ, క్రొత్తగా వీరన్నకు ఏర్పడుకున్న జ్ఞానం, ఆ తరువాతి మూలను చేరిన వీరన్న బాణాకర్రమీద క్రొత్త కొత్తగా చేరు తున్న బూజూ. కాగా అతిడా సరికి కన్న నలుగురు పిల్లలూ క్రొత్తగా సంపాదించిన భార్యాకూడా జమలకాలంలోనే కాన వస్తారు. ఇంక రెండవ కాలంలో తండ్రి గడించిపెట్టిన 'దిభేజా' అంతటితో పాటు అంత కన్నో రెట్లు విలువజేసే జీవితోత్సాహం సర్వసుఖ యోగాలూ కానవస్తాయి.

దారిద్ర్య దేవత నట్టింట పాదంపెడితే వచ్చే మార్పులను గురించి వేరే చెప్పనవసరంలేదు. అయితే మీకు తెలిసినవి సాధారణంగా ఒక దృక్పథంనుండి కానవచ్చేవే అయివుంటాయి. అందుచే దారిద్ర్యం వీరన్న కుటుంబ విషయంలో మంచి కెలా కారణ మయ్యిందో చెప్పి వినుస్తాను.

వీరన్న అడవి తండ్రి తెచ్చిపెట్టిన భార్యతో తృప్తిపడక మన్యను ఇంకొక ఆమెను తీసుకవచ్చాడు. ఒక విధంగా ఆమె అతడి కీర్తి కాంతకు చిహ్నమన వచ్చు. ఆమె తనంత తా వలచివచ్చిన కాంత. కట్టు కొన్న భర్తపోగా చాలాకాలంవరకూ నిష్ఠతో వైధ వ్యాన్ని అనుభవించి కూడా ఒకనాడు అత్తవారింటి ధనసంపదలుతో పాటు మట్టపక్కాలనూ పరువు ప్రతిష్ఠలనూ విడిచి వీరన్న పజ్జ చేరింది. ఆమెను మొట్టమొదట ఇంటికి తెచ్చిననాడు తొలి భార్య సహజంగా కొంత గోలచేయటం తగవు పెట్టడం కూడా జరిగింది. అయితే ఈ తగువులో పెదసరపు వీరన్న మొండిజవాబులకు ఊరి పెద్దలూ ఊరివారూ అలిగివలివేస్తామనీ కొడతామనీ బెదిరిస్తే మళ్ళా ఆ లలనామణే మొగుడు అటకమీద బూజుపట్టిన బాణాకర్ర తీయబోతూ ఉంటే ఆపి అసహాయంగా నిశ్శస్త్రుడై వీధినపడి "ఎనా..."అంటూ ఊరి ఊరం

దరిగుట్టులూ తడవితడవి అందరిచేతా అపరాధపు లెంపలు వేసుకునేటట్టు చేసింది.

ఈ అతిలోకసాధ్వీమణీ, ఆ 'విరాలూ' మొదట్లా గంగా గౌరులని పేరు ప్రైవేసినా కష్టకాలం వచ్చేసరికి ఒక్కటయ్యారు. వీరిద్దరూ ఎప్పటికప్పుడు కూడ పలుకుతుంటూ కొంతకాలం వ్యష్టిగానూ మరి కొంతకాలం సమిష్టిగానూ మామగారు ఆశలుకునుకొని విడిచిపోయిన బృహత్కార్యాన్ని తాముగా సాధించటానికి ప్రయత్నం చేశారు. కాని వారి కన్నీళ్లూ ఎత్తిపొడుపులూ చివరకు తిట్లూ కూడా వీరన్నపై ఏవిధమైన ఫలితాలనూ సాధించలేకపోయాయి. అంతట ఆ ఆడకూతుళ్ళిద్దరూ ఇంక గత్యంతరంలేక భార్యాత్వానికి స్వస్తి చెప్పి భర్తృత్వం వహించ తలపడ్డారు.

వీరన్న వర్గానికి చెందిన కుటుంబాలలో జరగనప్పుడు ఆడవాళ్ళు కూలి చెయ్యటం దోషం కాదు. అందుచే ఆ ఆడవాళ్ళిద్దరూ కాలంలో కూలులకు పోయీ వట్టెరోజుల్లో రాట్నాలపై నూలుతీసీ చాతనైనకాడికి గడించి వీరన్నకు కన్నపిల్లలతోపాటు వీరన్ననుకూడా పోషిస్తూ రాగా ఆ మగవాడు అమరినకాడికి మస్తుగా తిని ఊళ్లోకి క్రొత్తగా వచ్చిన టీ దుకాణంలో మధ్యమధ్య టీలు త్రాగుతూ అందులోనే ఒక వారనున్న కిళ్ళీలషాపునుండి అరువుకు ఒక కారాకిళ్ళీ సంపాదించి నములుతూ వీడి మగతనం గురించీ వాడి పసవతనంగురించీ ఆ కాలపు కుర్రాళ్ళ చవటతనంగురించీ తమరోజుల్లో యువకులదారుఢ్యాల గురించీ అక్కడ జరిగే విమర్శలలో పాల్గొంటూ జర్మనువాడి అసాధ్యతా జపానువాడి తెలివితేటలూ బ్రిటీషువోడి కుత్రిమత్వం గాంధీగారి మాహాత్మ్యం ఆదిగా గల ఆనాటి రాచకీయ విషయాలకు సంబంధించిన కట్టుకథలు ఆలకిస్తూ కాలం గడుపుతూ ఉండేవాడు.

ఊరివారు వీరన్న ఇంటివరసలోని అసందర్భాన్ని గ్రహించినా ఎన్నడూ ఎవ్వరూ అతడిని ప్రశ్నించి ఉండరు. నారాయణి గొడవతో వారు నేర్చుకొన్నపాఠం వారినోళ్ళు మూయటానికిచాలు. పోతే నారాయణే ఎప్పుడైనా అనేది "సిగ్గులేదా... సిగ్గు!! మగవాడంట—మగవాడు!!" అనేది. ఈ యీసడింపుకు వీరన్న ఒక్కొక్కప్పుడు తృప్తిగానవ్వుతూ "నేను మగవాడినౌదునో కాదో నువ్వెరుగుదువ్ జగమెఱుగు!......" అంటూ తన మగతనాన్ని ఇట్టిచోట అనుదాహరణీయమైన మాటలతో లేక ఘోరణితో నిరూపించుకునేవాడు. మరికొన్ని సందర్భాలలో "నీ కెందు కలాంటి దుర్బుద్ధి ఉండిఉండి ఒకసారి పైత్యం తిరగేసినట్టు తిరగేస్తుంటది ... సన్నీశ్వరుడైనా మార్చలేడు. బ్రహ్మ నా నుదుటను నువ్వుకోరిన వ్రాలు వ్రాయలేదు. ఈజన్మకింతే. నువ్వెంత తన్నుకు చచ్చినా నా చేత కూలి చేయించలేవు" అనేవాడు. ఆ సమయాన అతడిముఖాన తాండవించే నైరాశ్యం వేదనా ఆదిగా గల భావాలను చూస్తే నారాయణికే కాదు ఎవ్వరికైనా గుండె కరిగి కాలవ కట్టవలసిందే.

అయితే యీ విరక్తునుకూడా ఒకనాటికి రక్తపరచ్యాలన్నది లోకం. అంటూ అతనినెత్తిపై ధరింపరాని ఒక మహోదోషభారాన్ని పదిలంగా ఎత్తిపెట్టింది.

గత రెండుదశాబ్దాలలో గుర్తింపరానంత వేగంగా మారే ప్రపంచంలో మారే మనదేశంతోపాటు మానాడూ మా గ్రామంకూడా చాలా మారిపోయాయి.

ఆదిని మా గ్రామం నించి ఉదయం ఒకటీ మధ్యాహ్నం ఒకటీగా పోయే రెండుబస్సులూ రెండు నాల్గయి నాల్గు మూడై మూడు ఆరూ పదీ పదహారుగా పెరిగి పెరిగి ఇరవై అయాయి. ఇప్పుడు మావారెవ్వరూ నాలుగుమైళ్ళదాపున ఉన్న పొరుగూరికి కూడా నడిచిపోరు. పావులా పెట్టి బస్సుమీదే పోతారు.

బజారులో పకోడీవంటి పదార్థాల దర్శనం సంవత్సరంలో ఏ ఒక్క రథోత్సవదినంనాడో తప్ప ఎరుగని మావూరిప్పుడు అనునిత్యం సమస్తవిధములైన ఫలహారంపు దినుసులతోనూ సర్వకాల సర్వావస్థలయందూ పరిమళిస్తుంటుంది. బీడాబిక్కీతో పట్టుమని నాలుగువందలగడపైనా లేని మా గ్రామంలో నేడు దగ్గరదగ్గర పదివరకూ కాఫీ హోటళ్ళున్నవి. ఇందులో మూడు ఒక్కొక్కటి దశవార్షికాలు జరుపుకొన్నవి. ఒకటెపుట్టి సరిగా పద్దెనిమిదేళ్ళయ్యింది. ఇంకొకటి పదిహేనేళ్ళక్రితం పుట్టింది. ఇవికాక నాలుగైదు కిళ్ళీలకొట్లూ ఒక పెద్ద ఫాన్సీ గుడ్సు షాపూ ఉన్నాయి.

ఇప్పుడు మాఊర్లో కాఫీయో టీయో కిళ్ళీయో అలవాటులేని మహాభాగుడు అతిప్రయాసపడి వెతికి

తే నేగాని లభించదు. పట్నంపదిమైళ్ళయినా వారానిక్కనీసం సినీమా చూడటానికైనా ఒకసారి పోకపోతే బ్రతకలేనివాళ్లు ఎంతచచ్చుగాచూసినా రెండుమూడు డజనులకు తక్కువకుండి ఉండరు.

రెండవ ప్రపంచయుద్ధంనాటి కంట్రోళ్ళూ ద్రవ్యోల్బణతాఫలితంగానైతే నేం స్వాతంత్ర్యసిద్ధ్యనంతరం మనవారి మానసిక పరిణామాలూ స్థానికంగా ఏర్పడ్డ అసమర్థ పరిపాలనాతత్ఫలితమైన తిండీ గుడ్డా కఱవూ వల్లనైతే నేం ఈవిధంగా జీవితావసరాల పద్దులలో అవసరమైనవికొన్నీ అనవసరమైనవికొన్నీ చేరి మొత్తంపై సంఖ్యలో బాగా పెరిగి ఊరుకొన్నయ్. ధరలుకూడా పచ్చగడ్డినుండి బంగారంవరకూ గల సమస్తపదార్థాలకు చెందినవీ చిత్రవిచిత్రగతుల్లో ప్రపంచంలో గల సమస్త ఆర్థిక మాత్రాలనూ ఒక్కొక్కప్పుడు అధిగమిస్తూ బాగా పెరిగి ఊరుకొన్నాయ్.

ఈ ఆర్థికసంక్షోభంలో కొంతకాలంవరకూనైనా కటకటలాడని కుటుంబం ఉన్నతతరగతికి చెందినదైనా లేదంటే ఇంక బీదా బిక్కీ మాట తెలుపనవసరం లేదు.

బీదవారి ఆహారంలో వస్త్రధారణంలో వృత్తులలో ఎన్నో మార్పులూ వైపరీత్యాలూ అంతరాయాలూ క్రొత్తపద్ధతులూ ప్రవేశించాయి యీ కాలంలో. కందులూ పెసలూ ఉలవలూ ఆదిగా గల సమస్త కాయధాన్యాలనూ బియ్యంతో సమానంగా వాడటం వారు నేర్చుకొన్నారు. జరగనివారు కొందరు ఊరు విడచి పట్టణాలకుపోయి రిక్షాలు లాగటం మొదలుగా గల క్రొత్త వృత్తులు అవలంబిస్తే మరికొందరు బియ్యం పంచదారా మొదలగు కంట్రోలు వస్తువులు దొంగ రవాణాచేసీ, చీకటి బజారు ధరలకమ్మీ, జీవించసాగారు. ఇంకా కొందరు కంటసారా వ్యాపారం దొంగతనం ఆదిగా గల సాహసవృత్తులకుకూడా చొరుకున్నారు. మరికొందరు మరికొన్ని.

ఆరోజుల్లోనే — అందు నిజమెంతో అబద్ధమెంతో చెప్పటానికి నాకు ఆధారాలుచాలవుగాని — లోకం వీరన్నజీవితానికి ఒక కళంకాన్ని ముడిపెట్టింది.

నేను మావూరు విడిచి అప్పటికే చాలాకాలమయ్యింది. కాగా ఈనాడు నా తత్వ మెట్టేదంటే కండ్లతోచూచి గ్రహించినదానిలోకూడా మూడు వంతులు అసత్యం ఉండటానికి అవకాశం లేక పోలేదు అనుకునేధోరణి. అందుచేతే నేను ఇదమిద్ధమని ఈ విషయమై ఏమీ తేల్చలేకుండా ఉన్నాను. ఏమైనా విన్నదిమాత్రం యిది.

లోకం — వీరన్న చివరిరోజులలో తన పొట్ట పోషించుకోవటానికి చోరవృత్తి నారంభించాడన్నది. ఆదిలో గింజా గట్రా దొంగతనం చేశాడన్నారు. తరువాత రాత్రులందు పొరుగూర్లలో దొంగతనాలు చేసివస్తున్నాడన్నారు. రెండేండ్లలో అతడికి కొందరు గజదొంగలతో భాగస్వామ్య మున్నదన్నారు.

లోకం సంగతి మన మెరుగనిది కాదు. అయినా అందుకు వారు చూపే కారణాలంటూ కొన్ని లేక పోలేదు.

మొదటిది కూలీనాలీ లేకపోయినా వీరన్న కుటుంబం జీవనం చేస్తున్నది. రెండవది దిబ్బడితో స్నేహం. దిబ్బడు ఒకప్పుడు వీరన్న శిష్యుడైనా వాడు జైలుకు వెళ్ళివచ్చిన గజదొంగ. మూడవది అతడు అప్పుడప్పుడు రాత్రులు ఇంటివద్ద కనపడక పోవడం రాత్రులు తిరిగిరావడం ఆదిగా గల నిశాచర చర్యలు.

ఈఅపప్రథనుగూర్చినసత్యాసత్యాలు తర్కించ దలచి అవకాశాలు తడవితే అవికూడా వీరన్నకు ఎదురు తిరిగే కనిపిస్తవి.

అంతకు రెండేళ్ళక్రితం నిండు పదిహేనేండ్లు పెంచిన చెట్టంతకొడుకు చెప్పి పెట్టకుండా ఈలోకం విడిచిన పర్యవసానంగా వీరన్న వ్యక్తిత్వంలో చాలా మార్పురావడం; దేశపరిస్థితులకు తోడు వర్షాభావమాది స్థానికపరిస్థితులుతోడై దుర్భిక్షంలో అధికమాసంగా కరవుకుతోడు దొరికే కూలి నాలికూడా దొరకని రోజులు రావటం, అరవైయేళ్ళు వచ్చాక చదువ నేరుస్తానన్నట్టు వీరన్న కులవృత్తిలోకి దిగదలచినా నూలు కంట్రోలుదినాలలో అది అసాధ్యం కావటం, ఆదిగా గల పరిస్థితులు మనిషినే తప్పుదారి త్రొక్కించ దలచినా త్రొక్కించవచ్చు నని పిస్తాయి.

పోతే వీనివన్నిటినీ ఖండించటానికి రెండే రెండు బలహీనమైన యుక్తులు కనిపిస్తాయి. ఒకటి అతడింతవరకూ ఎట్టి అకృత్యమూ చేస్తూ వుండగా కన్నారా చూసినవా రెవ్వరూ లేరనటం. రెండవది ఇంతకన్నా బలహీనమైనది — అతడివంటి వాడు

చివరిదినాల్లో అట్టిఅకృత్యాని కొడగడుతాడా అనే ప్రశ్న.

ఏమైనా లోకంమాత్రం నిశ్శంకగా అతడి ముసలిముఖాన కళంకం అలిమేసింది. అంతేగాదు అతడి అంతిమయాత్రనుకూడా విరూపను చేయకుండా విడిచిపెట్టలేదు.

వీరన్న అంతిమయాత్రనుగూర్చి ప్రచారంలోకి వచ్చిన కథ ఇట్లా వుంటుంది.

అతడు తానుచనిపోయిననాటికి మూడురోజులు ముందుగా వరుసగా రెండురోజులు ఊరిలో కనుపించలేదట. తరువాత ఆనాటి అర్థరాత్రి దాటాక మూడవ జాము అంత్యానో నాల్గవజాము మొదటనో వీరన్న ఇంటితలుపు ఎవరో కొట్టడం ఎవరని లోనివారు అడుగగా ఎవరిదో క్రొత్త గొంతు ఒకటి వినిపించడం కొంతసేపు తరువాత ఆకస్మికంగా వీరన్న మొదటి భార్య ఆర్తస్వరంతో "ఓయి నాయనోయ్......" అంటూ ఏడువబోయి, అంతలో ఇంకొకరు చప్పన నోరుమూసినట్టు ఆగిపోవడం.........ఇత్యాది తాము విన్నట్టు పొరుగువారినుండి ఒక కథనం ప్రచారంలోనికి వచ్చింది. ఇదంతా ఎప్పుడూ మూడురోజుల నాడు ఆ తెల్లవారుజామున "అయ్యో నారాజా!..." అంటూ వీరన్న భార్యలు గొల్లుమన్నాక.

అయితే సాధారణంగా ఇట్టివే అయిన తక్కిన ప్రవాదాలన్నీ ఎట్లా గాలికన్నా వేగంగా ప్రచారంలోకి వస్తూంటాయో ఇదికూడా ఆలానే ఆపద్యో విధవారాంద్ర శోకాలాపాలకన్నా ఎన్నో రెట్లు వేగంతో ప్రచారంలోకి వచ్చింది.

తెల్లవారేసరికి వీరన్న మరణవార్తకన్నా ముందు మరణించినవిధమే అందరికీ తెలిసిపోయింది. ఆదెబ్బతో ఆ ప్రాంతాల కెవ్వరూ తొంగిచూడలేదు. ఇరుగు పొరుగులవారుకూడా అర్జంటు పనులమీద ప్రక్క వీధుల్లోకిపోయి అక్కడ మరిచిపోయి మాటల్లో పడ్డారు.

చివరకు వీరన్న భార్యా మరి ఒకసారి నోరు చేసుకోనారంభించేసరికి అప్పటికి ఊరి పెద్దలు మరి లోలో ఏమనుకున్నారో కదలి వచ్చారు. ఎవరే మట్టుకవారే ఏమీ తెలియనట్టు వచ్చి చేయవలనే హంగామా అంతా చివరకు దహనసంస్కారాలుకూడా ఎట్లానో అయ్యాయనిపించారు.

ఈ సందర్భంలో నారాయణికిచ్చినవాయిదాలలో తక్కిన వారి పిల్లలు ఇచ్చినవానితో సరిపోకపోయినా ఇట్లా ఉన్నదిట. వీరన్న అంతకుముందు వారం రోజులనుండీ ఉష్ణంతో బాధపడుతూ వచ్చాడుట. అది ఇట్లా ముంచుకవస్తుందని తా నెన్నడూ కలలో నైనా ఊహించలేదట.

బుద్ధిమాలిన మొద్దులు. తరువాత వల్లా ఇట్లా నారాయణిని వేధించీ ఆ పిల్లలను బాధించీ తమ తలలు పగలనేసుకొనీ యాతనలు పడేకన్నా అప్పుడే దహన సంస్కారములకు ముందు జరిగే శవసంస్కారాలకు ఆదుకున్నట్టయితే వాళ్ళ కోరికా తీరేది మన సందేహాలూ మిగిలిపోయేవి కావు. కాని అట్లా జరగలేదు.

అయితే ఏది ఎట్లాఉన్నా వీరన్న ఇంకలేడు. మానవ జీవితంలో తప్పని సమస్త సుఖదుఃఖాలకూ దూషణ భూషణాలకూ కీర్త్యపకీర్తులకూ అతీతమైన మృత్యువు వెనుక అత డేమయ్యాడో ఎక్కడకు పోయాడో యెవ్వరికీ తెలియదు.

ఇంతటితో వీరన్న చరిత్ర సరి!!!

*　　　*　　　*

వీరన్న చరిత్ర ముగిసింది—కాని ఇంకొక్క రెండు ముక్కలు చెప్పవలసినవి మిగిలిపోయాయి. వీరన్న చరిత్ర ఏల వినిపించానన్నే దానికి సంజాయిషీగా ఇచ్చుకోవలసినది కొంత వున్నది.

వీరన్న చరిత్రను నే నిట్లా వినిపించినది అతడు పడ్డకష్టాలకు నా హృదయం కదలిపోయికాదు. నిజమే. అతడు జీవితంలో అనుభవించిన ప్రతి వెన్నెలరాత్రి నీ రెండు చీకటి రాత్రులు అవ్వతీర్చాడు. అయితే యీ సందర్భంలో మీరూ నేనూ అతడి కుటుంబం కూడా అతడికై జాలిపడ్డా అతడు మాత్రం తనకై తా నెన్నడూ విచారించలేదు. అందుచే అదికాదు కారణం.

అట్లానే చిట్టచివర అతడి జీవితంలో వ్యక్తమైన కారుచేదు చే మోహితుడనయ్యీ కాదు. ఒట్టి చేదును చేదుకై మ్రింగటం మ్రింగించటం వంటి రస హృదయానికి నేను నోచుకో లేదు.

పోతే యింక కారణం సూటిగా చెప్పేస్తాను.

వీరన్న పోయాడనటం నిజమే. కాని అతడు ఉండీ ఉడిగీ నన్ను మహా వేధిస్తూ ఉంటాడు.

ఎప్పుడైనా ఒకనాడు ఒంటరిగా నిశ్శబ్దంగా ఉన్న వేళ ముఖ్యంగా రాత్రులందు కన్ను మూసే వేళ వీరన్న ప్రత్యక్షమౌతుంటాడు. సరిగా అప్పుడే వీరన్న భార్య అలనాడు నేను మా వూరిలో ఒక అర్ధరాత్రి వేళ మెలకువ పొందగా ఆ ప్రగాఢ ప్రశాంతతలో మంద మందర స్థాయిలో వినిపించిన శోకాలాపం "రాజా......నారాజా......" అంటూ పదే పదిగా ఆలపిస్తూ వినిపించిన పరిదేవనం నా చెవులలో మారుమ్రోగుతుంది.

నారాయణీ వీరన్న బాల్యయవ్వన కౌమారాలూ పిదప కాలంలో కష్టాలూ కళంకం మృతీ సవ్యాపసవ్యంగా వ్యస్తావ్యస్తంగా జ్ఞప్తికివస్తాయి. అప్రయత్నంగా — 'ఈ నిర్భాగ్యు డేమి సాధిద్దామని తాపత్రయ పడ్డాడు—కడ కేమి సాధించాడు' అనే ఆలోచనలో పడతాను. అట్టి వేళల అతడి మూర్తి మొదట నైరాశ్యం విషాదం ఈషదభియోగోద్యోగతా ముఖాన ముప్పిరిగొనగా కానవస్తుంది. తరువాత విషణ్ణహాసం చేసే అతడి పెదవులు కదలకపోయినా నైరాశ్యపు ఛాయలు వెదజల్లే ఆ చూపుల్లో మరే క్రొత్త భావాలూ పొడసూపక పోయినా మొత్తముపై అతని మూర్తినుంచే క్రమ క్రమ విస్పష్టమయ్యే అభియోగం ఒకటే నా హృదయానికి వ్యక్తమౌతుంది.

అతడిపై నాకు గల సానుభూతిచే ప్రేరేపితుడనై ఆ అభియోగ భారాన్ని ఎవరినెత్తిన వేయటమా అని వెతుకుతాను. అతడి తండ్రీ సహచరులూ ఆ రామమందిరపు ముఠా కథలతార కబుర్లరాయుళ్లయిన అలనాటి బాటసారులూ తాను చేస్తున్న దేమో తామే ఎరుగకుండా ఆదిలో అతడి నృత్య విన్యాసమూ అతడి స్వల్ప విజయాలనూ మహోఘనంగా చేసి పొగడిన గ్రామీణులూ—అందర్నీ ఒకరి తరువాత ఒకరినిగా సముఖానికి తెచ్చుకుంటాను. ఎవరికి వారే ఆ అభియోగ భారాన్ని నిష్కర్షగా తిరస్కరిస్తారు.

అంతట ఇంక గత్యంతరం లేక ఆ మహాభియోగ భారాన్ని నా వర్గానికి చెందిన వారందరి తరఫునా నేనే నెత్తిన వేసుకొన్నాను.

అందుచేతే అందుకు నిష్కృతిగా ఏ రసమూ లేని ఆ వ్యక్తి నీరసగాథ కిట్లా చరిత్రత్వమిచ్చి పాత వీరన్నను * సేనా పతి వీరన్నను చేసి చివరకు నా చేతలకు నేను జవాబు చెప్పుకోవలసి వచ్చింది.

* పాలీలను—ఆదిని బహుశః వ్యంగ్యంగానూ, కాలగతిని వాడుకగానూ, సేనా పతులని వ్యవహరించటం మా ప్రాంతాల కలదు. ఇతరులు వ్యవహరించటమే కాదు వారుకూడా మీ రెవరండీ అంటే సేనా పతుల మంటారు.



అంతర్వాణి

★

"సురభి"

[పరమేశ్వరుని పార్వతీప్రణయబద్ధుని చేయవలసినదిగా ఇంద్రుని వేడికోలు. ఆదిలో "ఇదెంతపని" యన్న మన్మథుడు తుదకు సాశంకముగా బయలుదేరినాడు................]

క్షితిభృద్భీషణ భూమి భృద్విభవ పక్షచ్ఛేదనాఖేటద
ర్పిత వజ్రాయుధు డప్సరః ప్రణయవల్లీ లాస్యకేళీప్రసా
రిత దృక్కోణ సహస్రు డింద్రుడకొ! అర్థిస్థానియైనిల్చి స
న్నుత త్రైవిష్టప మోహసంజననధానుష్కున్ ననున్గోరుటల్ !

పాటితవైరివర్గుడు, కృపాధుని, నాజనకుండు, దేవతా
కోటి కనారతంబుఁ గడుఁ గూరుచు చుట్టమనై వెలుంగు; నా
మేటికి మూడుమూర్తులను మించి జనించిన మన్మథుండ; నీ
పాటి పౌనర్భలేన ? పువ్వుబాణము లేటికి ? విల్లదేటికిన్ ?

కీడుఁదలంచి మేలుఁ బరికింతము నా మెయిజూడ చంద్రమ
శ్చూడు డెఱింగెనేని నిలుచున్నటులన్నను కన్నుమంటలన్
బూడిదసేయడే ? జరుగుఁబో ! పౌనరించినమేలు దేవన
ప్రమాడభిశంసితంబయి చిరస్మరణీయమునై వెలింగెడిన్ !

నాయటువంటి కార్యఘటనాఘటన ప్రతిభుండు, మోహసం
ధాయకమూర్తి విల్దొడిగె నా పువుటమ్ము ! విశీర్ణమై ధృతి
శ్రీ, యెవరైనగాని మరులీలల సోలుదురన్నచో ! హరుం
డా యెదురొడ్డి నిల్వగల యాతడు ! చూతముగాక పోకడల్ !

అరయ నాపౌనర్భ్యసదియైన విరుద్ధమ ? సర్వజంతు సా
ధారణమైన కామ్యము కదా ! దహనాంబకు డేలనాపయి
న్నూరును కత్తి ? నాకొరుగనున్నది ఏమిట ? లోకసంగ్రహో
దారతకై, దీనికయి తర్జనభర్జన లేల యింతగా ?

నవవికచారవింద మళినాదము లిక్షుశరాసనంబు మా
ధవ సహకారమున్ తుహినధాము సహాయముఁ గల్గునంతకున్
పువు విలుకాఁడొనర్పుటకుఁ బోలని కార్యము పుట్టునే? మహా
శివుని పినాకినైన వివశీకృతుఁజేసి ధృతి న్దొలంచఁడో?

ఉగ్రతపస్సమాధినియమోద్ధతుఁడౌ హరునా! లతాంత సా
మగ్రిఁ బురస్కరించుకొని మార్కొనుటల్ పటుకార్య సాధక
ప్రాగ్రసరుండుఁబోలె బహుభంగుల బీరములాడితిన్, సుప
ర్వాగ్రణి యేగతి న్ననుదలంచినఁగాని ప్రతిజ్ఞ నీగదన్.

గొనయముఁ దీర్చి నేను కొనగోటను మీటితినా! విలాసభా
జనమయి ప్రాణిలోక మదిసాగును నా చనినట్టి త్రోవనై!
ప్రణుత మహాగ్ని పంచికతపశ్చరణ స్థితనిశ్చయుల్! మహా
మునులును జారిపోవుదురు పో బళి! నీళ్ళకుగూడ పల్చనై!

ఏమిది వామబాహువుచలించె? నెఱింగితిప్రోజ్వల త్తప
శ్రీమహితాత్ముఁడౌ హరున జేయ భయంకరమూర్తి తోఁచెడిన్!
ఆమెయిఁ బ్రాకుచున్నవి మహాహులె! హా! నవనాళ్ళుక్రుంగ! ఏ
మేమి? మెఱుంగుచొచ్చినటు లీతను వెల్లయు వ్రచ్చి పోయెడిన్.

ఏలికయైన యింద్రుడు రతీశ్వరు నగ్గనుచున్ సహస్రదృ
గ్గోళముల్ "చెలీ! ఒరులకుం గడుదుర్ఘట మీవ ప్రోజ్వల
త్ఫాలుని పార్వతీప్రణయపాలు నొనర్పగజాలు"దంచ నేన్
పాలన సేయనే అసువు బాసియునైన సురేశునానతిన్?

ఫాలాక్షుండు దహించుగాక; స్వవచోవ్యాఘాతదోషంబునా
పాలన్బట్టుట కిచ్చగింపను, నిలింపస్వామి నాయీధను
శ్రీ లావణ్యమెఱుంగుగాక, గరళగ్రీవున్ ప్రసూనాశుగ
జ్వాలాధీనుఁ బొనర్పఁబోవుదు, సుపర్వక్షేమ సంధాయినై.

—.—


తెల్లగా
ఉతుకబడినవి
ప్రకాశవంతముగా
ఉతుకబడినవి
ఇందుకు
సన్ లైట్
సబ్బే కారణము
బాదకుండగనే బట్టలను
తెల్లగాను, ప్రకాశవంత
ముగాను ఉతుకును !
SUNLIGHT
SOAP

S. 203-50 TL



నవల:

శాఫో

★

ఆల్ఫోంజ్ డాడె(ట్)

13

మర్నాడు ప్రొద్దున్నే సీజేర్ బాబాయి, జీన్ సామానులూ, బట్టలూ అన్నీ ఛాబిల్లీ ఇంటి నుంచి తరలించుకు వచ్చి, తెగతెంపులు పూర్తి చేసే పని అంతా తనమీద పెట్టుకొని ఛాబిల్లీ వెళ్ళాడు.

అతను రావటం చాలా ఆలస్యమయింది. అక్కడ ఏమయిందో, ఏం అఘాయిత్యపు కబురు వినవలసివస్తుందో అనుకొంటూ, అంతకంతకు మనస్సును అలజడి పెట్టుకొంటూ కూర్చున్నాడు జీన్. చివరికి ఒక పెద్ద సామాను బండి హోటలు ముందర ఆగింది. తాళ్ళతో కట్టిఉన్న పెద్దపెద్ద ట్రంకులూ అవీ చూసి తనసామానేనని జీన్ గుర్తుపట్టాడు. ఇంతలో సీజేర్ బాబాయి, చాలా విచారంగా మొగం పెట్టుకొని, ఇదమిద్ధమని ఏమీ తేలనీయకుండా గంభీరంగా లోపలికి వచ్చాడు.

"అబ్బ, చాలా సేపు పట్టిందిరా అబ్బాయి. మళ్ళీ మళ్ళీ తిరగటం దేనికని, సామానంతా ఒకసారే పట్టించుకొని వద్దామని చూసేటప్పటికి, ఆలస్య మయి పోయింది." ఇంతలో కూలివాళ్ళు సామానులు తెచ్చి గదిఅంతటా విరజిమ్ముతున్నారు. సీజేర్ ట్రంకులవంక వేలు చూపిస్తూ అంటున్నాడు. "అదిగో ఆ ట్రంకంతా చొక్కాలూ అవీ; దీనినిండా గుడ్డలున్నాయి. ఇవిగో ఇవన్నీ నీ పుస్తకాలు, కాగితాలూ! దానివల్లా, నీ ఉత్తరాలు ఒకటే. పాపం బతిమలాడింది. అవొక్కటైనా ఉంచి వెళ్తే కొన్నాళ్ళపాటు అవి చదువుకొనైనా నిన్ను జ్ఞాపకం చేసుకొంటూ, కాలం గడుపుకొంటానని ఎంతో ప్రాధేయపడింది. ఉంచితే మించిపోయిందేముందిలే అని ఉంచేశాను. ఫ్చు! పాపం, ఎంతో మంచి పిల్లరా!"

అని ట్రంకుపెట్టిమీద కూలబడుతూ బుగ్గలు బూరించుకొని పెద్ద నిట్టూర్పు విడిచాడు. ఒక చిన్న తువ్వాలంత ఉన్న సిల్కు జేబురుమాలు, మసిధూళి కొట్టుకొంటున్న దొకటితీసి, నుదుట చెమట తుడ్చుకొంటూ కూర్చున్నాడు. ఆవిడ ఎల్లాఉందో, ఏమిటో, ఏవిషయం అడిగేందుకూ జీన్‌కు గుండె నిబ్బరం చాలటం లేదు. అదంతా చెప్పి, కుఱ్ఱవాణ్ణి వ్యథ పెట్టటం ఎందుకని ఆ బాబాయి ఆ విషయం ఏమీ చెప్పటంలేదు. అల్లాగే ఇద్దరు బరువుగుండెలతో, మనస్సులో మాటలు బైటికి చెప్పే ధైర్యంలేక, ఏవో అసంగతపు విషయాలు - క్రితంరోజునుంచి గాలిలో మార్పు వచ్చిందనీ - ఇత్యాదులు మాత్రమే మాట్లాడుకొంటున్నారు.

శీతగాలి దుర్భరంగా ఇనుమడించింది. పారిస్ శివార్లలో చెట్లు మోడువడిపోయి ఒక్క ఆకైనా లేక, అంతా ఎడారిలా కనబడుతోంది. ఫ్యాక్టరీ గొట్టాలు, నీరునించే పెద్దపెద్ద ఇనపతొట్టెలు, ఆ ఎడారి దృశ్యాన్ని మరింత హృదయవిహీనంగా చూపిస్తున్నాయి.

కొంతసేపయాక జీన్ అడిగాడు.

"అయితే, నాకిమ్మని ఏమీ ఇయ్యలేదా బాబాయి?"

"లేదు. ఏం భయపడకు. ఆమె నిన్నింక ఏమీ బాధపెట్టదు. అతి గాంభీర్యంతో, దృఢమనస్కురాలై, ఆమె తన ఈ విధిని తాను స్వీకరించింది."

ఆ బాబాయిమాటలు తన్ను ఆక్షేపిస్తున్నట్టు, తన మొండితనానికి తన్ను నిందిస్తున్నట్లు, జీన్‌కు ఎందుకు ధ్వనించిందో?

ఆ బాబాయి చెప్పుకుపోతున్నాడు.

"అంతా సజావ్‌గానే జరిగిపోయిందిలే. కాని అది మెరుగా ఇది మెరుగా అని చూసుకొంటే, పాపం ఈ అమ్మాయి నిస్పృహను ఎదుర్కోటం కంటే, లామోరాన్న రక్కులా బరుకులే, నామటుకు నాకు, సయమనిపించాయిరా బాబూ!"

"ఏం, చాలా ఏడ్చిందా?"

"ఓరి నాయనా! ఒకటే ఏడుపు. గుండెలు పగిలిపోతున్నాయా అన్న ట్లేడ్చింది. ఆ ఏడుపు చూస్తే నాకూ కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి. నేనూ జావజావ అయిపోయాను" అని, ఏమాటా సరిగ్గా రాక మాటలు తడబడి, ఇంతలో ఆ స్మృతుల నన్నిటినీ విదిల్చేసుకొంటూన్నట్లు విసురుగా, గంగిరెద్దులా, తల వూపి మళ్ళీ సాగించాడు.

"అసలు ఏదిఏమైనా, అంతకన్న చేసేదిమాత్రం ఏముంది? తప్పు నీది నేందుకూ వీలులేదు. నువ్వయినా జీవితం అంతా అల్లా గడుపుకోటం కుదరదు. అంతా సమంగానే పరిష్కారం చేశామాయెను. ఆవిడకు డబ్బా ఇస్తివి. సామానులు ఆవిడకే ఉంచితివి — ఇంక ఈ పాత ప్రేమకలాపాలన్నీ మర్చిపో! పెళ్ళి, సంసారం, ఆ విషయం అంతా చూసుకో. కాని ఆ విషయాలన్నీ నా తలకు మించిన వ్యవహారాలు. అదంతా కౌన్సల్‌గారిలాంటి వాళ్ళు చూడవలసిందే. నాకు చేతైనప్పనల్లా ఇల్లాంటి చిన్న చిన్న అసందర్భాలేమైనా ఉంటే అవి సరిచూడటం మటుకే..."

ఇంతలో అతనికి మళ్ళీ విషాదం ముంచుకొచ్చింది. కిటికీ అద్దానికేసి నుదురుఆనించి, హోరున కురుస్తున్న వర్షాన్ని, మబ్బులతో మూసుకొనిపోతూ వాలిపోయిన ఆకాశపుటంచులనూ, తదేకధ్యానంతో చూస్తూ కూర్చున్నాడు. "అంతా బాగానే ఉంది గాని, ఏమిటో ప్రపంచమే, మరీ, నాటినాటికీ, దుఃఖమయంగా తయారవుతోంది. నా చిన్నప్పుడు ఎడబాట్లను ఇంతకన్నా తేలికహృదయాలతో స్వీకరించేవారు"

షోకేలా, తన మోటారు పంపు పట్టించుకొని వెళ్ళిపోయినతర్వాత, ఆబాబాయి, ఆ సరదాకబుర్లూ, ఉత్సాహమూ, ఉల్లాసమూ, అవికూడా లేనిలోటు జీన్‌కు, మరీ కనిపించసాగింది.

ఆ వారం అతిదీర్ఘంగా దేకుతూ నడిచినట్లు నడిచింది. అంతా నిరామయంగా నిస్పృహాజనకంగా, మృతిబంధు విలాపప్రాయిక దైన్యంతో నిండిపోయినట్లుంది. ఇల్లాంటిసందర్భాలలో, విలపించతగ్గంత గాఢప్రేమచుంటూ ఏదీ లేకపోయినా, తనదై ఇతరులలో భాగమైపోయిన తనదైన అర్ధభాగంకోసం, ప్రతీవ్యక్తి వెదుకుకొంటాడు. ఎందుకంటే, ఒక్క కంచంలో తింటూ, ఒక్క మంచంపై పడుకొని గడపిన సహచర్య జీవితం, అదృశ్యంగా, అతిసున్నితమైన బంధాలను, ఇద్దరిచుట్టూ సాలిగూడులాగా అల్లి పెనవేస్తుంది. తెగతెంపులు చేసుకొన్నప్పుడుతప్ప, ఆ బంధాలు ఎంతటి బలాన్ని వృద్ధిపరుచుకొందీ, అవి తెంచటంలో ఎంత బాధా, యాతనా, పడాల్సిందీ సరిగ్గా తెలిసిరాదు. పరిచయాలు, అలవాట్లు, అతిగాఢంగా జీవింతాంతర్భాగాలుగా చొచ్చుకొని పోగల అద్భుత ప్రభావం కల విశేషాలు. ఉమ్మడి జీవితం గడుపుతూన్న ఏ ఇద్దరు వ్యక్తులైనా, చివరికి వారు వీరు, వీరు వారుగా, ప్రతిబింబిస్తూ మమైకం పొందుతారు.

శాఘోతో గడిపిన ఐదుసంవత్సరాలలో జీన్ అంతటి పరిణతికి రాలేదు. కాని అతని దేహంమీద ఆ గొలుసులు చేసిన గాట్లుపడ్డాయి. ఆ గొలుసుల మోత బరువు ఇంకా దేహం ధరిస్తూ ఈడుస్తున్నట్లే ఉంది. ఎన్నోసార్లు ఆఫీసు విడిచి బయలుదేరగానే అతని పాదాలు వాటంతటవే ఛావిల్లీ కేసి దారితీసేవి. అల్లాగే, ప్రొద్దున్న నిద్ర మెలుకువరాగానే తలగడ

దిండుపై తలప్రక్కనే చూసుకొనేవాడు. ఆమె వినీలకేశభారం, విడివడ్పుకొని తలగడ దిండు అంతా ఆక్రమించుకొంటూ కనబడుతూండేదేమోనని. అప్పటి రోజుల్లో నిద్రలేవగానే మొట్టమొదట ఆ కేశపాశాలను ముద్దెట్టుకొనేవాడు.

అన్నిటికన్నా సాయంకాలాలు మరీ కాలం గడవని కాలాలుగా కనిపించేవి. ఆ హోటల్ గది, మొదటిరోజుల్లో ఆమెతో తన శృంగారానుభవాలను స్మృతికి తెచ్చేది. ఆరోజుల్లో ఎంత మనోహరంగా ఉండేది! ఎంతటి సున్నితత్వం! ఎంత సెమ్మది నడవడి! ఆమె విజిటింగ్ కార్డుకూడా తన గదిలో అద్దానికి ఒక వింత సువాసనను చేకూర్చేది. ఆమె పేరులాగే, ఆ సువాసనకూడా, ఏదో అవ్యక్త గాంభీర్యాన్ని స్ఫురింపచేసేది. ఫాన్నీ లిగ్రాండ్.

ఆ తలపులు వచ్చినప్పుడు, వీధిలోకి నడకకు బయలుదేరేవాడు. నడిచి నడిచి ఒళ్ళు అలయగొట్టుకొని, చివరికి ఏ చౌకరకం నాటకం హాలుదగ్గిరో బ్యాండు మేళాల మోతలో, కన్నులు బైర్లు గమ్మే లైట్ల వెలుతురులో, దేహాన్ని మరింత నీరసింప చేసుకొని గదికి చేరుకొనేవాడు. కొన్నాళ్ళకు, వారానికి మూడు సాయంత్రాలు, ఐరీన్‌తో కబుర్లాడుకొంటూ కూర్చొనేందుకు డాక్టరుగారి అనుమతి పొందాడు. సంబంధం ఒక నిశ్చయానికి వచ్చేసింది. ఐరీని అతన్ని ప్రేమిస్తూంది. ఆమె బాబాయిగార్కికూడా ఈ సంబంధం నచ్చింది. ఏప్రిల్ మొదటి వారంలో, అతని అప్రెంటిస్ కోర్సుకూడా పూర్తయాక పెండ్లి జరగాలని నిశ్చయమయింది. ఇంకా ఈలోపుగా శీత ఋతువు మూడు నెలలు గడవాలి. ఒకర్నొకరు రెప్ప వాల్చుకోకుండా చూసుకొంటూ, ఒకర్నొకరు అవగాహన చేసుకో ప్రయత్నిస్తూ ఒకరినొకరు కాంక్షిస్తూ, ప్రథమ సమాగమ సమయాన్నూహించుకొని కలలు కంటూ స్వర్గసోపానాలు నిర్మించుకొనేందుకు అపారమైన అవకాశముంది.

వాళ్ళసంబంధం నిశ్చయానికి తాంబూలాలు పుచ్చుకొన్ననాటి సాయంత్రం, ఇంటికిరాగానే జీన్ నిద్ర పట్టక తన గదిఅంతా సర్ది బాగుచేసుకోటానికి ఉపక్రమించాడు. అంతః ప్రవృత్తికి సరిపోయేటట్లుగా బాహ్యపరిసరాలను కూడా అట్టే పెట్టుకోవాలనే మానవ సహజ స్వభావంతో గది సర్దటం ప్రారంభించాడు. టేబిల్, పుస్తకాలూ, సరిగ్గా సర్దటం మొదలుపెట్టాడు. అంతవరకూ పుస్తకాల మూటలు విప్పనేలేదు. ఆ పుస్తకాలు తీస్తూంటే, కమర్షల్ లా నిఘంటువులో నుంచి ఒక కవరులేని ఉత్తరం మడత విచ్చుకొంటూ క్రిందపడింది. ఉత్తరం ఫాన్నీ దస్తూరిలో ఉంది.

కేవలం తన అదృష్టాన్ని నమ్మి ఆ ఉత్తరం ఆ పుస్తకంలో ఆమె ఉంచింది. సీజర్ బాబాయిలో కల్గిన క్షణికమార్దవాన్ని నమ్మలేక, ఈ పుస్తకంలో ఇల్లా పెట్టిఉంచితేనే ఏనాటికైనా జీన్ ఉత్తరం చూసుకోటానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని అల్లా చేసింది. అందులో, ఆ పుస్తకమే, అతను ఎక్కువ సార్లు తీస్తూఉంటాడని ఆమెకు తెలుసు.

ముందు ఆ ఉత్తరం తెరిచి చదవాలనుకోలేదు. కాని మొదటి మాటలలోని, మార్దవము, మంచితనం, అతన్ని లోబరచుకొన్నాయి. అక్షరాల వంకరలలో తప్ప, రచనలో, రచయిత మానసికోద్రేకం వ్యక్తం కావటంలేదు. తన నామె అర్థిస్తున్నదల్లా ఒక్కటే, దయ చూపమన్న విషయం ఒక్కటే—అప్పుడప్పుడు వచ్చి చూస్తూండమని మాత్రమే. ఆమె ఏ విషయం ఎత్తదు. దేనికీ, అతన్నాడిపోయదు—పెళ్ళివిషయంలోగానీ—తమ ఎడబాటు విషయంలోగానీ; ఆ ఎడబాటు అవశ్యం అనీ, చివరిఎడబాటేననీ కూడా, ఆమె గ్రహించే ఉంది. కేవలం అతన్ని చూడాలని మాత్రమే కాంక్షిస్తూంది.

“ఇది నాకు మహాఘాతమని, అకస్మాత్తుగా పిడుగుపడ్డట్టుగా జరిగిందనీ జ్ఞప్తిలో ఉంచుకో. ఏదో, ఉన్నయిల్లు తగలడిపోయినట్లో, లేక ఎవరో అకాత్తుగా మరణించినట్లో, అనిపిస్తూంది నిత్యం. నన్ను నేను ఏంచేసుకోవాలో నాకు తెలియటంలేదు. ఎంతో ఏడుస్తున్నాను. అస్తమానం నీకోసం ఎదురుచూస్తున్నాను. నేను సుఖంగా గడిపిన పరిసరాలన్నీ పరికిస్తూ కూర్చొంటున్నాను. ఈ నూతన పరిస్థితికి అలవాటుపడేందుకు, నువ్వుతప్ప నాకు సహాయం చెయ్యగలవాళ్ళయినా ఎవరూ లేరు. ఎంతో దయదలచిన

నాడవౌతావు—ఒక్కసారివచ్చి నన్ను చూడు. అల్లా అయినా, ఈ పిరికితనం పోగొట్టుకోగల్గుతాను. ముందు ముందు ఏంచేస్తానో అని, నాకు నాకే భయంగా ఉంది..."

ఈ దీపాలాపాలు, ఈ వేడికోళ్ళు, ఉత్తరం అంతటా అలముకొని ఎక్కడికక్కడ "రావా!" అన్నమాటతో ముక్తాయింపు అందుకొంటూ, ఉత్తరాన్ని నింపేశాయి. అచ్చు, ఆ అడివిలో ఆ బూడిద పులుముకొన్న నీలివర్ణపు పంజచీకటిలో, తన పాదాల వద్ద మోకరిల్లుతూన్న ఫాన్నీ ప్రక్కనే ఉన్నట్టుంది. ఆ మొగమంతా నిష్ప్రభతో, పాలిపోయి, కన్నీళ్ళ చారికలు కట్టుకొంటూ, తెరిచిననోరు, చీకటి గూడు కట్టుకొన్న ముద్దలా, అవ్యక్తరోదన మొనరిస్తూన్నట్లుంది. ఈ రూపమే రాత్రిఅంతా కల్లోకూడా అతన్ని వెంటాడుతూ వచ్చింది. ఆ సాయంత్రం కాబోవు వధువుతో గడిపినప్పటి అనిర్వచనీయానందం అంతా, ఇంటికివచ్చాక ఇట్టే హరించిపోయింది. ఈడు మళ్ళి వాడిపోతూన్న ఆ వదనమే నిత్యం కన్నులముందు ప్రేలుతూంది తప్ప, ఆ రూపానికి తనకు మధ్య, నవ వికసిత పుష్పకోమల లజ్జారుణిమమై రేఖాసచిత్వంతో భాసిల్లుతూన్న ఐరీన్ అమాయకవదనాన్ని, ఎంత ప్రతిష్ఠించుకొందామన్నా సాధ్యపడటం లేదు.

ఆ ఉత్తరం వ్రాసి అప్పుడే వారం దాటిపోయింది. వారంరోజులుగా ఆ అభాగిని, తనదగ్గిరనుంచి ఒక్కమాటకోసం, ఒక్కరాకకోసం, వేచిఉంది. ఆ విధంగానన్నా ఈ అవశ్యవియోగ భారానికి ఉపశమనం, కలగచేసుకొని మనస్సు దిటవుపరుచుకొందామని ఆశిస్తున్నానని చెప్పుకొంది. కాని అప్పటినుంచీ మళ్ళీ ఉత్తరం వ్రాయలేదేం? జ్వరంగా ఉందేమో ననుకొన్నాడు. అనుకోటంలో పూర్వభయాలు మళ్ళీ ముంచెత్తాయి. హెట్టీమావద్దనైతే కొంతకొంత సంగతులు తెలుసుకోవచ్చునని స్ఫురించింది. హెట్టీమా, ఏపనీ వేళ తప్పించడు. సరిగ్గా పదిగంటలకు ఆర్టిలరీ మ్యూజియమ్ ఆఫీసుకు గడియారం గంటకొట్టినంత నిక్కచ్చిగా తయారయే స్వభావం అతనిది. అతన్ని కలుసుకొందామని జీన్ భరాక్షరి హెట్టీమాఆఫీసు గేటు దగ్గిరకు చేరుకున్నాడు.

చర్చి గడియారం సరిగ్గా పదో గంట కొడుతుండగా, ఆ స్థూలకాయుడు పొగగొట్టం పీలుస్తూ రెండుచేతులా పెచ్చుగా గొట్టాన్ని పట్టుకొని, ఆఫీసు గేటుముందర ప్రత్యక్షమయాడు. జీన్‌ను చూడగానే చిరాకుతోనే నమస్కరించాడు. "ఓ! నువ్వా! కానీ బాబూ ఈ వారం రోజులు మా బ్రతుకు బండలు చేశావు నువ్వు. నిన్ను తలచుకోని, అనుకోని, నిముషం లేదు. ఏదో శాంతంగా విశ్రాంతిగా ఉంటాం కదా, అని పల్లెటిపట్టుకు వెళ్ళినందుకు, భలేగా రోగం కుదిరింది."

ఆ గుమ్మంలోనే నిల్చుని పొగ గొట్టం చివరి దమ్ములు నాల్గూ లాగుతూ జీన్‌తో విశేషాలు చెప్తున్నాడు. గత ఆదివారంనాడు తమతో భోజనానికి రావలసిందనీ, ఆదివారం సెలవుకు ఇంటికి వచ్చిన పిల్లడినికూడా తీసుకురావలసిందనీ, ఫాన్నీని పిలిచారట. పాపం ఏదో కుములుతూందికదా కాస్త మనస్సు కులాసా పడేద్దామని అనుకొన్నారట. భోజనాలు సంతోషంగా బాగానే సాగాయి. ఫాన్ని ఉల్లాసంగా పాటలుకూడా పాడింది. రాత్రి పదింటికింక సెలవుతీసుకొని వాళ్ళు వెళ్ళగానే తామూ పడకకు చేరేందుకు సిద్ధమౌతున్నారట. ఇంతలో బైటనుంచి జోసెఫ్ అడావుడిగా కిటికీతలుపులు తట్టుతూ, భయంగా అరుస్తున్నాడు. "త్వరగా రండి! అమ్మ విషం త్రాగుతోంది ..." హెట్టీమా పరుగెత్తి వెళ్ళాడు. సరిగ్గా అతను వెళ్ళేటప్పటికి నల్లమందూ నూనె సీసా పుచ్చుకొని త్రాగటానికి సిద్ధంగాఉంది. ఆమెను గట్టిగా కావలించుకొని బలంగా ఆమె చేతులోనుంచి ఎల్లాగో ఆ సీసా లాగేటప్పటికి హెట్టీమాకు తలప్రాణం తోకకొచ్చింది. ఆవిడ అతని మొగమంతా దువ్వెన్నెట్టే బరుకుతూ, తలతో అతని పొట్టంతా కుమ్మి నానారభసా చేసేసింది. అనల్లమందు నూనె అతని బట్టలనిండా, గడంతా, ఒలికి హెట్టీమా ఒళ్లంతా ఆ విషం కంపే అయిపోయింది. పుణ్యానికి పోతే అతనికి దక్కిన ఫలితం ఇదే. "కాని ఇల్లాటి గందరగోళాలు, మాలాగ నెమ్మది బ్రతుకులకు అలవాటుపడ్డవాళ్ళం, పడలేమని నీకూ తెలుసుకదా! అందుకని వచ్చేనెల ఇల్లు ఖాళీ చేస్తున్నామని ఇంటివాళ్ళకు నోటీసు ఇచ్చేశాము. ఖాళీ చేసేస్తాం" అని చెప్పి

హెట్టీమా పొగగొట్టం దులిపి జాగ్రత్తగా జేబులో పెట్టుకొని ఏమీ చలనం లేకుండా వీడ్కోలు చెప్పకొని ఆఫీసులోకి పోయాడు. అతను చెప్పిందంతా వింటూ జీన్ దిగ్భ్రాంతుడైపోయాడు.

తను పడక గదిలో ఆ ఆగడం అంతా ఊహించుకొంటున్నాడు. ఆపిల్లవాడు సహాయానికి పరిగెత్తటం, హెట్టిమాతో ఆమె పెనగులాట, ఇల్లంతా ఆవిషం ఒలికినవాసన, ఆ విషం మత్తు రుచి, అన్నీ బుఱ్ఱకు తట్టున్నాయి. ఆ రోజంతా, ఆ భీభత్స దృశ్యమే అతన్ని వెంటాడుతూంది. హెట్టిమాలు కూడా వెళ్ళిపోయాక, ఆ నిర్జన ఏకాంతంలో, అల్లాటిసంఘటనే మళ్ళీ సంభవిస్తే, ఆమెను ఆపేందుకైనా ఎవరూ ఉండరే?

అతని భయం నివారిస్తూ ఆమె దగ్గిరనుంచి ఉత్తరం వచ్చింది. పైకి కనబర్చినంత కాఠిన్యం అతనిలో లేనందుకు, తను వదిలివేసిన దౌర్భాగ్యురాలి, యోగక్షేమాలు తెలుసుకొందామన్నంత మాత్రపు దయ, అతనిలో ఇంకా మిగిలి ఉన్నందుకు, ఫాన్ని అతనికి కృతజ్ఞత తెలుపుతూ ఉత్తరం వ్రాసింది.

"నీతో చెప్పారట. కాదూ? నేను చచ్చిపోదామనే అనుకొన్నాను. మరీ ఒంటరిగాఅనిపించింది బ్రతుకు. ప్రయత్నించాను — కాని వాళ్ళు అడ్డుకోవటంవల్ల చావలేకపోయాను. బహుశా చేతులు మరీ వణికాయేమో — బాధంటే భయమే కాకుండా, మరీ అనాకారినయిపోతానని కూడా భయమేసింది— ఆ డోర్ అమ్మాయికి ధైర్యమెల్లా వచ్చిందో? ఆ ప్రయత్నం విఫలమైనందుకు ముందర సిగ్గు పడ్డాను. కాని మళ్ళీ ఎంతదూరాన్నుంచైనా, ఉత్తరాలద్వారానైనా నిన్ను ప్రేమించేందుకు, ఎప్పటికైనా మళ్ళీ నిన్ను చూడగలిగేందుకు, బ్రతికే ఉన్నానుగదా అని అపారసంతోషమయింది. ఎప్పటికైనా నువ్వు వస్తావన్న ఆశ నాలో వదలకుండా ఉంది. అథవా కష్టంలో ఉన్న మిత్రులను పరామర్శించేందుకైనా- చుట్టపుచూపుగా వచ్చే స్నేహితులమాదిరి — దయ దలచి, కేవలం జాలిమూలానైనా, వస్తావన్న ఆశ నన్ను వదలదు."

ఆతర్వాత ఫావిల్లీనుంచీ కొన్నాళ్ళు ఉత్తరాలు రెండు మూడు రోజుల కొకసారి వరుసగా వస్తూ వచ్చాయి. కొన్ని పెద్దవి కొన్ని చిన్నవి. అన్నీ విషాదగ్రస్తాలే. అవి తిప్పి పంపటానికి అతనికి మనసొప్పలేదు. ఆ సున్నిత హృదయంలో గాయపు పుండును ఆ ఉత్తరాలు మరింత పెద్దదిగా చేస్తూ వచ్చాయి. అతని గుండెల్లో ప్రేమలేదు. జాలి నిండిపోతోంది. జాలి పూర్వప్రియురాలికోసం కాదు. తన మూలంగా దుస్థితి ననుభవిస్తున్న మానవ ప్రాణికోసం!

ఒకనాడు తను పొరుగువాళ్ళు తరలి వెళ్ళిపోయారని వ్రాసింది. తను కాపురంలో తాను అనుభవించిన అనేక ఆనందాలకు సాక్షీభూతులరై వాళ్ళు ఆ స్మృతులను తమతోపాటు తరలించుకు పోయారు. ఇంక అతన్ని గుర్తు తెచ్చేందుకు ఆమెకు ఆ గుడిసె, సామానులూ, పనిమనిషి, పంజరంలో చిలకతప్ప, ఏమీ లేవు. ఆ పనిమనిషి ఒక మూర్ఖురాలు. ఇతర ప్రపంచం ఏమీ ఆమనిషికి పట్టదు. అంతకన్నా పంజరంలో చిలకే నయం. శీతాకాలపు చలికి వణికిపోతూ, రెక్క లల్లాడించుకొంటూ, పంజరంలో ఒకమూలకు ఒదిగి ముడుచుకొని ఉంటుంది.

ఇంకోనాడు, కొత్త ఎండపొడవచ్చి సూర్యకిరణాలు కిటికీలోంచి లోపలకుపడి నిద్ర లేచేటప్పటికి, శుభసూచకంగాతోచి ఆనాడు అతనుతప్పకుండ వస్తాడన్న ఆశతో నిద్రలేచింది. ఎందుకనుకొందంటే, కారణంలేదు. ఊర్కే ఊహామాత్రమే. వెంటనే ఇల్లంతా చక్కగా సర్ది అలంకరించి, తనను శుభ్రంగా అలంకరించుకొని తల నీటుగా దువ్వుకొని సాయంత్రం అంతా కిటికీలోనుంచి ప్రతిరైలూ ఎదురుచూస్తూ కూర్చుంది. చీకటిపడి చివరి రైలు కూడా వెళ్ళిపోయింది. ఇంటి ప్రక్క ద్రోవంబడే అతని అడుగుల సవ్వడి వినిపించినట్లయింది....నిజంగా ఎంత పిచ్చిదై ఉండాలి!

ఒక్కొక్క రోజు ఉత్తరం ఒక్క పంక్తిని మించి ఉండేదికాదు. "వాన కురుస్తోంది. చీకటిగా ఉంది. ఒంటరిగా నీకోసం విలపిస్తున్నాను." ఒక

వాడు కవరులో ఒక చిన్న పువ్వుమాత్రమే పెట్టి పంపించింది. తమ చిన్నతోటలో పూసిన చివరి పూవు. మంచుకు వాడిపోయి జాలిగొల్పుతూంది. ఆమె విలాపాలన్నిటికన్నా కూడా, ఆ చిన్నపూవే, అక్కడి శీతువు, ఏకాంతము, నైరాశ్యము, అన్నిటినీ ఎన్నో రెట్లు విపులంగా అతనికి అవగాహన అయ్యేట్లు చేసింది. రోడ్డు చివర ఆ యిల్లు. మంచులో గానుచెరగులు ఆకులమధ్య తడుస్తూండగా, ఆ తోట మొక్కల మధ్య ఇటూ అటూ ఏకాంతంగా పచారుచేస్తున్న ఆడది, అన్నికళ్ళకు కట్టినట్లుగపడుతున్నాయి.

ఆ జాలి, హృదయబంధాలన్నిటిని కూకటి వేళ్ళతో పెకలిస్తూన్నట్లుగా బాధపెడ్తూంది. అవిడ నుంచి విడివడ్డా మనస్సులో నిత్యం అవిడతోటే జీవిస్తున్నాడు. అస్తమానం అవిడను గురించే ఆలోచన. నిత్యం ఆ రూపే కళ్ళముం దాడుతూంది. కాని స్మృతిపథంలోని వక్రవిశేషంవల్ల, ఆ పరిసరాలు, చిలుకపంజరము, గదులు సామానులూ అన్నీ అతి సూక్ష్మంగా మనస్సులో ఆడుతున్నా, ఆమె రూపం మాత్రం స్పష్టంగా ఎన్నడూ మనస్సులో గోచరించేది కాదు. ఏదో దూరస్థంగా మంచు కప్పబడ్డట్టు, రూపం కనబడ్తూ మొగంలో ఒక్క విలక్షణం మాత్రమే స్వరూపాని కంతకూ రూపందుకొన్నట్లుగా కనబడేది. ఆ వికృత విషాదహాసం, ఆ తెరచిన నోట ఆవిరిగినపంటితోబై, ఇవే స్థూలంగా రూపందుకునేవి.

ఇన్నాళ్ళుగా, పాపం, ఈ అనదతో ఏకశయ్యాగతుడై గడిపాడే, ఇప్పుడు మునిలిదైపోతూన్న ఈ దౌర్భాగ్యురాలి గతి ఏంకాను? తాను ఇచ్చిన నాలుగురాళ్ళు ఖర్చు ఐపోయాక ఎక్కడికి పోతుంది? ఏ అధః పతనాలకు కృంగిపోతుంది? ఆనాడు ఇంగ్లీషు హోటల్‌లో దాహం అర్పుకోవేందుకు దమ్మిడి చేత లేక అటమటించిన, దరిద్రురాలు, బాజారి లంజె జ్ఞప్తికి వచ్చింది. ఫానీ కూడా సరిగ్గా అదేమాదిరిగా అయిపోతుంది. ఇన్నాళ్ళుగా, ఫానీ ప్రేమానురాగాలు, తనయందలి భక్తి విశ్వాసాలు, తనకు అప్తరాలుగా చేసిన సేవా, అన్నీ లోకసామాన్య విషయాలుగా స్వీకరించుకొంటూ వచ్చాడు. ఈనాడు ఆ భావమే తనను నీరవృష్టి చేసేస్తూంది. కాని తమ ఏంచేయగలడు! ఈ స్త్రీని కలుసుకొని కొన్నాళ్ళు ఆమెతో కలిసిఉన్న పాపానికి, ఇంక జన్మంతా, తన సౌఖ్యం ఆ మనిషికోసం బలి ఇచ్చేసు కోవలసిందేనా? తనే ఎందుకీ త్యాగం చెయ్యాలి? ఇతరు లెందుకు చెయ్యకూడదు? ఏమిటీ న్యాయం?

అవిడను చూడకూడదన్న నిశ్చయం ఇంకా అల్లాగే ఉన్నా, ఉత్తరాలు మాత్రం వ్రాయటం ప్రారంభించాడు. ఉత్తరాలలో ఎక్కడా ఉద్రేకం తొణకనీయకుండా, సలహాలు, సదుపదేశాలు హితబోధలుచేస్తూ వ్రాశాడు. జోసఫ్‌ను ఆమెతోనే ఉంచుకొంటే కొంతకాలం గడుస్తుందన్నాడు. కాని ఆమె నిరాకరించింది. తన దుఃఖం బిడ్డడి ముందర కూడా ఒలకపోసుకోటం ఎందుకు? ఇప్పటికే అది వారాలు వచ్చినప్పుడే దుఃఖభాజన మైపోయినట్లున్న ఆ ఇంట్లో ఏమీతోచక, కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ, 'జీన్ బాబాయి' విషయం అడుగలేక అటమటిస్తున్నాడు. తనే కన్నీళ్లతో ఆ బాబాయి వెళ్ళిపోయాడనీ ఇంకెప్పుడూ తిరిగిరాడనీ చెప్పింది.

"నా బాబాయిలంతా అల్లాగే వెళ్ళిపోతారన్న మాట" అని మాత్రం అన్నాడు.

ఈ మాటలు ఆమె ఉత్తరంలో చదువుతూంటే అతి హృదయ విదారకంగా ఉన్నాయి. ఇంకా ఛావిల్లీలోనే ఉందనేటప్పటికి మనస్సులో భయం పెరిగి, పారిస్ వచ్చేసి పూర్వ మిత్రులను కలుసుకొంటూ ఉండవలసిందని సలహా ఇస్తూ వ్రాశాడు. మనుష్యులు, ఎడబాట్లు ఈ విషయాలలో ఆమెకున్న యథార్థ అనుభవాలవల్ల, ఆ మాటలలో అతని అంతులేని అహంకారాన్ని, తన్ను వదలించుకొనేందుకు శాశ్వత ప్రయత్నాన్ని (ఏ యితరుల ఆకర్షణలోనో పడి తన్ను మర్చిపోగలడేమో అన్న ఆశను) మాత్రమే అర్థం చేసుకోగల్గింది. తన మామూలు ధోరణిలో కుండ పగలగొట్టా నిజాయితీగా ఉత్తరం వ్రాసింది.

"ఒకప్పుడు నీతో ఏమన్నానో నీకు తెలుసును. ఎన్ని ఎల్లా జరిగినా, నేను నీ భార్యను. విశ్వాసంతో నిన్ను ప్రేమించే భార్యను. ఈ కుటీర మంతటా నీ రూపమే నన్ను ఆవరించుకొని ఉంది. ప్రపం

తంలో మరేదికూడా ఈ కుటీరం వదిలేందుకు నన్ను లోభపెట్టలేదు. పారిస్‌లో నేను ఏంచెయ్యను! నా పూర్వ జీవితం అంటే నాకసహ్యం. ఆ జీవితం నన్ను నీనుంచి దూరంచేస్తుంది. ఇక మన యిద్దరి పొత్తూ కొత్త ఆలోచించావా? నువ్వు చాలా దృఢచిత్తుడ ననుకొంటావు, కాదూ? అయితే మరి రా! ఓయి క్రూరుడా, ఒక్కసారి రాలేవా—"

అతను వెళ్ళలేదు. కాని ఒక ఆదివారం ఒక్కడే కూర్చుని పనిచేసుకొంటున్నాడు. సన్నగా తలుపు రెండుసార్లు కొట్టిన చప్పుడైంది. ఆ సంకేతం కనిపెట్టి దిగ్భ్రాంతుడయిపోయాడు. ఫాన్నీ తాను వచ్చానని చెప్పేందుకు పూర్వం అవలంబించిన సంకేతం! ముందు కబురుచేస్తే ఏదో వంకపెట్టి బైటినుంచే వెళ్ళగొట్టారన్న భయంతో ఎవరితో చెప్పకుండా చడీ చప్పుడూ లేకుండా మెట్లమీది నుంచి పైకి పరుగెత్తుకొని వచ్చేసింది.

నిశ్శబ్దంగా తలుపుదగ్గరకు వెళ్ళాడు. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తలుపు సందులోనుంచి మెల్లిగా వినబడుతున్నాయి.

'జీన్! అక్కడున్నావా!"

అబ్బా! కంఠం దిగులుతో పగిలిపోయినట్లుంది. మళ్ళీ అంతకన్నా మెల్లిగా "జీన్!..." అని ఊపిరి విడిచింది. అతర్వాత ఒక్క విషాదపు నిట్టూర్పు. తలుపు అడుగున నుంచి ఒక ఉత్తరం లోపలికి చొచ్చుకొంది. ఒక్క ముద్దు గాలిలో విసురుతున్న శబ్దం మెట్లమీద అంతరించిపోయింది. మెట్లు నెమ్మదిగా దిగుతూంది, మళ్ళీ వెనక్కి పిలుస్తాడేమోనన్న ఆశతో ఉన్నట్లు.

ఆమె వెళ్ళిపోయేదాకా ఉత్తరం ముట్టలేదు. అప్పుడు నెమ్మదిగా తీసి చదివాడు. ఉత్తరంలో రెండే ముక్కలున్నాయి. హోషికార్న్ బిడ్డ, పిల్లల ఆస్పత్రిలో పోయింది. అంత్యక్రియలకని సానుభూతితో హోషికార్న్ వెంట తనూపారిస్ వచ్చింది. ఇక్కడికి వచ్చాక అతన్ని చూడ్డానికి రాకుండా ఉండలేక పోయింది. అనవా ఈ నాల్గుమాటలైనా అందిస్తామని ముందే ఉత్తరం వ్రాసితెచ్చింది. "నీతో చెప్పాను కాదా! పారిస్‌లో ఉంటే అస్తమానం నీ యింటి వాకిటే పడికాపులు కాస్తూ ఉంటానని— ప్రియతమా, సెలవు నేను మళ్ళీ మనయింటికి వెళ్ళిపోతున్నాను."

చదువుతూంటే అతని కన్నులు చెమ్మగిల్లాయి. రూడిలా ఆర్కేడ్‌లో, ఆనాడు జరిగిన ఇదే ఘట్టం జ్ఞాపకానికి వచ్చింది. తిరస్కృత ప్రేమికుని ఆవేదన, తలుపుక్రింద తోపిన ఉత్తరం, ఆనాడు ఫాన్నీ నిర్దాక్షిణ్యపు నవ్వు, అవన్నీ జ్ఞప్తికివచ్చాయి. అంటే తాను ఐరీనిని ప్రేమించి నంతకంటె తనను ఫాన్నీ ఎక్కువగా ప్రేమించిన దన్నమాట. లేక ఆడవాళ్ళకన్నా మొగవాళ్ళు జీవితసంగ్రామంలో, ఎక్కువ ఇరుక్కొని రావటంవల్ల, ఆడవాళ్ళంతగా ప్రేమలో నిమగ్నులయిపోయి, తక్కిన సర్వస్వము మరచిపోయి ఏకాగ్ర ప్రేమచిత్తులయే ఉండటం ఉండదా?

ఈ ఆవేదన, బాధాకరంగా మనస్సును దహించేస్తున్న ఈ జాలి, ఒక్క ఐరీని సమక్షంలో ఉన్నప్పుడు మాత్రమే ఉండేవి కావు. ఆమె నీలికన్నుల వెలుగులో ఆ బాధలన్నీ కరిగి మాయమై పోయేవి. దేహంలో అనంతమైన విశ్రాంతిమాత్రమే మిగిలేది. మాటామంతీ లేకుండా, ఆమె బుజాలమీద తలపెట్టుకొని విశ్రాంతిగా తేరుకొని గడిపేయా లనిపించేది.

"ఏమిటి సంగతి! ఒంట్లో హాయిగా లేదా" అని ఐరీని అడిగేది.

ఓ, చాలా హాయిగానే ఉన్నది. కాని ఆ సుఖం, ఇంత విషాదంతో, ఇన్ని అశ్రుధారలతో ఎందుకు మిళితమైపోయింది? ఒక్కొక్కప్పుడు ఆ కన్యతో, మిత్రునితో చెప్పుకొన్నట్టు తన వ్యసనంతా చెప్పేసుకొందామా అని దాదాపు అందుకు ఉద్యుక్తుడయేవాడు. కాని అల్లాచేస్తే ఆ పసి హృదయంలో ఎంత తీవ్రమైన, మానని, గాయాలు ఏర్పడుతాయో ఆ అమాయకుడికి తెలియనంలేదు. వెంటనే ఐరీన్ని తీసుకొని ఏ దూరదూరాలకో పారిపోగలిగితే! ఈ ఆవేదన వెంటనే అంత మొండిందుకో వచ్చును కదా! కాని డాక్టరు బూచరో ఏప్రిల్ లోపల పెళ్ళికి ఒప్పుకోటంలేదు. "నేను ముసలాడిని. రోగిష్టి మనిషిని. నా పిల్లను మళ్ళీ చూసే అవకాశమే నాకుండదు.

అందుచేత ఈ బాధ్యతాళ్ళ పొత్తంగాకుండా నాకు లేకుండా చెయ్యవద్దన్నా" అన్నాడు.

బాలక్ పైకి ఎంత తీవ్రంగా కనబడినా అంత కఠినంగా దాలా పట్టడు. అతను స్వయంగా ముందే బట్టాతో తీవ్రంగా బాధపడుతున్నా, అన్యత మైన గాంభీర్యంతో, నిదానంతో, తన బాధ్యతల పట్ల కంటు బాధ్యతేక పరిస్థితులు వెంటాడినా వేసి కొంతమ క్లిష్టంగా పరీక్ష చేసేవాడు. అతగాడికున్న ఒక్క లోపమూ- పెద్ద పెద్ద కుటుంబాలంటే ఉన్న అసహ్య గౌరవం! తాను పాయకట్టు కుటుంబంలో నుంచి వచ్చాడు. అందుచేత నిరుపాధికంగున్న కుటుంబా లంటే అతని కభిమానం. ఆ అభిమానంవల్లే కొన్నైన్ పూరిగార్ల ఆస్తికి తన కేసులోని పరిష్కారానికి వెంటనే ఒప్పుకొన్నాడు.

ఒక్క కొన్నాళ్లలోనే, ఒక్కరోజుకు వారంతే జరగటానికి నిశ్చయమైంది. లీల తల్లి కమలేని స్థితిలో ఉండటంవల్ల, అతను కనపడుండా ఉండటానికి అన్నీ నిశ్చయించారు. అందుకే కోర్టులోకి పోవటం, వారం వారం, అవసరమైనప్పుడే ఉత్తరాలు వ్రాయటం చేసి. దినోదినంగా పిల్లల్లో ఎవరో ఒకరు ఆమె రాస్తాంటే ఉత్తరాలు వ్రాసేవారు. ఇక తన కుటుంబం విషయం పట్టింట్లో సంపూర్ణం చేస్తుంటే లీలకు బ్రహ్మాండంగా ఉండేది. ఆ లీలార్థ అంతరంగంలో ఆ పిల్లపై ఆకర్షణగా ప్రవేశిస్తోంది.

అతని కన్నా ఒక్కటే ధ్యేయం. ఆమెతో పాల్గొని మాస్తీ, తాను వ్యక్తుడు, విశ్వాసీ, అయిపోయినట్లుగా ఉండేది. ప్రతి విషయంలోను ఆమె అపార ఆనందంలో తాను పరిపూర్ణ ఉత్సాహంతో పాల్గొనలేక పోయేవాడు.

ఒకనాడు ముందు ముందు కాపరంలో ఏమేం కావాలో అన్నీ చర్చించుకుంటున్నారు. అతను ఆకస్మాత్తుగా అడిగోయాడు. మూడి అమ్మర్ బాక్సులో కాపరం పెట్టటోయే ముందు నాటి ఘట్టమే, ప్రవక్తవత క్షేత మవుతోంది. కాని అల్లాంటి ఆనందం అనుభవించ టానికి అతనిలో శక్తి ఉడిగిపోయింది. వివాహోత్సా హమైన, ఆయుర్దాయ్ కాపురం, ఆప్రీతితో గడపటంతో అతనిలో ఆ పసోభుత్వం అంతరించి పోయింది.

14

ఓరోజు సాయంకాలము డీపాట్లర్ ఒక మాళ్ళో నుంచి కైబిరికవస్తూ లీలను చూసి పల్కరిస్తూ అతని వెంటబడ్డాడు. లోనా పెంచిన తోంటి పాటిన పిల్లవుతో పెంకు పెల్ల యొద్దించేసి వచ్చి పోయింది. ఆ తోంటను వాళ్ళ అడిన వేళో క్త అంతర్ల క్రియయూ, లోనా దుఃఖమూ అన్నీ వర్ణించాడు. లోనాకుపకేమునదివ్వేందుకు వచ్చినవాళ్ళల్లో ఫాన్నీ కూడా ఉందని మాటల ధోరణిలో తెలిపాడు. "ఫాన్నీయా-!" అని లీల ఆశ్చర్యం వెలిబుచ్చినప్పటికి "ఔను. ఆమెను చూసి చాలా నాళ్లయింది. ప్రొఫెస్సే, లోనా దుఃఖంలో ఉండగా, అక్కడికి వచ్చింది" అంటూ చెప్పి, తన మాటలవల్ల లీలలో కల్గిన అలజడి గమనించకుండా "అయితే విరా సంబంధం విడిపోయిందన్నమాట! ఇప్పుడు కలిసుంటుం లేదా! అవును వచ్చితే తెలుసోక్కద మన విధ్యకం మాట్లాడుకోవాలి జ్ఞాపకముందా! అక్కడుం ఇదివరం అవసరానికల్లయితా సుగుణాలం "కెవ్యుకో గని శక్తి పేరో ఉందోయ్" అంటూ కొంత ఈర్ష్యతో అన్నాడు.

లీల మొకం మసిపిరపట్టేది. లోనారియా పంచను మళ్ళీ ఫాన్నీ చేరటం అతని కిష్టంలేదు. కాని ఇంతలో తే తటమాన తనకు విరామలేసింది. ఇప్పుడు అనవి లీలలి బాధ్యతలు తనమీద లేవారాము! తన ఇష్టాయిష్టాలు ఆమె కెందుకు!

రూ కే బాన్నిలో ఒక యింటిముందర ఇద్దరూ ఆగారు. అది డీపాట్లర్ ఇల్లు. అతనికొవ్వరం ఇక్కడే నని లోకం అనుకోవాలి. అందుకని ధొంగ్ర విద్దరూ ఈ ఇంట్లో ఉంటారు. లోకదృష్టిలో కేవలం వాళ్ళను వరిలేనివట్లు కనబడుకుండా అప్పుడప్పుడు చూసిపోతూ ఉంటారు.

లీల తన రోజును తాను పోలకుంటున్నాడు. డీపాట్లర్ చెయ్యిపట్టుకొని అడాడు.

"నాకు కొత్త ఉపకారం చెయ్యాలి. ఈరాత్రి లేను మాయాల్లి ఇంట్లో కే ఫోన్ చేస్తానని చెప్పుతుంటాను. కాని పాపం లోనాను ఆ దుఃఖసముద్రంలో వదిలి

ఇక్కడ ఉండలేను. అదంతా మా ఆవిడతో చెప్పుకోవాల్సి రాకుండా నువ్వు కాస్త పక్కనుండు చాలు."

ఇల్లు లోపల అంతా అతినిండుగా అతినీటుగా అమర్చి ఉంది. ఇద్దరూ లోపలికి వెళ్ళగానే లోపలి తలుపు తెరుచుకొని, "ఎవరూ, గస్టేవ్! నువ్వేనా!" అంటూ అతని భార్య గదిలోకి వచ్చింది. అతనొక్కడే ఉన్నాడనుకొని వచ్చిందేమో, జీన్‌ను చూసి తెల్లబోయి ఆగిపోయింది. ఆవిడ అతి అందమైన మనిషి. చాలా హుందాగా దుస్తులు ధరించింది. మొగంలో, స్థైర్యము, నిద్దాతనం, ఉట్టిపడుతున్నాయి.

లోకం ఆమెనుగూర్చి వివిధవిధాలుగా అనుకొంది. మొగుడుఅంత బాహాటంగా తిరుగుళ్ళు తిరుగుతూంటే కిమ్మనకుండా ఊరుకొన్నందుకు ఆమెను తిట్టినవాళ్ళున్నారు. ఆమె ఓరిమిని, శాంతస్వభావాన్ని మెచ్చుకొన్నవాళ్ళూ ఉన్నారు. ఒక మహాపురుషుని భార్య అనిపించుకోటమే చాలనుకొని, తనభర్తను ప్రేమించుకొంటూ, ఏ పోరూ పొక్కూ తెచ్చుకోకుండా గడుపుకోవటమే ఆమె కిష్టమేమో అనిపిస్తుంది.

డి పాటర్ చెప్పుకొంటూన్న అబద్ధపు సాకులన్నీ శాంతంగా వింటూంది.

ఆ సాంఘిక మర్యాదలో మహావిషాదం జీర్ణించిపోయినట్లు ధ్వనిస్తూంది జీన్‌కు. భర్తమాటలన్నీ నిజమని స్వీకరించినట్లే కనుబడుతూంది. అతి నెమ్మదిగా చెప్తుంది.

"అబ్బాయి, రేమండ్, ఏడుస్తాడేమో! వాడి మంచందగ్గిరే ఇవాళ భోజనాలు చేస్తామని వాడిని నమ్మించాను." అంది.

"అబ్బాయి కెల్లా ఉంది?" అంటూ డీపాటర్ విసుగ్గా క్షేమాభిలాష లేనట్లు అడిగాడు.

"కాస్త నయం! కాని దగ్గుతున్నాడు. లోపలికి వచ్చి చూస్తారా."

"ఇప్పుడు కాదు తొందరపని ఉంది" అంటూ దిక్కులు చూస్తూ గొణిగాడు డీ పాటర్.

ఆమె అకస్మాత్తుగా గాంభీర్యం తెచ్చుకొని "సరే వెళ్ళి రండి" అంది. సరస్సులో నిశ్చలమైన నీరంలో రాయిపడి, కదలికలు వెంటనే మూసుకొని పోయి మళ్ళీ తటాకం నిశ్చలమైనట్లు ఆమె ముఖంలో ఎప్పటి గాంభీర్యం ఇట్టే కోలుకొంది. తలవంచుకొని లోపలికి వెళ్ళిపోయింది!

"పోదాంపద" అంటూ నిట్టూర్చి డి పాటర్, జీన్‌ను బైటికి లాక్కొచ్చాడు.

ఉంచుకొన్న దాని తొండ చచ్చిపోయిందని నిర్వేదనిమగ్నుడైపోతూ స్వంత కుమారుడికి సుస్తీగా ఉంటే లోపలికైనా వెళ్ళి చూడలేని ఈ మహాపురుషుని వ్యసనరసికత్వానికి తెల్లబోతున్నాడు జీన్.

డి పాటర్ తనకు పెళ్ళిచేసినవాళ్ళదితప్పంటూ తనను తను సమర్థించుకొంటున్నాడు. "ఫాన్నీ ఉండమంటే జీన్ అల్లాగే వుంటాడని" చెప్పబోతున్నాడు. ఇంతలో కాళీబండి వెళ్తూంటే పిలిచి బండిలోకెక్కాడు.

"అన్నట్టు ఫాన్నీ మాట వచ్చింది కదూ. ఫ్లామంట్‌ను క్షమించి వదిలేశారు తెలుసా! డెషిలెట్ పిటీషను మాసే వదిలేశారు. పాపం చచ్చికూడా ఉపకారం చేశాడు, డెషిలెట్."

బండిసాగి ముందుకుపోయింది. జీన్ రోడ్ ప్రక్కన విభ్రాంతుడై నిలబడ్డాడు. ఆవార్త తన నెందుకంత కలచిందో తెలియక విస్తుపోతూనిలబడ్డాడు. ఈమధ్యకొన్నాళ్ళుగా ఫాన్నీ విలాపాలు తగ్గి, ఉత్తరాలు రాకపోవటానికి కారణం వెంటనే స్ఫురించింది. ఆ దౌర్భాగ్యుడు, స్వేచ్ఛ లభ్యం కాగానే ఫాన్నీనే మనసులో పెట్టుకొని అక్కడకే వెళ్ళి ఉండాలి.

ఫ్లామంట్ జైలులో ఉన్నప్పుడు ఫాన్నీ అతనితో ప్రేమలేఖలు సాగించటం జ్ఞప్తికి వచ్చింది. తక్కిన ప్రేమికులనందరినీ తూస్కారించిన ఫాన్ని, అతన్నిమాత్రం వెనకేసుకొని రావటం జ్ఞాపకానికొచ్చింది. ఆమెకొక ఆసరా చిక్కటంతో ఇంక తన బాధ తీరిపోయిందన్న భావంతో శాంతి పడవల్సింది పోయి, అతని మనస్సు అంతకంతకు కుళ్ళగించుకుపోతోంది. ఎందుకనీ! ఆమెను ప్రేమించటంలేదు. కాని తన ఉత్తరాలు ఆమెదగ్గిరున్నాయి. అవి వాడికి

చదివి వినిపిస్తుందేమో! లేక ఏనాటైనా, ఏ దుర్బోధ వల్లనో అవి తనమీద ప్రయోగించి, తన శాంతిసౌఖ్యాలను రూపుమాపుతుందేమో?

ఈ భావం నిజమైనా అబద్ధమైనా, అతని మనసు మాత్రం, ఎందుకో లోపల కుతకుతలాడిపోతోంది. ఆత్రంతో, ఛావిర్లీ వెళ్ళాలని నిశ్చయించుకొన్నాడు.

ఏ ఉద్రేకాలూ, కలతలూ లేకుండా అతి శాంతంగానే రైలు ఎక్కాడు. పట్టుకొన్నదల్లా ఒక్కటే భయం. తీరా తను అక్కడికి వెళ్ళేటప్పటికి ఆ మనిషి కాస్తా ఆ ఖైదీతో కలిసి పరారి అయిపోయి, ఇల్లు తాళం వేసి ఉంటుందేమోనని!

రైలు మలుపు తిరుగుతూంటే కుటీరం కనబడింది. కిటికీలు తెరిచే ఉన్నాయి. ఉంది కదా అనుకొని నిట్టూర్చాడు.

ఆ స్టేషనులో అతనొక్కడే దిగాడు. ఆ పొగమంచులో, మంచు పేరుకొని జారుడుజారుడుగా ఉన్న ఆ సన్న సందులోపడి వెళ్ళి రైల్వే ఆర్చి దాటాడు. కట్టెలవాళ్ళ సందులోకి వచ్చేదాక ఎవరూ అతనికి ఎదురుపడలేదు. అక్కడ సందు మలుపు తిరగగానే ఒక పెద్దతను, పిల్లడు, వెనకాతల సామానుబండితో కూలీ, ఎదురుపడ్డారు.

పిల్లడి తలమీద టోపీ, బుజాలమీద కోటూ మొగాన్ని మూసేస్తున్నాయి. ఆ పిల్లడు జీన్ను చూడగానే వచ్చిన కేక ఆపుకొని నడిచిపోయాడు.

కుఱ్ఱవాడు జోసఫ్! అంత విశ్వాసహీనంగా పల్కరించకుండా అతను వెళ్ళిపోయినందుకు జీనుకు కష్టమే తోచింది. మళ్ళీ వెనక్కు చూసేటప్పటికి పిల్లవాడి చేతిలో చెయ్యి వేసుకొని నడుస్తూ వెనక్కు చూస్తూన్న ఆ మనిషి చూపుల్తో చూపులు కలిశాయి. మొగంలో తెలివితేటలు ఉన్నాయి. గాలి లేక పాలిపోయినట్లుంది శరీరం. దుస్తులు ఒంటికి పెద్దవై, సెకండ్‌హేండ్ షాప్‌లో నిన్ననే కొన్నట్లున్నాయి. గడ్డం కొద్దిగా మాసి ఉంది. జైలు వదిలాక ఇంకా బాగా పెరిగినట్లు లేదు. ఫ్లామంటే! తప్పకుండా ఫ్లామంట్! జోసఫ్ అతని కుమారుడు!

మెరుపు మెరిసినట్లు తెలివిడి కల్గింది. ఫ్లామంట్ ఉత్తరంలో, తన బిడ్డడి రక్షణ ఫాన్నీ కప్పచెప్పాడు. పెంపుడుపిల్లనంటూ పల్లెటి దిక్కునుంచి తెచ్చినట్లు అకస్మాత్తుగా తీసుకు వచ్చింది. హెట్రేమాలకూ ఈ సంగతి తెలిసే ఉండాలి. లేకపోతే వాళ్లు అంత ముభావం వహించి ఉండరు. ఫాన్నీ, ఒలింపీకూడా కళ్లతో సంజ్ఞలు చేసుకొనేవారు. ఆహా! తన్నెంత చక్కగా వెధవని చేసి ఆడించారు! ఆ గడిచిన జీవితం తలచుకొని సిగ్గుతో కుమిలిపోయాడు. అక్కడినించే దూరదూరాలకు పారిపోదామనుకొన్నాడు. కాని తను తెలిసికోవలసిన విషయాలున్నాయి. తండ్రీ కొడుకూ వెళ్తూంటే ఆమె మాత్రం ఎందుకు వెళ్ళలేదు? అదీ కాకుండా తన ఉత్తరాలు తనకు కావాలి. తనదేదీ కూడా, ఈ సిగ్గులేని దౌర్భాగ్యపుటింట్లో మిగల్చకూడదు.

“అమ్మా! బాబుగారు వచ్చారు”

“ఏ బాబు?” అంటూ లోపల్నించి అమాయకంగా ప్రశ్న వినబడింది.

“నేనే...”

ఒక్క కేక వేసుకొంటూ ఎవరో నేలమీదికి ఉరికినచప్పుడైంది. “ఒక్క నిముషం ఆగు! లేచి వచ్చేస్తున్నా!”

మధ్యాహ్నమైనా ఇంకా మంచం వదలలేదా! ప్రొద్దున్న ఇల్లా గడిపేందుకు కల కారణాలు జీనుకు తట్టాయి.

ముందు గదిలో కూర్చుని, అక్కడే, అలనాటైన అతి స్వల్పవిషయాలన్నీ మళ్ళీ ఆకళింపుకొంటూ కూర్చున్నాడు. కొండ ఎగువను వస్తూన్న రైలుకూత వినబడుతూంది. ప్రక్క దొడ్డిలో మేక ‘మే’ అని అరుస్తూంది. బల్లమీద కంచాలు అల్లాగే ఉన్నాయి. మునుపటిరోజుల్లో రైలుకెళ్ళటానికి తొందరపడుతూ హడావుడిగా ఇక్కడే భోజనం కతికిన సమయాలు జ్ఞప్తికి వస్తున్నాయి.

ఫాన్నీ, ఉత్సాహంతో అతనిదగ్గిరకు ఉరుక్కుంటూ రాబోయింది. కాని అతను బిగుసుకుపోయి కూర్చున్న తీరు చూచి ఛటాలున ఆగింది. తను

ఆంతర్య జీవితం భగ్నమైపోయాక, మొదటిసారి కలుసుకోటంలో, ఏమి చెయ్యాలో తోచక ఇద్దరూ ఆశ్చర్యపోతున్నారు. నదికి ఇరువైపులా ఇద్దరూ నిల్చున్నట్లుగా ఉన్నారు. మధ్య వంతెన విరిగిపోయింది. ఇద్దరికి మధ్య, అగాధమై, విస్తరించుకొని, నది ప్రవహిస్తున్నది.

ఆమె, కదలకుండా, మృదుకంఠంలో అభినందన మొనర్చింది.

అతను మనిషి మారిపోయి, పాలిపోయినట్లు ఆమెకు కనిపించాడు. ఆమె ఇంకా ఇంత అందంగా కనబడుతున్నందుకు అతను ఆశ్చర్యపోతున్నాడు. తాను ఊహించుకొంటూన్నంత పొడుగ్గా లేదు. ఇంకొంచెం లావుబారింది. కాని, తనువంతటా యౌవనదీప్తిలో మునిగిపోయినట్లుంది. కన్నులు, దేహం, వెలుగులీనుతూ, పచ్చపచ్చని పచ్చిక నేల సౌరభాన్ని తలపిస్తున్నాయి. తీవ్ర కామతృష్ణా పరిపూర్తిపొందిన రేపటి ప్రొద్దుల ఆమెరూపం అల్లాగే ఉంటూఉండేది.

అంటే ఇంతటి ఆకురాలు సీతాకాలంలోనూ ఆమెపచ్చని అడివిమధ్యంలోనే వెచ్చగానే ఉన్నది. తానో, ఆమెకోసం జాలితో వృథాగా ఎండగట్టుకుపోయాడు.

"ఆలస్యంగా నిద్రలు లేవటం పల్లెటి పట్టుల అలవాటులాగుందే" అంటూ ఈసడింపుగా అన్నాడు.

ఆమె నెమ్మదిగా ఏవో క్షమాపణలు గొణుగుతూంది. తలనొప్పిగా ఉందని చెప్పుకొంది. అతనిలాగే, సంభాషణ అంతా తృతీయపురుషలోనే సాగిస్తూంది. అతను కనుబొమ్మలెత్తి బల్లమీది కంచాల వంక చూస్తుంటే, "పిల్లను ఫోంచేశాడు. వెళ్ళిపోయేముందు తిండి తినిపోయాడు" అని చెప్పుకొంది.

"వెళ్ళాడా? ఎక్కడికి వెళ్తున్నాడు?" అంటూ, ఏమీ అంటనట్టు మాట్లాడుతున్నాననుకొన్నాడు. కానీ కన్నులలో ఉద్రేకం మనిషిని పట్టి ఇచ్చేస్తోంది.

"అతని తండ్రి, అతనికోసం వచ్చాడు. తనవెంట తీసి కెళ్ళిపోయాడు." అని చెప్పింది.

"జైలు వదలగానే వచ్చేశాడనుకుంటానేం?"

ఆమె కొంచెం అదిరిపడ్డది. కాని అబద్ధమాడలేదు. "ఔను నిజమే. నేను మాట ఇచ్చాను. మాట నెరవేర్చుకొన్నాను. ఎన్నిమార్లో నీతో చెప్తాం అనుకొన్నాను. కాని, నువ్వు భరించలేక, పాపం ఆ కుఱ్ఱవెధవను తరిమేస్తావేమోనని భయపడి చెప్పలేదు" అని భయం భయంగా "నీకు అసలే ఈర్ష్య ఎక్కువాయెను" అంది.

వికటంగా పెద్ద నవ్వు నవ్వాడు. ఈర్ష్య! ఆ ఖైదీ అంటే తనకు ఈర్ష్య! ఇంతలో కోపం ముంచుకొచ్చి చటుక్కున ఆగి ఖండితంగా తను ఎందుకువచ్చిందీ చెప్పాడు. తనఉత్తరాలు! సిజేర్‌తో ఆ ఉత్తరాలు ఎందుకుపంపలేదు! పంపిఉంటే ఇల్లా ఇద్దరికీ బాధాకరంగా కలుసుకోవలసిన అవసరం లేకపోయేదికదా.

"ఆమాటా నిజమే! కాని ఎల్లాగా నీకు ఇచ్చేద్దామనుకొంటూనే ఉన్నాను. అక్కడే ఉన్నాయి." ...అప్పటికీ అతిమృదువుగా, నెమ్మదిగా జవాబు చెప్పింది.

ఆమె వెనకాతలే పడక గదిలోకి వెళ్ళాడు. పక్కబట్టలు నలిగి ఉన్నాయి. దుప్పటి అడావుడిగా మళ్ళీ పరిచినట్టుంది. ఉత్తరాలున్న ముత్యపు పెట్టె తీసింది. ఇద్దరికీ ఒకే ఘట్టం మనస్సుకు తట్టింది.

"ఈమాటు ఎన్నో లేవులే. ఏదీ తగలపెట్టామన్న భయం లేదు." అంది.

అతను మాట్లాడలేదు. నోరెండి పోతోంది. ఆమె నలిగిన ప్రక్కపక్కనే నిలబడింది. ఉత్తరాలు చివరిసారి తిరగేస్తూంది. ఆమె దగ్గరకు వెళ్ళటానికి జంకుతున్నాడు. తలవంచుకొని ఉంది. ముచ్చిలి గుంటదగ్గిర జుట్టు పైకి ముడిచుట్టేఉంది. జుట్టు క్రింది మెడ, తెల్లగా కనబడుతూ, నున్నగా, దృఢంగా వంపుతిరిగి ఉంది. ఒళ్ళు కొంచెం స్థూలబారి, తొడుక్కొన్న వదులు గౌనులో, వదులుగా, అశ్రద్ధగా, విడజార్చుకొన్నట్లుంది.

"ఇదిగో! అన్నీ యివే!"

ఉత్తరాల కట్టతీసికొని జేబులో ఆత్రంగా

దోపుకొన్నాడు. అప్పటికే ఆలోచనలు ఎటో ఉన్నాయి.

"అయితే తన పిల్లవాడిని తీసుకుపోయాడా? ఎక్కడికి వెళ్తున్నారు?"

"మోర్వక్కు, తన జన్మస్థలానికే పోతున్నాడు. అక్కడనుంచే రాగిరేకులు చెక్కి మారుపేరుతో పారిస్ పంపి అమ్ముకొంటాడు."

"మరి నువ్వు? నువ్వు ఇక్కడే ఉండదలచుకొన్నావా?"

అతని చూపులతో కలవకుండా తన మొగం తిప్పేసుకొంది. ఇక్కడ ఉండటం చాలా బాధాకరంగా ఉందని నసిగింది. అందుచేత, త్వరలో, ఎక్కడికైనా ప్రయాణం అవుదామని అనుకొంటున్నానంటూ నత్తుతూ నసుగుతూ చెప్పింది.

"మోర్వన్‌కేనా! కుటుంబాన్ని కలుసుకోనేందుకు!"అని బిగబట్టుకొన్న ఈర్ష్యనుకోపాన్ని అంతా వెళ్ళగక్కుతూ అన్నాడు. "ఆ బటాచోర్ దగ్గరకే పోతున్నానని, కాపురం పెట్టబోతున్నానని, చెప్ప రాదూ! చాలానాళ్ళబట్టే అల్లా చేద్దామనుకొంటున్నావాయెను! ఇంకేం ఫో! ఆ బురదగుంటకే పదు. లంజకీ, బటాచోర్‌కూ బలే దాంపత్యం కుదుర్తుందిలే. నీలాంటిదాన్ని రొంపిలోంచి బైటికి లాగుదామనుకొన్నానంటే ఎంత తెలివితక్కువ సన్నాసినై ఉండాలి!"

నిశ్శబ్దంగా, నిశ్చలంగా నుల్చుంది. కాని వాలిన కనురెప్పలక్రింద కన్నులలో విజయగర్వం తాండవ మాడుతూంది. అతని కోపం, తిరస్కారం, వెటకారం,!వెక్కిరింపూ, ఉధృతం అయినకొద్దీ,ఆ విజయ గర్వం ఇనుమడిస్తూంది. ఇప్పుడు తన స్వచ్ఛ నూతన ప్రేమనుగురించి మాట్లాడుతున్నాడు. ఆ పవిత్రతను, ఆ సౌభాగ్యాన్ని, ఆనందాన్ని పొగడుతున్నాడు.

తన మాటలు తనకే సిగ్గుఅనిపించి మళ్ళీ గొంతుక తగ్గించాడు.

"నీ ఫ్లామంట్, రోడ్డుమీద కనబడ్డాడులే! రాత్రి ఇక్కడే గడిపాడా?"

"ఔను, పొద్దుపోయింది. అందుకని అతనికి సోఫామీద పక్క వేశాను."

"అబద్ధం ఆడుతున్నావ్! ఇక్కడే పడుకున్నాడు. మంచంవంక చూస్తే తెలుస్తుంది. నీవంక చూసినా తెలుస్తుంది!"

"అయితే ఏం," అంటూ మొగం మరీ అతని మొగం దగ్గిరకు చేర్చింది. ఆ విశాల నేత్రాలు కామంతో వెలిగిపోతున్నాయి. "నువ్వు వస్తున్నావని, నాకు తెలుసా. ఇక నిన్ను పోగొట్టుకొన్నాక ఏది ఏమైతే నాకేం పట్టింది? ఏకాకినై, వ్యథార్తనై, ప్రపంచం అంటేనే రోతపుట్టే స్థితిలో ఉన్నాను..."

"ఆ రైలు కంపూ, వాడూ! మర్యాదస్థుడితో, ఇన్నాళ్ళు బ్రతికాక, ఆ మార్పుకూడా రుచిగానే ఉందనుకుంటానేం!—ఇద్దరూ కలిపి- ఛీ మురికి పెంట!"

దెబ్బ తగలబోతోందని చూసింది. కాని తప్పించుకోలేదు. మొగమంతా ఛెళ్ళున మ్రోగిపోయేటట్టు దెబ్బతింది. ఆ బాధ నాపుకొంటూన్న పూలుగులోనే ఆనందం, విజయగర్వం, విచ్చలవిడిగా పొంగుతున్నాయి. ఒక్కసారిగా అతనిమీద కురికి రెండు చేతులా గట్టిగా కౌగిలించుకొంటూ. "ప్రియతమా! ప్రియతమా! ఇంకా నన్ను ప్రేమిస్తూనే ఉన్నావ్" అని ఆనందాతిరేకంతో అరిచింది. ఒకరి కౌగిలిలో ఒకరు బిగుసుకుపోయి వెనక్కి మంచంమీదికి వాలిపోయారు.

సాయంత్రం ఎక్స్‌ప్రెస్ బండి హోరెత్తుకొంటూ పోతున్న చప్పుడుకు మేలుకున్నాడు. కొద్ది నిముషాలదాకా కళ్ళు తెరుచుకొనే, ఎక్కడున్నదీ తెలియక తేరిపార చూస్తున్నాడు. ఆ పెద్దమంచపు పరుపులో ఒక్కడూ కృంగిపోయి పడుకొని ఉన్నాడు. ఎన్నో మైళ్ళు నడిచినట్లు ఒళ్ళంతా కీలు కీలు నొచ్చుకొంటూంది. దేహాంగాలన్నీ తనవి కానట్టు, ముద్దగా పడిఉన్న ట్లనిపిస్తున్నాయి. మధ్యాహ్నం అంతా బాగా మంచు కురిసినట్లుంది. ఆ నిశ్శబ్దం అంతటా గాఢంగా ఆవరించుకొని, కరిగి చిన్నబొట్లు రాల్తూన్న మంచుబొట్ల చప్పుళ్ళవల్ల మాత్రమే భంగపడుతూంది.

తను ఎక్కడున్నాడు? ఏం చేస్తున్నాడు? లైటు మంచుకు చిమ్మిన వెలుగు కొద్దికొద్దిగా పరిసరాలను దృష్టికి తెస్తూ ఒక్కొక్క వస్తువే కనబడేటట్లు చేస్తోంది. ఫాన్నీ జ్ఞాపకం కనబడింది. తన ఈ పతనం అంతా స్మృతికి వచ్చింది. కాని, ఆశ్చర్యం భాయా మాత్రంగానైనా కలగటంలేదు. గదిలో కాలు పెట్టిన క్షణంనుంచే, ఆ మంచమూ ఆ పరుపూ తనను ఇంద్రజాలంలో ముంచేస్తున్నట్లు, తన కింక మోక్షంలేనట్లు గ్రహించాడు. "ఇప్పుడు జారిపడ్డానంటే, ఇక జన్మకు లేచుకోలేను" అనుకొన్నాడు. ఆ పతనం సంభవించింది. తన నీరసగుణం అంటే అసహ్యంతో పాటు, ఇంక ఈ బురదలోంచి బైటపడలేనని తెలుసుకొన్నందుకు ఏదో విపరీతపు ఉపశాంతికూడా కల్గుతూంది. క్షతగాత్రుడు పెంట కుప్పపై పడిపోయి, గాయం పెచ్చరిల్లుతూ, జీవం హరించిపోతూంటే, పెనుగులాడ్డానికి, బాధపడటానికి కూడా ఓపికలేని స్థితిలో, ఆ దుర్గంధపు కుప్పలో అంతకంతకు నిస్సారంగా కృంగిపోతూ ఆ బెచ్చదనంలోనే ఉపశమనం పొందేలాంటి ఉపశమనం.

ఇంక చేయవలసిన పని చాలా భీభత్సపుపనే! కాని చాలా సుకరం. ఈ పతనానంతరం, ఇంక ఏదీ పవిత్ర ప్రేమను కలుషితంచేస్తూ, డిపాట్టర్ జీవితం లాంటి జీవితం గడపటం అసంభవం. తాను ఎంత దిగజారిపోయినా ఇంకా అంత క్షుద్రుడు కాలేదు. డాక్టరు బూచరోకు తన విషయం అంతా విపులంగా ఉత్తరం వ్రాస్తాడు. ఆ మనస్తత్వ శాస్త్రవేత్తకు, తన వికృతగాథ నంతా నివేదిస్తాడు. ప్రారంభంలో ఈ స్త్రీని ఎల్లాకలుసుకొన్నదీ, ఈమధ్య తాను తన మాత్మ ఆనందపు సైపులో ఉద్ధరింప బద్ధానమకొని, మళ్ళీ, పూర్వ చరిత్ర విచిత్రప్రభావంవల్ల ఎల్లా ఆమె పాశాలలోనే చిక్కుకుపోయిందీ, అంతా చెప్పుకొంటాడు. ఆ విపరీత చరిత్రలో ప్రేమకున్న స్థానం అతి స్వల్పం. కేవలం పిరికి అలవాటు, వ్యసనలోలత, ఇవే అతిని ఎముక ఎముకకూ పట్టిపోయాయి.

తలుపు తెరుచుకొంది. నిశ్శబ్దంగా అతనికి నిద్రాభంగం కాకూడదన్నట్లు ఫాన్నీ, లోపలికి ప్రవేశించింది. సగం మూసిన రెప్పల్లోనుంచి ఆమెను చూస్తున్నాడు. చలాకీగా, ఎన్నో ఏండ్లు చిన్నదైపోయినట్లుగా, కనబడుతూంది. తోటలో తిరిగి రావటంవల్ల తడిసిన పాదాలను వెచ్చబడేసు కొంటూ కూర్చుంది. మధ్య మధ్య చిరునవ్వులో, ఆ ప్రొద్దున్న ఘర్షణ పడ్డప్పుడు ముఖంలో వికసించిన చిరునవ్వుతోనే, అతినికంక చూస్తోంది. ఇంతలో లేచి సిగరెట్టుతీసికొని లైటికి పోతోంది. అతను ఆపాడు.

"నిద్రపోతున్నా ననుకొన్నాను." అంది.

"కాదు, ఇల్లా కూర్చో, మాట్లాడుకొందాం." వచ్చి మంచం అంచునే కూర్చుంది. అతని ముఖంలో తీవ్రతకు ఆశ్చర్యపోతోంది.

"ఫాన్నీ—మనం కలిసి వెళ్ళిపోతున్నాం."

ముందు తనను పరీక్షించటానికి వేళాకోళం చేస్తున్నాడనుకొంది. కాని విపులంగా అతను విషయాలు చెప్తూంటే, వెంటనే మనసు మార్చుకొంది. "అరికాలో ఒక ఉద్యోగం ఖాళీ ఉంది. దానికి దరఖాస్తు పెట్టున్నాను. ఒకపక్షం రోజుల్లో ఖాయమవచ్చు. ఈలోపల అన్నీ సర్దుకోవేందుకు తీరుబాటు ఉంటుంది."

"మరి నీ పెళ్ళిమాట ఏమిటి?"

"ఆ విషయం ఇక ఎప్పుడూ ఎత్తకు. జరిగిన విషయాలు జరిగిపోయాయి. అవి మార్చటం నాతరం కాదు. అవన్నీ అఖరయిపోయాయని నా కళ్ళకు కట్టూంది. ఇక మళ్ళీ నిన్ను నేను వదులుకోలేను."

"పిచ్చి పిల్లాడా!" అంటూ కించిదవజ్ఞాపూర్వక విషాద మార్దవంతో మెల్లిగా అంది. ఇంతలో సిగరెట్టు రెండుమూడు మార్లు పీల్చి "చాలా దూరమా— నువ్వు చెప్పిన ప్రదేశం?" అని అడిగింది.

"అరికా? చాలాదూరమే! పెరూలో (దక్షిణ అమెరికా) ఉంది." అని గొంతు తగ్గించి. "అక్కడికి స్టామెంట్ నీ వెంటబడి రాలేదు" అన్నాడు.

ఆ సిగరెట్టు పొగమధ్యంలో, నిగూఢవదనంతో, కలలు కంటున్న స్థితిలో, అల్లాగే కూర్చుని ఉంది. ఆమె చేయి తన చేతిలో తీసుకొని అవగ్న హస్తాన్ని నిమురుతున్నాడు. ఇంటిచుట్టూ మంచుకరిగి చిటపటలాడ్తూ రాల్తున్న చప్పుళ్ళు, జోలపాడుతూంటే కన్నులు మూసి శాంతంగా ఆ మైకంలో మునిగిపోయాడు.

15

జీన్ అప్పుడే రెండు రోజులబట్టి మార్సేల్స్‌లో ఉన్నాడు! ఫాన్నీ అతన్ని మార్సేల్స్‌లో కలుసుకొంటుంది. అక్కడినుంచి ఇద్దరూ ఓడ ఎక్కుతారు. ప్రయాణాని కన్నీ సిద్ధమయి పోయాయి. ఓడలో రెండు ఫస్టుక్లాసు కాబిన్ టికెట్లు, ఆరికన్ వైస్ కాన్సల్, ఆయన 'వదిన,' గార్ల పేరట కొనెయ్యటం కూడా అయిపోయింది.

దూరప్రయాణానికి ముందర ప్రతీవాళ్ళూ పడే ఆదుర్దా అంతా పడుతున్నాడు. జీన్, మార్సేల్స్‌లో ఒక చిన్న హోటల్‌లో, ఈ రెండు రోజులకు గది అద్దెకు పుచ్చుకొని, బైటి కెక్కడకు పోకుండా గదిలోనే తివాచీమీద ఆత్రంగా పచార్లు చేస్తూ గడుపుతున్నాడు. బైటికి వెళ్ళటానికి, దొంగల్లా భయపడుతున్నాడు. ఏమో, ఈ మార్సేల్స్ జన సమ్మర్దంలో, ఏ సందు మొగనో భటాలున తన తండ్రో, డాకరు బూచరోయో కనబడి, రెక్కపట్టుకొని వెనక్కు ఈడ్చుకొని పోవచ్చును. అందుకని చీకటిపక్షిలా అస్తమానం గదిలోనే గడిపేస్తున్నాడు.

అత నున్న హోటలు ఒక మారుమూల హోటలు. ఫాన్నీ తానూ, ప్రయాణం అవటాని కెక్కడ కలుసుకోవాలని ఆలోచించు కొన్నప్పుడు, గైడ్ పుస్తకంలో ఈ మారుమూల పేరుచూసి ఇక్కడ కలుసుకొందామని సంకేతం ఏర్పరుచుకొన్నారు. అక్కడ అడుగెట్టే దాకా ఆ పరిసరాలు అతనెరుగడు. హోటల్ కిటికీ క్రిందే, పంజరాల్లో పక్షులమ్మే అంగడిఉంది. అక్కడి చిలకలు గోరింకలూ, కలకలారావాలతో ప్రొద్దుపొడుపు నాహ్వానిస్తాయి — పొద్దెక్కినకొద్దీ, వీధి కిటకిటలాడుతూ నానా గోత్రాల జనాభాతో, హార్బరు కార్మిక బృందాలతో, మోత లెత్తిపోతూంటుంది. హార్బరు మోత, చేపలబజారు సందడి, క్షుద్రజీవిత పరిసరాల హాహాకారమంతా నిత్యం వినపడుతూంటుంది. ఇక అక్కడి వాసనలన్నీ కుళ్ళువాసనలే.

రాత్రిపూట కొంత సవ్వడి తగ్గాక, జీన్ సముద్రపువైపు కిటికీ తెరచి దూరాన్న లైట్ హౌస్ వెలుగ్నీ, ఓడలు నిద్రపోతూన్న హార్బరునూ చూస్తూండేవాడు. ఆ లైట్ హౌస్ దీపం మేల్కొని ఉన్న నేత్రంలా మెరుస్తూ, అతన్ని దూరప్రయాణాల కాదేశిస్తూ పిలుస్తూన్నట్లుంది.

ఇంకా ఇరవై నాలుగు గంటలు గడవాలి. ఫాన్నీ ఆదివారంనాడు గాని కలుసుకోదు. ఈలోపుగా ఈ మూడురోజులూ, ఎన్ని ఏళ్ళకు మళ్ళీ తిరిగి వస్తామో, కాసెలెట్‌లోనే ఇంటివద్ద గడిపివద్దామని ముందర అనుకొని వెళ్ళాడు. వెళ్ళిన నాడు సాయంత్రమే, తండ్రీ, కొడుకు పెళ్ళి చెడిపోయిందని తెలుసుకొన్నాడు. కారణం ఆయనే గ్రహించుకొన్నాడు. తండ్రీ కొడుకులమధ్య పెద్ద ఘర్షణ జరిగింది.

అసలు, మనుష్యులం ఏపాటివాళ్ళం? మన బాంధవ్యాలు, సన్నిహిత ఆప్యాయతలు, మాతా పితృ భాతృ వాత్సల్యాలు, హృదయబంధాలు, ఏపాటివి? ఒకే మాంసం ఒకే రక్తం కలవారిమధ్యనైనా కూడా, ఒక్క చిన్న క్రోధతరంగం లేస్తే, ఆ బంధు ప్రేమల లాలిత్యం మొక్కపోయి, ఆ బాంధవ్యం గరుసుబారి పుటుక్కున తెగిపోతుందంటే, అసలు మానవత్వపు విలువ ఏపాటిది? ఆ క్రోధ విజృంభణం, చైనాసముద్రాలలోని భీకరమైన టైఫూన్లలాగా, కన్నూ మిన్నూ తెలియక విజృంభించి, ఎప్పుడైనా మాటకు తెచ్చుకొనేందుకు కూడా భయం పుట్టిస్తుంది.

ఆనాడు సాయంత్రం కాసిలెట్ డాబామీద తండ్రి కొడుకులమధ్య జరిగిన ఘర్షణనుగూర్చి జీన్ ఏనాడూ మాట్లాడబోడు. కాని జీవితాంతం, అక్కడ జరిగినరంగం, ఆ తండ్రి శాపం, జీన్ మరిచిపోలేడు. దీర్ఘకాయుడైన ఆ వృద్ధుడు, మొగమంతా చించుకొంటూ, కళ్ళు నిప్పులు కక్కుతూ, పళ్ళు కొరుకుతూ మీదిమీదికి వచ్చి, ద్వేషంతో, ఏనాటికీ క్షమార్హంకాని మాటలంటూ, "ఫో! వెళ్ళిపో! నీ లంజెనుకూడా వెంటబెట్టుకుపో; నువ్వు చచ్చావనే అనుకొంటాం" అని గర్జించాడు. కవలపిల్లలు రాళ్ల మీద మోకరిల్లి అన్నను క్షమించమని ప్రార్థిస్తున్నారు. దివోని, మొగం పాలిపోయి, అతనివంక న్నా చూడ లేక, అతనితో మాట్లాడకుండా నిలచిపోయింది. మేడమీద తల్లి కిటికీలోంచి అదుర్దాగా, ఏమిటూ ఆడాపుడీ, కొడుకెందుకు వెంటనే వెళ్ళిపోతున్నాడూ, అనే ఆశ్చర్యంతో మందంగా చూస్తోంది.

తల్లికి వీడ్కోలు చెప్పకుండా వస్తున్నానని ఆ వేదనతో, ఆ రాత్రి మళ్ళీ కౌన్సిలేట్‌కు వెళ్ళాడు. కాని తలుపులు అన్నీ మూసి ఉన్నాయి. తల్లి గది వంక తదేకదీక్షతో చూసి, తను లోపలికి రాకుండా మూసివేయబడ్డ, తన గృహాన్ని చూస్తూ, నిట్టూర్పు, నిస్పృహతో, అక్కడినించి త్వరగా వెళ్ళిపోయాడు. తల్లివద్ద వీడ్కోలు తీసుకోలేదన్న ఆ వేదన అల్లాగే వెంటాడుతూ మిగిలిపోయింది.

రాత్రి గంటలన్నీ బహుదీర్ఘంగా గడుస్తున్నాయి. ఆ హోటలులోనే తక్కిన గదులలో, విదేశాలకు, ఆప్తులను పంపుతూన్న బంధువులు, తల్లులు, తండ్రులు, ఆ వీడ్కోలు సమయమంతా సన్నిహితంగా ఆప్యాయతలతో గడుపుకొంటూన్నారు. తన గీత సరిగ్గా ఉంటే, తన కెంత చక్కని వీడ్కోలుండేది ?

చివరికి తెల్లవారుఝామున కొంత నిద్ర పట్టించుకొన్నాడు.

ఆ మధ్యాహ్నమే ఫాన్నీ వస్తుంది. రైలుకెళ్ళి కలుసుకోనేందుకు బటలు వేసుకొంటున్నాడు, బైట చక్కని ఎండ కాస్తోంది. ప్రకృతి బహు రమణీయంగా ఉంది. సముద్రంమీది ఓడల కదలికలు, పిల్లగాలులు, చుట్టూ వినబడుతున్న శబ్దాలూ, అన్నీ అతి ఆకర్షణీయంగా ఉన్నాయి.

బైటికి బయలుదేరుతున్నాడు.

గుమ్మంలో ఒక నౌకరువచ్చి "కౌన్సల్ గారూ, తమకు ఉత్తరం వచ్చిందండి. ప్రొద్దున్నే వచ్చింది కానీండి అప్పటికి తమరు నిద్రలో ఉన్నారు" అన్నాడు. కౌన్సల్ అంత పెద్ద ఉద్యోగస్థులు ఆ చిన్న హోటలుకి రావటం అదే మొదలు. అందుచేత నౌకరు మరీ మర్యాద చేస్తున్నాడు.

ఇప్పుడు ఇక్కడికి తనకు ఉత్తరం ఎవరు వ్రాస్తారు? ఒక్క ఫాన్నీకి తప్ప తన అడ్రసు ఎవరికీ తెలియదు. ఉత్తరం దగ్గరగా చూశాడు. ఏదో భయం కల్గింది. భయపడ్డంతా నిజమేనని గ్రహించాడు.

"నేను రావటం లేదు. ఇంత మహాకార్యము, ఇంత ఉన్మత్తంగా చెయ్యటానికి నాకు శక్తి లేదనే నాకు అనిపించింది. అల్లాంటి పనులు చెయ్యటానికి నిండు యౌవనం కల్గినవారే ఉండాలి. ప్రియతమా! నేను అంత యౌవనినికాను! లేదా, ప్రేమతో, అంగనలూ, ఉన్మత్తులూ అయినా అయివుండాలి. ఐదేళ్ళక్రిందట, మన పంట పండిన భాగ్యదినాల్లో, నువ్వు సై అంటే చాలు, నీతో ప్రపంచపుటంచుల దాకా వచ్చేసి ఉండేదాన్ని. నిన్ను అంత ఉధృతంగా ప్రేమించానన్న విషయం నువ్వు కాదనలేవు. నాకున్న సర్వస్వమూ నీకు అర్పించాను. ఆ బంధంనుంచి నన్ను నేను ఛేదించుకోవాల్సి వచ్చినది. ఏ నాడూ ఎవరివల్లా పొందనంత బాధ పొందాను. కాని అల్లాంటి ప్రేమ, మనిషిని నీరస పెట్టేస్తుందని నీకూ తెలుసునుగదా! నిత్యం యౌవనంతో అందంగా ఉన్న నిన్ను చూస్తూ, ఏ నిముషం పోగొట్టుకొంటానో, అని అదుర్దాతో, వణికిపోతూ నిత్యం వేయికళ్ళ కాపాడుకొంటూ రావాలే! ఇప్పుడింతటి శ్రమపడలేను. నన్ను అతికష్ట జీవితం గడిపేటట్టు చేశావు. ఎంతో బాధ అనుభవింపచేశావు. ఇప్పుడింక నాపని అయిపోయింది.

ఈ పరిస్థితిలో, ఈ దీర్ఘ ప్రయాణమూ, మళ్ళీ నూతన జీవిత ప్రారంభమూ, నన్ను భయపెట్టేస్తున్నాయి. నాకు ఒకేచోట ఉండిపోవటమే ఇష్టం. నా జన్మలో సెంటి జెర్మేన్ దాటి ఎక్కడికీ నేను వెళ్ళలేదు.

అదీకాక ఉష్ణ దేశాల్లో, అక్కడవాళ్ళు ఇట్టే ముసిలివాళ్ళయిపోతారు. నేనూ చివరికి రోజా తల్లి ఫిలార్‌లా తయారౌతాను.

ఆనాడు నువ్వు చేసిన త్యాగానికి కుములుతూ నన్ను తప్పకుండా ద్వేషిస్తావు. ఇంక నీ కోపతాపాలన్నీ పాపమీ ఫాన్నీయే భరించాల్సి ఉంటుంది. విను. ప్రాచ్య దేశాలలో ఒక దేశం ఉందట — ఈ విషయం నీదగ్గిర మేగజైన్లలోనే చదివాను — ఆ దేశంలో స్త్రీ భర్తను వంచించినప్పుడు, ఆ మనిషికీ ఒక పిల్లికీ జత గలిపి, పచ్చి చర్మపుసంచీలో పెట్టి, సంచీ కుట్టేసి, సముద్రం ఒడ్డున కాలుతూన్న ఇసుకలో పాతేస్తారు. ఆమాట అరుస్తూ ఆ కాలుతూన్న ఇసకలో సజీవంగా పొర్లింతలు పెడుతూంటుంది. ఆపది అరుస్తూంటుంది. పిల్లి బరుకుతూంటుంది. ఇద్దరూ ఒకర్నొకరు చీల్చుకొంటూంటారు. పైనున్న పచ్చి చర్మం ఎండకు ముడుచుకుపోతూ ఆ యిద్దరి మధ్య యుద్ధక్షేత్రాన్ని అంతకంతకూ కుంభించేస్తుంది. ఆ బందీల ఘోరయుద్ధం చివరికి సమాప్తమయి సంచీ కదలికలు సమసిపోతాయి..."

ఒక్క నిమిషం దిగ్భ్రాంతుడయి ఆగాడు. కంటికి కనబడినంతమేరా, నీలపు సముద్రం తళతళ లాడుతూంది. "సెలవు" అంటూ ఎవరో గట్టిగా రాగ ధోరణిలో ఆప్యాయంగా వీడ్కోలిస్తున్న నాదం వినబడుతూంది. తరంగాలు అప్పగింతలపాటలు పాడుతున్నాయి. శిథిలమై, చీకుబట్టి, కన్నీళ్ళతో, వ్యథతో, భగ్నమైపోయిన తన జీవితపు టగాథం కన్నులముందు కట్టుతూంది. పండిన పంట కుప్పనూర్చిడి అయాక నాశనమయిపోయి, ఎండుమోళ్ళ వరుసలుమాత్రం మిగిలిన చేనుగా అయింది బ్రతుకు! ఇంతా చేసీ, చివరకు చేతి వేళ్ళసందుల్లోనుంచి జారిపోయిన ఈ స్త్రీకోసం!...

"ఇంతకుముందే నీతో చెప్పిఉండాల్సి ఉంది. కాని నీ ఉద్రేకం, మనోవిశ్చలంమాని ధైర్యం చేయలేకపోయాను. నీ ఉత్సాహం నన్నుకూడా వశీకృతను చేసింది. అదీకాకుండా, విడిపోయాకకూడా నిన్ను మళ్ళీ గెలుచుకోగల్గానన్న స్త్రీ సహజమైన అహంకారంకూడా పనిచేసింది. నా హృదయాంతరాల్లో మాత్రం, మునుపటికీ ఇప్పటికీ భేదం ఉందనీ, ఏదో బీటవారిందనీ, ఆ అధ్యాయం అంతమయిందనీమాత్రం ఎరుకకల్గింది. మన యిద్దరిమధ్యా అంతజరిగాక, ఆ తెలివిడి ఎల్లాగూ రాక తప్పదు. ... దీనికంతకూ, పాపం, ఆ దరిద్రుడు శ్యాముంటే కారణం అనిమాత్రం అనకోకు. అతనికిగాని, నీకుగాని మరేపురుషునికగాని, ఇంక నా జీవితంలో ఆ స్థానంలేదు. అందరివిషయంలోనూ నా హృదయం మృతము అయిపోయింది. కాని బిడ్డడున్నాడు. వాడిని వదిలి ఉండలేను. అందువల్ల ఆ తండ్రికీ ప్రమేయం కల్గింది. పాపం, ఆ దీనుడు, నా ప్రేమకోసం జీవితం నాశనంచేసుకొని, మొదట నన్ను కలుసుకొన్నప్పుడు ఎంత ప్రేమించాడో అంత ప్రేమతోనూ, జైలు వదలగానే సరాసరి నాదగ్గరకు వచ్చాడు. ఒకళ్ళనొకళ్ళం చూసుకొన్నాక ఆరాత్రంతా నా భుజంమీద తలపెట్టుకొని కన్నీళ్ళు కారుస్తూనే గడిపాడంటే, ఇంక ఆలోచించు! ఆ విషయంగా నువ్వు అసూయపడవలసిన ప్రాప్తి ఏదీ అతనికీ లేదు!

చెప్పానుకదా! ప్రియతమా! నేను అత్యధికంగా ప్రేమించి, శిథిలమైపోయాను. ఇప్పుడు ప్రతిఫలంగా నన్ను ప్రేమించేవాళ్ళు, నన్ను లాలించేవాళ్ళు, బుజ్జగించేవాళ్ళు, నాకు కావాలి. అతను నిత్యం నా పాదాలదగ్గిరే మోకరిల్లి ఉంటాడు. నా మొగం ముడుతలు, నరిసిన వెంట్రుకలు అతనికి కనబడవు. అతను తలపెట్టినట్లు, నన్ను అతను పెళ్ళి చేసికోటమే తటస్థిస్తే, నేను అతనికి గొప్పవరప్రదానం చేసినట్లు పొంగిపోతాడు. ఈ రెంటుపరిస్థితులూ పోల్చిచూసుకో ...అన్నిటికన్నా, ఏ పిచ్చిపనులు చెయ్యకు! నన్ను నువ్వు వెదకి కనుక్కోలేకుండా, తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకొన్నాను. నేను ప్రక్క హోటల్లో కూర్చుని ఈ ఉత్తరం వ్రాస్తూంటే, దూరాన చెట్లచాటున మన కుటీరం — ప్రేమ సౌఖ్యంలో మనం ఓలలాడిన రోజుల కుటీరం, ఆ తర్వాత నేను దుస్సహవేదన ననుభవించిన రోజుల నాటి కుటీరం—మన కుటీరం కనబడుతూంది.

ఇంక నువ్వు స్వతంత్రుడవు. ఏనాడూ నన్ను గురించి ఇక నువ్వు విచారించవలసిన అవసరమే కలుగదు. సెలవు—ఒక్క ముద్దు—ప్రియతమా..."

[తెలుగు: వి. డి. ప్రసాదరావు]

సంపూర్ణము.

గ్రంథవిమర్శనము

The First Look and other Poems

Siva Sankara Sastry. Sahiti Samiti, Repalle, S India. Price 2 Rupees.

డాక్టరు పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారీ గ్రంథంలో శివశంకర శాస్త్రిగారు రచించిన కొన్ని ఖండకృతులకు ఆంగ్ల కవితానువాదాలు రచించారు.

ఈ రోజుల్లో ప్రాంతీయ భాషలల్లోని సారస్వతం ఆంగ్లంలోనికీ ఇతర భారతీయ భాషల్లోకీ అనువదించవలసిన అవసరం ఇనుమడించింది. తత్రాపి శాస్త్రిగారికి షష్టి పూర్త్యుత్సవం జరిగిన ఈసమయంలో ఈ పుస్తకం ప్రకటించడం మరింత సమంజసంగా ఉన్నది.

ఈ గ్రంథంలో శాస్త్రిగారు రచించిన [illegible], ప్రతాపకుమారి, చామెకాంబ, దీపారాధన, మొదలైన 21 ఖండకృతులకు యథామూలానువాదాలున్నాయి. సుందరభావస్ఫోరకములైన చిన్న చిన్న ఖండకావ్యాలు మొదలు ఖండనాటికలవరకు గల శాస్త్రిగారి వివిధకృతులనుండి రచించిన అనువాదాలీ గ్రంథంలో చేర్చడంవల్ల దీనికొక సమగ్రత వచ్చింది. అయితే ఆంగ్లపాఠకులకీ గ్రంథం స్థాలీపులాక న్యాయంగా శాస్త్రిగారి కవితాస్వాదన కలిగించగలదు గాని అంతకంటె ఎక్కువగా ఉపకరించలేదు.

తెలుగులోనించి ఆంగ్లంలోకి సారస్వతానువాదం చెయ్యడం అంత తేలికైన పనికాదు. అందులోను కవితానువాదం మరింత కష్టం. శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తమ రచనలో యథామూలతని తీసుకురావడంకోసం చాలా శ్రమపడి కృతకృత్యులైనారు.

గ్రంథముద్రణము, ఆకారము ప్రశస్తంగా ఉన్నాయి. గ్రంథం చిన్నదైనా ఆంగ్లంలో శివశంకరశాస్త్రిగారి కవితావగాహనకిది ఒక ఉపోద్ఘాతంలా సహకరిస్తుంది.

కమలాంజలి

[గీతికా సంపుటి]

రావులపర్తి భద్రిరాజు. శశి కళాపీఠం. బ్రాడీపేట. రామచంద్రపురం. తూర్పు గోదావరి జిల్లా. వెల: ఎనిమిది అణాలు.

దీనిలో మాత్రాచ్ఛందోమయమైన 20 గీతాలున్నాయి. వీటి అన్నిటిలోను కవి స్వీయానుభూతులే కథావస్తువులు.

ఈ రచయిత అచ్చమయిన తన అనుభవమే తనకు అనువయిన భావనాపరిమితిలో వెల్లడించడానికి ప్రయత్నించారు.

ఈ పాటలలో అక్కడక్కడ వీరికి ఆచార్యులయిన బాపిరాజుగారి పాటల పాదముద్రలు కనిపిస్తున్నాయి.

అయితే ఈ కవి ఈ పాదముద్రలు అధిగమించి తన గొంతు వినిపించే ప్రయత్నంకూడా అక్కడక్కడ గోచరిస్తున్నది.

కవి ప్రథమ ప్రయత్న ఫలమయిన ఈ గీతికా సంపుటిలో సమున్నతమైన భావనగాని తపనగాని కనబడక పోవచ్చును. పలికినంతవరకు ఈయన గీతిక సహజంగాను, స్వాదువుగాను సాగిపోతుంది.

పీఠికాకర్తలన్నట్టు ఈ క్రింది గీతికలో ముగ్ధమయిన సరళమాధుర్యం గోచరిస్తుంది. ఇల్లాంటి గీతికలింకా ఈ కావ్యంలో నాలుగైదుదాకా ఉన్నాయి.

'ఎవరోయి పిలిచింది
    ఎవరోయి పలికింది ?
క్రొమ్మావి చివురులో
    కులికింది ఎవరోయి ?
పలుకులే పాటలై
    పాటలే పిలుపులై
తరచివని నా హృదిని
    తలపు లూరేదాక !
వాగులన్నీ కలసి
    వరదలై ప్రవహించి
అవని భూములన్నిటిని
    ఆకాశ మెత్తినవి !
కోయిలే పిలిచింది
    కోయిలే పలికింది
నవ వసంతమ్మునకు
    నాంది పలికినదోయి !

శ్రీ మహర్షి జీవిత కథామృతము

[మూడవ భాగము]

బులుసు వెంకటేశ్వర్లు. బి. ఎ., రామారావు పేట. కాకినాడ. వెల: రూపాయి.

శ్రీ వెంకటేశ్వర్లుగారు ఇంతకుపూర్వం కొందరు మహర్షుల జీవిత చరిత్రలు ప్రథమ ద్వితీయ భాగాలుగా వెలయించారు. ప్రస్తుత సంపుటం మూడవ భాగం. దీనిలో వీరు అంగిరసుడు, కౌత్సుడు, కంఠుడు, కణ్వుడు, కర్దముడు, గర్గుడు, గౌరముఖుడు, జాబాలి అనే ఎనమండుగురు మహర్షుల జీవితచరిత్రలు విపులంగా విస్తరించి వ్రాశారు. ఈ యిమ్మలలో కంఠుడు, గౌరముఖుడు మొదలయిన నలుగురైదుగురు మహర్షులంతగా ప్రసిద్ధులు కారు.

అయినా గ్రంథకర్త ఆయా పురాణాంతర్గత గాథలు జాగ్రత్తగా పరిశీలించి ఈ గ్రంథంలో చేర్చారు.

వీరి గ్రాంథిక భాష ఎక్కువగా సంస్కృత పద ప్రచురంగా ఉన్నా దీనిలో క్లిష్టాన్వయాలు లేకపోవడంవల్ల ఇది సర్వక్షిగా సాగిపోతుంది.

మానవుడు

[పద్యకావ్యము]

వల్లమూడి గోపాలకృష్ణయ్య శాంతి ప్రచురణలు. బాపట్ల. వెల: రూపాయి.

ఈ రచయిత మానవుని బాల్యం, కుమారతనం, యౌవనం, వార్ధకం అనే నాలుగు దశల్లోను కలిగే అనుభూతి సౌందర్యం వర్ణిస్తూ సంపూర్ణకావ్యం రచించాలని సంకల్పించారు. ప్రస్తుత రచన బాల్యదశకు మాత్రమే సంబంధించిన గ్రంథం.

దీనిలో రచయిత కేవలం బాల్యంలోని ముగ్ధ సౌందర్యం మాత్రమే ఉపవర్ణించి ఊరుకోకుండా పిల్లల్ని పెంచే విధానము, బాల్యంలో పిల్లలలో స్థైర్య సాహసాలు ప్రోత్సహించే శిక్షణపద్ధతి మొదలైన విషయాలన్నింటిని గురించీ విపులంగా వర్ణించారు.

ఈ విధంగా పిల్లల పెంపకము మొదలైన విషయాల వ్యాఖ్యానంతో కూడి ఈ కావ్యం తల్లిదండ్రులందరికీ చాలా ఉపయోగకరమైనదే.

రచయిత ఈ కావ్యంలో అంతటా చాలా చోట్ల ఆట పలుకులే ఎక్కువగా వాడారు. అక్కడక్కడ సహజత్వంగా వృత్తాలుకూడా ఉన్నాయి. అయితే ఉపయుక్త విషయాల కున్నంత ప్రాధాన్యం కవితకు రాలేదు. కవిత చాలాచోట్ల భావ మాత్రంగానే కనిపిస్తున్నది. ఈ క్రింది ఆటపలుకులనుబట్టి రచనాపద్ధతి గ్రహించుకోవచ్చును.

'మాటలాడుచుంటె ఆటలాడుచునుంటె
పిచ్చి పాటలెవరికివచ్చురాక
నీ పెంపొందుచుకుంటె నిద్దుర గడచుచుండ
ఉదయ వేళయందు ఒక్కనాడు.
చిన్నతార ! అనుచు చేతులు చాపితా
కనులు భగము మూసి కొందుమండి
దొంగవచ్చునో మరి దొరవచ్చునో మరి
అనుచు చాలసారు లమ్మపల్కె.

నన్ను రమ్మటంచు నవ్వుచు ప్రేమతో
పిల్చి పిల్చినన్ను పిల్చుకొలది
"రాను పోను రాను రానంచు నవ్వుచు
దూరదూరమునకు జారిపడచు
కాలుముందుపెట్టి కవ్వించి కవ్వించి
ముందుకు పడకపోగ మురియజేసి
ఒక్కసారి పడిరి కౌగిలోన అమ్మయు
నూగొగు నవ్వునవ్వు తెరచె కనులు !"

How Common people think - By a Common Man. 3/2 Colege street, Calcutta.

ఈపుస్తకం ఆంగ్లభాషలో వ్రాసిన సంపాదక లేఖల సంపుటి. దినపత్రికల్లో సంపాదకీయాలలాగ సంపాదక లేఖలు కూడా చాలా ప్రాముఖ్యం వహిస్తాయి: వీటివల్ల సంపాదకులు పాఠకులు ఎప్పటి కప్పుడు పరస్పరాభిప్రాయాలు కలబోసు కుంటూ పరిస్థితులు వాస్తవ దృక్పథంతో అవగాహన చేసుకోడానికి వీలవుతుంది.

రచయిత ఈ పుస్తకంలో ఆయా విషయాలను గూర్చి వ్రాసిన లేఖలన్నీ వేరువేరుగా వర్గీకరించి ముద్రించారు.

వీటిలో బెంగాలు హిందువులు, ఉపాధ్యాయులు - భావిపౌరులు, ప్రజాస్వామ్యము, వర్గరాజకీయాలు, ఆహారసమస్య మొదలైన దైనందిన సమస్యలను గూర్చిన లేఖ లెన్నో ఉన్నాయి.

రచయిత ఈ లేఖ లన్నిటిలోను ఎక్కడా మొహమాటము సంకోచము లేకుండా నిర్భయంగా తన అభిప్రాయాలు వ్యక్తీకరించి ప్రజానీకం పడే ఇబ్బందులు తొలగించడానికి ప్రయత్నించారు.

ప్రభుత్వం కమ్యూనిష్టులమీద ఉపయోగించే దమన విధానంమీద వీరు వ్రాసినవి పాఠకులే కాక ప్రభుత్వం కూడా జాగ్రత్తగా గమనించవలసిన లేఖలు.

పత్రికలకు లేఖలు వ్రాసేవా రందరికీ ఇది ముఖ్యమైన గ్రంథము.

సంస్కృతి

సారస్వత వైజ్ఞానిక మాసపత్రిక. సంపాదకులు అద్దేపల్లి నాగేశ్వరరావు. సరస్వతీ పవర్ ప్రెస్. రాజమహేంద్రవరము. సంవత్సర చందా. 5 రూపాయలు. విడిప్రతి. ఎనిమిది అణాలు.

ఇది సారస్వత వైజ్ఞాని కావర్గాలతో వెలువడిన ఉత్తమ తరగతికి చెందిన మాసపత్రిక.

పి. వి. రాజమన్నారు. నండూరి బంగారయ్య, దివాకర్ల వేంకటావధాని, మొదలైన ప్రముఖులు రచించిన ఉత్తమ వ్యాసాలతో ఈ పత్రిక మొదటి సంచిక సర్వాంగ సుందరంగా వెలువడింది.

సంపాదకులు సూచించినట్లు, ఉత్తమ సాహిత్య పత్రికల సంఖ్య తక్కువగా ఉన్న ఈ రోజులలో ఇటువంటి పత్రికల అవసరం ఎంతైనా ఉన్నది. ఉన్నత సాహిత్య లక్ష్యాలకు దోహదం కల్పిస్తూ, క్రమంగా ఈ పత్రిక ఆంధ్ర సాహితీపరుల మన్నన లందుకోనగలదనీ, తెలుగు ప్రజలలో విశేష వ్యాప్తి పొందగలదనీ ఆశిస్తున్నాము.

సౌభాగ్య

ప్రత్యేక వార్షిక సంచిక. 7; ఆరాముడు గార్డెన్ స్ట్రీట్, ఎగ్మూర్. మద్రాసు. ప్రత్యేక సంచిక వెల 8 అణాలు.

మదరాసు ప్రభుత్వం స్త్రీ జనాభ్యుదయ శాఖ వారు నిర్వహిస్తున్న సౌభాగ్య ఈ ప్రత్యేక సంచికతో ఆరవ సంవత్సరం ప్రారంభించింది.

దీనిలో గుమ్మలూరి సత్యనారాయణ, దిగుమర్తి సాంబశివరావు, కోటుకూరి లక్ష్మీకాంతమ్మ, దిగుమర్తి సీతారామస్వామి మొదలైన వారు రచించిన స్త్రీ జనాభ్యుదయిక రచనలే కాక వర్ణచిత్రాలు, ఛాయాచిత్రాలుకూడా ఉన్నాయి.

వీటిలో హెచ్. వి. రామగోపాల్, శ్రీమతి విజయలక్ష్మి రచించిన చిత్రాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి.

స్త్రీ జనాభ్యుదయానికి సంబంధించిన వివిధ వైజ్ఞానిక వ్యాసాలే కాక దీనిలో బాలగేయాలు, నాటిక మొదలైన సారస్వత రచనలుకూడా ఉన్నాయి.

క్రమంగా ఈ పత్రిక ఇతోధికంగా మహిళాలోకంలో వ్యాప్తి చెందగలదని ఆశిస్తున్నాము.

రాజపుత్రవీరుడు రంజిత్

[రంగుల బొమ్మల కథ]

రచన. బుజ్జాయి: ప్రతులకు: బుజ్జాయి పబ్లికేషన్సు, 38 హబీబుల్లా రోడ్డు, త్యాగరాజనగర్. మదరాసు 17. వెల: ఆరు అణాలు.

ఇది పిల్లల కుత్సాహం కలిగించే రంగు రంగుల బొమ్మల కథల పుస్తకం. దీనిలో ముందు ఒక రంగు బొమ్మ, అడుగున దానికి సంబంధించిన సంభాషణలు ఉన్నాయి. వీటి మూలాన పిల్లలీ కథలపుస్తకం కులా

సాగా ముందుకు చదువుకు పోవడానికి వీలుపడుతుంది.

సంభాషణల భాష, పిల్లలకు తేలికగా అర్థమౌతూ చురుగ్గా ముందుకు చదువుకు పోవాలని ఉత్సాహం కలిగిస్తున్నది.

తెలుగు దేశ చిత్రపటము.

తెలుగు భాషాసమితి. యూనివర్సిటీ, భవనములు. మద్రాసు 5. వెల: అరణాలు.

తెలుగు భాషాసమితివారి చిత్రపటంలో అవతరించబోయే ఆంధ్ర రాష్ట్రపు సరిహద్దులు, విశాలాంధ్ర సరిహద్దులు మొదలైనవన్నీ సవివరంగా నిరూపించారు. దీనితో కేలండరుకూడా జతపరిచారు.

రాష్ట్రం అవతరించబోయే సమయంలో ఇది ఇంటింటా ఉంచవలసిన చిత్రపటము.

శ్రీహరినామ మహిమశతకము

మూలము—శ్రీ నీలకాంత గోస్వామి. అనువాదకులు. శ్రీ బులుసు సూర్యప్రకాశశర్మ. ప్రకాశకులు, సాధన గ్రంథమండలి. తెనాలి. వెల నాలుగణాలు.

సంస్కృతంలో ఈ గ్రంథకర్త, ప్రాచీనుల్లో, శ్రీ చైతన్యస్వామి సంప్రదాయానికి చెందినవారు. మూలగ్రంథకర్త 'హరేర్నామైవ కేవలం మే' అనే మకుటంతో భిన్న భిన్న రీతులలో హరినామ ప్రభావం వర్ణిస్తూ ఈ శతకం రచించారు. ఈ విషయంలో మూలరచయిత అవలంబించిన రచనా వైవిధ్యము, సారళ్యము, చాతుర్యము, ప్రత్యేకంగా పేర్కొనదగినవి.

అనువాదకులు మూల రచయిత శ్లోకాలన్నింటికీ తేట తెనుగులో అందరికీ అవగాహన అయ్యే సులభ శైలిలో తాత్పర్యం రచించారు. గ్రంథం చిన్నదైనా నామమాహాత్మ్యం తెలుసుకోగోరే వారందరికీ ఇది అవశ్యపఠనీయమైన గ్రంథం.

ఈ విధమైన గ్రంథాలు ప్రకటిస్తూ ప్రజానీకంలో ప్రాచీన భక్తి సాధనలపై అభిమానం కలిగిస్తున్న సాధన గ్రంథమండలివారి ప్రయత్నము బహుధా ప్రశంసనీయమైనది.

ముక్తావళి

శ్రీ త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి. ప్రకాశకులు. వసంత పబ్లికేషన్సు, తెనాలి. వెల: ఒక రూపాయి.

దీనిలో వీరపత్ని, పోరాట్ రుస్తుమ్, పుత్రాది ష్ఫోత్ పరాజయమ్, అనుక్తకథ, అనే నాలుగు కథలున్నాయి.

ఈ కథలలో వాడిన భాష గ్రాంథికము. అయినా కఠినంగా లేకుండా సరళంగాను వ్యాకరణయుక్తంగాను ఉన్నది.

కథాకథనంలో అవలంభించినది వర్ణపద్ధతి. అందుచేత కథలలో సన్నివేశాలు పాఠకులకు కళ్ళకు కట్టినట్లుంటాయి. ముందుకు చదువుకుపోవాలనే ఉత్సాహం కలుగుతుంది.

ప్రకాశకు లుద్దేశించినట్లే పుస్తకం హైస్కూలులో విద్యార్థులకు భాషా పరిచయం కలిగించడానికీ, సముచితమైన సారస్వత రుచి కలిగించడానికీ బాగా ఉపయోగిస్తుంది.

భగవత్ప్రాప్తి - ఉపాయములు

మూలము: జయదయాల్ గోయందకా, అనువాదకులు: కుందుర్తి వెంకటనరసయ్య, బులుసు సూర్యప్రకాశశాస్త్రి, ప్రకాశకులు: సాధన గ్రంథమండలి, వెల: నాలుగణాలు.

ఇది ఈ గ్రంథమండలి ప్రథమ పుష్పము. ప్రథమముద్రణ ఖర్చయిపోవడంవల్ల ప్రకాశకు లీ ద్వితీయ ముద్రణ ముద్రించారు.

అనువాదకులు మూలంలో ఉన్న సంస్కృత శ్లోకాలకు చక్కని వివరణ వ్రాసి పాఠకుల కవి సులభంగా అవగాహన అయ్యేటట్లు చేశారు.

భగవద్భక్తి, ప్రార్థన, మొదలైన విషయాలు అవహేళనాస్పదమైన ఈ రోజుల్లో—ప్రాచీనభక్తి సంప్రదాయాన్ననుసరించి రచించబడిన ఈ గ్రంథం భక్తిమార్గస్థులకు చాలా సహకరిస్తుంది.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Pres. No 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.